సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 100

మంగళవారం 1-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



ఆయుశ్ అదరహో

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ సాధించిన భారత షట్లర్

-14లో



డాక్టర్స్ హార్ట్‌బీట్

దేవుడు రాసిన స్క్రిప్ట్‌ను కూడా మార్చి రాయగల రైటర్లు డాక్టర్లు


-13లో



వచ్చేస్తోంది.. మన బాహుబలి

'అగ్ని–5'కి బంకర్ బస్టర్ బాంబును మోసే సామర్థ్యాన్ని ఆపాదిస్తూ మిస్సైల్‌ను ఆధునీకరిస్తున్నట్లు డీఆర్‌డీఓ ప్రకటించింది.

- వివరాలు 6లో▶



కలామ్ ల్యాబ్స్ కమాల్

కలామ్ ల్యాబ్స్ తాజాగా దాదాపు 10 కి.మీ. ఎత్తుకు ఎగరగలిగే యూఏవీని తయారుచేసి సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

- వివరాలు 6లో▶



అమల్లోకి కొత్త రైల్వే చార్జీలు

రైల్వేశాఖ రైళ్ల టికెట్ల ధరలను స్వల్పంగా పెంచింది. పెరిగిన ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి.

- వివరాలు 6లో▶



వారిద్దరూ దైవ విరోధులు

ట్రంప్, నెతన్యాహు దైవానికి శత్రువులుగా తయారయ్యారంటూ ఇరాన్ మతపెద్ద అయతొల్లా షిరాజీ ఫత్వా జారీ చేశారు.

- వివరాలు 6లో▶

బతుకులు బుగ్గి

ఫార్మా పరిశ్రమలో భారీ పేలుడు

16 మంది కార్మికులు, ఉద్యోగులు దుర్మరణం!

36 మందికి కాలిన గాయాలు.. పలువురి పరిస్థితి విషమం

- కుప్పకూలిన భవనాలు.. శిథిలాల కింద మరికొందరు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ కంపెనీలో రియాక్టర్ పేలడంతో ప్రమాదం
- చెల్లాచెదురుగా ఎగిరిపడిన కార్మికులు, ఛిద్రమైన శరీరాలు
- అగ్నికీలల్లో పలువురి సజీవదహనం..
- సమీప ఆసుపత్రులకు క్షతగాత్రుల తరలింపు
- మృతుల్లో ఎక్కువమంది ఒడిశా, బిహార్, యూపీ వారే..
- అర్ధరాత్రి వరకు కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్... ఘటనా స్థలాన్ని, ఆస్పత్రులను సందర్శించిన మంత్రులు.. నేడు సీఎం రాక
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్ సహా ప్రముఖుల సంతాపం

2లో





పేలుడు ధాటికి ధ్వంసమైన పరిశ్రమ భవనం.. తమ వారి ఆచూకీ తెలియక రోదిస్తున్న బాధితురాలు

పరిశ్రమల్లో ప్రాణాలు.. గాలిలో దీపాలు

- పారిశ్రామికీకరణతోపాటే పెరుగుతున్న ప్రమాదాలు
- ఐదేళ్లలో 600కుపైగా ప్రమాదాలు.. 1,116 మంది మృతి
- రసాయన, ఔషధ పరిశ్రమల్లోనే ఎక్కువగా..
- డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌లో ఇన్‌స్పెక్టర్ల కొరత..

2లో

న్యూస్‌రీల్


అన్ని కోర్సులకూ పాత ఫీజులే



రాష్ట్రంలో ప్రొఫెషనల్ కాలేజీల్లోని అన్ని కోర్సుల ట్యూషన్ ఫీజులపై సర్కారు స్పష్టత ఇచ్చింది. 2025–26 విద్యా సంవత్సరంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు పాత ఫీజులే అమలవుతాయని ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 16లో▶

'బనకచర్ల'కు బ్రేక్!



పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు (పీబీఎల్‌పీ)కు తొలిదశ పర్యావరణ అనుమతుల్లో భాగంగా టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) జారీ చేయాలని ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తిరస్కరించింది.

- వివరాలు 5లో▶

తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనాల్లో కోత

వారి వేతనాల నుంచి 10-15% నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ



- అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- అస్సోంలో అమలవుతున్న పథకాన్ని పరిశీలించాలని సూచన
- రవాణా, దేవాదాయ, ఐటీ సహా వివిధ శాఖల్లో ట్రాన్స్‌జెండర్ల సేవలు
- దివ్యాంగులకు మరింత అండగా ప్రభుత్వం
- సంక్షేమ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి

12లో

కమల దళపతి రాంచందర్‌రావు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్సీ

- అధిష్టానం ఆదేశాలతో ఒకటే నామినేషన్ దాఖలు
- నేడు ఏకగ్రీవంగా ఎన్నిక.. ప్రక్రియ అంతా లాంఛనమే
- యువమోర్చా నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘ ప్రస్థానం
- 45 సంవత్సరాలుగా పార్టీలో వివిధ హోదాల్లో అనుభవం

3లో

'మీకో దండం... మీ పార్టీకో దండం'



బీజేపీ సభ్యత్వానికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా

- అధ్యక్ష పదవికి నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆరోపణ
- రాజీనామా లేఖను కిషన్‌రెడ్డికి సమర్పిస్తున్నట్లు ప్రకటన
- అసెంబ్లీ స్పీకర్‌కు రాజీనామా లేఖను పంపాలని సూచన

3లో

నిబంధనలు పాటించనప్పుడే ప్రమాదాలు

పాశమైలారం ప్రమాద స్థలంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అన్ని పరిశ్రమలకు ప్రత్యేకంగా ఎస్ఓపీలు (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్)ఉంటాయి. వాటిని తప్పక పాటించాలి. అందులో చిన్నపాటి పొరపాటుకు కూడా తావుండకూడదు. నిబంధనలు పక్కాగా పాటించాలి. అదేవిధంగా పరిశ్రమలోని అన్ని పరికరాలు, యంత్రాలు, బాయిలర్స్ ను విధిగా పరిశీలిస్తుండాలి. మెయింటినెన్స్ అవసరం. అయితే ఇలా.. నిబంధనలు పాటించనప్పుడే ప్రమాదాలు జరుగుతాయి. కాబట్టి పరిశ్రమ మనుగడ ఎక్కువ కాలం అయ్యే కొద్దీ..పరికరాల మెయింటినెన్స్ మరింత మెరుగ్గా చూసుకోవాలి..'అని రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. పాశమైలారంలో సిగాచి ఫార్మా యూనిట్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఘటన సమా చారం అందిన వెంటనే ఇతర సహాయక బృందాలతో కలిసి అగ్నిమాపక శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అత్యాధునిక పరికరాలతో కూడిన విక్టిమ్ లొకేషన్ కెమెరాలతోపాటు..సీఎస్ఎస్ఆర్ (కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ) ఆపరేషన్‌లో భాగంగా అత్యాధునిక రెస్క్యూ టెండర్‌ను పూర్తిస్థాయిలో మొదటిసారి వినియోగించారు. సోమవారం ఉదయం 9–30 గంటల నుంచే రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. పనులను ఫైర్ డీజీ స్వయంగా ఘటనా స్థలంలోనే ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎయిర్ డ్రయర్ యూనిట్‌లో సమస్య తలెత్తడంతోనే మంటలు చెలరేగాయని తెలిపారు. 'మైక్రో క్రిస్టల్ అండ్ సెల్యూలోజ్ డ్రయింగ్ యూనిట్‌లో సాంకేతిక లోపంతో ఈ ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా గుర్తించామని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదానికి అసలు కారణం ఏంటో ఇంకా తెలియదు. వందకు పైగా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు..'అని నాగిరెడ్డి తెలిపారు.

ప్రమాదాన్ని ప్రధాని మోదీకి వివరించా: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాశమైలారంలో ప్రమాదం జరగడం దురదృష్టకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఈ ఘటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్ళినట్లు వివరించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని, కార్మికులకు ప్రమాదాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇదం జగత్



గుడ్‌న్యూస్! బయటి రాష్ట్రాల్లో మన ప్రత్యర్థులు కూడా బాగానే ఉన్నార్సార్!






సిగాచి పరిశ్రమలో పేలుడుతో చెలరేగిన మంటలు ● ఘటనా స్థలంలో సహాయక చర్యల్లో సిబ్బంది ● పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం ● క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న తోటి కార్మికులు

బతుకులు బుగ్గి

ఫార్మా పరిశ్రమలో భారీ పేలుడు.. 16 మంది దుర్మరణం

36 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు టౌన్/పటాన్ చెరు/రామచంద్రాపురం/జిన్నారం/చందానగర్: ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరున్న పాశమైలారంలోని సిగాచి అనే ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. కంపెనీలోని రియాక్టర్ పేలిపోగా దాని తీవ్రతకు మూడంతస్తుల భవనాలు రెండు కుప్పకూలిపోయాయి. పరిశ్రమ పైకప్పు, రేకులు, ఇతర యంత్ర భాగాలు ఎగిరి వంద మీటర్ల దూరంలో పడ్డాయి. యంత్రాల భాగాలు చెల్లాచెదురయ్యాయి. భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ ప్రదేశమంతా దట్టమైన పొగ అలుముకుంది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న 100 మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పేలుడు ధాటికి చెల్లాచెదురుగా పడిపోయారు. శరీరాలు ఛిద్రమైపోయాయి. 10 మంది అక్కడికక్కడే సజీవ దహనం కాగా ఇద్దరు ఆస్పత్రుల్లో మృతి చెందినట్లు తెలుస్తోంది. మొత్తం 16 మంది మరణించినట్లు అనధికారిక సమాచారం కాగా, మంత్రులు దామోదర, వివేక్ మాత్రం 12 మంది మరణించినట్లు ప్రకటించారు. మృతదేహాలను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. సుమారు 36 మంది గాయపడ్డారు. 20 మందికి పైగా కార్మికులకు 80 శాతానికి పైగా కాలిన గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను సమీపంలో ఉన్న పటాన్‌చెరు, చందానగర్, మదీనాగూడ, మియాపూర్‌లలోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భవనాల శిథిలాల కింద మరింత మంది కార్మికులు, ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. పరిశ్రమ ఆవరణలో భీతావహ వాతావరణం నెలకొంది. ఘటనా స్థలాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు సందర్శించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఘోర దుర్ఘటనపై ప్రధాని మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తదితర ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

బ్లోయర్ పేలి.. రియాక్టర్‌కు అంటుకుని..

మందుల తయారీకి సంబంధించిన ఈ పరిశ్రమలో కన్సిస్టెన్స్ మైక్రోస్టెల్లయిన్ సెల్యులర్ పౌడర్‌ను ఉత్పత్తి చేస్తారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం.. ఉదయం 9.10 గంటల ప్రాంతంలో మొత్తం 111 మంది కార్మికులు, ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అంతా పనిలో నిమగ్నమై ఉండగా తొలుత హెయిర్ బ్లోయర్ పేలింది. దీంతో ఎగసిన మంటలు సమీపంలో ఉన్న రియాక్టర్‌కు అంటుకోవడంతో చెవులు చిల్లులు పడిపోయేంత శబ్దంతో భారీ పేలుడు సంభవించింది. భూమి కంపించినట్టు అయ్యింది. కొందరు కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రులు దామోదర, వివేక్

మృతుల్లో యాజమాన్య ప్రతినిధి?

మృతులు, గాయపడిన వారిలో ఎక్కువగా ఒడిశా, బిహార్, యూపీ వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మరణించిన వారిలో ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెందిన గోవన్ అనే వ్యక్తి కూడా ఉన్నారని అధికారవర్గాలు వెల్లడించాయి. ఆయన ఫ్యాక్టరీలోకి వచ్చిన కొద్ది సేపటికే ఈ పేలుడు సంభవించిందని తెలిపాయి.

అర్ధరాత్రి వరకు కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్

సిగాచి పరిశ్రమ భవనాల శిథిలాల కింద కార్మికులు చిక్కుకుపోయి ఉంటారనే అంచనాతో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. భారీ కట్టర్లు, క్రేన్‌లు, హిటాచీలతో శిథిలాల తొలగింపును చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షం సహాయక చర్యలకు కొంత అంతరాయం కలిగించింది. అయితే రెస్క్యూ ఆపరేషన్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. మంగళవారం కూడా శిథిలాల తొలగింపు చర్యలు కొనసాగనున్నాయి.

మిన్నంటిన రోదనలు.. ఆందోళన

కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. విధులకు హాజరై ఆచూకీ లేకుండా పోయిన వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ వారి ఆచూకీ అధికారులను ఆరా తీశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి దామోదర రాజనర్సింహ నాలుగు గంటల పాటు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌కు పలు సూచనలిచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పరిశ్రమల శాఖ ఫైర్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఎయిర్ ఫైర్ సిస్టమ్‌లో ప్రెషర్ వల్లే సిగాచీ పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ స్పష్టం చేశారు. ఇప్పటికే పరిశ్రమల శాఖ అధికారులు దీనిపై విచారణ ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వం తరఫున మెరుగైన ఎక్స్‌గ్రేషియా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రాజకీయం చేయొద్దు: మంత్రులు

పేలుడు ఘటనలో గాయపడిన వారిలో హేమ సుందర్, ధర్మరాజ్ ప్రసాద్, రాజేష్ కుమార్ చౌదరి, కమలేష్ ముఖియా, చందన్‌కుమార్ నాయక్, సగ్నజిత్, అభిషేక్ కుమార్, అజిత్ తివారి, సంజయ్‌కుమార్, యశ్వంత్ కుమార్, ధన్‌వీర్ కుమార్, సంజయ్ ముఖియా, రాజశేఖర్‌రెడ్డి, దేవనంద్, గణేష్ కుమార్, సంజయ్‌కుమార్ యాదవ్, నీలాంబర్ బత్రా, సమీర్, అమర్జిత్, అర్జున్‌కుమార్, అజీమ్ అన్సారీలను మియాపూర్ మదీనాగూడలోని ప్రణామ్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ అభిషేక్ కుమార్, అజిత్ తివారి మృతి చెందారు. ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రివర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రిలో ఉన్నవారిని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దీనిపై ఎవరూ ఎలాంటి రాజకీయం చేయవద్దని కోరారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఇందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

సిగాచీ పరిశ్రమలో ప్రమాదం నేపథ్యంలో బాధిత కుటుంబాలకు సహాయం కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. తక్షణ సహాయం కోసం సంబంధిత వ్యక్తులు 08455–276155 నంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సీఎం సందర్శన

సిగాచి పరిశ్రమను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు సందర్శించనున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించనున్నారు. అక్కడి కార్మికులతో మాట్లాడనున్నారు. సహాయక చర్యలను కూడా పరిశీలిస్తారు.

కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి: కేసీఆర్

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ప్రమాదానికి కారణాలపై విచారణ జరిపించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని, చనిపోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇలావుండగా పాశమైలారం పరిశ్రమలో రియాక్టర్ పేలుడు అత్యంత విషాదకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పలువురు కార్మికులు చనిపోయారన్న వార్త తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు.

రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: సంగారెడ్డి జిల్లాలో సంభవించిన పేలుడు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రధాని తక్షణ ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున, గాయపడ్డ వారికి రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. 'ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నా. తమకు ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా..' అని మోదీ పేర్కొన్నారు. 'ఈ ఘోర ప్రమాదం గురించి విని చాలా బాధ కలిగింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తక్షణ సహాయ, రక్షణ చర్యలు చేపడుతున్నారు..' అని రాహుల్ పేర్కొన్నారు. 'ఈ ఘోర ప్రమాదంలో అమూల్యమైన ప్రాణాలు పోవడం ఎంతో దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం..' అని ఖర్గే అన్నారు.

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. ప్రమాదంపై ఆరా

సాక్షి, హైదరాబాద్: పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. డీజీపీ జితేందర్, సీఎస్ రామకృష్ణారావుతో సమీక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరాయంగా కొనసాగించేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తరఫున సీఎస్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. డిజాస్టర్‌మేనేజ్‌మెంట్‌స్పెషల్ సీఎస్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఫైర్‌సర్వీసెస్‌అడిషనల్‌డీజీని సభ్యులుగా నియమించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతను కమిటీకి అప్పగించారు.

ఒక్క క్షణంలో అంతా జరిగిపోయింది

మంటల్లో చిక్కుకున్న వాళ్ల అరుపులే గుర్తొస్తున్నాయి

నేను వాష్‌రూంకి వెళ్లడంతో బతికిపోయిన

ఫస్ట్‌ఫ్లోర్ కిటికీలోంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న

ప్రమాద ఘటనను 'సాక్షి'కి వివరించిన ప్రత్యక్ష సాక్షులు.. కుటుంబీకుల కోసం బంధువుల ఆర్తనాదాలు

సాక్షి, హైదరాబాద్: 'పెద్ద శబ్దం..ఒక్కసారిగా మంటలు వచ్చాయి. మొత్తం పొగ..దుమ్ము.. ఏం జరుగుతోందో తెలియలేదు. ఒక్క క్షణంలో అంతా జరిగిపోయింది. మా కళ్ల ముందే పేలుడు జరిగింది..మా ముందే చాలామంది చనిపోయారు. కొందరు మహిళలు మంటలు అంటుకుని కాపాడాలంటూ వేడుకుంటున్న అరుపులే ఇంకా గుర్తొస్తున్నాయి. మా చిన్నాన్నలు, అన్నలు, స్నేహితులు కనిపించకుండా పోయారు. వాళ్లు బతికి ఉన్నారో..? లేదో..? తెలియడం లేదు.. పొద్దుటి నుంచి వాళ్ల జాడ కోసం ఎదురు చూస్తూ ఇక్కడే ఉన్నాం..ఎప్పు డు ఏ వార్త వినాల్సి వస్తుందో అని భయంగా ఉంది..'అని పాశమైలారం సిగాచి ఫ్యాక్టరీలో ప్రమాద ఘటన ప్రత్యక్ష సాక్షులు 'సాక్షి'వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. 'మా వాళ్ల జాడ చెప్పండి సారూ'అంటూ బాధితుల బంధువులు అక్కడికి వచ్చిన అధికారులను బతిమాలుకుంటున్న తీరు కంటతడిపెట్టించింది. తమ వాళ్ల గురించి ఎందుకు చెప్పడం లేదంటూ కొందరు మహిళలు ఏకంగా రాళ్ల ను తీసుకుని అధికారులపై దాడి చేసినంత పని చేశా రు. వారి కుటుంబీకుల కోసం వారు చేస్తున్న ఆర్తనాదాలు..ఆగ్రహావేశాలు సైతం అందరినీ కలిచి వేశాయి.

వాష్‌రూంలో ఉండగా పెద్ద శబ్దం

నేను ఉదయం షిఫ్ట్‌లో ఉన్నా. పేలుడు జరగడానికి ఐదు నిమిషాల ముందు వరకు కూడా డ్రయింగ్ యూనిట్ దగ్గరే పనిచేస్తున్నా. మూత్ర విసర్జన కోసం బయటికి వెళ్లి పక్కన వాష్‌రూంలో ఉండగా ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. బయటికి వచ్చి చూసే సరికి పెద్దగా మంటలు..పొగ..దుమ్ము ఏమీ కనపడ లేదు. వాష్‌రూంకు వెళ్లకపోతే చనిపోయేవాడిని.

– చందన్ గౌర్, కార్మికుడు, ఉత్తరప్రదేశ్

నేను రియాక్టర్ దగ్గరే పని చేస్తున్నా

నేను రెండేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా. ఉదయం పేలుడు జరిగినప్పుడు రియాక్టర్ దగ్గర పనిచేస్తున్న. మొదట ఎయిర్ బ్లోయర్ పేలింది. దానివల్ల నేను పని చేస్తున్న రియాక్టర్ కూడా పెద్ద శబ్దంతో పేలింది. అయితే పక్కనే గది నుంచి మెట్లు ఉన్న విషయం నాకు ముందు నుంచి తెలుసుకాబట్టి ఆ దారి వెతుక్కుంటూ బిల్డింగ్ పైకి వెళ్లిన. అక్కడ కూడా ఏమీ అర్థం కాలేదు. వెంటనే కూలిన ఒక గోడ పట్టుకుని పాకుతూ మొదటి అంతస్తులోకి కిందికి వచ్చిన. అక్కడ కిటికిలోంచి కిందికి దూకిన. నా పక్కనే రెండు శవాలు పడి ఉన్నాయి. వెంటనే అక్కడ నుంచి బయటికి వచ్చేశా. పేలుడు జరిగినప్పుడు కనీసం 30 నుంచి 45 మంది అక్కడ ఉన్నారు. వాళ్లంతా చనిపోయే ఉంటారు.

– పవన్ ఇసాద్, కార్మికుడు, ఉత్తరప్రదేశ్

మా ఇద్దరు చిన్నాన్నలు చిక్కుకున్నారు

ఏడేళ్ల నుంచి ఇక్కడ పనిచేస్తున్నా. ఇప్పటివరకు ఏ చిన్న ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరిగినప్పుడు నేను రియాక్టర్ రూం దగ్గరే పనిచేస్తున్న. ఒక్కసారిగా పెద్ద శబ్దం.. వెంటనే మంటలు అంటుకున్నాయి. దీంతో కిందికి పారిపోయిన. కానీ మా చిన్నాన్నలు శశికుమార్, లఖ్నజీత్ ఇద్దరు లోపలే చిక్కుకున్నారు. ఒకరి శవం దొరికింది. ఇంకొకరు ఏమయ్యారోఏమో..

– విజయ్, బక్సర్ జిల్లా బిహార్

ముగ్గురిని కాపాడినం..

నేను ప్రమాదం జరిగినప్పుడు పక్కన బిల్డింగ్‌లో టిఫిన్ చేస్తున్న. బయటికి వచ్చేసరికి మొత్తం పొగ ఉంది. ఏం కనిపించలేదు. కాసేపటికి అంతా అటు ఇటు ఉరుకుతున్నరు. పక్కన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ దగ్గర కొంతమంది కాపాడాలని అరుస్తున్నారు. నేను, ఇంకో ఇద్దరం కలిసి వాళ్ల దగ్గరికి వెళ్లినం. పైన ఫ్లోర్ నుంచి మెల్లగా కిందికి దింపి ముగ్గురిని కాపాడినం.

– శివ, కార్మికుడు, ఒడిశా

డ్యూటీలోనే దూరంగా ఉన్నా..

నేను ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న. పేలుడు జరిగినప్పుడు డ్యూటీలోనే ఉన్న. కానీ స్పాట్‌కు దూరంగా ఉన్న. పెద్ద శబ్దం వచ్చింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. వెంటనే అటువైపు పరుగెత్తుకుంటూ వెళ్లిన. ఎవరెరు చనిపోయారో అర్థం కాలేదు. అనేకమంది గాయపడ్డారు.

– సంతోష్‌కుమార్, ఉద్యోగి, ఏపీ

ఆచూకీ లేనివారు ఎంతమంది?

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటన తర్వాత ఆచూకీ లేకుండా పోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సోమవారం పరిశ్రమలో విధులకు వెళ్లినవారు ఇంటికి తిరిగి రాక.. ఆసుపత్రుల్లోనూ కనిపించకపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అయితే ఈ ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో అసలెంత మంది ఉన్నారు.. ప్రమాదం నుంచి బయటపడిన వారు ఎంతమంది.. అనేదానిపై ఇంకా పూర్తి స్థాయిలో స్పష్టత లేకుండా పోయింది. ఒకవైపు శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుండగా, శిథిలాల కింద ఎంతమంది ఉండి ఉంటారనే దానిపై కూడా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో 16 మంది మరణించినట్లు తెలిసింది. రెండు మృతదేహాలు శిథిలాల కింద లభ్యమైనట్లు చెబుతున్నారు. మృతదేహాలను పోలీసులు ఆసుపత్రులకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. డీఎన్ఏ పరీక్షలు చేపడుతున్నట్లు తెలిసింది. కుటుంబసభ్యుల డీఎన్ఏలతో పోల్చాకే మృతదేహాలను అప్పగించనున్నట్లు సమాచారం. సోమవారం రాత్రి వరకు ముగ్గురిని గుర్తించినట్లు తెలుస్తుండగా.. దీన్ని ఎవరూ అధికారికంగా ప్రకటించలేదు. కాగా ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల తరలింపునకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా 10 అంబులెన్సులను ఏర్పాటు చేశారు.

కంపెనీ డ్రైవర్ సమయస్ఫూర్తి

8 మంది క్షతగాత్రులను బస్సులో ఆస్పత్రికి తరలింపు



సాక్షి, హైదరాబాద్: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు జరిగిన వెంటనే అక్కడ భయానక వాతావరణం నెలకొంది. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అయితే జరిగిన ఘటన నుంచి క్షణాల్లో తేరుకున్న కంపెనీ బస్సు డ్రైవర్ లాల్‌రెడ్డి సమయస్ఫూర్తితో వ్యవహరించారు. పేలుడు కారణంగా బస్సు ధ్వంసమైనా వెనుకడుగు వేయకుండా బాధితులను ముత్తంగిలోని ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన తీరును ఆయన 'సాక్షి'కి వివరించారు. 'నేను జనరల్ షిఫ్ట్ వాళ్లను కంపెనీకి తీసుకువచ్చిన తర్వాత బస్సును పార్క్ చేసి కూర్చుని ఉన్నా. కొద్ది నిమిషాల్లోనే పెద్ద శబ్దం విన్పించింది. కాసేపటికి అంతా గాయాలతో బయటికి వస్తున్నారు. ఇంకా అంబులెన్స్‌లేవీ రాలేదు. నేను వెంటనే 8 మందిని బస్సులో ఎక్కించుకుని ముత్తంగి ఆసుపత్రికి తీసుకెళ్లిన. అక్కడి నుంచి మదీనగూడ ఆసుపత్రికి తీసుకొచ్చిన. ఆషాక్ నుంచి బయటికి రాలేకపోతున్నా..'అని లాల్‌రెడ్డి వివరించారు.


పరిశ్రమల్లో ప్రాణాలు.. గాలిలో దీపాలు

పారిశ్రామికీకరణతోపాటు ప్రమాదాల్లోనూ పెరుగుతున్న వేగం

గత ఐదేళ్లలో 600కు పైగా ప్రమాదాలు.. 1,116 మంది మృతి

రసాయన, ఔషధ పరిశ్రమల్లోనే ఎక్కువగా..

డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌లో ఇన్‌స్పెక్టర్ల కొరత.. భద్రతా తనిఖీల్లో వైఫల్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామీకరణతో పాటు పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. పారిశ్రామిక ప్రమాదాలు కార్మికుల ప్రాణాలు, వారి జీవన స్థితిగతులతోపాటు పరిశ్రమల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలపైనా ప్రభావం చూపే రీతిలో ఉంటున్నాయి. రసాయన, ఔషధ, టెక్స్‌టైల్, ఆహార సంబంధిత పరిశ్రమల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. పారిశ్రామిక రంగం కేంద్రీకృతమై ఉన్న హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఏటా ప్రమాదాలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ పరిసరాల్లోని జీడిమెట్ల, జిన్నారం, గడ్డపోతారం, పాశమైలారం, ఐడీఏ బొల్లారం, పటాన్‌చెరు, సంగారెడ్డి తదితర పారిశ్రామిక వాడల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఔషధ తయారీ యూనిట్లు, ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లలో పేలుళ్లు, రసాయనాల లీకేజీలు, షార్ట్ సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలు, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం తదితరాల మూలంగా కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తుండగా, భారీగా ఆస్తి నష్టం కూడా జరుగుతోంది. పారిశ్రామిక రంగంలో ఫార్మాస్యూటికల్స్, కెమికల్ యూని ట్స్‌ను హైరిస్క్ పరిశ్రమలుగా పరిగణిస్తూ ఉంటారు. తెలంగాణలో హైరిస్క్ యూనిట్లు 4,130 వరకు ఉన్నా వాటిలో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసే డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌లో ఇన్‌స్పెక్టర్లు 20 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పరిశ్రమల సేఫ్టీ ప్రొటోకాల్స్‌ను తరచూ తనిఖీ చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

రెండు రోజులకో ప్రమాదం..

→ రాష్ట్రంలో సగటున ప్రతీ రెండు రోజులకో ప్రమాదం జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో 600కు పైగా పారిశ్రామిక ప్రమాదాలు జరగ్గా 1,116 మరణాలు సంభవించినట్లు సమాచారం. గత పదేళ్లలో ఫార్మా యూనిట్లలో 102 భారీ అగ్ని ప్రమాదాలు జరగ్గా.. రూ.100 కోట్ల మేర నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ లెక్కలు చెప్తున్నాయి. రియాక్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం, ముడి సరుకులు, ఉత్పత్తుల నిలువ, రవాణాలో అజాగ్రత్తలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఫ్యాక్టరీల్లో భారీ యంత్రాల చుట్టూ రక్షణ చర్యలు, పిట్స్, సంప్స్ వద్ద జాగ్రత్తలు, యంత్ర భాగాల తనిఖీలు, పరిశుభ్రత, సరైన గాలి, వెలుతురు, ఉష్ణోగ్రతలు ఉండేలా చూసుకోవడం. హానికర రసాయనాలను సురక్షితంగ పారవేయడం వంటి వాటిలో నిర్లక్ష్యం వంటివి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఉద్యోగులు, కార్మికులకు సరైన నైపుణ్య శిక్షణ లేకపోవడం, తక్కువ వేతనాలు ఇచ్చే ఉద్దేశంతో నైపుణ్యం లేని కార్మికులను విధుల్లోకి తీసుకోవడం, ప్రమాదకర రసాయనాల గురించి వారికి అవగాహన లేకపోవడం, కాలం చెల్లిన యంత్రాలను మార్చకపోవడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



నిరంతర ఆడిట్ లేనందునే..

→ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించేలా చూడాల్సిన డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు నామమాత్ర తనిఖీలు, నోటీసుల జారీతోనే సరిపెడుతున్నట్లు విమర్శలున్నాయి. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలతోపాటు ఫైర్ ఆడిట్స్‌ను ఏటా నిర్వహించాల్సి ఉండగా.. అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. భద్రతా ఆడిట్‌లు, కార్మికులకు నిరంతర శిక్షణ, పర్యావరణ నియమాలు పాటించడం, సాంకేతికంగా నవీకరణ, అత్యవసర స్పందన కోసం పరిశ్రమల్లో అగ్నిమాపక, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవడం తదితరాలపై దృష్టి పెట్టాలనే డిమాండ్ కార్మికుల నుంచి వినిపిస్తోంది.

క్లుప్తంగా...

చంద్రబాబు చెబితే అధ్యక్షుడిని పెట్టే పార్టీ కాదు

కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎంపిక చేయడంలో అధిష్టానం ఎన్నో విధాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు చెబితే అధ్యక్షుడిని పెట్టే పార్టీ బీజేపీ కాదన్నారు. బీజేపీకి కట్టర్ కార్యకర్తలు ఉన్నారని, ఎవరైనా పార్టీకి, అధిష్టానానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా పోస్టింగ్‌లు పెట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు కొందరు బీజేపీ అధ్యక్ష ఎన్నికపై విమర్శలు చేస్తున్నారని, బీసీ వ్యక్తిగా అధ్యక్ష పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ముందుగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీ వ్యక్తిని నియమించాలని, ఆ తర్వాత వ్యాఖ్యలు చేయాలని సంజయ్ హితవు పలికారు. బీజేపీలో అన్ని వర్గాలకు చెందిన వారు అధ్యక్షులు అయ్యారని, గతంలో బండారు దత్తాత్రేయ, కె.లక్ష్మణ్, బండి సంజయ్ ఇలా బీసీలు అధ్యక్షులుగా కొనసాగారని గుర్తుచేశారు.

బీజేపీ బీసీల వ్యతిరేకి అని మరోసారి రుజువైంది

• మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ అని మరోసారి నిరూపించుకుందని, ముగ్గురు బీసీ ఎంపీలతో పాటు బీసీ వర్గాలకు చెందిన సీనియర్ నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యే అవకాశమున్నా ఇవ్వలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి.. బీజేపీ శాసనసభా పక్ష పదవి కూడా ఇవ్వలేదని, ఇప్పుడు అధ్యక్ష పదవి కూడా ఎగ్గొట్టిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ ఫ్యూడల్ పార్టీ అని, ఆ పార్టీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదని ఆరోపించారు. కనీసం అధ్యక్ష పదవి కోసం బీసీ నేత నామినేషన్‌ను కూడా వేయనీయరా? అని పొన్నం ప్రశ్నించారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ను తొలగించి కిషన్‌రెడ్డిని అధ్యక్షుడిని చేశారని, ఇప్పుడు మరోసారి బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా బీసీ వర్గాలకు అండగా నిలబడి సామాజిక న్యాయం చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ ప్రకటనలో మంత్రి పొన్నం స్పష్టంచేశారు.

రేవంత్ ప్రభుత్వాన్ని కేంద్రం రక్షిస్తోంది: కేటీఆర్

బీజేపీ, కాంగ్రెస్.. ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని నిజామాబాద్ పర్యటనలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వాన్ని కేంద్రం ఎందుకు రక్షిస్తున్నదో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి రేవంత్ ప్రభుత్వం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని ఆరోపణలు చేసే ప్రధాని మోదీ ఎలాంటి చర్యలు తీసుకోరు. రేవంత్ బావమరిది కంపెనీకి అర్హత లేకున్నా రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు పనులను అప్పగించినా ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి విచారణకు ఆదేశించదు. కంచెగచ్చిబౌలి అటవీ భూములను తనఖా పెట్టి రూ.10వేల కోట్లు రేవంత్ ప్రభుత్వం అప్పుగా తెచ్చి ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ చెప్పినా విచారణ ఉండదు. తెలంగాణ మంత్రివర్గంలోని ఓ నేతకు రూ.4,400 కోట్ల కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల అప్పగింతలో భారీ అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలు ఉండవు. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ పేరును ఈడీ ప్రస్తావించినా, వాల్మీకి కుంభకోణంలో రూ.45 కోట్లు తెలంగాణలోకి ఓ కాంగ్రెస్ నాయకుడి ఖాతాలోకి వచ్చాయని తెలిసినా స్పందన లేదు. బీజేపీతో ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అనే విషయం అందరికీ అర్థమైంది' అని కేటీఆర్ విమర్శించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసుమి భట్టాచార్య తీరును ఆక్షేపిస్తూ న్యాయవాదులు ఆమె కోర్టును సోమవారం బహిష్కరించారు. న్యాయవాదులెవరూ హాజరుకాకపోవడంతో ఒక గంటపాటు వారు లేకుండానే విచారణ కొనసాగింది. జస్టిస్ మౌసుమి భట్టాచార్యను బదిలీ చేయాలంటూ చేసిన తీర్మానాన్ని గత వారం హెచ్‌సీఏఏ ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం తెలిసిందే. సాయంత్రం హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) మరోసారి సమావేశమైంది. వారంపాటు విచారణకు హాజరుకావాలని, న్యాయవాదుల పట్ల జస్టిస్ మౌసుమి భట్టాచార్య అదే తీరుతో వ్యవహరిస్తే.. వచ్చే సోమవారం నుంచి బదిలీ చేసే వరకు విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.జగన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి, అదనపు కార్యదర్శి అనిరుధ్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు

- సోమవారం నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్సీ
- అధిష్టానం ఆదేశాలతో అధ్యక్ష ఎన్నికకు ఒకటే నామినేషన్ దాఖలు
- నేడు ఏకగ్రీవంగా ఎన్నిక.. ప్రక్రియ అంతా లాంఛనమే
- యువమోర్చా నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘ ప్రస్థానం
- 45 సంవత్సరాలుగా పార్టీలో వివిధ హోదాల్లో అనుభవం



ఎన్నిక రిటర్నింగ్ అధికారి శోభా కరంద్లాజేకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎన్.రాంచందర్‌రావు. చిత్రంలో యెండల, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే. అరుణ, కొండా తదితరులు

సాక్షి, హైదరాబాద్/లాలాపేట: భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీ నుంచి సమాచారం అందటంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరుల సమక్షంలో అధ్యక్ష అభ్యర్థిగా రాంచందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నిక రిటర్నింగ్ అధికారి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, ఎన్నికల ఇన్‌చార్జ్ యెండల లక్ష్మీనారాయణకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అధ్యక్ష ఎన్నికకు రాంచందర్‌రావు ఒక్కరే నామినేషన్ వేయటంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మంగళవారం అధ్యక్ష ఎన్నికల ఫలితాలను లాంఛనంగా ప్రకటించనున్నారు. కాగా అధ్యక్ష పదవికి ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డాక్టర్ కె.లక్ష్మణ్‌ల పేర్లు విస్తృతంగా ప్రచారమైనా, చివరకు పార్టీ అధిష్టానం ఎన్.రాంచందర్‌రావును ఎంపిక చేసింది.

45 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం

బీజేపీతో ఎన్.రాంచందర్‌రావుకు సుదీర్ఘ అనుబంధం ఉంది. వివాదరహితుడిగా ఆయనకు పార్టీలో మంచి పేరుంది. పార్టీ విద్యార్థి విభాగం ఏబీవీపీతో ఆయన ప్రస్థానం ప్రారంభించారు. 1980–82 మధ్య పార్టీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 1980–85 మధ్య ఏబీవీపీ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడిగా, 1986–90 మధ్య బీజేవైఎం హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2003–06 మధ్య బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా, 2006–10 మధ్య జాతీయ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా, 2007–09 వరకు ఉమ్మడి రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధిగా కొనసాగారు. 2015 నుంచి 21 వరకు హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్నారు. హైదరాబాద్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

పార్టీలో ఆధిపత్య పోరు లేదు: రాంచందర్

బీజేపీలో ఎలాంటి ఆధిపత్య పోరు లేదని నామినేషన్ వేసే ముందు ఎన్.రాంచందర్‌రావు మీడియాతో అన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, నాయకత్వమంతా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుందని చెప్పారు. పార్టీలో నాలుగు దశాబ్దాలకు పైగా సేవ చేస్తున్నందుకు తనకు అధిష్టానం ఈ బాధ్యత అప్పగించిందని, దీనిని విజయవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ రోజురోజుకు మరింత బలపడుతుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. అంతకుముందు తార్నాకలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. పార్టీలోని అందరినీ కలుపుకుని పోయి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని తెలిపారు. నామినేషన్ వేయటానికి పార్టీ కార్యాలయానికి వెళ్లటానికి ముందు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆలయంలో పూజలు నిర్వహించారు.

గ్యారంటీలను అమలు చేసే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు: శోభ కరంద్లాజే

కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలుగా మారాయని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చే ముందు ఆయా పార్టీలు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసే ధైర్యం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలకు లేదని మండిపడ్డారు. కర్ణాటకలో ప్రభుత్వ పాలన అగమ్యగోచరంగా మారిందని అన్నారు. తెలంగాణలో అభివృద్ధి ఎక్కడుందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ హైకమాండ్‌కు డబ్బులు పంపడం, ఖుషీ చేయడమే తెలంగాణ ప్రభుత్వ పని అని విమర్శించారు. కర్ణాటక ప్రభుత్వం కూడా ఇదే పని చేస్తోందని మండిపడ్డారు. ఈ రెండు రాష్ట్రాల్లో 50 శాతం కమీషన్ నిబంధన అమలు జరుగుతోందన్నారు.

ఏపీ బీజేపీ కొత్త సారథి మాధవ్

పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఆయన ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారుచేసింది. ప్రస్తుతం ఈయన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతీ మూడేళ్లకొకసారి జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. మాధవ్ సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌లతో సహా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాధవ్ తరఫున మొత్తం ఐదు సెట్ల నామినేషన్ సెట్లను జాతీయ పార్టీ తరఫున ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించిన పీసీ మోహన్‌కు అందజేశారు. పీవీఎన్ మాధవ్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా మంగళవారం ఉ.11 గంటలకు రాష్ట్ర పార్టీ సంస్థాగత ఎన్నికలాధికారి పాకా వెంకటసత్యనారాయణ వెల్లడించనున్నారు.

కార్మిక సంఘాల సమ్మెకు వామపక్షాల మద్దతు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎం.హన్మేశ్ (సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్), వనం సుధాకర్ (సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ), మామిండ్ల రమేశ్‌రాజా (సీపీఐ(ఎంఎల్)లిబరేషన్), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐ(సీ) తదితరులు మాట్లాడారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

'మీకో దండం... మీ పార్టీకో దండం'

బీజేపీ సభ్యత్వానికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ఆ పార్టీలో చిచ్చు రేపింది. అధ్యక్ష పదవికి నామినేషన్ వేయకుండా తనను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తోపాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 'మీకో దండం.. మీ పార్టీ కో దండం' అంటూ ఘాటు విమర్శలకు దిగారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి సమర్పించారు. పార్టీ గుర్తుపై గెలిచినందుకు రాజీనామాను అసెంబ్లీ స్పీకర్‌కు పంపించాలని కోరారు. పలుమార్లు పార్టీ అగ్ర నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాజాగా అధ్యక్ష ఎన్నికల్లో తనకు అన్యాయం జరిగిందంటూ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

నామినేషన్ వేయనివ్వలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు రాజాసింగ్ సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. అయితే తనను నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆయన మీడియాతో వాపోయారు. 'ముగ్గురు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాకోసం సంతకం చేశారు. కానీ నన్ను నామినేషన్ వేయనివ్వకుండా అడ్డుకున్నారు. కౌన్సిల్ సభ్యులకు ఫోన్ చేసి బెదిరించారు. పార్టీ కోసం నేను సర్వం ధారపోశాను. ఇప్పుడు టెర్రరిస్టులకు టార్గెట్‌గా ఉన్నాను. ఇప్పుడు పార్టీకి రాజీనామా చేస్తున్నాను. అసెంబ్లీ స్పీకర్‌కు సమాచారం ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి చెప్పాను. మీకో దండం, మీ పార్టీకో దండం. కొందరు నేతలు తమకు అనుకూలంగా ఉన్న వాళ్లకే అధ్యక్ష పదవి ఇచ్చుకున్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావొద్దు అనేవాళ్లంతా ఒక్కచోట జమ అయ్యారు' అని రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

లైట్ తీసుకున్న పార్టీ నేతలు

రాజాసింగ్ రాజీనామా వ్యవహారాన్ని పార్టీ నేతలు తేలిగ్గా తీసుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనే ఉద్దేశం ఉంటే నేరుగా అసెంబ్లీ స్పీకర్‌కు రాజీనామా పత్రం సమర్పించాలని, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలంటే అధ్యక్షుడికి ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ మీడియాతో మాట్లాడుతూ.. అధ్యక్ష పదవి నామినేషన్ పత్రంపై పదిమంది కౌన్సిల్ సభ్యుల సంతకాలు ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శోభ కరంద్లాజె సూచించారని, దీంతో ఆయన పార్టీ నేతలపై ఆరోపణలు చేసి వెళ్లారని తప్పుబట్టారు. రాజాసింగ్ రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడికి కిషన్‌రెడ్డి పంపించారని తెలిపారు. రాజాసింగ్ ఇప్పటికే అనేకసార్లు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారని, ఆయన క్రమశిక్షణ రాహిత్యం పరాకాష్టకు చేరిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక పార్టీ నియమావళి ప్రకారం జరుగుతుందని, అర్హులందరికీ అవకాశం ఇచ్చారని తెలిపారు. పదిమంది సంతకాలతో నామినేషన్ వేస్తే ఆమోదిస్తారని చెప్పారు. అంతకుముందు రాజాసింగ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ బుజ్జగించే ప్రయత్నం చేయగా... తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది.

బీజేపీలో 'రాజా'నామా చర్చ

గోషామహల్ నియోజకవర్గంలో గందరగోళం

అబిడ్స్: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తన పార్టీకి, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించటంతో.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న గోషామహల్ నియోజకవర్గంలో పార్టీలోని కింది స్థాయి నేతలు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిత్యం వివాదాస్పద ప్రకటనలు చేసే రాజాసింగ్‌ను గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏడాదిపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ సమయంలో ఆ నియోజకవర్గంలో బీజేపీకి ఉన్న ఐదుమంది కార్పొరేటర్లు రాజాసింగ్‌కు మద్దతుగా నిలువలేదు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన మళ్లీ బీజేపీలో చేరారు. ఇప్పుడు కూడా ఆయన ఒంటరి అవుతారా? లేదంటే బీజేపీలోని కొందరైనా ఆయన వెంట నడుస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీకి 5 మంది కార్పొరేటర్లతోపాటు పలువురు రాష్ట్రస్థాయి నాయకులు, నగర మాజీ అధ్యక్షులు, కీలక నేతలు ఉన్నారు. సోమవారం రాత్రి వరకు వారిలో క్కరు కూడా రాజాసింగ్‌కు మద్దతుగా కనీసం ప్రకటనలు కూడా చేయలేదు. రాజాసింగ్ దారి ఎటు? అని పలువురు చర్చించుకుంటున్నారు. ఆయన వేరే పార్టీలోకి వెళ్తారా? సొంత ఎజెండాపై ముందుకు వెళ్తారా? అనే చర్చ జరుగుతోంది.

స్థానిక ఎన్నికల్లో మా పరిస్థితి ఏంటి ?

- అన్ని జిల్లాల్లో కలిసి పోటీచేసే విషయంపై స్పష్టత ఇవ్వండి
- సీఎంతో భేటీలో సీపీఐ ముఖ్య నేతల విన్నపం
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పరిశీలిద్దామన్న సీఎం




సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యం, ఎమ్మెల్యే కూనంనేని, వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నాటి నుంచి కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా కొనసాగుతున్న సీపీఐ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏం చేయాలనే అంశంపై తర్జనభర్జన పడుతోంది. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయడమా? ఒంటరిగా బలమున్న చోట బరిలోకి దిగడమా? అనే అంశాన్ని తేల్చుకోవాలని నిర్ణయించింది. సోమవారం అందుబాటులో ఉన్న సెక్రటేరియట్ సభ్యులతో ఎమ్మెల్యే, సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమావేశమయ్యారు. ఎన్నికల్లో జిల్లాలవారీగా సీపీఐకి సీట్ల కేటాయింపు, గతంలో ఇచ్చిన హామీ మేరకు మరో ఎమ్మెల్సీ సీటు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సీపీఐ ఎమ్మెల్సీ ఇచ్చే ప్రతిపాదనలను ఆమోదించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించాలని నిర్ణయించారు. అనంతరం సోమవారం సాయంత్రం సీఎంను ఆయన నివాసంలో కూనంనేనితోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, బీవీ విజయలక్ష్మి, కపిల్ కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీచేసే అంశాన్ని సీపీఐ నేతలు ప్రస్తావించారు. అయితే, ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, నోటిఫికేషన్ వచ్చిన తరువాత మాట్లాడుదామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ సత్యం ఇందిరమ్మ ఇళ్ల అంశాన్ని లేవనెత్తగా, జిల్లాలవారీగా ప్రక్రియ సాగుతోందని, పరిశీలిద్దామని దాటవేసినట్లు సమాచారం. ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు జరిపి, ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించాలన్న అభ్యర్థనకు సీఎం సానుకూలంగా స్పందించారని సీపీఐ వర్గాలు తెలిపాయి. అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, వరంగల్, భూపాలపల్లి, మేడ్చల్ ప్రాంతాలలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని సీపీఐ నేతలు కోరారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు : కవిత

ఎమ్మెల్సీ కవిత.. రైల్ రోకో పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించి తీరుతామన్నారు. సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ సమాజం, తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ పోరాటాల తోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందన్నారు. వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కవిత డిమాండ్ చేశారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ రైలు ప్రయాణాలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో సింగరేణి జాగృతి నాయకులు వెంకట్, నరేశ్ నేత, శ్రీనివాస్, భువనచంద్ర, సిద్ధిఖ్ షేక్, అనిల్, శ్రీకాంత్ రెడ్డి, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. భద్రాచలంలో అంతర్భాగంగా, పట్టణాన్ని ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ ఇవ్వడాన్ని 'ఎక్స్' వేదికగా ఆమె స్వాగతించారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగి 8 మంది మృతి చెందడంపై కవిత ఆవేదన వ్యక్తంచేశారు.

స్కూల్ యూనిఫామ్, బ్యాగులు పంపిణీ చేయాలి: హరీశ్

సాక్షి, హైదరాబాద్: గురుకుల కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థ పట్ల కాంగ్రెస్ చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుందని సోమవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటం శోచనీయమన్నారు. జనవరి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోడిగుడ్లు, మాంసం, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయాయని, బకాయిలు చెల్లించకుంటే జూలై 1 నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించే పరిస్థితి వచ్చిందని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు 13 నెలలుగా రూ.450 కోట్లకు పైగా అద్దె బకాయిలు చెల్లించక భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దుస్థితి వచ్చిందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇంతవరకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు.



ఏ మూర్ఖపు పిల్లాడైనా ఒక పేడపురుగును తొక్కేయగలడు.
కానీ ప్రపంచంలో ఉన్న ప్రొఫెసర్లందరు కలిసి కూడా ఒక పేడపురుగును సృష్టించలేరు.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 1 జూలై 2025

ఎందుకొచ్చిన 'సర్'?!

దేశంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా ఆరోపణలు రావటం, మౌనంగా ఉండిపోయి నెలలు గడిచాక ముక్తసరిగా మాట్లాడటం ఎన్నికల సంఘం(ఈసీ)కి అలవాటైపోయింది. ఈసారి మార్పేమిటంటే... ఓటర్ల జాబితా సవరణ దశలోనే దానిపై ఆరోపణలు రావటం! రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం పద్దెనిమిదేళ్లు నిండిన భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవాలి గనుక దానికి అనుగుణంగా ఈ దఫా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఈసీ చెబుతోంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కింద ఓటర్ల వివరాలు సేకరిస్తామంటున్నది. ఇదే మాదిరి సవరణ 2003లో జరిగింది. కానీ ఆ 'సర్' వేరు! అప్పట్లో ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఫొటోలతో ఓటర్లను పోల్చిచూడటం, అనుమానాస్పదం అనిపిస్తే తొలగించటం వగైరాలు చేశారు. 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జాబితాల్లోకి ఎక్కినవారందరినీ సంశయ ఓటర్లుగా పరిగణించి వారి నుంచి వివిధ పత్రాలు అడగాలన్నది ఈసీ తాజా నిర్ణయం. ఇవన్నీ 1955 నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్సీ)లో నిర్దేశించిన పత్రాలు. సారాంశంలో ఈ ఓటర్లంతా జాబితాలో కెక్కాలంటే ముందుగా ఈ దేశ పౌరులమని నిరూపించుకోవాల్సి ఉంటుంది. తమ పుట్టుకకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు మాత్రమే కాదు... తమ తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేయాలి. ప్రస్తుతం ఓటర్లను ఈసీ మూడు కేటగిరీలుగా విభజించింది. దాని ప్రకారం 1987 జూలై 1 లేదా అంతకుముందు జన్మించినవారు జనన ధ్రువీకరణ పత్రం లేదా పుట్టిన ఊరు ధ్రువీకరణ పత్రం... లేదా రెండూ సమర్పిస్తే సరిపోతుంది. జూలై 1, 1987– డిసెంబర్ 2, 2024 మధ్య జన్మించినవారు ఈ పత్రాలతోపాటు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి జనన లేదా ప్రాంత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఆ తర్వాత జన్మించినవారు తమ ధ్రువీకరణ పత్రాలతోపాటు తల్లిదండ్రులిద్దరివీ కూడా సమర్పించాలి. ఇవి అందజేయలేనివారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. తుది జాబితా ప్రచురణలోగా అందిస్తేనే తిరిగి చేరుస్తారు.

ఎన్నికలను సక్రమంగా నిర్వర్తించటంలో తరచూ విఫలమవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈసీ దొడ్డిదారిన ఎన్ఆర్సీని అమల్లో పెట్టజూస్తున్నదని విపక్షాలు చేస్తున్న ఆరోపణ కొట్టిపారేయదగ్గది కాదు. అలాగని దొంగ ఓటర్ల సమస్య లేదని కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, అటు తర్వాత రెండు విభజిత రాష్ట్రాల్లో వేర్వేరు పోలింగ్ తేదీలున్నప్పుడు తెలుగుదేశం దీన్నొక కళగా అభివృద్ధి చేసింది. అక్కడా ఇక్కడా ఓటేయించటం, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఓటర్లను తరలించటం ఆ పార్టీకి అలవాటైన విద్య. ఇక అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వగైరాల్లో బంగ్లాదేశ్, మయన్మార్‌ల నుంచి వచ్చినవారు ఓటర్లుగా నమోదై ఎన్నికల ఫలితాలు తారుమారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే అందుకు సంబంధించిన డేటా ఈసీ ఇంతవరకూ బయటపెట్టలేదు. అది విడుదల చేసివుంటే ఈ వ్యవహారం ఇంత వివాదం అయివుండేది కాదు. కానీ అలా చేయటం తన స్థాయికి తగదని సంస్థ భావిస్తున్నట్టుంది. బిహార్ మాత్రమే కాదు... వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ఈ 'సర్' వచ్చిపడుతుందంటున్నారు.

ఏడేళ్ల క్రితం అస్సాంలో ఈ దేశ పౌరులెందరు... ఇతరులెందరన్న ఆరా తీశారు. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వే తర్వాత 40.07 లక్షల మంది 'విదేశీయులని' నిర్ధారించారు. ఎన్నో ఆందోళనలు జరిగాక ఈ సంఖ్య 19 లక్షలకు తగ్గింది. వీరిలో అన్ని మతాలవారూ ఉండగా బిచ్చగాళ్లు, నిరుద్యోగులూ, ఇల్లూ వాకిలీ లేనివారూ ఎక్కువ. ఒక ఇంట్లో పెద్దన్న 'భారతీయుడైతే' మిగిలిన అన్నదమ్ములు 'విదేశీయులు'గా ముద్రపడిన వారున్నారు. భర్తకు ఎన్ఆర్సీలో చోటు దక్కితే భార్య పేరు గల్లంతయిన ఉదంతాలు కోకొల్లలు. సైన్యంలో రిటైరై, అస్సాం సరిహద్దు పోలీసు విభాగంలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే మహమ్మద్ సనావుల్లా పేరు సైతం మాయమైతే అరెస్టు చేసి నిర్బంధ శిబిరానికి తరలించారు. జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులంతా గువాహటి హైకోర్టును ఆశ్రయించాక బెయిల్ దొరికింది. ఆ రాష్ట్రంలో ఏడేళ్లయినా ఇప్పటికీ లక్షల కేసులు తేలని నేపథ్యంలో ఇంత పని ఈసీ ఎందుకు నెత్తికెందుకుందన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

బిహార్‌లో ఇప్పుడున్న ఓటర్ల సంఖ్య 7 కోట్ల 90 లక్షలు. ఇందులో 20–38 ఏళ్ల మధ్య వయస్కులు దాదాపు సగమని చెబుతున్నారు. ఈసీ లెక్క ప్రకారం ఈ సంఖ్య 2.93 కోట్లు. వీరు తమతోపాటు తమ తల్లిదండ్రుల్లో కనీసం ఒకరి పౌరసత్వాన్ని తేల్చిచెప్పాల్సి ఉంటుంది. నాలుగు నెలల్లో ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడాల్సిన బిహార్‌లో ఇది అంత తేలిగ్గా తేలే వ్యవహారమా? ఆ వంకన పాలక పక్షాల ఒత్తిడితో భారీయెత్తున ఓటర్లను తొలగించే ప్రమాదం ఉండదా? జాబితాలో చోటుదక్కనివారు న్యాయస్థానాలకెక్కితే పరిస్థితేమిటి? పాలకులుగా ఎవరున్నా పేదరికం రాజ్యమేలే బిహార్ నుంచి భారీయెత్తున వలసలుంటాయి. అక్కడ వృద్ధాప్య పింఛన్ నెలకు రూ. 700. ఇటీవలే దాన్ని రూ. 1,100 చేస్తున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆర్భాటంగా ప్రకటించారు. పనుల కోసం వందలాది కిలోమీటర్లు దాటి తెలుగు రాష్ట్రాలకు వలస వస్తున్నవారి సంఖ్య తక్కువేమీ కాదు. అక్కడి జనాభాలో 7 శాతం మంది వేరే రాష్ట్రాలకు పోగా, అందులో 30 శాతం మంది ఉపాధి వెదుక్కొని వెళ్లినవారే. వారంతా వెనక్కొచ్చి తమ పత్రాల కోసం వెతుకులాడటం జరిగే పనేనా? బిహార్‌లో సకాలంలో ఎన్నికలు జరుగుతాయని ఈసీ విశ్వసిస్తోందా?

దూకుడు కన్నా సమన్వయానికే మొగ్గు

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

'మంచి ప్రారంభంతో సగం పని అయిపోయినట్టే' అంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీ కొత్త అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియను తామలానే జరిపించగలిగామని బీజేపీ అధినాయకత్వం భావిస్తోంది. తెలంగాణలో ఎన్.రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్‌లో పి.వి.ఎన్. మాధవ్ కొత్త అధ్యక్షులుగా ఎన్నికవడం చూస్తే, సుదీర్ఘ కాలం పార్టీనే అంటిపెట్టుకొని ఉండటం, సైద్ధాంతిక బలం వంటి అంశాలకే ప్రాధాన్యమిచ్చిందని స్పష్టమౌతోంది. తాజా నిర్ణయంపై ఆర్ఎస్ఎస్ ప్రభావమూ విస్పష్టమే! పార్టీని దూకుడుగా తీసుకు వెళ్లటం కన్నా, 'గ్రూప్'ల బెడద లేకుండా, ఐక్యంగా నడిపించటం పైనే అధిష్ఠానం దృష్టి నిలిపిందనిపిస్తోంది. పార్టీకి లభించే తక్షణ ఊపు కన్నా, ఎన్డీయే కూటమికి దీర్ఘకాలికంగా ఒనగూరే రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేశారని ఈ నిర్ణయం తేటతెల్లం చేస్తోంది. బయటి నుంచి వచ్చే నేతలకు లభించే ఇతర అందలాల సంగతెలా ఉన్నా, వారు పార్టీ సంస్థాగత పదవులు, హోదాల్లోకి రావటం అంత తేలికైన అంశం కాదనీ మరోమారు సంకేతాలు ఇచ్చినట్టయింది.

జాప్యం జరిగినా తెలుగు రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక విషయంలో బీజేపీ అధినాయకత్వం వ్యూహాత్మకంగానే అడుగులు వేసింది. అభ్యర్థుల ఎంపికలో, దూకుడు స్వభావం కన్నా సంయమనం, సమన్వయం నెరిపే నాయకత్వానికి ప్రాధాన్యమిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోని కూటమి భాగస్వామ్య పక్షమైన బీజేపీ, కూటమి పార్టీల మధ్య సఖ్యతకు విఘాతం రానీయకుండా చూసుకోవడమే కాక... తెలంగాణలో అటువంటి భవిష్యత్ అవకాశానికి దారులు తెరచి ఉంచింది. రేపు అది తెలుగుదేశం–జనసేనతో జట్టు కొనసాగించడమైనా కావచ్చు, కాదు పరిస్థితులు మారితే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో జోడీ కట్టడమైనా కావచ్చు. పార్టీ అధినాయకత్వం కనుసన్నల్లో మెదలవటమే కాకుండా, ఢిల్లీ నాయకత్వం నిర్దేశించిన తరహాలో రాష్ట్రాల్లో పార్టీ శ్రేణుల్ని నడపగలిగే అణకువ గలిగిన నాయకత్వానికి పీట వేసింది. మొదట్నుంచీ పార్టీలోనే ఎదిగిన ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు ఎన్.రామచంద్రరావు (తెలంగాణ), పి.వి.ఎన్. మాధవ్ (ఏపీ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయేట్టు వ్యూహరచన చేసింది. దూకుడు నాయకత్వం ఉండుంటే, ఇతర పార్టీల నుంచి, ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి బీజేపీ వైపు వలసలుంటాయేమోననే భయం ఆ పార్టీకి ఉండేది. ఇప్పుడా భయం పోయింది.

వీగిన తెలంగాణ చిక్కుముడి

తెలంగాణలో పార్టీ రాష్ట్రాధ్యక్ష ఎన్నిక బీజేపీ అధినాయకత్వానికి ఒక దశలో సవాల్‌గానే మారింది. పలువురు నాయకులు ఈ పదవిని ఆశించడమే కాకుండా ముమ్మరంగా తమ వంతు ప్రయత్నాలు చేశారు. తర్జన – భర్జనల తర్వాత త్రాసు రామచంద్రరావు వైపు మొగ్గింది. ఈ పదవిని ఆశించడమే కాకుండా ఢిల్లీ నాయకత్వాన్ని మెప్పించే ప్రయత్నం చేసిన మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు నిరాశే మిగిలింది. ఈటలకు పార్టీలో 'చేరికల కమిటీ'కి నేతృత్వం ఇచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో చేరికలు జరగకపోవడం, పార్టీలో పాత –కొత్త నాయకుల మధ్య స్పర్ధ పెరగటం వంటివి అధినాయకత్వానికి చీకాకు కలిగించాయి. బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రచారం జరగటం, గజ్వేల్‌తో పాటు హుజూరాబాద్‌లోనూ ఆయన ఓడిపోవడం వంటివే కాక బీజేపీ సంస్థాగత ఎన్నికల నిబంధనలు కూడా ఆయనకు ప్రతికూలంగా ఉన్నాయి.



బీజేపీ నూతన రాష్ట్రాధ్యక్షులు:
పి.వి.ఎన్.మాధవ్ (ఏపీ), ఎన్.రామచంద్రరావు (తెలంగాణ)

◆ బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుల ఎన్నిక ద్వారా – ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోని కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సఖ్యతకు విఘాతం రానీయకుండా చూసుకోవడమే గాక... తెలంగాణలో అటువంటి భవిష్యత్ అవకాశానికి దారులు తెరచి ఉంచింది.

ఈటలకు పార్టీ అధ్యక్ష పీఠం దక్కకపోవడమొక్కటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మిగిలిన సంతృప్తి కావచ్చని పార్టీలో గుసగుసలున్నాయి. బయటకు ఆసక్తిని వెల్లడించకపోయినా, ఒక దశలో తాను పోటీదారును కాదని ప్రకటించినా.... మరోమారు అధ్యక్షుడు కావాలని ఆయనకు లోలోపల ఉండినట్టు తెలుస్తోంది. అందుకు కారణం, లోగడ ఆయన బాగా పనిచేస్తున్నప్పుడు, పార్టీకి మంచి ఊపు తెచ్చినపుడు అర్ధంతరంగా ఆయన్ని తప్పించడమే! పార్టీ ఎదుగుదలకు 'నేనే' కారణం అనే స్థితిలోకి అధ్యక్షుడు వెళ్లిపోయారనీ, 'నేను'ను బీజేపీ నాయకత్వం అంగీకరించదనీ పార్టీలో కొందరు అప్పట్లో అన్వయం చెప్పేవారు. ఇక తెలంగాణ అధ్యక్ష స్థానానికి ఎంపీలు అర్వింద్, డీకే అరుణ, రఘునందనరావు, డా.లక్ష్మణ్ పేర్లు ప్రచారంలోకి రావటమన్నది ఆటలో అరటిపండే!

సత్తా కన్నా సంకేతాలకే మొగ్గు

బీజేపీ అధిష్ఠానం వైఖరి కొన్నిసార్లు విచిత్రంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై దృష్టి నిలిపిన గొప్ప చరిత్ర ఏమీలేదు. ఏదో సమీకరణాల్లో... అయితే రాష్ట్రం రావాలి, కాదంటే వ్యూహం నెరవేరి ఎన్డీయేకు లబ్ధి చేకూరాలి. ఏపీ, తెలంగాణల్లో అధ్యక్షుల ఎన్నికకు అదే వ్యూహాన్ని అనుసరించినట్టు కనిపిస్తోంది. కూటమి పార్టీల మధ్య సఖ్యతకు, సయోధ్యకు మాజీ ఎమ్మెల్సీ (పట్టభద్రుల స్థానం) పి.వి.ఎన్. మాధవ్ అధ్యక్షులైతే అందరికీ ఆమోదయోగ్యంగా, అధిష్ఠానానికి తలలో నాలుకలా ఉంటారనే తాజా నిర్ణయానికి వచ్చినట్టుంది. కూటమి మిత్రులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలివ్వడం పార్టీకి ముఖ్యం. మాధవ్ దివంగత నేత పి.వి.చలపతిరావు తనయుడు. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా ఉండి, ఉమ్మడి ఏపీ బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిగానూ పనిచేసిన చలపతిరావుకు మంచి పేరుండేది. కోస్తాంధ్ర ప్రాంతం నుంచి సుదీర్ఘకాలం ఆయనే బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్నారు.

ఇక తెలంగాణలో రామచంద్రరావు అధ్యక్షుడవడం చాన్నాళ్లుగా పార్టీనే అంటిపెట్టుకొని ఉన్న పాత నాయకులకు సంతృప్తినిచ్చే నిర్ణయం. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం (ఏబీవీపీ) నుంచి, యువమోర్చా నుంచి ఎదిగి వచ్చిన నాయకుడాయన. సంప్రదింపుల్లో దిట్ట అని పేరుంది. ఎమ్మెల్సీగా (పట్టభద్రులకు) ప్రాతినిధ్యం వహిస్తూ మండలిలో పార్టీ నాయకుడిగా ఉన్నారు. ప్రజలు తమకు అవకాశం ఇస్తే, బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన పార్టీ అధినాయకత్వం ఇతర అగ్రవర్ణాలను దూరం చేసుకోవద్దన్న వ్యూహమే ఇక్కడ పనిచేసి ఉంటుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయ కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయినపుడు, ఆ పార్టీని బీజేపీతో జతచేయడమో, విలీనమో.... ప్రతిపాదనలొచ్చాయని ప్రచారం జరుగుతున్న పరిస్థితుల్లో ....తాజా అధ్యక్ష ఎంపిక/ఎన్నిక కీలకమైంది. రేపు ఏదైనా పరిణామాల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ జట్టు కట్టాల్సివస్తే పార్టీకి సంయమనంతో వ్యవహరించే నాయకత్వం ఉండాలని ఇప్పట్నుంచే ఢిల్లీ నేతలు యోచించినట్టుంది.

ఈటల రాజేందర్, బండి సంజయ్... 'వారిద్దరిలో ఎవరికిచ్చినా వేరొకరు సహకరించక పోదుర'నే బలమైన అభిప్రాయముంది. ఇప్పటికే సిటీ వర్గం, నిజామాబాద్ బ్యాచ్, కరీంనగర్ టీమ్... ఇలా వర్గాలుగా చీలి ఉన్న తెలంగాణ బీజేపీలో మరో కొత్త వర్గాన్ని పుట్టించకుండా అధిష్ఠానం జాగ్రత్తపడిందనే సంతృప్తి కొందరిలోనైనా ఉంది. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఒకప్పుడు చెప్పిన మాటలీ సందర్భంలో గుర్తుకొస్తాయి. బీజేపీకి సన్నిహితంగా పనిచేస్తూ, ఒక దశలో బీజేపీలో చేరే ఆలోచన చేసిన టీడీపీ నాయకుడు పర్వతనేని ఉపేంద్రనుద్దేశించి వాజ్‌పేయి ఈ మాటలన్నారు: 'మీ పనితీరు మాకు అతకదేమో! మీరు ఇక్కడ ఇమడలేరు, మా వాళ్లు ఇమడనివ్వరు కూడా' అని ఆ పెద్దాయన నర్మగర్భంగా చెప్పారు. అది కరడుగట్టిన సత్యమని తెలంగాణ బీజేపీ రాజకీయాలు నిరూపించాయి.

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

ఇరాన్ తగ్గలే!



లీక్ అయిన గూఢచర్య సమాచారం, అంతర్జాతీయ అణుశక్తి సంఘం (ఐఏఈఏ) అధినేత వ్యాఖ్యలు, అడ్డగింతకు గురైన ఇరాన్ అధికారుల సంభాషణలు, ఇజ్రాయెలీల హెచ్చరికలు, బెదిరింపులు... అన్నీ ఒకటే విషయాన్ని సూచిస్తున్నాయి– ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంలో ఇజ్రాయెల్, అమెరికా విఫలమయ్యాయి.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఎందుకిన్ని?



చండీగఢ్‌లో 13 లక్షల మంది జనానికి 14.27 లక్షల వాహనాలు ఉన్నాయి. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి నమూనా ఎంత వక్రంగా ఉందో ఇది చూపుతోంది. ఇది అత్యధిక జీడీపీకి దారితీస్తుంది, అదే సమయంలో ప్రమాదకర జీవనానికి కూడా!

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

ఒక్కడే అయినా...



రాజ్ ఠాక్రేకు ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు. అయినా బడుల్లో హిందీని మూడో భాషగా చేయాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల అభ్యంతరాలు లేవనెత్తారు. మరాఠీ జనానికి అది ఉద్వేగపూరిత అంశం కావడంతో భారీ మద్దతు వచ్చింది. ఇతర పార్టీలూ తోడయ్యాయి. ప్రభుత్వం తన నిర్ణయం పట్ల వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

– సుధీర్ సూర్యవంశీ, న్యాయవాది

మనీ పవర్



డబ్బుల కరవు ఎంత దారుణంగా ఉండగలదో తెలియకుండా, డబ్బుల విలువను అర్థం చేసుకునే మార్గమే లేదు.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

సగం అక్కడినుంచే...



ఇండియా ఏటా 87 బిలియన్ డాలర్లను రెమిటెన్సెస్(చెల్లింపుల) రూపంలో అందుకుంటోంది. అందులో సగం ఐదు ఇస్లామిక్ దేశాల నుంచి వస్తోంది: యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, ఒమన్.

– హెంద్ ఫైజల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గురు సార్వభౌముడు

భాషా శాస్త్రానికి తెలుగులో తగిన పుస్తకాలు దొరకని రోజుల్లో అలవోకగా, అర్థమయ్యేలా బోధించిన గురుసార్వభౌముడు ఆచార్య తూమాటి దొణప్ప. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్‌లో గ్రాంథిక, వ్యావహారిక భాషపై వాదోపవాదాలు జరిగే 1960–70 కాలంలో పట్టుబట్టి, మెట్రిక్యులేషన్ నుంచి తెలుగు పీహెచ్‌డీ వరకు వ్యావహారిక భాషలో రాయొచ్చని తీర్మానం చేయించిన ఘనాపాటి ఆచార్య దొణప్ప.



ఆచార్య తూమాటి దొణప్ప

అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకట్ల గ్రామంలో 1926 జూలై ఒకటిన దొణప్ప జన్మించారు. చిన్నతనంలోనే 'చంద్రుడు–కలువ' అనే కథతో రచనా వ్యాసంగం ప్రారంభించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 'వైకృత పద స్వరూప నిరూపణము' అనే అంశంపై పరిశోధన చేశారు. 1958 నాటికి అదే విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరి, తెలుగులో భాషాశాస్త్ర పరిచయాన్ని కొత్తపుంతలు తొక్కించారు. గుంటూరు నల్లపాడులోని ఆంధ్రా యూనివర్సిటీ పీజీ సెంటర్ 1976 సెప్టెంబరు 11న నాగార్జున విశ్వవిద్యాలయంగా అవతరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బదిలీల్లో భాగంగా దొణప్పతో సహా తన పరిశోధక శిష్యబృందం అంతా నాగార్జునకు వచ్చారు. ఆపై తెలుగు శాఖాధిపతిగా, ప్రిన్సిపల్‌గా, రిజిస్ట్రారుగా వివిధ పదవులు అలంకరించి పదవులకే వన్నె తెచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం 1986లో స్థాపితమైంది. దానికి తొలి ఉపకులపతిగా దొణప్ప నియమితులయ్యారు.

దొణప్ప రచనల్లో అధికభాగం తెలుగు సాహిత్య అకాడమీ పురస్కారం లేదా విశ్వవిద్యాలయ ప్రత్యేక గుర్తింపు వచ్చిన రచనలే. ఆయన రచనల్లో 'సంస్థానాలు సాహిత్య పోషణ', 'భాషాచారిత్రక వ్యాసావళి', 'జానపద కళాసంపద', 'తెలుగులో కొత్త వెలుగులు' వంటివి ఉన్నాయి. అముద్రిత గ్రంథాల్లో దాదాపు వేలకొద్దీ పుటలున్న వివిధ పుస్తకాలు ప్రస్తుతం అచ్చుకు సిద్ధంగా ఉన్నాయి.

గురువులకే గురువుగా వెలిగిన ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి సంవత్సరం (1926–2025) పురస్కరించుకుని కుటుంబసభ్యులు, ఆత్మీయులు, అంతేవాసులు తొలి సమావేశం జూలై ఒకటిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రారంభించి, 2026 జూలై వరకు రాష్ట్ర, రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల్లో జాతీయ సదస్సులు, శతజయంతి సాహిత్య సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆచార్య దొణప్ప అముద్రిత రచనలను ప్రచురించి ఆ యా ప్రాంతాల్లో ఆవిష్కరిస్తారు. ఇది సద్గురువుకు సన్మనస్కుల నివాళి కదా!

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, విశ్రాంత ఆచార్యులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మొబైల్: 98481 23655

(నేడు హైదరాబాద్‌లో ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ప్రారంభ సభ)

లండన్ 'వీరాస్వామి'కి చివరి రోజులా?

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్‌లో ఇప్పటికీ నడుస్తున్న అతి పురాతనమైన భారతీయ రెస్టారెంటు 'వీరాస్వామి'. ఇంత సుదీర్ఘకాలం నుంచీ భోజనప్రియులను అలరిస్తున్న ఇండియన్ రెస్టారెంటు ప్రపంచంలోనే మరొకటి లేదని యాజమాన్యం సగర్వంగా చెబుతుంది. దీన్ని స్థాపించి వచ్చే ఏడాదికి వందేళ్లు. ఆ సంబరాలే మరపురానివిగా మిగిలిపోయే... 'వీరాస్వామి' అంతిమ ఘడియలు కూడా కావచ్చు.

లండన్ రీజెంట్ స్ట్రీట్‌లో ప్రసిద్ధి గాంచిన చిరునామాల్లో 'వీరాస్వామి' ఒకటి. దీనికి ఎడమవైపు ఆస్టిన్ రీడ్, ఎదురుగా ఆక్వాస్క్యూటమ్ ఉండేవి. ఈ రెండు లెజెండరీ క్లాత్ షాపులూ చరిత్రగర్భంలోకి జారిపోయి ఎంతో కాలం కాలేదు. అదే 'వీరాస్వామి' విషయంలోనూ నిజం కాబోతుందేమో!

ఈ రెస్టారెంటు మూతపడటం... సాంస్కృతిక విలువలను బేఖాతరు చేస్తూ డబ్బుకు ప్రాముఖ్యం ఇవ్వడానికి నిదర్శనంగా రంజిత్ మత్రానీ, నమిత పంజాబీ అంటున్నారు. వీరు 'వీరాస్వామి' ప్రస్తుత యజమానులు. వారి మాటలతో ఏకీభవించని వారుండరు.

1926లో 'వీరాస్వామి' ప్రారంభమైంది. జనరల్ విలియం పామర్, మొఘల్ ప్రిన్సెస్ ఫయిసన్ నిస్సా బేగంల ముని మనవడు ఎడ్వర్డ్ పామర్ దీన్ని స్థాపించాడు. వీరాస్వామిలోని 'వీరా' ఆయన గ్రాండ్ మదర్ పేరు. తందూర్ ఓవెన్‌ను తీరాలు దాటించిన ఘనత కూడా ఎడ్వర్డ్‌కే దక్కింది. 1937లో ఈ రెస్టారెంటు తందూర్ ఓవెన్ ప్రారంభించింది. 1940లలో లండన్ మీద జర్మనీ బాంబులు కురిపిస్తున్నా, వీరాస్వామి యథాప్రకారం తెరచి ఉందని చెబుతారు.

లండన్ పుర ప్రముఖులకు 'వీరాస్వామి' అంటే ఎప్పుడూ మొఖం మొత్తలేదు. వేల్స్ యువరాజు (తర్వాతి కాలంలో 8వ కింగ్ ఎడ్వర్డ్) తరచూ అక్కడ విందు ఆరగించేవాడు. 1930ల ప్రథమార్ధంలో డెన్మార్క్ క్రౌన్ ప్రిన్స్‌కు ఈ రెస్టారెంటు ఎంతో ఇష్టమైన ప్లేస్. దీన్నిబట్టి దాని ప్రాభవం ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆయన తరచూ ఇక్కడకు వస్తూ ఉండేవాడు. గోవా స్టయిల్ డక్ విన్డాలూ వంటకం ఆయన ఫేవరెట్ డిష్. ఈ ప్రిన్స్ ప్రతి ఏటా క్రిస్మస్ నాడు 'వీరాస్వామి'కి కృతజ్ఞతా పూర్వకంగా కార్ల్స్‌బర్గ్ బీరు పీపా పంపేవాడు. బీరు, ఇండియన్ వంటకాల మేళవింపుపై బ్రిటిష్ వారి క్రేజ్‌కు ఇక్కడే బీజం పడింది. ఇప్పుడు ఇవి జన జీవన స్రవంతిలో భాగం అయ్యాయి.

భారతీయులకు కూడా 'వీరాస్వామి' ప్రీతిపాత్రంగా ఉంటూ వచ్చింది. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, కృష్ణమీనన్ ఈ రెస్టారెంటుకు తరచూ వెళ్లేవారు. అలాగే చర్చిల్, స్వీడన్, జోర్డాన్‌ల రాజులు, మార్లన్ బ్రాండో, లారెన్స్ ఆలివర్, పియర్స్ బ్రాజ్నన్, ప్రిన్సెస్ ఏనీ, డేవిడ్ క్యామరన్‌లు కూడా. 1948లో భారత ఒలింపిక్ టీముకు తన సేవలు అందించింది. 2017లో ఇంగ్లాండులో పర్యటించిన భారత రాష్ట్రపతికి ఎలిజబెత్ రాణి ఇచ్చిన విందుకు వీరాస్వామే కేటరర్.



లండన్‌లో నూరేళ్లుగా ఉన్న భారతీయ రెస్టారెంట్ 'వీరాస్వామి'

వీరాస్వామిని మూసివేత అంచుల్లోకి నెట్టిన సమస్య ఏమిటో చూద్దాం. ఈ రెస్టారెంటు రీజెంట్ స్ట్రీట్‌లోని క్రౌన్ ఎస్టేట్‌కు చెందిన బిల్డింగులో ఉంది. ఇదే అసలు సమస్య. క్రౌన్ ఎస్టేట్ సంస్థ చార్లెస్ రాజు ఆస్తులను నిర్వహిస్తుంది. ఈ సంస్థ వీరాస్వామి లీజు పొడిగించరాదని నిర్ణయించింది. లీజు వచ్చే ఏడాది ఏప్రిల్‌తో ముగుస్తుంది. రెస్టారెంటు గ్రౌండ్ ఫ్లోర్ ముఖద్వారం ఆక్రమించి ఉండే 11 చదరపు మీటర్ల స్పేస్‌ను తీసేసుకుని పైఅంతస్తుల్లోని ఆఫీసుల కోసం రిసెప్షన్‌ను విస్తరించుకోవాలని తలపెట్టింది. అక్కడ రెస్టారెంటు ఉండటం చీకాకుగా ఉంటోందని వారు భావిస్తూ ఉండొచ్చనీ, భవనం అంతా కార్యాలయాలు మాత్రమే ఉండాలనుకున్నారని తాము భావిస్తున్నామనీ మత్రానీ ఇటీవలే 'ది టైమ్స్' వార్తా పత్రికకు చెప్పారు.

అయితే 'వీరాస్వామి' దీనిపై కోర్టుకు వెళ్లింది. కేసు ఇంకా విచారణకు రాలేదు. అలాగే, సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. లీజు రద్దుకు వ్యతిరేకంగా పదుల వేలల్లో ప్రజలు పిటిషన్ మీద సంతకాలు చేశారు. దీన్ని రాజుకు సమర్పిస్తారు. ఈ ప్రయత్నాలేవీ ఫలించనట్లయితే, 'మేం దీన్ని మూసేస్తాం. తర్వాత అనువైన కొత్త సైటును ఎంపిక చేసి అందులో తిరిగి తెరుస్తాం. ఈ ప్రక్రియకు ఎంతకాలం పడుతుందో చెప్పలేం. అందాకా వ్యాపారం నష్టపోతుంది. వృథా వ్యయాలు ఉత్పన్నమవుతాయి' అని మత్రాని వివరించారు. దీనివల్ల 'ప్రధానమైన ఒక లండన్ సంస్థ నాశనమవుతుంద'ని ఆయన ఆవేదన చెందారు.

అది నిజంగానే ఓ విషాదం. ఇక్కడ విషయం, 'వీరాస్వామి'కి చరిత్రలో ఉన్న స్థానాన్ని కాపాడటం, సంరక్షించడం మాత్రమే కాదు. ఒక మంచి రెస్టారెంటు కనుమరుగు అవుతుందన్నది కూడా ముఖ్యమైన అంశమే. 2016లో దీనికి గుర్తింపుగా మిషెలన్ స్టార్ రేటింగ్ లభించింది. ఇవ్వాళ్టికీ ఈ రేటింగ్ కొనసాగుతోంది.

చార్లెస్ రాజు జోక్యం చేసుకుని 'వీరాస్వామి' మూతపడకుండా అడ్డుకుంటారా? ఈ ఒక్క ఆశే మిగిలి ఉంది. ఒకవేళ ఆయన ఆ పని చేయనట్లయితే, ఈ సారి లండన్ వెళ్లినప్పుడు నేను తప్పనిసరిగా 'వీరాస్వామి'లో డైనింగ్ చేసి వీడ్కోలు చెప్పివస్తాను. మీరు కూడా ఇలా ఎందుకు చెయ్యకూడదు? ఆలోచించండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఎరుక

ఈ భూమి మీదకు వచ్చేటప్పుడు ఏ జీవియైనా ఏమీ తీసుకురాదు. మృతి చెందినప్పుడూ తనతో ఏదీ తీసుకుపోదు. ఈ ఎరుక ఒక్కటే మనిషికి ఒత్తిడిలేని జీవితాన్ని అందిస్తుంది. ఈ చిన్న కథ ద్వారా ఈ వాస్తవం బోధపడుతుంది. ఒకానొక రోజు, ఓ ధనవంతుడు తన ఇంటి బాల్కనీలో పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాస్సేపటికి అతను ఒక చిన్న చీమ తన ఆకారం కన్నా కొన్ని రెట్లు ఎక్కువ పెద్దదైన ఓ ఆకును తీసుకుపోవటం చూశాడు.

జ్యోతిర్మయం

ఇంతలో ఓ చోట ఒక పగులు కనిపించింది. అక్కడ ఆ చీమ ఎలా పోతుందా అని ఆసక్తిగా చూశాడు. పగులు దగ్గరకు రావడంతోనే చీమ అక్కడ ఆకును అడ్డంగా ఉంచి దాని పైకి ఎక్కి అవతలకు దాటింది. అనంతరం ఆ ఆకును ముందుకు లాగింది. మొత్తం మీద చీమ ఇలా మరిన్ని అడ్డంకులను దాటుకుంటూ విజయవంతంగా ముందుకు సాగింది. చీమ చివరకు దాని గమ్యస్థానమైన పుట్ట వద్దకు చేరుకుంది. తన పుట్ట ముందర ప్రవేశ ద్వారంగా ఓ రంధ్రం ఉంది. ఆ రంధ్రంలోకి తాను వెళ్ళడానికి వీలుంది తప్ప తానింత దూరమూ తీసుకొచ్చిన ఆకుని పుట్టలోకి తీసుకుపోయే వీలు లేదు. అది తెలీని చీమ ఎంత ప్రయత్నించినా ఆకుతో సహా రంధ్రంలోకి వెళ్లడానికి నానా తిప్పలూ పడింది. చివరకు చేయగలిగిందేమీ లేక ఆకును ప్రవేశ ద్వారం దగ్గరే విడిచిపెట్టి లోపలికి వెళ్లింది.

ఒక వ్యక్తి చాలా కష్టపడి తన జీవితంలో ఎన్నెన్నో సమకూర్చుకుంటాడు. ఇబ్బందులు అధిగమించి సౌకర్యాలను పొందుతాడు. బోల్డన్ని ఆస్తిపాస్తులను పోగేసుకుంటాడు. తాను జీవించడానికి అవసరమైనవాటికన్నా ఎక్కువే పోగుచేసి సంతోషపడిపోతూ ఉంటాడు. చివరికి, అతను మరణించేటప్పుడు తనదంటూ ఏదీ తీసుకుపోలేడు. ఈ సంపదలేవీ తనతో రావని తెలిసీ మనిషి చివరి వరకూ అవసరం లేకపోయినా సంపాదించడానికే ప్రయత్నిస్తాడు. కానీ, రిక్త హస్తాలతో చీమ పుట్టలోకి వెళ్లినట్లే... మనిషీ మరణం ఒడిలోకి జారుకుంటాడు. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడమే జ్ఞానం! ఈ జ్ఞానమే ఇహలోకంలో మనిషికి ప్రశాంతతను ప్రసాదిస్తుంది.

– యామిజాల జగదీశ్

నా వల్ల కావడం లేదు తల్లీ..

• కుమార్తెకు వైద్యం చేయించలేక తండ్రి ఆత్మహత్య



పరశురాం



అచేతన స్థితిలో కుమార్తె సింధు

కూసుమంచి: రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు మరణించగా, అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమార్తె ప్రాణం ఉన్నా మంచంలోనే అచేతన స్థితిలో మిగిలింది. దీంతో కూతురిని దక్కించుకోవాలని ఆ తండ్రి శక్తికి మించి రూ.లక్షల్లో అప్పులు చేసినా ఫలితం లేక బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన ఇది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన జర్పుల పరశురాం (46)– లలితకు సందీప్, సింధు సంతానం. పరశురాం భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం సింధు ఖమ్మంలో ఎంసెట్ పరీక్ష రాసింది. పరీక్ష ముగిశాక ఆమెను సోదరుడు సందీప్ బైక్‌పై తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సింధు తలకు తీవ్రగాయాలు కావడంతో మాటలేక అచేతన స్థితిలో ఉండిపోయింది. వీరి కుటుంబ దీనస్థితిని గమనించి దాతలు రూ.25 లక్షల మేర సాయం చేశారు. సింధుకు చికిత్స చేయించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఆపై పరశురాం పలువురి వద్ద రూ.15 లక్షల వరకు అప్పు తీసుకుని చికిత్స కొనసాగించినా ఫలితం లేకపోయింది. తమకున్న పది గుంటల భూమిని అమ్ముకుందామంటే పట్టాదారు పాసుపుస్తకం లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదురైంది.

మంచంలో బిడ్డను చూడలేకపోతున్నా..

దాతల చేయూతకు తోడు అప్పులు చేసినా బిడ్డకు నయం కాకపోవడం, భూమి అమ్మలేని పరిస్థితి ఎదురుకావడంతో పరశురాం కుమిలిపోయాడు. దీంతో ఆదివారం రాత్రి తాను కౌలుకు తీసుకున్న చేను వద్దకు వెళ్లి అక్కడి నుంచి భార్య లలితకు ఫోన్ చేశాడు. కుమార్తెకు చికిత్స చేయించేందుకు తన శక్తి సరిపోవడం లేదని, బిడ్డను ఆ స్థితిలో చూడలేకపోతున్నానని ఆమెకు చెబుతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వెల్లడించాడు. దీంతో లలిత స్థానికులతో కలిసి చేను వద్దకు వెళ్లి వ్యవసాయ బావిలో పరిశీలించగా పరశురాం మృతదేహం కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘బనకచర్ల’కు బ్రేక్!

ప్రతిపాదనలను ఏపీకి తిప్పి పంపిన కేంద్ర పర్యావరణ శాఖ

- నిపుణుల మదింపు కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం
- వరద జలాల లభ్యతపై సీడబ్ల్యూసీతో అధ్యయనం జరిపించాలి
- సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతే దరఖాస్తు చేసుకోవాలి
- ఏపీకి స్పష్టం చేసిన నిపుణుల మదింపు కమిటీ
- పోలవరం ముంపు అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు (పీబీఎల్‌పీ)కు తొలిదశ పర్యావరణ అనుమతుల్లో భాగంగా టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) జారీ చేయాలని ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. కేంద్ర పర్యావరణ శాఖకు సంబంధించిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఈ నెల 17న ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో సమావేశమై ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుకు టీఓఆర్ జారీ చేయాలని ఏపీ సమర్పించిన ప్రతిపాదనలను వెనక్కి పంపిస్తూ ఈఏసీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశ నిర్ణయాలతో కూడిన మీటింగ్ మినట్స్ కాపీను సోమవారం కేంద్ర పర్యావరణ శాఖ బహిర్గతం చేసింది. పోలవరం ప్రాజెక్టుతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఏర్పడనున్న ముంపు సమస్యల నేపథ్యంలో.. ప్రాజెక్టుకు 2005 జనవరి 25న జారీ చేసిన పర్యావరణ అనుమతులపై న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉందన్న విషయాన్ని నిపుణుల కమిటీ గుర్తు చేసింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) సహకారంతో గోదావరిలో వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం జరపాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలు గోదావరి ట్రిబ్యునల్ తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని ఆరోపిస్తూ తమకు మెయిల్ ద్వారా ఫిర్యాదులు సైతం అందినట్టు కమిటీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర సమస్యలతోపాటు అవసరమైన అనుమతులు/క్లియరెన్స్‌ల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించాలని ఏపీకి సూచించింది. ఆ తర్వాతే టీఓఆర్ కోసం తమకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ ప్రాజెక్టుతో తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని, ఎలాంటి అనుమతులు, నిధులు జారీ చేయరాదని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

టీఓఆర్ అంటే ?

పర్యావరణ అనుమతుల్లో భాగంగా తొలుత టీఓఆర్‌ను కేంద్ర పర్యావరణ శాఖ జారీ చేస్తుంది. టీఓఆర్‌లోని మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టుతో పర్యావరణంపై పడనున్న ప్రభావం (ఈఐఏ)పై అధ్యయనంతోపాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. టీఓఆర్‌లోని నిబంధనలను అమలు చేసినట్టు సంతృప్తి చెందిన తర్వాతే తుదిగా పర్యావరణ అనుమతులను జారీ చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేస్తుంది. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వానికి తొలి అడుగులోనే ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా రోజుకు 2 టీఎంసీలు చొప్పున మొత్తం 200 టీఎంసీల గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి 3 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించడంతోపాటు 9.14 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రత్యామ్నాయ నీటి వసతి, 80 లక్షల మందికి తాగునీటి సదుపాయం కల్పిస్తామని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది.

రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఫలించింది : మంత్రి ఉత్తమ్

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఫలించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తాను తీవ్ర ప్రయత్నాలు చేయడంతోనే ఇది సాధ్యమైందని చెప్పారు.

ఇది బీఆర్‌ఎస్ విజయం : హరీశ్‌రావు

సీడబ్ల్యూసీ, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు పరిశీలించకుండానే బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇచ్చేది లేదని నిపుణుల కమిటీ తేల్చి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ పార్టీ పోరాట విజయమని, తెలంగాణ ప్రజల విజయమని స్పష్టం చేశారు.

‘బనకచర్ల’పై ఎలా ముందుకెళదాం?

- ఐసీసీసీలో మంత్రులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- నేటి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌పై చర్చ



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో చర్చించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో సీనియర్ మంత్రులతో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మంగళవారం జరగనున్న పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ గురించి మంత్రివర్గ సభ్యులు చాలాసేపు చర్చించినట్టు తెలిసింది. ప్రెజెంటేషన్ గురించి సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించగా, ఈ ప్రెజెంటేషన్‌లో పేర్కొనాల్సిన అంశాలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు గురించి ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో చర్చకు వచ్చిన అంశాలు, పీసీ ఘోష్ కమిషన్‌కు ఇచ్చిన వివరాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తున్న తీరు గురించి చర్చించిన మంత్రులు.. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు తగ్గవద్దని, తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 4న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లు, సమావేశాలు నిర్వహించాల్సిన తీరుపై కూడా మంత్రులు మాట్లాడుకున్నట్టు సమాచారం. అదేవిధంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా ఆయన్ను కలిసి తెలంగాణ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు అనుమతులు కోరుతూ వినతిపత్రం సమర్పించాలని అనుకున్నా అపాయింట్‌మెంట్ ఇవ్వని తీరును గురించి కూడా ప్రజలకు ఎలా వివరించాలనే అంశంపై కూడా చర్చించినట్టు సమాచారం.

సంచార జీవనం నుంచి చదువులమ్మ ఒడికి

25 మంది పిల్లలను బడిలో చేర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పిల్లలను బడిలో చేర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: వారంతా సంచార జాతి పిల్లలు.. తల్లిదండ్రులు కుటుంబపోషణ కోసం వివిధ వృత్తులను ఎంచుకున్నారు. ఉదయాన్నే పనుల నిమిత్తం గుడిసెల నుంచి బయలుదేరుతుండగా వారి పిల్లలు అక్కడే ఆడుకుంటూ కాలం గడుపుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం పట్టణంలో వారి గుడిసెల వద్దకు వెళ్లారు. ‘సంచార జీవనం వద్దు.. తరాలు మారినా చదువు లేకపోతే మీ తల రాతలు మారవు. అన్ని జాతుల మాదిరిగా మీ సంచారజాతి అభివృద్ధి చెందాలి. అందుకు చదువు ఒక్కటే మార్గం, మీ పిల్లలను బడికి పంపించండి’ అంటూ తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించారు. అనంతరం 25 మంది సంచారజాతి పిల్లలను ఎంఈవో మనోహర్‌తో కలసి ఆర్టీసీ కాలనీలోని సర్కారు బడిలో చేర్పించారు. పిల్లలతోపాటు వాహనంలో ఎమ్మెల్యే కూడా స్కూలుకు వెళ్లారు. వారిని చేర్పించాక ఆ పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, దుస్తులు అందజేశారు. ప్రతిరోజు పిల్లలను బడికి పంపిస్తామని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేసుకున్నారు. పేద విద్యార్థుల చదువుకోసం ఎలాంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘తాటికాయల’ ఘటనలో కొనసాగుతున్న విచారణ

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో ఓ వివాహితపై ఇటీవల జరిగిన అమానవీయ సంఘటనపై విచారణ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ ఘటనలో కొంతమంది పెద్ద మనుషుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ సంఘటనలో ఇప్పటికే 14 మందిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. మరికొందరిని త్వరలో అరెస్ట్ చేసే అవకాశం ఉందని చెపుతున్నారు.

టీజీఐఐసీ ఎండీగా కె.శశాంక బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక నదుపాయాల కల్పన సంస్థ (టీజీఐఐసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కె.శశాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శశాంకను టీజీఐఐసీ వీసీ, ఎండీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 2013 బ్యాచ్‌కు చెందిన శశాంక ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణలో పారిశ్రామిక క్లస్టర్‌లను గుర్తించి అభివృద్ధి చేయడం, పారిశ్రామికవేత్తలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రారంభించేందుకు టీజీఐఐసీ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని అమలు చేయడానికి, సమన్వయ ప్రయత్నాల ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి కార్పొరేషన్ పనిచేస్తుంది. కాగా, సంస్థ వీసీ, ఎండీగా కార్పొరేషన్ లక్ష్యాలను మరింతగా ముందుకు తీసుకువెళ్తానని శశాంక ప్రకటించారు. ప్రభుత్వ ప్రాధాన్యాలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలను మరింతగా ప్రోత్సహించడంపై దృష్టి కేంద్రీకరిస్తానన్నారు.

మెట్రోరైల్‌కు అంతర్జాతీయ పురస్కారం

సాక్షి, హైదరాబాద్: జర్మనీలోని హంబర్గ్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక యూఐటీపీ– 2025 అవార్డుల కార్యక్రమంలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి గాను ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని దక్కించుకుంది. రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తోడ్పాటుతో, ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్‌కు చెందిన ‘ఆప్టిమైజ్ మెట్రో ఆపరేషన్స్ ప్లాన్స్ లీడింగ్ టు ఇన్‌క్రీజ్ రెవెన్యూ ఫర్ ట్రెయిన్’ప్రాజెక్టుకు ఈ పురస్కారం లభించింది. మెట్రోరైళ్ల అత్యుత్తమ నిర్వహణ, సుస్థిరమైన పట్టణ రవాణాలో ఎల్‌అండ్‌టీ అనుసరించే విశిష్టమైన విధానాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. కాగా, ఈ పురస్కారం పొందడం ఎంతో గర్వకారణంగా ఉందని ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈవో కేవీబీ రెడ్డి అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య మెట్రో ప్రాజెక్టు ఆపరేటరుగా హైదరాబాద్ మెట్రోను ప్రపంచ వేదికపై నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు.

నిబంధనలు రూపొందిస్తారా? కోర్టుకు వస్తారా?

ఫైర్ సర్వీసెస్ రూల్స్‌పై సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999 కింద కొత్త నిబంధనలను రూపొందిస్తారా.. లేదా కోర్టుకు హాజరై వివరణ ఇస్తారా.. అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని హైకోర్టు ప్రశ్నించింది. జూలై 16 వరకు సమయం ఇస్తున్నామని, ఆలోగా నిబంధనలు రూపొందించకుంటే తమ ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేసింది. తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999 కింద కొత్త నిబంధనలను రూపొందించాల్సి ఉన్నా సర్కార్ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని హైదరాబాద్‌కు చెందిన గోవింద్ సహా పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సామ్‌కోషి, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏప్రిల్ 21 విచారణ సందర్భంగా నిబంధనలు రూపొందించాలని ఆదేశించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. జూలై 16 వరకు అవకాశం ఇస్తున్నామని, నిబంధనలు రూపొందించకుంటే సీఎస్ హాజరుకావాలని ఆదేశించింది.

రాష్ట్రంలో గిగ్ కార్మికుల భద్రతకు కొత్త చట్టం

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. గిగ్ కార్మికులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని సిద్ధం చేస్తోంది. దీని ప్రకారం 4.2 లక్షల గిగ్ కార్మికులకు భద్రత లభిస్తుంది. ఇప్పటికే గిగ్ కార్మికుల రక్షణ చట్టాన్ని అమలు చేస్తున్న రాజస్తాన్, కర్ణాటకల తర్వాత ఈ చట్టాన్ని తీసుకువస్తున్న మూడో రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం ద్వారా గిగ్ కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతను పరిరక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ చట్టంలో అగ్రిగేటర్ల ద్వారా గిగ్ కార్మికులను తప్పనిసరిగా నమోదు చేయాలి. కార్మికులు, అగ్రిగేటర్లు, ప్రభుత్వం ప్రతినిధులుగా ఉండే బోర్డు ఏర్పాటు చేసి, గిగ్ కార్మికుల సంక్షేమాన్ని పర్యవేక్షిస్తారు. ఈ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక సంక్షేమ నిధిని కూడా ఏర్పాటు చేస్తారు.

అత్యాచారంచేసి.. ఆపై గడ్డిమందు తాగించి..

• ఓ ఆర్‌ఎంపీ దాష్టీకం • మహిళ మృతి.. కేసు నమోదు

గుర్రంపోడు: ఓ ఆర్‌ఎంపీ మహిళపై అత్యాచారం చేసి, ఆపై గడ్డిమందు ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి కిరాతకంగా హత్య చేశాడు. వివరాలు.. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జూనూతుల గ్రామానికి చెందిన మంకెన శ్రీనివాస్‌రెడ్డి తన భార్య జ్యోతి (37), ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా మిర్యాలగూడలో ఉంటూ రైస్‌మిల్లులో పనిచేస్తున్నాడు. కాగా, జ్యోతి తన అత్తను చూసేందుకు ఆదివారం జూనూతులకు బయలుదేరింది. మిర్యాలగూడ నుంచి మల్లేపల్లికి వచ్చి అక్కడి నుంచి జూనూతులకు వెళ్లాల్సి ఉంది. అయితే, జ్యోతి మల్లేపల్లికి వచ్చేసరికి ఆలస్యమైనందున జూనూతులకు వెళ్లేందుకు బస్సులు గానీ, ఆటోలు గానీ లేవు. దీంతో ఆమె తనకు తెలిసిన.. అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మహేశ్‌కు ఫోన్‌చేసి తనను గ్రామానికి తీసుకెళ్లాలని కోరింది. అదే విషయాన్ని జ్యోతి తన భర్త శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌చేసి చెప్పింది. జ్యోతిని తీసుకెళ్లేందుకు మహేశ్ కారులో జూనూతుల నుంచి మల్లేపల్లికి వచ్చాడు. అయితే, జ్యోతి పట్ల దుర్బుద్ధితో ఉన్న మహేశ్.. తన వెంట గడ్డిమందు తెచ్చుకున్నాడు. జ్యోతిని మల్లేపల్లి వద్ద కారు లో ఎక్కించుకుని జూనూతులకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం బలవంతంగా గడ్డిమందును ఇంజెక్షన్ ద్వారా ఎక్కించాడు. ఆమె ప్రతిఘటించడంతో గడ్డిమందును నీళ్లలో కలిపి బలవంతంగా తాగించాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జూనూతుల స్టేజీ సమీపంలో కాచారం రోడ్డులో జ్యోతిని కారులో నుంచి దింపే ప్రయత్నం చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తు న్న పోలీసులు గమనించారు. తాను ఆర్‌ఎంపీనని, జ్యోతి గడ్డిమందు తాగిందని మహేశ్ పొంతనలేని సమాధానాలు చెప్పడం, ఆమె ఒంటిపై గాయాలు ఉండటా న్ని గుర్తించిన పోలీసులు మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అపస్మారక స్థితి లో ఉన్న జ్యోతిని దేవరకొండ ఆస్పత్రికి తరలించి.. ఆ తర్వాత సోమవారం తెల్లవారుజామున మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జ్యోతి మృతిచెందింది. భర్త శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యా దుతో కేసు నమోదు చేసుకుని ఎస్‌ఐ మధు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేస్తోంది.. మన బాహుబలి

అగ్ని-5 క్షిపణిని బంకర్ బస్టర్ బాంబుగా మార్చబోతున్న డీఆర్‌డీవో

- 7,500 కేజీల బాంబును మోసుకెళ్లేలా తయారీ
- మ్యాక్20 స్పీడ్‌తో దూసుకెళ్లేలా డిజైన్
- అభివృద్ధి దశలో రెండు వేరియంట్లు

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని ఫోర్డో భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారాలపై అమెరికా వేల కేజీల బరువైన బంకర్ బస్టర్ బాంబులను పడేసి విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో తమ అమ్ములపొదిలోనూ అలాంటి బాహుబలి బాంబులు ఆత్యావశ్యకమని భారత సైన్యం భావించింది. అనుకున్నదే తడవుగా ఆ దిశగా రంగం సిద్ధంచేసిందని వార్తలొచ్చాయి. ఈ వార్తలను నిజం చేస్తూ భారత రక్షణ, పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ఒక కొత్త విషయాన్ని ప్రకటించింది. అత్యంత శక్తివంతమైన అగ్ని-5 ఖండాంతర క్షిపణికి బంకర్ బస్టర్ బాంబును మోసే సామర్థ్యాన్ని ఆపాదిస్తూ మిస్సైల్‌ను మరింత ఆధునీకరిస్తున్నట్లు డీఆర్‌డీఓ ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్‌లోని భూగర్భ అణుకేంద్రంపై భారత వాయుసేన బాంబులు పడేసిందన్న వార్తల నడుమ అధునాతన బంకర్ బస్టర్ బాంబు తయారీకి ఏర్పాట్లు జరుగుతుండటం విశేషం.

ఏకంగా 100 మీటర్లు నేలలోకి చొచ్చుకుపోయేలా..

అగ్ని-5 ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌కు అత్యంత బరువైన వార్‌హెడ్‌ను మోసుకెళ్లేలా మార్పులు చేయబోతున్నట్లు డీఆర్‌డీవో తెలిపింది. తొలుత రెండు వేరియంట్లలో ఈ కొత్త మిస్సైల్‌ను తయారుచేస్తారు. ఆకాశం నుంచి లక్ష్యంమీదకు జారవిడిచాక అది నేలలో ఏకంగా 100 మీటర్ల లోతు వరకు చొచ్చుకుపోయేలా డిజైన్ చేస్తున్నారు. అవసరమైతే శత్రు భూగర్భ అణుకేంద్రాలను భూస్థాపితం చేయాల్సిందేనని ఇరాన్-అమెరికా ఉదంతం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని భారత్ తలపోస్తోంది. అందులో భాగంగానే బంకర్ బస్టర్ బాంబులతో సంప్రదాయక క్షిపణులను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతున్నట్లు సంస్థ వివరించింది. సాధారణంగా అగ్ని-5 క్షిపణి గరిష్ఠంగా 5,000 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించి అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తుంది. దూరం కంటే కూడా అత్యంత బరువును మోయగలిగేలా కొత్తవేరియంట్‌లను సిద్ధంచేస్తున్నారు. తొలి దశలో గరిష్ఠంగా 7,500 కేజీల బరువైన బంకర్ బస్టర్ బాంబును దీనిని అమర్చుతారు. పేలిపోవడానికి ముందు నేలలోకి గరిష్ఠ లోతులోకి చొచ్చుకుని పోయేలా కొత్తతరహా మెకానిజంతో దీనిని సిద్ధంచేస్తున్నారు.

తక్కువ ఖర్చులో పని పూర్తయ్యేలా..

అమెరికా ప్రయోగించిన భారీ బాంబులను క్షిపణులు మోసుకెళ్లలేవు. వాటిని మోసేందుకు, లక్ష్యంపై జారవిడిచేందుకు ప్రత్యేకంగా స్టెల్త్ రకంగా నార్త్‌రోప్ బీ-2 స్పిరిట్ బాంబర్‌లను అమెరికా సమకూర్చుకుంది. ఒక్కో స్పిరిట్ బాంబర్ విమానం ఖరీదు వేల కోట్ల రూపాయలు. ఇదంతా భారీ ఖర్చుతో కూడిన వ్యవహారం. దీనిని ప్రత్యామ్నాయంగా క్షిపణికి అమర్చి దాని ద్వారా బంకర్ బస్టర్ బాంబును రణక్షేత్రంలో పడేయాలని భారత్ భావిస్తోంది. అందులోభాగంగా ఇప్పటికే తన అమ్ములపొదిలో ఉన్న అగ్ని-5ను ఈ కార్యం కోసం డీఆర్‌డీఓ ఎంచుకుంది.

ఒకటి భూతలంపై.. మరోటి భూగర్భంలో..

రెండు వేరియంట్లలో ఒకటి భూతలం మీది లక్ష్యాలను ఛేదిస్తుంది. ఇది నేలలోకి చొచ్చుకుపోదు. కేవలం భవన నిర్మాణాల వంటి కట్టడాలనే నామరూపాల్లేకుండా పేల్చేస్తుంది. మరో రకం నేలలోకి చొచ్చుకెళ్లాక తర్వాతే పేలుతుంది. రెండు వేరియంట్లు గరిష్ఠంగా 8,000 కేజీల బాంబును మోసుకెళ్లేలా సిద్ధంచేయాలని భావిస్తున్నారు. ఈ బాంబు అందుబాటులోకి వస్తే ఇంతటి వేలకేజీల బరువైన బంకర్‌బస్టర్ బాంబులున్న దేశాల సరసన భారత్ నిలుస్తుంది. శత్రువుల కమాండ్-కంట్రోల్ సెంటర్లు, క్షిపణి నిల్వ కేంద్రాలు, సైనిక స్థావరాలపై ఈ బాంబులను ప్రయోగించనున్నారు. ఎప్పటికప్పుడు శత్రుత్వాన్ని పెంచుకుంటూ పక్కలో బల్లెంలా తయారైన పాకిస్తాన్, చైనాలను నిలువరించాలన్నా, వాటి సైనిక సామర్థ్యాన్ని దెబ్బకొట్టాలన్నా భారత్‌కు ఇలాంటి భారీ బాంబుల అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీఓ పేర్కొంది.

హైపర్‌సోనిక్ వేగంతో దూసుకెళ్లేలా...

ఎంత వేగంగా కిందకు పడితే అంతటి పెను వినాశనం సాధ్యమవుతుంది. అందుకే అత్యధిక హైపర్‌సోనిక్ వేగంతో దూసుకెళ్లేలా ఈ రెండు వేరియంట్లను తయారుచేస్తున్నారు. భూతల లక్ష్యాలను ఛేదించే వేరియంట్ మ్యాక్8 వేగంతో, భూగర్భ లక్ష్యాలను ఛిద్రంచేసే వేరియంట్ మ్యాక్20 వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారు.


అగ్ని-5 క్షిపణి

బంకర్ బస్టర్ ఉపయోగాలేంటి?

సైనిక బంకర్లు, క్షిపణి స్థావరాలు, భూగర్భ ఆయుధాగారాలు, భూగర్భ యురేనియం శుద్ధి కార్మాగారాలను భూస్థాపితం చేయాలంటే బంకర్ బస్టర్ బాంబుతోనే సాధ్యం. జీపీఎస్ ట్రాకింగ్, అతి వేగం, భారీ బరువు దీని ప్రత్యేకతలు. నేలపై పడగానే పేలకుండా నిర్దేశిత లక్ష్యం చేరుకునేదాకా నేలకు రంధ్రం చేసుకుంటూ లోపలికి వెళ్తుంది. ఈ క్రమంలో బాంబు పాడైపోకుండా బయటివైపు పటిష్ఠమైన ఉక్కు కవచం దీనిని రక్షణంగా ఉంటుంది. యుద్ధక్షేత్రంలో పోరాడే సైనికులు, యుద్ధట్యాంక్‌లు, డ్రోన్లకు దిశానిర్దేశం చేసే సైన్యాధికారులు భూగర్భంలో ఉండే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సురక్షితంగా ఉంటారు. ఈ కంట్రోల్ సెంటర్‌ను నాశనంచేస్తే రణక్షేత్రంలోని బలగాలకు సరైన దిశానిర్దేశం కరువవుతుంది. దీంతో ఆ శత్రుబలగాలను నిలువరించడం భారత బలగాలకు తేలిక అవుతుంది. శత్రువులు ప్రయోగించే కొన్ని రకాల బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు పాక్షిక భూగర్భ లాంచర్ నుంచే దూసుకొస్తాయి. వీటిని భూస్థాపితం చేయాల న్నా బంకర్‌బస్టర్‌లు అవసరమే.

వారిద్దరూ దైవవిరోధులు

- ట్రంప్, నెతన్యాహు పశ్చాత్తాపపడేలా చేయండి
- ఫత్వా జారీచేస్తూ ప్రజలకు ఇరాన్ మత పెద్ద మకరెం షిరాజీ పిలుపు


నెతన్యాహు ట్రంప్

టెహ్రాన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహులపై ఇరాన్‌లో ఫత్వా జారీ అయింది. ఇస్లామిక్ రాజ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ట్రంప్, నెతన్యాహూలిద్దరూ దైవానికి శత్రువులుగా తయారయ్యారని ఇరాన్ మత పెద్ద అయతొల్లా మకరెం షిరాజీ వ్యాఖ్యానించారు. వీరిద్దరూ పశ్చాత్తాపం పడేలా వీరిని, వీరి ప్రభుత్వాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ఫత్వా జారీ చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, మరి కొందరు మతాధికారులను బెదిరిస్తూ ట్రంప్, నెతన్యాహూ చేసిన వ్యాఖ్యలను షిరాజీ తీవ్రంగా ఖండించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదిరిస్తున్న వీరిద్దరినీ ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థకు మూలస్తంభాలైన నాయకుల ప్రాణాలకు, ముఖ్యంగా సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ప్రాణానికి ముప్పు తలపెట్టడం మతపరంగా నిషిద్ధం. అలాంటి శత్రువులకు, వారి నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు దృఢంగా, ఐక్యంగా నిలబడాలి. ట్రంప్, నెతన్యాహూ తమ తప్పులకు పశ్చాత్తాపపడేలా చేయాలి'' అని ఫత్వాలో షిరాజీ పేర్కొన్నారు. ఈ శత్రువులకు ముస్లింలు లేదా ఇస్లామిక్ దేశాలు మద్దతిచ్చినా, సహకారం అందించినా అది క్షమించని నేరంగా భావించాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. నేరాలకు పాల్పడిన వీరిద్దరినీ మొహరీబ్‌గా ఆయన అభివర్ణించారు. ఇరాన్ న్యాయ చట్టాల ప్రకారం మొహరీబ్ అంటే దైవంపై దండయాత్రకు దుస్సాహసం చేసేవాడు.

కశ్మీర్‌లో ఉగ్రవాదం న్యాయమైన పోరాటం
పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మరోసారి జమ్మూకశ్మీర్ గురించి ప్రగల్భాలు పలికారు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని న్యాయపరమైన పోరాటంగా అభివర్ణిస్తూ.. అక్కడి ప్రజలకు పాక్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. 'కశ్మీరీల ఆకాంక్షలను అణచివేయడంతోపాటు సమస్యను పరిష్కరించడానికి బదులుగా ఉద్యమాన్ని మరింత ఎగదోసిన వారు తమ చర్యల ద్వారా పోరాటం మరింత సానుకూలంగా మార్చారు. కశ్మీరీల ఉద్యమానికి అంతర్జాతీయ చట్టం గుర్తింపు లభించింది'అని పేర్కొన్నారు. 'ఐరాస తీర్మానాలు, కశ్మీరీల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సమస్యకు న్యాయమైన పరిష్కారం కోసం పాక్ గట్టి మద్దతిస్తుంది'అని మునీర్ తెలిపారు. భవిష్యత్తులో తమ దేశంపై దాడికి పాల్పడితే తగు రీతిలో సమాధానమిస్తామని భారత్‌నుద్దేశించి పేర్కొన్నారు.

అమల్లోకి కొత్త రైల్వే చార్జీలు

- ఏసీ క్లాస్‌లలో రెండు పైసలు, నాన్-ఏసీ క్లాస్‌లలో ఒక పైసా పెంపు
- సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీలను స్వల్పంగా పెంచిన రైల్వేశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: భారత రైల్వే శాఖ రైళ్ల టికెట్ల ధరలను స్వల్పంగా పెంచింది. పెరిగిన ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. ఏసీ క్లాస్‌లలో కిలోమీటరుకు రెండు పైసలు, నాన్-ఏసీ క్లాస్‌లలో ఒక పైసా చొప్పున చార్జీలను పెంచారు. సెకండ్ క్లాస్ ఆర్డినరీ రైలు టికెట్ చార్జీలనూ స్వల్పంగా పెంచారు. జూలై ఒకటో తేదీ నుంచి ధరలు పెంచబోతున్నట్లు జూన్ 24వ తేదీనే రైల్వే శాఖ సూచనప్రాయంగా చెప్పడం తెల్సిందే. తరగతుల వారీగా పలు రకాల రైళ్లలో పెరిగిన టికెట్ చార్జీల వివరాలను సోమవారం రైల్వేశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ప్రతిరోజూ రైళ్లలో రాకపోకలు చేసే ప్రయాణికులపై భారం మోపకుండా సబర్బన్ రైళ్లు, మంత్లీ సీజన్ టికెట్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. 500 కిలోమీటర్లలోపు ప్రయాణాలకు ఆర్డినరీ సెకండ్ క్లాస్ టికెట్ ధరలోనూ ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ కేటగిరీలో పాత ధరలే కొనసాగుతాయి. అయితే ఆర్డినరీ సెకండ్ క్లాస్‌లో 500 కిలోమీటర్లు దాటితే మాత్రం టికెట్ ధర పెరుగుతుంది. 501 నుంచి 1500 కిలోమీటర్ల ప్రయాణానికి రూ.5 ధర పెరిగింది. 1,501 నుంచి 2,500 కిలోమీటర్ల ప్రయాణానికి టికెట్ ధర రూ.10 పెంచారు. 2,501 నుంచి 3,000 కిలోమీటర్ల ప్రయాణానికి టికెట్ ధర రూ.15 పెంచారు. అంటే ఆర్డినరీ సెకండ్‌క్లాస్‌లో 500 కి.మీ.లు దాటి ప్రతి కిలోమీటర్‌కు అరపైసా ధర పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఆర్డినరీ ఫస్ట్ క్లాస్‌లోనూ ప్రతి కిలోమీటర్‌కు అర పైసా ధర పెంచారు. '' ప్రీమియర్, స్పెషల్ రైలు సేవలైన రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, తేజ్, హమ్‌సఫర్, అమృత్‌భారత్, మహామన, గతిమాన్, అంత్యోదయ, జన్ శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్, ఏసీ విస్టాడోమ్ కోచ్‌లు, అనుభూతి కోచ్‌లు, ఆర్డినరీ నాన్-సబర్బన్ సర్వీసులకూ ఈ పెరిగిన ధరలు వర్తిస్తాయని రైల్వే శాఖ పేర్కొంది. నాన్-ఏసీ మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రతి కిలోమీటర్ ప్రయాణానికి ఒక పైసా ధర పెంచారు. ఏసీ క్లాస్‌లలో ప్రతికిలోమీటర్‌కు రెండు పైసలు ధర పెంచారు. అంటే మెయిల్/ఎక్స్‌ప్రెస్ సెకండ్ క్లాస్‌లో, మెయిల్/ఎక్స్‌ప్రెస్ స్లీపర్ కాస్‌లో, మెయిల్/ఎక్స్‌ప్రెస్ ఫస్ట్ క్లాస్‌లోనూ ధర ఒక పైసా పెరిగింది. ఏసీ తరగతులైన ఏసీ చైర్‌కార్, ఏసీ-3టయర్/3ఈ, ఏసీ -2 టయర్, ఏసీ ఫస్ట్ క్లాస్/ఈసీ/ఈఏ టికెట్లపైనా రెండు పైసలు ధర పెంచారు. జూలై ఒకటో తేదీన, ఆ తర్వాతి తేదీల కోసం బుక్ చేసిన టికెట్లకు ఈ సవరించిన ధరలు వర్తింపజేస్తారు. ఈ మేరకు పీఆర్‌ఎస్, యూటీఎస్, మాన్యువల్ టికెటింగ్ వ్యవస్థల్లోనూ సవరించిన కొత్త ధరలు కనిపించేలా సిస్టమ్స్‌ను అప్‌డేట్ చేశారు. అయితే రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌చార్జీలు, ఇతర చార్జీల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. వస్తుసేవల పన్ను(జీఎస్టీ)లోనూ ఎలాంటి మార్పు లేదని రైల్వేశాఖ పేర్కొంది.

అలా చదివితే ఎల్‌ఎల్‌ఎం, తత్సమాన కోర్సులకు
విలువ ఉండదు
ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడ్ విద్యాభ్యాసం చట్టవిరుద్ధమని తేల్చిన బార్ కౌన్సిల్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా న్యాయవిద్యలో మరింత విశ్వసనీయను పెంచేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. తమ ముందస్తు అనుమతి లేకుండా ఆన్‌లైన్, హైబ్రిడ్, ఓపెన్, దూరవిద్యా విధానాల్లో ఎల్‌ఎల్‌ఎం(మాస్టర్ ఆఫ్ లా), తత్సమాన కోర్సులను బోధిస్తే అవి చెల్లుబాటు కావని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ప్రకటించింది. ఈ మేరకు బీసీఐ ఒక అడ్వైజరీని అన్ని రాష్ట్రాల హైకోర్టులకు జూన్ 25వ తేదీన పంపిన లేఖలో పేర్కొనగా ఈ విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, బీసీఐ లీగల్ ఎడ్యుకేషన్ స్థాయికమిటీ కో-చైర్మన్ అయిన రిటైర్డ్ జస్టిస్ రాజేంద్ర మీనన్ ఈ అడ్వైజరీని జారీచేశారు. ఎల్‌ఎల్‌ఎంను పోలినట్లుగా ఎల్‌ఎల్‌ఎం (ప్రొఫెషనల్), ఎంఎస్సీ(లా) వంటి తప్పుడు పేర్లతో తత్సమాన కోర్సులను తమ అనుమతి లేకుండా ఆన్‌లైన్, దూరవిద్య, బ్లెండెడ్, హైబ్రిడ్ మోడ్‌లో బోధిస్తే ఆయా కోర్సులకు చెల్లుబాటు ఉండదని బీసీఐ స్పష్టంచేసింది. '' ఈ కోర్సుల బోధన కోసం ఆయా వర్సిటీలు, కాలేజీల్లో అదనంగా బోధనా, బోధనేతర సిబ్బందిని తీసుకున్నా, రీసెర్చ్ కోసం రిజిస్ట్రేషన్లు జరిపినా అవి చెల్లవు. ఈ కోర్సులు చేసిన వాళ్లకు న్యాయ సేవలు, విభాగాల్లో పదోన్నతులు ఇవ్వకూడదు'' అని బీసీఐ స్పష్టం చేసింది. '' ఈ విషయంలో హైకోర్టులు అప్రమత్తంగా ఉండాలి. ఈ అర్హతలతో ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ప్రాధాన్యత ఇవ్వకండి. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఎల్‌ఎల్‌ఎం విద్యార్హతతో నియామకాల కోసం సవాల్ చేస్తే న్యాయవిద్య నిబంధనలు, 2008, 2020కి అనుగుణంగా బీసీఐ నుంచి వారికి ముందస్తు అనుమతి ఉందో లేదో సరిచూసుకోండి'' అని హైకోర్టులకు బీసీఐ సూచించింది.

పప్పన్నం చేత్తో తింటే..

- వైరల్‌గా మారిన మమ్దానీ భోజనం వీడియో
- చేత్తో తినడం అనాగరికమంటూ తిట్టిపోసిన అమెరికా నేతలు

న్యూయార్క్: న్యూయార్క్ సిటీ మేయర్ ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిత్వాన్ని గెల్చుకున్న జోహ్రాన్ ఖ్వామీ మమ్దానీ ఏం చేసినా ఇప్పుడు విమర్శల వర్షం కురుస్తోంది. ఇప్పుడు తాపీగా కూర్చుని పప్పన్నం తిన్నా సరే అమెరికా రాజకీయనేతలు తీవ్రంగా తప్పుబట్టడం ఇప్పుడు కొత్త వార్తాంశంగా నిలిచింది. ఒక ఇంటర్వ్యూ సందర్భంగా మమ్దానీ భోజనం చేస్తూ కనిపించారు. ఒక చిన్న ప్లేట్‌లో అన్నం, పప్పు చేత్తో కలుపుకుని కడుపారా తిన్నారు. '' ప్రపంచాన్ని చూసే దృక్కోణాన్ని నేను అభివృద్ధి చెందుతున్న(థర్డ్ వరల్డ్) దేశాల నుంచే నేర్చుకున్నా'' అని అన్నారు. అయితే ఈ వీడియోను 'ఎడ్ ఓక్‌నెస్' అనే 'ఎక్స్' ఖాతాలో ఒకతను పోస్ట్‌చేసి మమ్దానీ తీరును తప్పుబట్టారు. '' అన్నాన్ని చేత్తో తింటూ ఆయన తనకు థర్డ్ వరల్డ్ స్ఫూర్తి అని చెబుతున్నారు'' అని ఆ నెటిజన్ వ్యాఖ్యానించారు. దీనికిఅమెరికా దిగువసభ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ యువనేత బ్రాండన్ జీనీ గిల్ సైతం మద్దతు పలికి మమ్దానీని తప్పుబట్టారు. '' అమెరికాలో ఉంటూ అనాగరికంగా తింటున్నారు. మీకు థర్డ్ వరల్డ్ స్ఫూర్తి అయితే ఆ థర్డ్ వరల్డ్‌లోనే బతకండి. అక్కడికి వెళ్లిపొండి'' అని ఒక క్యాప్షన్ పెట్టారు. '' రాజకీయ జిమ్మిక్కులో భాగంగానే ఆయన ఇలా చేత్తో తింటున్నారు. సాధారణంగా ఆయన చేత్తో కాకుండా చెంచాలు, ఫోర్క్‌లతో తింటారు'' అని కొందరు నెటిజన్లు విమర్శించారు. మ్యాన్‌హాటన్ జిల్లా అటార్నీ రేసులో ఉన్న రిపబ్లికన్ నాయకురాలు మాడ్ మరూన్ సైతం విమర్శించారు. అయితే మరికొందరు మాత్రం మమ్దానీకి మద్దతు పలికారు. ''ఆయన చక్కగా చేత్తో కలుపుకుని తిన్నారు. తినడం అనేది ఆయా వ్యక్తుల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అలవాట్లకు సంబంధించిన అంశం. ఇది పూర్తిగా జాత్యహంకారమే'' అని వ్యాఖ్యానించారు. '' రాజకీయంగా ఆయనను ఎదుర్కొనే సత్తాలేక ఆయన వ్యక్తిగత అలవాట్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. చేత్తో తినని వాళ్లకే అమెరికా చెందుతుందని రాజ్యాంగంలో రాశారా?. చేత్తో తింటే అనాగరికం ఎలా అవుతుంది?'' అని మరికొందరు మమ్దానీకి మద్దతు పలికారు. '' టాకూస్, ఫ్రెంచ్ ఫ్రై, బర్గర్, పిజ్జా, లేస్ ప్యాకెట్ ఎలా తింటారు?. చేత్తోనేకదా తినేది. మరి అలాంటప్పుడు పప్పన్నం హాయిగా చేత్తో కలిపి తింటే తప్పేంటట?'' అని మరికొందరు వాదించారు. '' అమెరికాలో అన్నం చేత్తో తినడం కూడా తప్పేనా?. అమెరికా ఎటు పోతోంది?'' అని ఇంకొకరు వ్యాఖ్యానించారు.


చేత్తో తింటున్న మమ్దానీ

రెమిటెన్స్ పన్ను ఒక్క శాతమే

- భారతీయులకు భారీ ఉపశమనం
- తొలుత 5 శాతంగా ప్రతిపాదించిన ట్రంప్ సర్కారు

వాషింగ్టన్: భారతీయ అమెరికన్లకు భారీ ఉపశమనం ! వాళ్లు భారత్‌కు పంపే డబ్బు (రెమిటెన్స్)పై ప్రతిపాదిత పన్నును 5 శాతం నుంచి కేవలం ఒక్క శాతానికి తగ్గిస్తూ ట్రంప్ సర్కారు నిర్ణయం తీసుకుంది. అధ్యక్షుడు ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వన్ బిగ్, బ్యూటిఫుల్ చట్టంలో ఈ మేరకు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెమిటెన్సులపై ఏకంగా 5 శాతం పన్ను విధించాలని మే నెలలో ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన వన్ బిగ్, బ్యూటిఫుల్ బిల్లులో ప్రతిపాదించడం తెలిసిందే. దాంతో భారతీయ అమెరికన్లు హాహాకారాలు చేశారు. అనంతరం పన్ను శాతాన్ని 3.5కు తగ్గిస్తూ సవరణ ప్రతిపాదన చేశారు. చివరికి దాన్ని 1 శాతానికి పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బిల్లుకు తాజాగా ఈ మేరకు సవరణ చేసి సెనేట్ ముందు పెట్టారు. అక్కడ శనివారం 51-49 ఓట్ల అతి స్వల్ప మెజారిటీతో బిల్లు గట్టెక్కి చట్టంగా మారడం తెలిసిందే. నగదు, మనియార్డర్లు, క్యాషియర్స్ చెక్కుల ద్వారా చేసే అన్ని రెమిటెన్సులకూ ఇది వర్తించనుంది. డబ్బు పంపేవారే పన్ను చెల్లించాలని అందులో స్పష్టం చేశారు. అయితే అమెరికాకు చెందిన బ్యాంకు ఖాతాలు, అక్కడి ఆర్థిక సంస్థలు, అమెరికాలో జారీ చేసిన డెబిట్/క్రెడిట్ ద్వారా నిధులు పొందే సంస్థ లు/వ్యక్తులను రెమిటెన్స్ పన్ను నుంచి మినహాయించారు.

మనం ప్రపంచంలోనే టాప్

రెమిటెన్సుల స్వీకరణలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రపంచబ్యాంకు డేటా ప్రకారం 2024లో భారత్‌కు ఏకంగా రూ.11 లక్షల కోట్లకు (129 బిలియన్ డాలర్లకు) పైగా రెమిటెన్సులు అందాయి! ఆ ఏడాది ప్రపంచ దేశాలన్నీ అందుకున్న రెమిటెన్సుల్లో ఇది 14.5 శాతం. అందులో 28 శాతం, అంటే రూ.3 లక్షల కోట్లకు పైగా అమెరికాలోని భారతీయులు పంపిన మొత్తమే. ఆ లెక్కన భారత విదేశీ మారకద్రవ్యంలో కూడా అమెరికా నుంచి మనవాళ్లు పంపే రెమిటెన్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేరళ, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో లక్షలాది కుటుంబాలకు అమెరికాలోని తమవాళ్లు పంపే ఆ మొత్తాలే జీవనాధారం.


సిమ్లాలో వర్ష తీవ్రతకు కూలిన బహుళ అంతస్తుల భవనం శిథిలాలు

250 రోడ్లు మూసివేత..
130 చోట్ల కరెంట్ కట్
ఎడతెగని వానలతో హిమాచల్‌లో స్తంభించిన జనజీవనం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దాదాపు రాష్ట్రమంతటా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. కనీసం 130 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. వరద చేరడం, ధ్వంసం కావడం వంటి కారణాలతో 250 రోడ్లను అధికారులు మూసివేశారు. ఇందులో అత్యధికంగా సిర్మౌర్ జిల్లాలో 57, మండి జిల్లాలో 44 రోడ్లున్నాయి. రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడే అవకాశమున్న 22 ప్రాంతాలకుగాను 18 చోట్ల ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. కంగ్రా, మండి, సిర్మౌర్, సొలాన్ జిల్లాల్లో సోమవారం స్కూళ్లను మూసివేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. పర్యాటక ప్రాధాన్యమున్న సిమ్లా-కల్కా రైలు మార్గంపైన చేరిన రాళ్లు, చెట్లను తొలగించే రాకపోకలకు వీలు కల్పించారు. గత 24 గంటల్లో చనిపోయిన ముగ్గురితో కలిపి ఈ సీజన్‌లో వర్షాల సంబంధిత ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20కి చేరిందని అధికారులు తెలిపారు. సిమ్లా-కల్కా ఐదో నంబర్ జాతీయ రహదారిపై కోటి సమీపంలో కొండచరియలు విరిగి పడటంతో గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

మణిపూర్‌లో కాల్పులు..
నలుగురు మృతి

ఇంఫాల్: వర్గ వైషమ్యాలతో అట్టుకుతున్న మణిపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో వృద్ధురాలు సహా నలుగురు మృతి చెందారు. చురాచంద్‌పూర్ జిల్లా మొంగ్‌జంగ్ గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తు న్న బాధితులను అతి దగ్గర్నుంచి కాల్చి చంపినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలిలో 12 వరకు ఖాళీ తూటాలను స్వాధీనం చేసుకు న్నారు. ఘటన కు తమదే బాధ్యతని నిషేధిత యునై టెడ్ కుకీ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (యూకేఎన్‌ఎల్‌ఏ) ప్రకటించుకుంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ముందు జాగ్రత్తగా అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

కలామ్ ల్యాబ్స్ కమాల్

- 9.7 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిరిన సంస్థ యూఏవీ
- నూతన ప్రపంచ రికార్డ్ నమోదయ్యే చాన్స్

లక్నో: భారతీయ విద్యార్థుల అంతరిక్ష పరిశోధనా సంస్థగా మొదలైన కలామ్ ల్యాబ్స్ తాజాగా దాదాపు 10 కిలోమీటర్ల ఎత్తుకు ఎగరగలిగే మానవ రహిత లోహవిహంగం(యూఏవీ)ని తయారుచేసి అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఈ యూఏవీ తాజాగా సముద్రమట్టానికి 9,790 మీటర్ల ఎత్తుకు చేరుకుని కొత్త ప్రపంచ రికార్డ్‌ను సృష్టించింది. రెక్కల వెడల్పు రెండు మీటర్లలోపు ఉన్న ఒక యూఏవీ ఇంతటి ఎత్తుకు ఎగరడం ఇదే తొలిసారి. అయితే ఈ రికార్డ్‌ను ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. వైమానికరంగంలో యువత ఘనతను చాటే ఉద్దేశ్యంతో అత్యంత అననుకూల వాతావరణ పరిస్థితులుండే హిమాలయాల్లో ఈ యూఏవీని ఎగరేయడం విశేషం. సముద్రమట్టానికి 2,700 మీటర్ల ఎత్తులోని హిమాలయాల్లో దీనిని పరీక్షించారు. వైమానికరంగంలో చిన్నారులను ప్రోత్సహించాలనే లక్ష్యంగా ముగ్గురు బిట్స్ పిలానీ పూర్వవిద్యార్థులు ఈ కలామ్ ల్యాబ్స్ అంకుర సంస్థను స్థాపించారు. వాస్తవ ప్రపంచ సవాళ్లకు స్వయంగా విద్యార్థులే పరిష్కారాలు వెతకగలరని నిరూపించేందుకు ఈ సంస్థను ఏర్పాటుచేశామని వ్యవస్థాపకులు చెప్పారు.

20 నుంచి మైనస్ 60 దాకా

గాలి పీడనం ఎక్కువగా ఉండే వాతావరణం తోపాటు గాలిపీడనం తక్కువగా ఉండే పరిస్థితుల్లోనూ తమ యూఏవీ ఎగరగలదని నిరూపించేందుకు దీనిని + 20 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశం నుంచి నింగిలోకి ఎగిరేశారు. గరిష్ఠంగా అది మైనస్ 60 డిగ్రీ సెల్సియస్ పరిస్థితుల్లోనూ ఆకాశంలో చక్కర్లు కొట్టడం విశేషం. అత్యంత ఎత్తులకు వెళ్లేకొలదీ గాలి పీడనం తగ్గి యూఏవీ గాల్లోనే స్థిరంగా ఉండటం కష్టమవుతుంది. గాలి కేవలం గంటకు 50 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నా సరే ఈ యూఏవీ గాల్లో స్థిరత్వాన్ని సాధించడం గమనార్హం. దీని బరువు నాలుగు కేజీలలోపే. అత్యంత ఎత్తులో ఎగిరే, తక్కువ బరువైన డ్రోన్ల తయారీలో భారత్ స్వావలంభన దిశలో ఇలాంటి యూఏవీలు బాటలు వేయనున్నాయి. కంట్రోలర్ అవసరం లేకుండా స్వయంచాలితం(అటానమస్) గా ఈ యూఏవీ అంత ఎత్తులకు వెళ్లిరావడం విశేషం. '' భారత్‌లో నూతన ఆవిష్కరణలు ఎంతటి అసాధ్యాలనైనా సుసాధ్యం చేస్తాయనడానికి ఈ యూఏవీనే గీటురాయి'' అని కలామ్ ల్యాబ్స్ ప్రధాన ఇంజనీర్ డాక్టర్ ప్రియా శర్మ చెప్పారు. వాతావరణ పీడనం 73 శాతం తగ్గిపోయినాసరే అటానమస్‌గా యూఏవీ పూర్తి సామర్థ్యంతో ఎగిరిందని ప్రియ వెల్లడించారు. స్ట్రాటోస్పియర్ ఆవరణ సమీపందాకా యూఏవీ వెళ్లివచ్చింది. మైనస్ 60 డిగ్రీ సెల్సియస్‌నూ ఇది తట్టుకుంది. అత్యంత తేలికైన వస్తువులు, తక్కువ ఇంధనాన్ని వాడుకునే ప్రొప ల్షన్, అధునాతన థర్మల్ వ్యవస్థల కారణంగానే యూఏవీ ప్రయోగం విజయవంతమైందిన ప్రియ చెప్పారు. మరో ఐదేళ్లలో భారత డ్రోన్ పరిశ్రమ 23 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతున్న ఈ తరుణంలో డ్రోన్ల రంగంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యత ఎంతైనా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

4న విద్యార్థులతో ముచ్చటించనున్న శుభాంశు

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి శుక్రవారం సాయంత్రం 3.47 గంటలకు విద్యార్థులు, ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లతో మాట్లాడనున్నారు. బెంగళూరులోని యూఆర్ రావ్ ఉపగ్రహ కేంద్రంలో ఏర్పాటు చేసిన టెలీబ్రిడ్జ్ ద్వారా హామ్ రేడియో సాయంతో కార్యక్రమం జరగనుంది. దీనికి సంధానకర్తగా వ్యవహరిస్తున్న అమెచ్యూర్ రేడియో ఆన్ ద ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఏఆర్ఐఎస్ఎస్) ఒక ప్రకటనలో ఈ మేరకు పేర్కొంది. యాగ్జియం-4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి శుభాంశు ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టడం, ఆ ఘనత సాధించిన తొలి భారతీయునిగా చరిత్ర సృష్టించడం తెలిసిందే.

పాక్ జాతీయుడి అరెస్ట్

రాజౌరీ/జమ్మూ: పాకిస్తాన్ సరిహద్దు గుండా భారత భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న ఒక పాక్ జాతీయుడిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. నియంత్రణ రేఖ ఆవలి నుంచి వస్తున్న నలుగురు ఉగ్రవాదుల బృందానికి గైడ్‌గా వ్యవహరిస్తున్న మొహమ్మద్ ఆరిఫ్ అనే వ్యక్తిని ఆర్మీ అరెస్ట్ చేసింది. జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన నలుగురు ఉగ్రవాదులు ఆరిఫ్‌తో కలిసి పూంఛ్, రాజౌరీ సరిహద్దు జిల్లాల వెంట ఉన్న నియంత్రణ రేఖను దాటి ఆదివారం మధ్యాహ్నం భారత భూభాగం వైపు వస్తుండటంతో భద్రతా బలగాలు గుర్తించాయి. తొలుత సరిహద్దు దాటిన ఆరిఫ్‌ను గంభీర్ ప్రాంతంలోని హజూరా పోస్ట్ వద్ద భద్రతాబలగాలు పట్టుకున్నాయి.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 1 । జూలై । 2025



శివార్లకు గుడిమల్కాపూర్ మార్కెట్
నగరం నడిబొడ్డున ఉన్న గుడిమల్కాపూర్ మార్కెట్‌ను ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. -8లో



యాప్..ఆరోగ్యం సేఫ్
ఆరోగ్య రంగంలో టెక్నాలజీ తెచ్చిన మార్పులు ఆశాజనకంగా మారాయి. యాప్‌ల ద్వారా హెల్త్‌కు సంబంధించిన ఎన్నో అంశాలను మనం ట్రాక్ చేయగలుగుతున్నాం. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

వారంతా రోజు మాదిరిగానే విధుల్లోకి వచ్చారు. తమ తోటి కార్మికులు, ఉద్యోగులకు శుభోదయం చెప్పుకున్నారు. అప్పుడప్పుడే ఎవరికివారు తాము పని చేసే స్థలాల్లో నిమగ్నమవుతున్నారు. ఒక్కసారిగా మృత్యువు పేలుడు రూపంలో కబళించింది. ఉన్నపళంగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. పొగ పూర్తిగా కమ్ముకోవడంతో చుట్టూ చీకటి. అగ్నికీలలకు దేహాలు ఆహుతైపోయాయి. శరీరభాగాలకు మంటలు అంటుకున్నాయి. మరికొందరి శరీరాలు మాడి మసైపోయాయి. ఎటు చూసినా హాహాకారాలే. ప్రమాదం నుంచి బయటపడేందుకు హాహాకారాలే.. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనకు సంబంధించి భీతావహ వాతావరణం ఇది. ఎక్కడపడితే అక్కడ కార్మికుల శవాలు. కాలి బూడిదై.. మసైపోయిన శరీర భాగాలు. ఇలా పేలుడు జరిగిన ప్రదేశం పూర్తిగా మరుభూమిని తలపించింది.

పేలుడు జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూటీం





ఆర్తనాదాలు.. హాహాకారాలు

పాశమైలారంలో భారీ పేలుడు • మరుభూమిగా ఘటనా స్థలం

సిగాచీ పరిశ్రమ ఎదుట భీతావహం • ఆచూకీ కోసం విలపించిన బాధిత కుటుంబ సభ్యులు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తూ..



బాధితురాలితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

ఉపాధి కోసం వస్తే ఏకంగా ఉసురు తీసేసింది సిగాచీ పరిశ్రమ. సోమవారం ఈ కంపెనీలో జరిగిన విస్ఫోటనం బతుకుదెరువుకోసం వలస వచ్చిన వారి జీవితాలను బుగ్గిపాలు చేసింది. పేలుడు ధాటికి దూరంగా ఎగిరిపడ్డ కార్మికుల మృతదేహాలతో..ఛిద్రమైన శరీరభాగాలతో, కూలిన శిథిలాలతో సిగాచీ మరుభూమిని తలపించింది. తమ వారి ఆచూకీ కోసం బాధితుల ఆక్రందనలు, క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం భీతిల్లింది.

ఈ పారిశ్రామికవాడలో జీవితాలు కోల్పోవడం కార్మికుల కుటుంబాలకు కొత్తైనా పరిశ్రమ యాజమాన్యానికి మాత్రం సాధారణమేనని తరచూ జరిగే ప్రమాదాలు నిరూపిస్తూనే ఉన్నాయి. అనుభవాలు, ప్రమాద పాఠాల నుంచి యాజమాన్యాలు, ప్రభుత్వాలు గుణపాఠం నేర్వవని మరోసారి ఈ ప్రమాదంతో రుజువైంది. సోమవారం ఉదయం జరిగిన రియాక్టర్ పేలుడు ఘటన ఆ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది.

పారిశ్రామిక వాడలో విషాదం

ఉదయమే తమ ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్లిన కొద్ది సేపటికే ప్రమాదం జరిగినట్లు సమాచారం తెలుసుకున్న బాధిత కార్మికుల కుటుంబసభ్యుల ఆవేదన అంతా ఇంతా కాదు. కుటుంబసభ్యుల ఆచూకీ లభించకపోవడంతో కార్మికుల కుటుంబసభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి. తమ వారు ఏమయ్యారో తెలియకపోవడంతో వారు అధికారుల చుట్టూ తిరిగారు. అక్కడి నుంచి స్పందన లేకపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. దీంతో పాశమైలారం పారిశ్రామికవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. కాలినగాయాలతో బాధపడుతున్న తమ ఆత్మీయులను చూసి బోరున విలపించారు. కళ్లముందే విగత జీవులుగా మారిన తమ వారిని చూసి కన్నీరు మున్నీరుగా రోదించారు. తమ వారి జాడ ఎక్కడైనా లభిస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు.

ఉపాధి కోసం వచ్చి అనంత లోకాలకు..

వారంతా పొట్ట చేతబట్టుకుని వచ్చిన నిరుపేద కుటుంబాలే. ఉపాధి కోసం వందల కిలోమీటర్ల నుంచి వచ్చిన కార్మికులే అధికం. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి భార్యాబిడ్డలతో వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. చాలీ చాలని జీతాలున్నప్పటికీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ కార్మికుల కుటుంబాల్లో ఈ పేలుడు ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పొట్ట చేతబట్టుకుని వచ్చిన తమ వారిని మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఉపాధి కోసం వస్తే ఉసురే పోయిందని విలపిస్తున్నారు. ఘటన జరిగి గంటలు గడుస్తున్నా తమ వారి ఆచూకీ లభించకపోవడంతో వారు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

బంజారాహిల్స్‌లో..



దంచి కొట్టిన వర్షం!

మరో 3 రోజులు వానలు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం దంచి కొట్టింది. మృగశిర కార్తె తర్వాత ఇంత భారీ వర్షం కురవడం ఇదే ప్రథమం. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి..ఆ తర్వాత వర్షం జోరందుకుంది. నైరుతి రుతుపవనాలు వారం రోజుల ముందే ప్రవేశించినప్పటికీ ఆ తర్వాత వర్షాలు పెద్దగా కురవలేదు. సుమారు గంటపాటు కురిసిన వర్షం అతలాకుతలం చేసింది. సాయంత్రం పూట అందరూ ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధానంగా ఆర్‌కే పురం, బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, అల్వాల్, ముషీరాబాద్, తిరుమలగిరిలో భారీ వర్షం కురిసింది. నగరంలో మరో 3 రోజులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

అలర్ట్‌గా ఉండండి: మేయర్
సిటీలో భారీ వర్షాల అంచనా నేపథ్యంలో మేయర్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా కంట్రోల్‌రూమ్ (నెంబర్ 040–21111111)కు ఫోన్ చేయాలని తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కూడా మాట్లాడి రెండు డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు.

ఐదు చెరువుల పునరుద్ధరణ

సీఎస్సార్ నిధులతో చేపట్టేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: తీవ్ర నిర్లక్ష్యానికి గురై మురికి కూపాలుగా మారిన చెరువుల పునరుద్ధరణకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈమేరకు ఐదు చెరువుల పనులను సీఎస్సార్ కింద ప్రక్షాళన చేసి, అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మల్లెకుంట, బాచుకుంట, గోసాయికుంట, చాకలివాని చెరువు, మూసాకుంటలను సీఎస్సార్ నిధులతో ప్రక్షాళన చేసి, అభివృద్ధి పరచేందుకు వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో, చందానగర్‌లోని మల్లె కుంటను శుభ్రపరచడం, కట్టను బలోపేతం చేయడం, పూడికతీసి, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయడం వంటి పనుల్ని చేయనున్నారు. ఔట్‌లెట్‌ను పునరుద్ధరించనున్నారు. మిగతా నాలుగు చెరువులకు సైతం కట్టల బలోపేతం, పూడికతీతలు, అవసరమైన చోట ఔట్‌లెట్‌ల మరమ్మతులు, చెరువుల పరిసరాల్లో సుందరీకరణల పనులు చేయనున్నారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చెరువులను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నగరంలోని జలవనరులను పర్యావరణహిత, వినోద కేంద్రాలుగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదంతోపాటు, ముంపు సమస్యల్లేకుండా చేసేందుకు, చెరువుల్ని పరిరక్షించేందుకు సీఎస్సార్ నిధులతో పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలను జీహెచ్‌ఎంసీ ప్రోత్సహిస్తోంది.

'ఆటోమేటిక్ ఫేర్'తో మెరుగైన సేవలు



ఐటిమ్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ముషీరాబాద్ ఆర్టీసీ డిపో సందర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆర్టీసీ అమలు చేస్తున్న ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)తో ప్రయాణికులకు మెరుగైన సేవలు లభిస్తున్నాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన సోమవారం ముషీరాబాద్ డిపోను సందర్శించారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి ఐటిమ్స్, డిజిటల్ పేమెంట్స్ అమలు తీరును స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఈ వ్యవస్థ ఎంత సులభతరంగా ఉందో కండక్టర్లు వివరించారు. అంతకుముందు ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ముషీరాబాద్ డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సుల్లో ఏఎఫ్‌సీఎస్ అమలు చేస్తున్న తీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో 3 నెలలుగా ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ విజయవంతంగా అమలవుతుందని, ప్రతి రోజు సగటున 20 శాతం మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని చెప్పారు. త్వరలో అన్ని బస్సుల్లోనూ ఈ వ్యవస్థను అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా టీజీఎస్ ఆర్టీసీలో ఆధునిక సంస్కరణలను ప్రవేశపెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి–మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఆర్టీసీకి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 191 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసిందని, తద్వారా రూ.6300 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు.

గ్రేటర్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులు...
త్వరలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్త కాలనీలకు ప్రజా రవాణా సేవలను విస్తరింపజేస్తామని, అందుకు కాలనీవాసులు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఏఎఫ్‌సీఎస్‌లో భాగంగా ప్రస్తుతం క్యూఆర్ కోడ్ టికెటింగ్ అందుబాటులో ఉందని, త్వరలో వాట్సాప్ టికెటింగ్, డిజిటల్ బస్‌పాస్‌ల సదుపాయాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. వాట్సాప్, డిజిటల్ బస్ పాస్‌లను కండక్టర్ల వద్ద ఉండే ఐటిమ్స్‌తో స్కాన్ చేసి..రాకపోకలు సాగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీఈఐటీ శ్రీదేవి, హైదరాబాద్ ఆర్‌ఎం సుధా పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నేతగా రాణించి.. రాడికల్స్‌కు ఎదురొడ్డి

- ఉస్మానియా వర్సిటీ నుంచి ఎదిగిన రాంచందర్‌రావు
- కార్పొరేటర్ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వైనం..



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి మరో మారు నగరవాసికే దక్కింది. ప్రముఖ న్యాయవాదిగా, మాజీ ఎమ్మెల్సీగా చిరపరిచితుడైన ఎన్.రాంచందర్‌రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. బండి సంజయ్ కంటే ముందు, తరువాత కూడా నగరానికి చెందిన నేతలే కమలం పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. కాగా, ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా వర్సిటీలో విద్యార్థి సంఘం నాయకుడిగా రాంచందర్‌రావు పనిచేశారు. ఆ సమయంలోనే రాడికల్స్‌కు ఎదురొడ్డి నిలబడ్డారు.

ఏబీవీపీ మనుగడలో లేని సమయంలోనే 1977 నుంచి 80 వరకు ఆ సంఘంలో పనిచేశారు. డిగ్రీ చదువుతూ సంఘం కార్యకలాపాలలో పాలుపంచుకున్నారు. విద్యార్థుల పక్షాన నిలిచి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. యూనివర్సిటీ మావోలకు అడ్డాగా మారి, రాడికల్స్ హవా నడుస్తున్న సమయంలో వారిని ఎదురించి నిలిచారు. ఒక సందర్భంలో లైబ్రరీలో ఉన్న రాంచందర్‌రావుపై నక్సల్స్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ దెబ్బతో రెండు నెలల పాటు మంచానికే పరిమితమయ్యారు. 1977 నుంచి 1985 వరకు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, నగర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1986లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. బీజేపీలో చేరి రవీంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు. అప్పటి నుంచి పార్టీలో వివిధ స్థాయిల్లో బాధ్యతలు చేపట్టారు. 1986లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. నాటి నుంచి జిల్లా కోర్టులు, నాంపల్లి మెట్రోపాలిటిన్ కోర్టులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పనిచేసి ప్రస్తుతం సుప్రీం కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. 2015లో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2021 వరకు మండలి ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు.

వాట్సాప్ ద్వారా ఆస్తిపన్ను చెల్లింపులు

ట్రేడ్ లైసెన్సులు, తదితర ఫీజులు సైతం
- త్వరలో అందుబాటులోకి తేనున్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) డిజిటల్ సేవల విస్తరణలో మరో ముందడుగు వేయనుంది. ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, తదితర రెవెన్యూ వసూళ్ల కోసం వాట్సాప్ బిజినెస్ ప్లాట్‌ఫామ్ సేవలందించేందుకు సిద్ధమవుతోంది. అందుకుగాను సదరు సేవలందించగల సాంకేతిక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఎఓఐ) కోరింది. ఈ సేవల ద్వారా పౌరులకు వాట్సాప్ ద్వారానే బిల్లులు, రసీదులు, నోటీసులు, తదితరమైనవి పంపించడమే కాకుండా చెల్లింపులకు సంబంధించిన లింకులు పంపించి, వెంటనే చెల్లింపులు చేసే సదుపాయం కల్పించనుంది. చెల్లింపులు జరిపిన వారు వెంటనే అకనాలెడ్జ్‌మెంట్ కూడా పొందుతారు. యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, వాలెట్‌ల ద్వారా చెల్లింపులకు అవకాశం ఉంటుంది. సదరు చెల్లింపులు రెండు రోజులకు జీహెచ్‌ఎంసీ ఖాతాలో జమవుతాయి. చెల్లింపులకు సంబంధించి ఎప్పటికప్పుడు మెసేజ్‌లు, రియల్‌టైమ్ అనలిటిక్స్ వంటివి ఉంటాయి. వాట్సాప్ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలి. ప్రజలు వాట్సాప్‌ను ఎక్కువగా వినియోగిస్తుండటంతో ఈ సేవల ద్వారా ఓవైపు ప్రజలకు సౌలభ్యంతోపాటు జీహెచ్‌ఎంసీకి ఆదాయమూ ఎప్పటికప్పుడు రాగలదని అధికారులు భావిస్తున్నారు. ఆంగ్లంతో పాటు ఇతర భాషలను కూడా అందుబాటులో ఉంచాలని యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమలు చేసేందుకు మెటా అనుబంధ సంస్థలుగా గుర్తింపు పొందిన టెక్ కంపెనీలు లేదా కన్సార్టియంలు, బ్యాంకింగ్, ఇతరత్రా సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూలై 16, 2025. ముందుకొచ్చే సంస్థలు, అవి అందించే సేవలు, వాటి ఆధునిక సాంకేతికత, తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని తగిన సంస్థను ఈ సేవల కోసం ఎంపిక చేయనున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వాట్సాప్ సేవలు విస్తృతంగా అమలవుతున్నాయి. కోటిమందికి పైగా ప్రజలకు సేవలందిస్తున్న, ఏటా రూ.2 వేల కోట్లకు పైగా ఆస్తిపన్ను, దాదాపు వెయ్యికోట్ల టౌన్‌ప్లానింగ్ ఫీజులు వసూలవుతున్న జీహెచ్‌ఎంసీలో ఈ సేవలు అవసరమని భావించిన యంత్రాంగం ఇందుకు సిద్ధమైంది.

సున్నం చెరువులో

ఆక్రమణల తొలగింపు

- కూల్చివేతలు చేపట్టిన హైడ్రా అధికారులు
- అడ్డుకున్న స్థానికులు, పరిధి మారిందని ఆరోపణ
- నివాసితులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే

చుట్టూ కబ్జాలు, అక్రమ బోర్లతో దందా



సాక్షి, సిటీబ్యూరో/మాదాపూర్:

కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన మాదాపూర్‌లోని సున్నం చెరువు పునరుద్ధరణ పనుల్ని హైడ్రా సోమవారం ప్రారంభించింది. ప్రాథమికంగా అక్కడ ఏర్పాటైన అక్రమ బోర్లతో పాటు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న ఆక్రమణల్ని కూల్చేసింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మూడు దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నామని, మా ఇళ్లను ఎలా కూలుస్తారంటూ స్థానికులు జేసీబీలను అడ్డుకున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ వారికి మద్దతు తెలిపారు. సున్నం చెరువు అంశంపై వివరణ ఇవ్వడానికి మంగళవారం సమయం ఇచ్చిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ఎలా కూల్చేస్తారంటూ ప్రశ్నించారు.

బోర్లు తొలగింపు, ట్యాంకర్లు సీజ్...

విషతుల్యమైన సున్నం చెరువులో వెలిసిన అనేక అక్రమ బోర్ల ద్వారా నిర్వాహకులు నీటిని తోడి స్థానికంగా విక్రయిస్తున్నారు. ఈ నీటిపై ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా నివేదిక ఇచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన హైడ్రా సోమవారం అక్కడ పదుల సంఖ్యలో ఉన్న బోర్లను తొలగించడంతో పాటు ట్యాంకర్లను సీజ్ చేసింది. ఆ బోర్లకు ఆనుకుని వేసిన షెడ్లను కూల్చేసింది. నీటి దందా చేస్తున్న వారిపై కేసులు పెట్టింది. హైడ్రా విధులకు ఆటంకం కలిగిస్తున్న వెంకటేష్ అనే బోర్ యజమానిపై మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు వెంకటేష్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. సోమవారం ఉదయమే భారీ బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను కూల్చడం ప్రారంభించారు. గుడిసెలు, ప్రహరీ గోడలు, షెడ్లను భారీబందోబస్తు నడుమ కూల్చివేశారు.

జేసీబీలను అడ్డుకున్న స్థానికులు...

సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో దాదాపు మూడు దశాబ్ధాలుగా నివసిస్తున్న తమ ఇళ్లను కూల్చేస్తున్నారంటూ స్థానికులు నిరసనకు దిగారు. హైడ్రా అధికారులు చెరువు సరిహద్దులు ఏర్పాటు చేసేందుకు కాలువను తవ్వుతుండగా బోరున విలపిస్తూ ఆ జేసీబీని అడ్డుకున్నారు. 'హైడ్రా డౌన్‌డౌన్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విలపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నివాసాలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలోని వాటి పైనే చర్యలన్న హైడ్రా...

సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన 1970 నాటి టోపో షీట్ల ప్రకారం సున్నం చెరువు విస్తీర్ణం 26 ఎకరాలని హైడ్రా పేర్కొంది. ఈ క్రమంలోనే 2016లో హెచ్‌ఎండీఏ ఈ చెరువు విస్తీర్ణాన్ని 32 ఎకరాలుగా పేర్కొంటూ ప్రాథమికంగా నిర్ధారించిందని వివరించింది. 2014లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు నిర్ధారించిన హద్దుల మేరకే ప్రస్తుతం చెరువుల పునరుద్ధరణ జరుగుతోందని పేర్కొంది. సున్నం చెరువునూ ఆ మేరకే అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేసింది. గతంలోని వేసిన లేఔట్‌ను హుడా రద్దు చేసిందని తెలిపింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందునే అక్కడ నిర్మాణాలు చేపట్టడానికి పదేళ్లుగా అనుమతులు ఇవ్వట్లేదంది. ఎవరైనా నష్టపరిహారానికి అర్హులమని భావిస్తే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

చెరువు బౌండరీలు మార్చారు

చెరువు ఆక్రమణలపై గతంలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశా. వాటిని పక్కదారి పట్టిస్తూ చెరువు బౌండరీలు మార్చారు. సర్వే అంశం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఒకపక్కకు ఉండాల్సిన చెరువును మరోపక్కకు మార్చారని సియెట్ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ తప్పు జరిగిందని తేలింది. ఇప్పటి ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడిగా ఉండగా ఇక్కడకు వచ్చి ధర్నా చేశారు. హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వడానికి మంగళవారం నివాసితులకు సమయం ఇచ్చారు. ఈలోపు కూల్చివేశారు... దీనిపై మంగళవారం హైడ్రా కమిషనర్‌ను కలుస్తా. – అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే



చెరువుకు సంబంధించిన ఆధారాలను చూపిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

73 మంది పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ



బంజారాహిల్స్: హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 73 మంది పోలీసు అధికారులు సోమవారం పదవీ విరమణ పొందారు. ఇందులో ఒక ఏసీపీ, 31 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 8 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, ఒక ఎల్‌జీఈ ఉన్నారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఎవరూ బాధతో వెళ్లకూడదని, అందుకే పదవీ విరమణ రోజే అన్ని రకాల బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఇంట్లో ఖాళీగా కూర్చోవద్దని, ఆరోగ్య స్థోమతను బట్టి ప్రతినిత్యం కుటుంబం కోసం ఏదో ఒకటి చేస్తూ ఉండాలన్నారు. ఏదో ఒక పని చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (అడ్మిన్) పరిమళ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ అపూర్వరావు, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇస్మాయిల్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర శివార్లకు గుడిమల్కాపూర్ మార్కెట్

- అజీజ్‌నగర్, రాజేంద్రనగర్‌లో భూముల పరిశీలన
- 150 ఎకరాల విస్తీర్ణంలో పూలు, కూరగాయలు, పండ్లకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- ప్రభుత్వ పరిశీలనకు ప్రతిపాదనలు



సాక్షి, సిటీబ్యూరో: నగరం నడిబొడ్డున ఉన్న మరో మార్కెట్‌ను ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి భూముల లభ్యతను పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం ప్రైవేటు భూముల కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వ భూముల వివరాల సేకరిస్తున్నారు. కూరగాయలు, పూలు, పండ్ల సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్‌కు సుమారుగా 150 ఎకరాలు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పూలు, హైదరాబాద్ ప్రజల కూరగాయల అవసరాలు తీర్చడంలో కీలకంగా మారిన గుడిమల్కాపూర్ మార్కెట్ సైతం ఔటర్ దాటిపోనుంది.



ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు

గుడిమల్కాపూర్‌లో 6 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల మార్కెట్, 11 ఎకరాల విస్తీర్ణంలో పూల మార్కెట్ కొనసాగుతున్నాయి. ఆయా మార్కెట్లకు రోజుకు 15 టన్నుల నుంచి 20 టన్నుల కూరగాయలు, దిగుమతి అవుతున్నాయి. 150 నుంచి 200 వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ దారిలో వెళ్లేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు గాను రైతులకు రవాణా సౌకర్యం మెరుగ్గా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ 1992లో నిర్మించారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా ఉండటం, ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలు, మౌలిక సదుపాయాలు కరువే. ఈ పరిస్థితులను అధిగమించాలంటే మార్కెట్‌ను తరలించడమే మార్గమని భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ కోసం కట్టి..

మెహిదీపట్నం బస్టాండ్ కోసం గుడిమల్కాపూర్‌లో 6 ఎకరాల విస్తీర్ణంలో 1992లో నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో వివిధ కారణాలతో ఆ ప్రతిపాదనలు విరమించుకుని వ్యవసాయ మార్కెట్‌కు అప్పగించారు. అప్పటి నుంచి సుమారు మూడు దశాబ్దాల కుపైగా వ్యవసాయ మార్కెట్‌గానే వినియోగిస్తున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు ఈ మార్కెట్‌కు వస్తుంటాయి. రోజుకు సుమారు వెయ్యి నుంచి 1,200 మంది రైతులు కూరగాయలు, పూలు తెస్తారు. కూరగాయల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు 300 మంది వరకు ఉండగా, పూల మార్కెట్‌లో 200 మంది ఏజెంట్లు ఉన్నారు. ఏజెంట్లు, కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిటలాడుతుంది. మార్కెట్ తరలించాలంటే వీరందరికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

మెరుగైన వసతుల కోసమే..



రైతులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే మార్కెట్‌ను తరలించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. సుమారు 150 ఎకరాల భూములు అవసరం ఉంటుంది. గుడిమల్కాపూర్ మార్కెట్‌కు వచ్చే రైతులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. 30 ఏళ్ల నాటి నిర్మాణాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటన్నింటిని అధిగమించేందుకు ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.

–తల్లారి మల్లేశం ముదిరాజ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, గుడిమల్కాపూర్

బీఆర్ఎస్ నాయకులకు బెయిల్

- రూ.20 వేలతో రెండు పూచీకత్తులు అందజేయాలి
- నాంపల్లి 17వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశం

సిటీ కోర్టులు : ఓ న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకులకు సోమవారం నాంపల్లిలోని 17వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరూ రూ. 20వేలతో రెండు పూచీకత్తులు అందజేయాలని షరతులు విధించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సదరు న్యూస్ ఛానెల్‌లో తప్పుడు వార్తలు ప్రసారం చేశారని, అసత్యపు ఆరోపణలతో కేటీఆర్ పరువుకు భంగం కలిగేలా చానల్ యాజమాన్యం వ్యవహరించిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం సంస్థ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్యాలయం అద్దాలు, కార్యాలయం ముందున్న కార్ల అద్దాలను ధ్వంసం చేశారని పోలీసులు వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారి తరుపున బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు సోమవారం నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో వారికి రూ.20 వేలతో రెండు పూచీకత్తులు, వ్యక్తిగత బాండ్‌లను కోర్టులో అందజేయాలని సూచించించిన నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

రౌడీషీటర్ దారుణ హత్య...



సయ్యద్ సాహెద్ (ఫైల్)

మూసాపేట: స్నేహితుల చేతిలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్, పండిట్ నెహ్రూ నగర్‌లో రౌడీషీటర్ సయ్యద్ సాహెద్ (24) నివాసం ఉంటున్నాడు. గతంలో ఓ హత్య కేసులో జైలుకు వెళ్లిన అతను ఇటీవలే బయటికి వచ్చాడు. ఆదివారం రాత్రి కూకట్‌పల్లిలో పవన్ అనే వ్యక్తి పుట్టిన రోజు సందర్భంగా పాపారాయుడు నగర్‌లోని ఖాళీ స్థలంలోని ఇచ్చిన విందుకు సయ్యద్ సాహెద్, సాజిద్, సమీర్, మున్నా, పవన్ హాజరయ్యారు. అయితే గతంలో సాహెద్, సాజిద్‌ను డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అందరూ కలిసి మద్యం తాగిన అనంతరం డబ్బుల విషయమై వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి లోనైన సాజిద్ బీరు బాటిల్ పగలగొట్టి సాహెద్ గొంతులో పొడిచాడు. మరో రెండు బీరు బాటిళ్లు తలపై పగులగొట్టడమేగాక బండరాయితో తలపై మోదటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సాహెద్‌పై అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని, అల్లాపూర్, సనత్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. యూ ట్యూబర్‌గా పని చేస్తున్న నిందితుడు సాజిద్‌పై కూడా రౌడీ షీట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ హత్య కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

యువకుడి హత్య

చార్మినార్/బహదూర్ పురా: ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బహదూర్ పురా చౌరస్తాలో ఫ్లైఓవర్ కింద సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహంపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని కొట్టి చంపినట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మృతుడు కాలాపత్తర్ కు చెందిన ఇస్మాయిల్ (33)గా గుర్తించారు. టైలర్‌గా పని చేసే ఇస్మాయిల్ ఆదివారం ఉదయం పనికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం బహదూర్ పురా ఫ్లై ఓవర్ కింద గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉస్మానియా మార్చురీలో ఇస్మాయిల్ మృతదేహాన్ని చూసిన అతడి భార్య తన భర్తేనని నిర్ధారించింది. ఈ మేరకు అనుమానాస్పద హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు



ప్రజావాణి ద్వారా వచ్చినవి 49

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 49 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో అత్యధికం ఆక్రమణలకు సంబంధించినవే కావడం గమనార్హం. ఫతేనగర్ శివాలయం సమీపంలో నాలాలో 350 గజాల వరకూ ఆక్రమించి షెడ్లు వేసి అద్దెకు ఇచ్చారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ స్థలం విలువ రూ. 3 కోట్లు కాగా అద్దెల రూపంలో ప్రతి నెలా రూ.1.50 లక్షలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ నాలా కుంచించుకుపోవడంతో సమీప బస్తీలన్నీ నీట మునుగుతున్నాయని వివరించారు. బాలానగర్ పరిధిలోని ఫైసర్ నగర్‌లో బూర రాజు నాలాను 60 నుంచి 80 గజాల మేర ఆక్రమించి షెడ్లు నిర్మించి, విక్రయిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయమై పలుమార్లు మీడియాలో వార్తలు వచ్చినా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని శ్రీ సూర్య సాయినగర్‌లో పార్కు స్థలం తమదంటూ పక్క సర్వే నంబరుతో ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. 1979లో వేసిన వెంచర్‌లో 500 గజాల వరకు ఉన్న స్థలాన్ని పార్కుగా చూపించారు. జీహెచ్ఎంసీ సైతం రూ.18.37 లక్షలు పార్కు అభివృద్ధికి కేటాయించింది. ఆ పార్కు హద్దులు నిర్ధారించాలని హైడ్రాను కోరారు. సాహెబ్‌నగర్ కలాన్‌లోని బృందావన్ మెడోస్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పార్కు కబ్జా అయ్యిందంటూ ఫిర్యాదు చేశారు. లే ఔట్ వేసిన వారే పార్కుగా చూపించిన స్థలాన్ని కబ్జాచేశారంటూ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. శామీర్‌పేట యూఎస్ఎం మై సిటీ లేఔట్ వాళ్లు రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఎల్ఎల్‌బీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చైతన్యపురి: మనస్తాపంతో ఎల్ఎల్‌బీ విద్యార్థిని హాస్టల్ నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా నేతాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ కూతురు సుష్మిత (20) ఏడాదిన్నర కాలంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని అక్షయ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ ఎన్‌టీఆర్‌నగర్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ చదువుతుంది. నెల రోజుల క్రితం పక్షవాతంతో తల్లి చనిపోవటంతో అప్పటి నుంచి మనస్తాపానికి గురవుతూ ఉంది. సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకోవాలని నాలుగో అంతస్తు నుంచి దూకింది. తీవ్రంగా గాయపడిన సుష్మితను హాస్టల్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రెండు కాళ్లు విరిగి ప్రస్తుతం చికిత్స పొందుతుందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి

మీర్‌పేట: చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన భీశెట్టి బాబ్జీకి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన మోహన కృష్ణ (18) బీటెక్ చదువుతున్నాడు. జూన్ 23వ తేదీన మోహనకృష్ణ ఆత్మహత్య చేసుకునేందుకు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మోహనకృష్ణ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని.. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య



అశోక్ యాదవ్ మృతదేహం

నాగోలు: ఓ వ్యక్తిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసి నగర శివార్లలోని నిర్మానుష్య ప్రాంతంలో పడవేసిన సంఘటన నాగోలు పోలీసుల స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని పసుమాముల శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నాగోలు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహం వద్ద లభించిన వివరాల ఆధారంగా మృతుడు కాచిగూడకు చెందిన అశోక్ యాదవ్ గా గుర్తించారు. కాచిగూడలో జ్యూస్ షాప్ నిర్వహిస్తున్న అశోక్ యాదవ్‌కు భార్య క్రాంతి దేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. అశోక్ యాదవ్ మృతదేహం లభించిన ఫోన్ ఆధారంగా అతని భార్యకు ఫోన్ చేసిన పోలీసులు సమాచారం సేకరించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ఇంటి వస్తున్నట్లు సమాచారం అందుకున్న అతడి భార్య ఇంటికి తాళం, జ్యూస్ సెంటర్ మూసి వేసి సెల్‌ఫోన్ ఆఫ్ చేసి పరారైనట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

రిమోట్ కోసం తమ్ముడితో గొడవ పడి..

బాలిక ఆత్మహత్య

సైదాబాద్: టీవీ రిమోట్ కోసం తమ్ముడితో గొడవ పడిన ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వినయ్‌నగర్ కాలనీకి చెందిన మల్లిక, వెంకన్న దంపతులకు ముగ్గురు సంతానం. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన వారి పెద్ద కుమార్తె ధృతి చందన (16) ఆదివారం రాత్రి తన తమ్ముడుతో కలిసి టీవీ చూస్తుండగా రిమోట్ విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో ఆగ్రహానికి లోనైన ధృతి తమ్ముడిని కొట్టి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఆ తర్వాత కొద్ది సేపటికి ఇంటికి వచ్చిన ఆమె తండ్రి వెంకన్న గది తలుపులు కొట్టినా ధృతి స్పందించకపోవడంతో తలుపులు పగుల కొట్టి లోపలికి వెళ్లి చూడగా ధృతి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. ఆమెను కిందకు దించి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజిన్, ట్రక్కు మధ్యలో ఇరుక్కుని కార్మికుడి మృతి



ఉపేందర్ మృతదేహం

జీడిమెట్ల: మినీ ట్రక్కుకు రంగు వేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు, ఇంజిన్ మధ్యలో ఇరుక్కుని కార్మికుడు మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌సాగర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉపేందర్‌కుమార్(35) నగరానికి వలసవచ్చి కళావతినగర్‌లో ఉంటూ సుభాష్‌నగర్‌లోని పవన్ కోచ్ బాడీబిల్డింగ్ పరిశ్రమలో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను మినీ ట్రక్కుకు పెయింట్ వేస్తుండగా ఒక్కసారిగా ట్రాలీ కిందికి రావడంతో ట్రాలీ ఇంజిన్ మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



విజయ్‌కుమార్ మృతదేహం

నాగోలు: లారీ ఢీకొని రాపిడో రైడర్ మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీడిమెట్ల సుభాష్ నగర్‌కు చెందిన బండారి విజయ్‌కుమార్(35) రాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను బైక్‌తో నాగోలు సమీపంలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద నిలబడి ఉన్నాడు. అదే సమయంలో ఉప్పల్ నుంచి బండ్లగూడ వెళుతున్న లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఎల్లస్వామిని అదుపులోకి తీసుకున్నారు.

జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ

బంజారాహిల్స్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి ప్రవేశించి ఖరీదైన వజ్రాభరణాలు దొంగిలించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివసించే వెంకటేశ్వరరావు ఇంట్లో బీరువాలో ఉన్న నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో వజ్రాలతో కూడిన ఆభరణాలు కూడా ఉన్నట్లు తెలిపాడు. తాము మూడురోజుల క్రితం రెండు గంటల పాటు బయటకు వెళ్లామని ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగలు తస్కరించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



కళ్యాణ్ మృతదేహం

కీసర: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బీబీనగర్ మండలం, జియాపల్లికి చెందిన కళ్యాణ్ (20) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేసేవాడు. సోమవారం అతను తన స్నేహితుడు తరుణ్ (19) తో కలిసి బైక్‌పై ఈసీఐఎల్‌కు వెళుతుండగా కీసర చర్చి వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో కళ్యాణ్ అక్కడికక్కడే మృతిచెందగా, తరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ డిక్కీలో ఉంచిన రూ. 6.5 లక్షలు మాయం

చాదర్‌ఘాట్: స్కూటర్ డిక్కీలో ఉంచిన రూ. 6.5 లక్షలు చోరీకి గురైన సంఘటన సోమవారం చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ కుద్దూస్ అనే వ్యక్తి మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రూ.6.5 లక్షల నగదును తన స్కూటర్ డిక్కీలో పెట్టి వాహనాన్ని షాప్ ఎదుట పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా స్కూటర్ డిక్కీలో దాచిన డబ్బులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: అవంతీనగర్, పాటిగడ్డ 11కెవీ ఫీడర్లు మోతీనగర్, ఎస్-పార్క్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బబ్బుగూడ, మోతీనగర్, కబీర్‌నగర్, అవంతీనగర్, హనుమాన్ టెంపుల్, పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. లక్ష్మీకాంప్లెక్స్, ఇంద్రప్రస్థ, హుండా, పాటిగడ్డ, చిరాన్‌పోర్ట్ 11కెవీ ఫీడర్లు, ఆల్విన్, ఎస్-పార్క్, ప్రకాశ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఇంద్రప్రస్థ, హుడాలైన్, చిరాన్‌పోర్ట్, పాస్‌పోర్ట్ ఆఫీస్, పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, రసూల్‌పుర, హుడాలైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

జీటీఎస్ ఆలయ హుండీ ఆదాయం రూ.2 లక్షలు



వెంగళరావునగర్: స్థానిక జీటీఎస్ కాలనీలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానం హుండీ లెక్కలు సోమవారం నిర్వహించారు. మూడు నెలలకు గాను రూ.2, 03, 916 లను భక్తులు హుండీలో వేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తెలియజేశారు. జూలై 10వ తేదీనాడు గురుపౌర్ణమి ఉత్సవాలను ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తెలియజేశారు. కాగా హుండీ లెక్కలను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ డి.మధుబాబు, నాయకులు రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, రిన్నోవేషన్ కమిటీ నేతలు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో 34 మంది ఉద్యోగుల పదవీ విరమణ

లక్డీకాపూల్: ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 34 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ వేణుగోపాల్, ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

హిమాయత్‌నగర్: గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ(జీపీ) సంఘం జేఏసీ చైర్మన్ మామిడాల నర్సింహులు ఆధ్వర్యంలోని బృందం సోమవారం తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఎస్పీఆర్‌హిల్స్ మార్కెట్‌లో దంపతులపై దాడి

రహమత్‌నగర్: వివాహితను దూషించిన కేసులో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బోరబండ పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన ఓ వివాహిత ఆదివారం రాత్రి భర్తతో కలిసి ఇంటికి వెళుతోంది. కాంత్ అనే వ్యక్తి వివాహితవద్దకు వేగంగా దూసుకొచ్చాడు.దీంతో భర్త మందలించాడు. కోపోద్రెకుడైన కాంత్ వివాహితను దూషించాడు.ఆ తరువాత మరో ముగ్గురు కలిసి వీరిపై దాడి చేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి



ఫిలింనగర్: బోనాల పండుగ ప్రారంభమైన నేపథ్యంలో అమ్మవారి ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధికారులకు సూచించారు. బోనాల పండుగ దృష్ట్యా ఏర్పాట్లపై సోమవారం కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా చెత్తను తరలించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, రోడ్డుకిరువైపులా వాహనాలు అక్రమ పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల వద్ద పేరుకుపోయిన మట్టి, చెత్తను తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్ రవి, శానిటేషన్ సూపర్‌వైజర్ అమిత్, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

మొదలైన ఇంటింటి

జ్వర సర్వే..

వ్యాధులు నిర్ధారణ అయితే అక్కడికక్కడే మందులు..

రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది..



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని దూద్‌ఖానా బస్తీలో జ్వర సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది..

బంజారాహిల్స్: వర్షాకాలంలో వ్యాధులు విజృంభించడంతో పాటు జ్వరాలతో జనం మంచాన పడుతూ అనారోగ్యాలకు గురవుతున్న నేపథ్యంలో వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటి ప్రాథమిక ఆరోగ్య సర్వే చేపట్టింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ డివిజన్లలో ఉన్న 9 ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ)లతో పాటు 22 బస్తీ దవాఖానాల పరిధిలో ఈ సర్వే చేపడుతున్నారు. బాధితులు ఉంటే అక్కడికక్కడే మందులు అందిస్తున్నారు. దీనికి తోడు బాధితులు ఉన్నచోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను కూడా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాటుచేశారు. వ్యాధుల కట్టడి భాగంలో ఎపిడమిక్ విభాగాన్ని ఏర్పాటుచేసి దాని ఆధ్వర్యంలో సహాయక కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు..

వైద్య ఆరోగ్యశాఖ సత్వర స్పందన బృందాలను నియమించింది. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు నిర్ధారణ అయ్యినట్లు సమాచారం తెలియగానే ఈ బృందాలు రంగంలోకి దిగుతాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి జ్వర పీడితులకు ఉపశమనం కలిగేలా ఆరోగ్య సూత్రాలు చెప్పి మందులు అందిస్తారు. పీహెచ్‌సీ స్థాయిలో ఈ బృందాలను నియమించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల స్థాయిలో వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ అధికారి, ల్యాబ్ టెక్నీషియన్, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు ఉంటారు.

వైద్య శిబిరాలు..

సీజన్ మొదలవడంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న పీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ర్యాపిడ్ డయాగ్నస్టిక్ కిట్ ద్వారా పరీక్షిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ లక్షణాలు ఉంటే రక్తనమూనాలు సేకరించి టీ-హబ్‌కు చేరవేస్తారు. అక్కడ పరీక్షల అనంతరం నిర్ధారిస్తారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమకాటుకు గురికాకుండా ఉండవచ్చు. భోజనం వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిదని, చేతులను శుభ్రం చేసుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యాధికారుల పాటు జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగం అధికారులు సూచిస్తున్నారు. బ్యాంక్‌లు, నీటి సంప్‌లు, నీటిపాత్రలపై ఎప్పుడూ మూతలు ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

త్వరలోనే రహమత్‌నగర్ జంక్షన్ విస్తరణ పనులు

మేయర్ గద్వాల విజయలక్ష్మి



రహమత్‌నగర్‌లో పర్యటిస్తున్న మేయర్ విజయలక్ష్మి, సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ జంక్షన్ విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి స్పష్టం చేశారు. దీంతో ఈ ప్రాంత వాసుల ట్రాఫిక్ కష్టాలు తొలగిపోనున్నాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రహమత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధిపై తాను ప్రత్యేక శ్రద్ధవహిస్తానని చెప్పారు.

అధికారులతోకలిసి రోడ్డు పక్కన టిఫిన్....

రహమత్‌నగర్ డివిజన్ పర్యటనలో పాల్గొన్న మేయర్ కార్మికనగర్ రోడ్డు పక్కన ఉన్న బండి వద్ద అధికారులతో కలిసి టిఫిన్ చేశారు.స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న నృత్యం



ఆకట్టుకున్న నిఖిత నృత్య ప్రదర్శనలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని జగన్నాథస్వామి దేవాలయంలో కూచిపూడి నృత్యకారిణి బడుగు నిఖిత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. తన తల్లి వరలక్ష్మీ ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచి రవలి రమేష్‌బాబు శిష్యరికంలో అరంగేట్రం చేసిన ఆమె ఇప్పటికే అనేక ప్రదర్శనలు ఇచ్చింది. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానంకూడా సంపాదించింది. భూదాన్ పోచంపల్లి మండలం పరిధిలోని వంకమామిడి గ్రామానికి చెందిన బడుగు శివశంకర్ దంపతుల కుమార్తె బడుగు నిఖిత పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో కూచిపూడి నృత్యంలో డిప్లొమా పూర్తి చేసి, నగరంలోని కోఠి ఉమెన్స్ కళాశాలలో కంప్యూటర్ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు.

దుర్గంధంలో రహదారులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని ప్రధాన రహదారిలో పారిశుధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. వ్యర్థాల దుర్గంధం, దుర్వాసనతో బంజారాహిల్స్ కంపు కొడుతోంది. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటికి వెళ్లే దారిలోనే పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయి దర్గంధం, దర్వాసనతో స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య విభాగం పూర్తిగా విఫలమైంది. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 నిర్వాకం, నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యాదవుల డిమాండ్లను పరిష్కరించాలి

బంజారాహిల్స్: యాదవులకు వెంటనే మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, యాదవుల దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన యాదవుల సత్యాగ్రహ దీక్షకు శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి తన సంపూర్ణ మద్దతు ప్రకటించి దీక్షలో పాల్గొంది. సమితి తెలంగాణ అధ్యక్షుడు కాటం నర్సింహ్మాయాదవ్, సిటీ ప్రెసిడెంట్ రాజేష్ బి.యాదవ్, వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్‌యాదవ్, జనరల్ సెక్రటరీ లక్ష్మీకాంత్‌యాదవ్, అరుణ్‌కుమార్‌యాదవ్ తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించాలని వీర డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

గుంతలు లేకుండా చూసుకోవాలి

జెడ్‌సీ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: వర్షాల నేపథ్యంలో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల్లో గుంతలు లేకుండా అధికారులు చూసుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 ఇంజనీరింగ్, శానిటేషన్, యూబీడీ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని నాగార్జున సర్కిల్ నుంచి విరించి వరకు అధికారులతో రోడ్లను, ఫుట్‌పాత్‌లను, సెంట్రల్ మీడియన్‌లో మొక్కలను పరిశీలించారు. నిత్యం సీఎం తిరిగే రూట్ కూడా కావడంతో ఎక్కడైనా రోడ్డు దెబ్బ తిన్నా, మ్యాన్‌హోల్ మూతలు పగిలిపోయినా వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులు అలసత్వం వహించొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎంసీ సమ్మయ్య, యూబీడీ డీడీ చంద్రశేఖర్, ఈఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వో కే.ఎస్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణా ఉద్యమకారుల ఫోరం జూబ్లీహిల్స్ నియోజకవర్గ నేతలు డిమాండ్ చేశారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శీనన్న పిలుపు మేరకు నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత దీక్షను చేపట్టారు. ఉద్యమకారులకు 250గజాల స్థలం, 25వేల పింఛను ఇవ్వాలని, తెలంగాణా కోసం పోరాడిన వీరులకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలవాలని కోరారు. ఉద్యమకారుల కోసం సంక్షేమబోర్డును ఏర్పాటుచేయాలని, దశాబ్దం దాటినా తెలంగాణా ఉద్యమకారులకు తగు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో డివైడర్‌ను ఢీ కొన్న కారు

పంజగుట్ట: మద్యం మత్తులో కారు నడుపుతూ డివైడర్‌ను ఢీ కొట్టిన ఇద్దరు వ్యక్తులపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సుచిత్రా సర్కిల్‌కు చెందిన జే.జయశంకర్ (28), ప్రజ్వల్ (28)లు సోమవారం తెల్లవారు జామున వారి కారులో బంజారాహిల్స్ జర్నలిస్టు కాలనీ నుండి పంజగుట్ట వైపు వస్తున్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో ఫర్నిచర్ వరల్డ్ ముందు వీరి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. విధుల్లో ఉన్న పంజగుట్ట పోలీసులు మద్యం మోతాదు చెక్ చెయ్యడంతో ఇద్దరూ మద్యం తాగినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పంజగుట్ట: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఈసీఐఎల్, ఈస్ట్ మారుతీ నగర్‌కు చెందిన పి.కిరణ్మయి (29)కి, కుందన్‌బాగ్‌కు చెందిన శరత్ (32)తో 2023 డిసెంబర్‌లో వివాహం జరిగింది. 20 రోజుల క్రితం కిరణ్మయికి కడుపు నొప్పి రావడంతో తల్లి వచ్చి ఆసుపత్రిలో చూపించి మూడు రోజుల తరువాత తిరిగి కుందన్‌బాగ్‌లోని అత్తవారింటికి పంపింది. ఆదివారం తెల్లవారు జామున కిరణ్మయి విపరీతంగా కడుపు నొప్పితో బాధపడుతుందని ఫోన్ చెయ్యడంతో తల్లి, సోదరుడు ఇద్దరూ కలసి అక్కడకు వెళ్లి ఎ.ఎస్.రావు నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం మరో ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడనుండి నిమ్స్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నిమ్స్‌లో కిరణ్మయి మృతి చెందినట్లు చెప్పారని బాధితురాలి సోదరుడు కిరణ్ కుమార్ తెలిపారు. మా సోదరి మృతికి అత్తింటి వారే కారణమని మృతురాలి సోదరుడు కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమగ్ర సాంస్కృతిక పాలసీని ప్రభుత్వం ప్రకటించాలి

హిమాయత్‌నగర్: సమగ్ర సాంస్కృతిక పాలసీని ప్రభుత్వం ప్రకటించాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధరక భవన్‌లో రాష్ట్రస్థాయి కవులు, కళాకారుల సదస్సును నిర్వంచారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ సమాజం మరింత వెలుగు రేఖల వైపు తీసుకువెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజ న్యాటమండలి పని చేయాలన్నారు. సమాజంలోని అభ్యుదయవాదులంతా కమ్యూనిస్టు భావజాలం కలవారేనని, వారి కలాలతో గళాలతో ఈ సమాజాన్ని చైతన్యవంతులు చేస్తున్నారన్నారు.

ప్రతి ఇంటా మాగంటి బతికే ఉన్నారు

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజవకర్గం అంతా ఒకే కుటుంబం లాంటిదని, అందులో ప్రతి ఇంటా మాగంటి బతికే ఉన్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో దివంగత శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభ ఆదివారం రాత్రి సిద్ధార్థనగర్‌కాలనీ కమ్యూనిటీహాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ త్వరలోనే బీఆర్‌ఎస్ మరోసారి ఎగరవేయనున్నామన్నారు. కార్యక్రమంలో మాగంటి సతీమణి సునీత, కాలనీనేతలు విజయ్‌కుమార్, కోడె సాంబశివరావు, సోహెయిల్, యలమంచిలి రవి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బంజారాహిల్స్: విద్యాశాఖ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ మహనీయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొమ్ము విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజక వర్గంలో ఉన్న ప్రైవేట్ స్కూళ్ళలో 90 శాతానికి పైగా ఒక్కటి కూడా నిబంధనలు పాటించడం లేదని, విద్యార్థులకు భద్రత లేదని ఇరుకు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మైనర్ బాలిక ఇంటర్వ్యూ వెంటనే తొలగించాలి

పంజగుట్ట: చిన్నపిల్లల పట్ల వార్తాకథనాలు చూపేచే సమయంలో జాగ్రత్తగా చట్టానికి లోబడి చూపించాలని కలెక్టివ్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు వనజ, కట్ట కవిత, రాజేశ్వరి, సామాజికవేత్త సత్యవతిలు మాట్లాడారు. కొన్ని మీడియా చానల్స్ వారు వ్యూస్ కోసం ఇటీవల చనిపోయిన సీనియర్ జర్నలిస్టు స్వేచ్ఛ కూతురు (మైనర్ బాలికను)ను ఇంటర్వ్యూ పేరుతో వేధించారని ఆగ్రహంవ్యక్తం చేశారు. బాలిక ముఖాన్ని కొంతమంది కంళ్లు బ్లర్ చేసి చూపించగా, మరి కొంతమంది కేవలం మాస్కులు పెట్టి చూపించారని, మరి కొంతమంది ఏకంగా ఆమె పేరు, స్కూల్ పేరు కూడా బయటపెట్టారని ఇది చాలా బాధాకరమన్నారు. వ్యూస్ కోసం ఇలాచేయడం దారుణమన్నారు. ఈ అన్ని మీడియా సంస్థల సంపాదకులు, యాజమాన్యాలకు లేఖలు రాసినట్లు వారు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్ స్కూల్ ఇంగ్లిష్ ఫెస్ట్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సీనియర్ సెకండరీ ఇంటర్ స్కూల్ ఇంగ్లిష్ ఫెస్ట్ 'ఇగ్నైట్ ది లిటరరీ స్పార్క్' ఉత్సాహంగా జరిగింది. నగరవ్యాప్తంగా తొమ్మిదికి పైగా ప్రఖ్యాత పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ భాష, సృజనాత్మకత, వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ భాషా నైపుణ్యాలను వివిధ కోణాల్లో పరీక్షించే డిబేట్, డిక్లమేషన్, వాట్స్ ది గడ్ వర్డ్ వంటి పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయన్నారు.

నిమ్స్‌లో 18మంది ఉద్యోగుల పదవీ విరమణ

లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)లో ఉద్యోగుల భర్తీకి కార్యచరణ ప్రణాళికలను రూపొందించినట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆస్పత్రిలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగుల నియామకాల ప్రక్రియను చేపట్టనున్నామన్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు చెందిన 18 మంది ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డైరెక్టర్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధిలో ఉద్యోగుల సేవలను ఆయన కొనియాడారు.

చెత్త సేకరణకు రానివారిని తొలగించండి

వెంగళరావునగర్: చెత్త సేకరణ కోసం కేటాయించిన ఆటోవాలాలు ప్రతిరోజు తప్పనిసరిగా ఇళ్ళను సందర్శించాలని, లేని పక్షంలో అలాంటి వారిని అధికారులు గుర్తించి తొలగించాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి హెచ్చరించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆమె సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మహిళలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు చెత్త ఆటోలు రావడం లేదని, కొన్ని ఏరియాల్లో మూడు రోజుల పాటు సెలవులు పెడుతున్నారని మహిళలు ఆమెకు తెలిపారు. దీనిపై తీవ్రంగా స్పందించిన మేయర్ సంబంధిత అధికారులను పిలిపించి చెత్త సేకరణ సరిగ్గా చేయని ఆటోవాలలను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని అన్నారు.

సాక్షి మంగళవారం । 1 । జూలై । 2025

ఎల్లమ్మ కల్యాణ వేడుకలు ప్రారంభం



ఎదుర్కోళ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్త జనం

అమీర్‌పేట: భక్తుల కొంగు బంగారమైన బల్కంపేట రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, దేవతాహ్వానం, అంకురార్పణం, పుట్ట బంగారం, గంగ తెప్ప వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి వస్త్రాలంకరణ చేశారు. దేవాదాయ శాఖ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఒగ్గుకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం సంప్రదాయబద్ధంగా ఎదుర్కోళ్లు జరిగాయి. ఎస్‌ఆర్ నగర్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి స్వామి వారిని ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి మహేందర్‌గౌడ్, వేడుకల నోడల్ అధికారి ఎస్.అన్నపూర్ణ, సూపరింటెండెంట్ హైమావతి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ప్రధాన అర్చకులు అనిల్ పంతులు, కాంగ్రెస్ నేత కోట నీలిమ, పాలక మండలి సభ్యులు ఉమానాథ్‌గౌడ్, ఉమారాణి, భాస్కరం తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సభ ఏర్పాట్ల పరిశీలన



ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహేష్‌గౌడ్, మంత్రులు పొన్నం, శ్రీహరి

గన్‌ఫౌండ్రీ: జూలై 4వ తేదీన ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పరిశీలించారు. బహిరంగ సభకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ప్రవేశాలకు లక్కీ డ్రా నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి,సిటీబ్యూరో: విద్యను మించిన సంపద లేదని, విద్యార్థులు తమకు లభించిన అవకాశాన్ని వినియోగించుకొని రాణించాలని కలెక్టర్ హరిచందన పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద పాఠశాలలో ప్రవేశం కల్పించేందుకు విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికిగాను 3వ తరగతిలో 8 సీట్లు, 4వ తరగతిలో 7 సీట్లు, 5వ తరగతిలో 6 సీట్లు కోసం మొత్తం 21 విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్.కోటాజీ, ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌బీఐ ఆఫీసర్స్ సమావేశాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శామీర్‌పేటలో మూడు రోజులపాటు జరిగిన ఆల్–ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ 29వ వార్షిక జనరల్ కౌన్సిల్ సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. 17 సర్కిల్స్ నుంచి 700 మంది ప్రతినిధులు, రెండు వేలమంది ఉద్యోగులు పాల్గొన్న సమావేశాల్లో బ్యాంకింగ్ సంస్కరణలు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా 2025–2028 త్రైమాసిక కాలానికి సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అరుణ్ కుమార్ బిషోయ్, రూపమ్ రాయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భద్రత గాలికొదిలి.. రియాక్టర్లు పేలిపోయి..

పరిశ్రమల్లో మృత్యువాత పడుతున్న కార్మికులు

- ఫైర్ సేఫ్టీ పరికరాలు, అంబులెన్స్‌లు కరువు
- నిబంధనలు పట్టని యాజమాన్యాలు
- తనిఖీలు విస్మరించిన అధికారులు



జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ పేలిన దృశ్యం (ఫైల్)

జీడిమెట్ల: రియాక్టర్‌లో తీవ్ర ఒత్తిడి.. ఒత్తిడిని నిరోధించే సేఫ్టీ రిలీజ్ వాల్వ్ లేకపోవడం.. ట్యూబ్స్‌లో ఉప్పు పొరలు ఏర్పడటం.. కొత్త టెక్నాలజీ కలిగిన సేఫ్టీ పరికరాలు వాడకపోవడం.. వెరసి కార్మికుల భద్రత గాలిలో దీపంలా మారింది. ఇలాంటివి ఫార్మా, బల్క్‌డ్రగ్, రసాయన పరిశ్రమల్లో రియాక్టర్లు పేలడానికి ప్రధాన కారణాలవుతున్నాయని వివిధ పరిశ్రమల్లో పనిచేసే పెద్ద స్థాయి ఉద్యోగులు చెప్తున్నారు. రియాక్టర్లు పేలడంతో కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాశామైలారం పరిధిలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ పేలి 16 మంది దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

రియాక్టర్‌కు సేఫ్టీ రిలీజ్ వాల్వ్ అవసరం..

రియాక్టర్‌లను వాడే ప్రతి పరిశ్రమలో ఖచ్చితంగా రియాక్టర్‌కు ఎస్‌ఆర్‌వీ వాల్వ్ అమర్చాలి. దీంతో రియాక్టర్‌లో తీవ్ర ఒత్తిడి పెరిగినప్పుడు వాల్వ్ నుంచి ప్రెషర్ బయటకు వెలువడుతుంది. రియాక్టర్‌లో ఒత్తిడి ఎంత మేర ఉందో కూడా ఆ మీటర్‌లో చూపిస్తుంది. దీనిని బట్టి ముందు జాగ్రత్త తీసుకుని రియాక్టర్ పేలకుండా నిరోధించవచ్చు. రియాక్టర్‌లో ఉన్న రసాయనాలు ట్యూబుల్లో పేరుకుపోయిన ఉప్పుపొరలు ఏర్పడి రియాక్టర్లు పేలే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రొడక్ట్ తయారు చేసేకంటే ముందుగానే రసాయనాలతో రియాక్టర్లను శుభ్రం చేసుకోవాలి.

అధికారుల నిర్లక్ష్యం..

పరిశ్రమల్లో అధికారులు విరివిగా ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి పరిశ్రమను సందర్శించి మిషన్ల పనితీరుతోపాటు పరిశ్రమ యాజమాన్యం రియాక్టర్ల భద్రత కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందో పర్యవేక్షించాలి. కానీ, అధికారులు పరిశ్రమలను పర్యవేక్షించకుండానే కార్యాలయాల్లోని సీట్లకు పరిమితం అవుతున్నారు.

ఇరుకు గదుల్లో రియాక్టర్లు..

పరిశ్రమల నిబంధనల ప్రకారం రియాక్టర్‌లను విశాలమైన స్థలంలో అమర్చాలి. కానీ, కొన్ని పరిశ్రమల్లో రియాక్టర్లు ఇరుకు గదుల్లో అమర్చడం వల్ల ఒత్తిడికి రియాక్టర్‌లు పేలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.రియాక్టర్లు పేలే ప్రమాదాన్ని కార్మికులు పసిగట్టినా ఆ ప్రదేశం ఇరుకుగా ఉండటంతో తప్పించుకోలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

సేఫ్టీ టీంలు ఉండాలి..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం 150 మంది పైచిలుకు కార్మికులు ఉన్న పరిశ్రమల్లో ఖచ్చితంగా ఒక మేనేజర్‌తో కూడిన సేఫ్టీ టీంను ఏర్పాటు చేసుకోవాలి. కానీ, చాలా పరిశ్రమల్లో సేఫ్టీ టీంలు లేవు. టీంలు ప్రతిరోజు రియాక్టర్‌లు, యంత్రాల పనితీరును పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి రసాయనాలతో శుభ్రం చేయించాలి.

- రాజశేఖర్‌రెడ్డి, సేఫ్టీమేనేజర్, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్

అజాగ్రత్తగా రియాక్టర్లలో రసాయనాలు..



ఖచ్చితమైన టెంపరేచర్ వద్ద ఇచ్చిన చాట్ ప్రకారం రియాక్టర్లలో రసాయనాలు వేయాలి. కానీ, కొంతమంది కార్మికులు అనుభవం లేని కార్మికులు ఒకేసారి సాల్వెంట్, పౌడర్‌లను రియాక్టర్‌లలో వేస్తుంటారు. దీంతో తీవ్రమైన రసాయన చర్య జరిగి పెద్దఎత్తున పేలుడు సంభవించే ప్రమాదముంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఫ్లోరా పాలిమర్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్

అలారం అమర్చుకోవాలి..

పరిశ్రమల్లో ప్రమాదం పొంచి ఉన్నప్పుడు మోగేలా అలారం అమర్చుకోవాలి. అలారం మోగగానే ఫైర్‌సేఫ్టీ పరికరాలు వాటంతటవే పనిచేయడం ప్రారంభిస్తాయి. దీని వల్ల ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ప్రతి పరిశ్రమలో యాజమాన్యం ఖచ్చితమైన ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రథమ చికిత్స కిట్‌తోపాటు ఆక్సిజన్ ఉన్న వాహనాన్ని అందుబాటులో ఉంచాలి.

- బి.రామిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ ఏ.ఆర్.లైఫ్ సైన్సెస్

రేపట్నుంచి పెద్దమ్మ తల్లి శాకాంబరి ఉత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి శాకాంబరి ఉత్సవాలు జూలై 2 నుంచి 4వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిపేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించి శాకాంబరిదేవిగా భక్తులు పూజలు నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణాన్ని క్వింటాళ్ల కొద్ది కూరగాయలతో కనువిందుగా అలంకరించనున్నారు. కనువిందు చేసే ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలిరానునండటంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలై 2న తెల్లవారుజామున 3 గంటలకు పెద్దమ్మ తల్లి అభిషేకంతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి



ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కర్ణన్

లక్డీకాపూల్: జాప్యం లేకుండా సత్వరమే ప్రజావాణి విన్నపాలను పరిష్కరించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజలు సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, ఆస్తి పన్ను సంబంధిత ఫిర్యాదులు అధికంగా అందినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా మార్చడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాటాడుతూ ఆయా విభాగాల అధికారులు ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 71 విన్నపాలు వచ్చాయి. ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. ఇక ఆరు జోన్లలో మొత్తం 107 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా కూకట్‌పల్లి జోన్‌లో 49, అత్యల్పంగా ఖైరతాబాద్ జోన్‌లో ఒక అర్జీ అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు వేణుగోపాల్, సత్యనారాయణ, రఘుప్రసాద్, సీసీపీ శ్రీనివాస్, విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అడిషనల్ సీసీపీలు వెంకన్న, గంగాధర్, ప్రదీప్ రంజిత్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, రెవెన్యూ జేసీ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని పెంపొందించి పరిశోధనల వైపు మళ్లించేందుకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ కార్యక్రమం దోహదం చేస్తుందని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన కార్యాలయంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం అవార్డ్స్ పేరిట బాలశాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎక్కువమంది విద్యార్థులు ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిని ఆర్.రోహిణి మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల్లో విద్యను అభ్యసిస్తున్న 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు వారి ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా www.inspireawards&dst.gov.in సెప్టెంబర్ 15వ వరకు నమోదు చేసుకోవాలన్నారు ఎంపికైన విద్యార్థికి పది వేల రూపాయలు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ముకుందరెడ్డి, కదిరవన్ పలని తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో గణాంకాలకు ఎంతో ప్రాధాన్యం

రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ సంఘం చైర్మన్ కోదండరెడ్డి



రాయదుర్గం: చరిత్రలో గణాంకాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ సంఘం చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ లోని సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్(ఏఐఎంఎస్‌సీఎస్)లో సోమవారం జాతీయ గణాంకాల దినోత్సవం–2025, ప్రసిద్ధ భారత గణాంకవేత్త ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలానో బిస్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోదండరెడ్డి మాట్లాడుతూ గణాంకాల ఆధారంగా రూపొందించిన ప్రణాళికలు మాజీ ప్రధానులు పండిత్ నెహ్రూ కాలం నుంచి డాక్టర్ మన్మోహన్‌సింగ్ వరకు దేశాభివృద్ధికి ఎలా దోహదపడ్డాయో వివరించారు. డాక్టర్ సీఆర్ రావు వంటి గొప్ప గణాంకవేత్తల సలహాలు ప్రణాళికా సంఘాల ఏర్పాటుకు దారితీశాయన్నారు. ఇందిరాగాంధీ తెచ్చిన భూసంస్కరణలతో దేశం ఆహార సుస్థిరత సాధించి, బియ్యం ఎగుమతి చేసే స్థితికి చేరిందని పేర్కొన్నారు. గణాంకాల ద్వారా చేపట్టిన భూసంస్కరణల ప్రభావం వల్లే 2010–11 నాటికి చిన్న రైతుల సంఖ్య 51 శాతం నుంచి 67 శాతానికి పెరిగిందని చెప్పారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం. గోపాలకృష్ణ మాట్లాడుతూ భారతదేశం గణాంక శాస్త్ర అభివృద్ధిలో గ్లోబల్ లీడర్‌గా మారిందని చెప్పారు. గణాంకాల ఆధారంగా ప్రభుత్వం రూపొందించే ప్రణాళికల ద్వారా సంక్షేమం, వనరుల సమాన పంపిణీ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏఐఎంఎస్‌సీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ యుగంధర్, ప్రొఫెసర్ అప్పల నాయుడు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేసేవారి సేవలు చిరస్మరణీయం

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



రమేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉద్యోగులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేస్తే పదవీ విరమణ చేసినా, వారి సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. ఉద్యోగులకు బదిలీలు పదోన్నతులు, పదవీ విరమణ తప్పవని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు చెందిన ఐదుగురు అధికారుల పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పదవీ విరమణ చేస్తున్న వారు తమ శాఖల్లో చిరస్మరణీయ సేవలు అందించారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత కూడా సమాజసేవలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన సూపరిటెండెంట్ ఇంజనీర్ షఫీమియా, జిల్లా పౌరసరఫరాల అధికారి రమేష్, ఎస్‌డీసీసీ ఎల్లారెడ్డి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నీరజ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అనంతరెడ్డిలకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అడ్‌హక్ పదోన్నతి పొందిన అదనపు కలెక్టర్ పనిచేస్తున్న జి.ముకుందరెడ్డిని, బదిలీ అయిన ఎండీఎం సుబ్రహ్మణ్యంను కూడా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరివన్ పలని, ఇన్‌చార్జి డీఆర్‌ఓ శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ఆశన్న, గిరిజన సంక్షేమ అధికారి కోటాజి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రమేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఘనంగా వీడ్కోలు



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఆయన 2022 నుంచి ఈ పదవిలో ఉన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఎక్కువ కాలం పనిచేసిన జనరల్ మేనేజర్‌గా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలోని సమన్వయ హాల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జె.వినయన్, ఇతర సీనియర్ అధికారులు జనరల్ మేనేజర్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. ఆయన ప్రశాంతమైన ప్రవర్తన, అపారమైన జ్ఞానం, విధినిర్వహణ పట్ల నిబద్ధతను కొనియాడారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి వీలు కల్పించిందన్నారు. అంతకుముందు దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం ఆధ్వర్యంలో మౌలాలీలోని ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక ఉత్సవ వీడ్కోలు పరేడ్ నిర్వహించింది. కార్యక్రమంలో సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర సీనియర్ అధికారులు, ఆర్.పి.ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎస్‌ఎన్‌టీ చైర్మన్‌గా సూర్యప్రకాష్ నియామకం

నాంపల్లి: ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్షన్ టెస్టింగ్ (ఐఎస్‌ఎన్‌టీ) హైదరాబాద్ చాప్టర్–2025–26వ సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. ఐఎస్‌ఎన్‌టీ చాప్టర్‌కు ప్రైవేట్ ఇండస్ట్రీ నుంచి రెండో చైర్మన్‌గా నగరానికి చెందిన పారిశ్రామికవేత్త సూర్యప్రకాష్ గజ్జెల ఎన్నికయ్యారు. ఆర్కిమెడీస్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఈయన సీఈఓగా ఉన్నారు. ఈ సంస్థ దేశంలోని మొట్టమొదటి రూఫ్‌టాఫ్ విండ్మిల్(గాలిమర)ను రూపొందించింది. గతంలో ఎంఎస్ఎంఈ నేషనల్ అవార్డును కేంద్రం మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వ శాఖ నుంచి అందుకున్నారు. ఎన్నికైన ఇతర నూతన కార్యవర్గసభ్యుల్లో సలహాదారు మోహన్ (చైర్మన్ మెట్సానిక్ ఇంజినీర్స్), ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.వి.శివారావు(డీఆర్‌డీఎల్), డాక్టర్ శ్రీనివాస్(ఏఎస్ఎల్), ఎం.ఎన్.వి.విశ్వనాథ్ (ఎన్ఎఫ్‌సీ రిటైర్డ్), రవి(మిధాని), కార్యదర్శి డాక్టర్ ఎం.ఫణి సూర్యకిరణ్(డీఎంఆర్ఎల్), అతుల్ ఖన్నా (ఎండీ హోరిజాన్) ఎన్నికైన వారిలో ఉన్నారు. కార్యవర్గం సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జైతీర్థ రాఘవేంద్ర జోషి, మిధాని చైర్మన్ డాక్టర్ నారాయణ మూర్తి హాజరయ్యారు.

బీసీల ద్రోహి బీజేపీ

రాష్ట్ర అధ్యక్ష పదవిని ఓసీకి కేటాయించడంపై బీసీ సంఘాల ధ్వజం



సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ బీసీల ద్రోహి అని బీసీ సంఘాలు ధ్వజమెత్తాయి. సోమవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజ్‌గౌడ్, గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీసీలను బీజేపీ అవమానించి ఓసీ నేతకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత కట్టబెట్టిందని అన్నారు. బీసీల పట్ల బీజేపీ చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తే సహించబోమని వారు హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో బీసీ అయిన బండి సంజయ్‌ని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్‌రెడ్డికి అప్పగించారని ఆరోపించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్‌ను ఈసారి అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. బీసీలకు ద్రోహం చేసిన బీజేపీకి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు శేఖర్, నాగేశ్వర్‌గౌడ్, బడేసాబ్, బాలగౌని వెంకటేష్ గౌడ్, పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి చేయూతనివ్వండి

మంత్రి వాకిటికి మత్స్య కార్మిక సంఘం వినతి



మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మత్స్యకారులు, కార్మిక సంఘం ప్రతినిధులు

లక్డీకాపూల్: రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి చేయూతనందించాలనితెలంగాణ మత్స్యకారులు, కార్మిక సంఘం పశు సంవర్ధక, మత్స్యశాఖల మంత్రి వాకిటి శ్రీహరికి విన్నవించాయి. సోమవారం ఈ మేరకు సంఘం అధ్యక్షులు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఎనిమిది డిమాండ్లతో కూడి విజ్ఞాపన పత్రాన్ని మంత్రికి సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మత్స్యకారులు, మత్స్య కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ సాధించుకుని 11 ఏళ్లు పూర్తవుతున్నా తమ జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కనీసం ప్రతిపాదనలు లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు నిర్దుష్టమైన ప్రణాళికలను రూపొందించాలని మంత్రికి విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు కొప్పు పద్మ, చనమోని శంకర్, గండ్ల అమరావతి, బక్కి బాలమణి తదితరులు ఉన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

యాదవుల సత్యాగ్రహ దీక్షలో రాజారామ్ యాదవ్ డిమాండ్



యాదవుల సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న రాజారామ్ యాదవ్

కవాడిగూడ: రాష్ట్రంలో 40 లక్షల మంది జనాభా ఉన్న యాదవులకు మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ జనసభ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.రాజారామ్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో యాదవులు సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్‌పై యాదవ సమాజం తిరగబడుతుందని హెచ్చరించారు. జూలై రెండోవారంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ఎండగడతామన్నారు. యాదవ కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్లు కేటాయించి, వారి అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలని, రెండో దశ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలు విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలనలేదని, రేవంత్ రెడ్డి కులపాలన సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కులవృత్తులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, షీప్, గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, చింతల రవీందర్ యాదవ్, రమేష్ యాదవ్, మేకల రాజేందర్ యాదవ్, అయిలిబోయిన రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలా నిధుల గోల్‌మాల్‌పై నజర్ ఇలా..

- ఇంటెలిజెన్స్ అధికారుల నివేదికతో చర్యలకు సిద్ధం
- టీజీఐఐసీ తాత్సారంపై పారిశ్రామికవేత్తల ఆగ్రహం

కుషాయిగూడ: ఐలాలో నిధుల గోల్‌మాల్ అంటూ ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు ఐలా కార్యాలయాన్ని సందర్శించారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో చేపట్టిన సంపు నిర్మాణానికి సంబంధించి టెండర్ డాక్యుమెంట్లు, ఇతర సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. రూ.25 లక్షల సంపు నిర్మాణ వ్యయాన్ని ఏకంగా రూ.75 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అయితే ఐలా కమిషనర్ నిర్ణయాన్ని పలు పరిశ్రమల యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. నింబంధనలకు విరుద్ధంగా ఐలా కమిషనర్ రూ.50 లక్షలను జోనల్ కార్యాలయానికి బదిలీ చేసినా చర్యలు తీసుకోకుండా టీజీఐఐసీ అధికారులు తాత్సారం చేస్తున్నారని పలువురు మండి పడుతున్నారు. కమిషనర్ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారుల ప్రమేయం లేదంటే కాంట్రాక్టును రద్దు చేసి నిధులు తిరిగి ఐలా అకౌంట్‌లో ఎందుకు జమ చేయడం లేదని నిలదీస్తున్నారు. పారిశ్రామికవాడలో అంతర్గత రోడ్ల, పారిశుద్ధ్య, వీధి దీపాల నిర్వహణకుగాను వెచ్చించాల్సిన నిధులను దుర్వినియోగ పరచడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట



గన్‌ఫౌండ్రీ : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతీయ లోక్ కళామండల్ సంయుక్తంగా రెడ్డి కళాశాలలో తోలుబొమ్మలాట ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులకు తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు డాక్టర్ లాయక్ హుస్సేన్ రచించి దర్శకత్వం వహించిన రామాయణ ఇతివృత్తంతో ప్రదర్శించిన పప్పెట్ షో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అచ్యుత దేవి, సాంస్కృతిక కమిటీ సభ్యులు ప్రవళిక, హరిత పాల్గొన్నారు.



కేఎల్‌హెచ్‌కు మద్రాస్ ఐఐటీ పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కేఎల్‌హెచ్ వర్సిటీ 2 ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకుంది. వర్సిటీ ప్రతినిధులు ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. ఐఐటీ మద్రాస్ ఆవరణలో జరిగిన పీఏఎల్ వార్షిక దినోత్సవ వేడుకలో కేఎల్‌హెచ్ అజీజ్ నగర్ క్యాంపస్‌కు ‘అవుట్ స్టాండింగ్ పార్టనర్ ఇన్‌స్టిట్యూట్ అవార్డ్’, ‘బెస్ట్ హోస్టింగ్ ఇన్‌స్టిట్యూట్ అవార్డ్ ఫర్ ఇన్నోవా ప్రీఫైనల్స్’ అవార్డులను అందుకుందని, వీటిని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ కేఎల్‌హెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణకు ప్రదానం చేశారని వివరించారు.



యాప్.. ఆరోగ్యం సేఫ్..

ఆన్‌లైన్ వేదికగా ఆరోగ్య సాధనాలు

- హెల్దీ లైఫ్ కోసం వందల కొద్దీ యాప్స్
- ప్రెగ్నెంట్స్ మొదలు కార్డియాక్ కేర్ వరకు
- అరచేతిలో సూచనలు.. అవసరమైతేనే డాక్టర్ వద్దకు
- వాడే యాప్ విశ్వసనీయత, డేటా ప్రైవసీ తప్పనిసరి
- అంతిమ నిర్ణయం ఎప్పుడూ వైద్యునిదే..



కాలం మారుతున్న కొద్దీ మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి ఇవన్నీ వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఇదే సమయంలో సాంకేతిక పరిజ్ఞానం కూడా వేగంగా అభివృద్ధి చెందుతూ, అనేక రంగాల్లో మార్పులకు దారితీస్తోంది. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో టెక్నాలజీ తెచ్చిన విప్లవాత్మక మార్పులు ఎంతో ఆశాజనకంగా మారాయి. ఒకప్పుడు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ అవసరం తగ్గిపోయింది. కేవలం స్మార్ట్‌ఫోన్ ఉంటే సరిపోతుంది. ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో అంశాలను మనం ట్రాక్ చేయగలుగుతున్నాం. దీని వల్ల ఆరోగ్యంపై అవగాహన పెరగడమే కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఏర్పడుతోంది. - సాక్షి, సిటీబ్యూరో

సాంకేతికత మన ఆరోగ్య సంరక్షణ విధానాన్ని పూర్తిగా మార్చేస్తోంది. అప్రమత్తతతో సరైన యాప్‌లను ఎంచుకొని ఉపయోగించుకుంటే, రోజువారీ జీవనశైలిలో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడం చాలా సులభం. టెక్నాలజీ ఆధారంగా ఆరోగ్య సంరక్షణ ఇప్పుడు ఒక శక్తివంతమైన సమాచారంగా మారుతోంది. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణకు మార్కెట్‌లో అనేక అనుసంధానిత యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవి వివిధ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి.

- **హార్ట్ రేట్ మానిటర్, ఈసీజీ యాప్‌లు :** హార్ట్ బీట్స్‌ను ట్రాక్ చేయడం, ఏవైనా అసాధారణ పరిస్థితులు ఉన్నాయా అనే విషయం తెలుసుకోవడం ఈ యాప్‌ల ద్వారా సాధ్యమవుతుంది. ఉదాహరణకు కార్డియా మొబైల్, వెల్టాయ్ వంటి యాప్‌లు ఇంటి వద్ద నుంచే గుండె పనితీరును గమనించేందుకు తోడ్పడుతున్నాయి.
- **స్కిన్ కేర్ అనలైజర్ యాప్స్ :** నిద్రలేమి, కాలుష్య వాతావరణ ప్రభావం వంటి వాటి వల్ల ఏర్పడే చర్మ సమస్యలను అంచనా వేసి, తగిన చిట్కాలు అందించే యాప్‌లు మనకు అందుబాటులో ఉన్నాయి. స్కిన్ విజన్, ట్రోవ్ స్కిన్ వంటి యాప్‌లు అందులో ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి.
- **ఉమెన్ హెల్త్, ప్రెగ్నెన్సీ ట్రాకర్స్ :** గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించి ప్రతి దశనూ గమనిస్తూ, తగిన ఆహారం, వ్యాయామ సూచనలు, నిద్ర పద్ధతులు వంటి విషయాల్లో దారి చూపించే యాప్‌లు ఇప్పుడు చాలా ప్రాచుర్యంలో ఉన్నాయి. బేబీ సెంటర్, ఫ్లో, ఒవియా ప్రెగ్నెన్సీ వంటి యాప్‌లు మహిళల ఆరోగ్య సహచరులుగా మారాయి.
- **మెంటల్ వెల్నెస్ యాప్స్:** మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యానికంతే ముఖ్యం. ఈ అవసరాన్ని గుర్తించి కామ్, హెడ్ స్పేస్, మైండ్ హౌస్ వంటి యాప్‌లు ధ్యానం, బ్రీథింగ్ టెక్నిక్‌లు, అనువైన నిద్ర కోసం ఉపాయాలను అందిస్తున్నాయి.
- **డైట్ - ఫిట్నెస్ ట్రాకర్స్ :** ఆరోగ్యకరమైన జీవనశైలికి సరైన ఆహారం, శారీరక చురుకుదనం అవసరం. మై ఫిట్నెస్ పాల్, హెల్తిఫై మీ, ఫిట్బర్ వంటి యాప్‌లు రోజువారీ కేలరీలు, వ్యాయామం, నీటి మోతాదు మొదలైన వాటిని ట్రాక్ చేస్తాయి.



ఇలాంటి యాప్స్ వల్ల ఉపయోగాలు..

- **సులభతరం :** యాప్‌ల ద్వారా వైద్యుడు వద్దకు వెళ్లకుండా ప్రాథమిక ఆరోగ్య సమస్యలను గుర్తించవచ్చు.
- **సకాలంలో హెచ్చరికలు:** కొన్ని యాప్‌లు ఆరోగ్య సూచీలను విశ్లేషించి ప్రమాద సూచనలుగా అలర్ట్ చేస్తాయి.
- **వ్యక్తిగత సమాచారం ఆధారంగా :** ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని అనుసంధానం చేసుకుని యాప్‌లు ప్రత్యేకమైన మార్గదర్శకతను ఇస్తాయి.
- **అనుసంధానం:** ఫిట్‌నెస్ బ్యాండ్లు, స్మార్ట్‌వాచ్‌లు, డిజిటల్ బీపీ మానిటర్లు వంటి పరికరాలను యాప్‌తో అనుసంధానించి మరింత ఖచ్చితంగా డేటా పొందవచ్చు.
- **ఆరోగ్యపరమైన అలవాట్లకు :** నిద్ర సమయం గుర్తుచేయడం, నీరు తాగమని రిమైండర్ చేయడం లాంటి చిన్న విషయాలు ఆరోగ్యానికి బాగా సహాయపడతాయి.









జాగ్రత్తలు కూడా అవసరమే..

ఆరోగ్య యాప్‌ల వినియోగిస్తున్నప్పుడు కొన్ని విషయాలను గమనించాలి. ముందుగా, వాడే యాప్ విశ్వసనీయమైనదేనా? డేటా ప్రైవసీ ఎలా ఉంది? యాప్ ఇచ్చే సమాచారం వైద్యుని సలహాకు ప్రత్యామ్నాయంగా కాకుండా, తోడ్పాటు సాధనంగా ఉపయోగపడేలా ఉండాలి. ‘ఆరోగ్య సమస్యల విషయంలో తుది నిర్ణయం ఎప్పుడూ వైద్యునిదే కావాలి’.





6 నుంచి లైఫ్ స్టైల్ ప్రదర్శన



బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మక హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 6వ తేదీ నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్‌లోని రోడ్ నెం 10లో సోమవారం జరిగింది. ‘లైఫ్ స్టైల్’ పేరుతో నిర్వహించే ఈ ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిస్ టీన్ చార్మ్ ఇండియా–2024 బిపాషా గ్రోవర్‌తో పాటు పలువురు మోడల్స్ పాల్గొన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న వజ్రాభరణాలు, దుస్తులు ధరించి ర్యాంప్ వాక్ నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోనే ప్రసిద్ధిచెందిన డిజైనర్లు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నావనెక్కి.. నేవీకి చేరి..

నేవీ యూత్ స్పోర్ట్స్ కంపెనీకి ముగ్గురు హైదరాబాద్ యువ సెయిలర్లు

- తెలుగు యువకులు నవీన్, సాత్విక్ ధోకి, రిజ్వాన్ మహమ్మద్‌కు అవకాశం
- పేదరికం, కష్టాల నుంచి స్ఫూర్తిదాయక ప్రయాణం
- వీరి ప్రస్థానంలో హైదరాబాద్ యాచ్ క్లబ్ కీలక పాత్ర



సాక్షి, సిటీబ్యూరో: చిన్ననాటి విషాదాలను, పేదరికాన్ని జయించి సెయిలింగ్‌లో అద్భుత ప్రతిభను కనబరిచిన ముగ్గురు తెలుగు యువకులు భారత నౌకాదళంలోని స్పోర్ట్స్ కంపెనీలో చేరనున్నారు. ఈ ముగ్గురు నవీన్, సాత్విక్ ధోకి, రిజ్వాన్ మహమ్మద్.. వారి జీవితం ఎలా ఉన్నా అద్భుతమైన సెయిలింగ్ ప్రతిభతో భవిష్యత్ ప్రయాణాన్ని సుగమం చేసుకున్నారు. ఈ యువ హైదరాబాదీ సెయిలర్లు గోవాలోని నేవీ యూత్ స్పోర్ట్స్ కంపెనీ (ఎంవైఎస్సీ)కి ఎంపికయ్యారు.

తార హోమ్ నుంచి యువ తారగా..

ప్రకాశం జిల్లాలోని లక్ష్మప్ప గ్రామానికి చెందినవాడు 13 సంవత్సరాల నవీన్. ఆరేళ్ల వయసులో తల్లిదండ్రులను కోల్పోయి, తప్పిపోయి నగరంలోని సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు దొరికాడు. అక్కడి నుంచి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా తార హోమ్ అనే అనాథ శరణాలయానికి చేరుకున్నాడు. ఇలాంటి దయనీయమైన గతం నుంచి ఈ తరం యువతకు స్ఫూర్తి నింపేలా తను భవిష్యత్తును రూపుదిద్దుకున్నాడు.

జాతీయ స్థాయి మేటి సెయిలర్‌గా..

15 ఏళ్ల రిజ్వాన్ మహమ్మద్ ప్రస్తుతం దేశంలోనే నెం.1 సెయిలర్‌గా ఉన్నాడు. హైదరాబాద్‌లోని పాట్టిగడ్డ ప్రాంతంలో ఒక చిన్న గుడిసెలో నివసించే రిజ్వాన్ ఏడేళ్ల వయసులో తండ్రిని కోల్పోయాడు. అతని తల్లి యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌లో వంట మనిషిగా పనిచేస్తుంది. కాసింత ప్రోత్సాహం అందితే చాలు అనుకునే పరిస్థితి నుంచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ సెయిలర్‌గా మారడంలో తన కృషి, నిబద్ధత, అంకితభావం ఎలాంటిదో ఊహించవచ్చు.



కూలీ కుటుంబం..


వరంగల్ జిల్లాలోని ఎర్రవల్లి గ్రామం నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందినవాడు 14 సంవత్సరాల సాత్విక్. అతని తండ్రి హైదరాబాద్ మోండా మార్కెట్‌లో కూలీగా, తల్లి ఓ ఇంటి పనిమనిషిగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇలాంటి కుటుంబం నుంచి వచ్చిన సాత్విక్ భారత నౌకాదళంలో చేరనుండటం తనకే కాదు తన కుటుంబానికి సైతం గర్వకారణం.

నేనున్నానని..

ఈ ముగ్గురు యువకుల ప్రస్థానంలో యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్) కీలక పాత్ర పోషించింది. ఆరేళ్ల నవీన్ తప్పిపోయి అనాథ శరణాలయం ‘తార హోమ్’కు చేరుకున్న సమయంలో.. వైసీహెచ్ అతన్ని గుర్తించి సెయిలింగ్ శిక్షణ కోసం ఎంపిక చేసింది. నవీన్ లాగే, పేద కుటుంబాల నుంచి వచ్చిన సాత్విక్, రిజ్వాన్ కూడా వైసీహెచ్ మార్గ దర్శకత్వంలోనే శిక్షణ పొందారు. కోచ్ సుహీమ్ షేక్ పర్యవేక్షణలో ఈ యువకులు సెయిలింగ్‌లో కఠోర శిక్షణ తీసుకున్నారు. అంకితభావం, పట్టుదల జాతీయ స్థాయి పోటీల్లో ఉన్నత స్థానాలకు చేర్చాయి. రిజ్వాన్ మహమ్మద్ అయితే స్థిరంగా పతకాలను సాధిస్తూ, అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. ఈ యువకుల అసాధారణ ప్రతిభ, క్రీడా స్ఫూర్తిని గుర్తించిన నేవీ యూత్ స్పోర్ట్స్ కంపెనీ, వారిని తమ జట్టులోకి తీసుకుంది.

26న మాన్సూన్ డ్రీమ్స్..

ప్రముఖ నర్తకి తనుశ్రీ శంకర్ నాట్య బృందం ఆధ్వర్యంలో ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన చౌరంగి కళా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నగరంలోని తారామతి బరాదారిలో ‘మాన్సూన్ డ్రీమ్స్’ నృత్య ప్రదర్శన జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ నర్తకి తనుశ్రీ శంకర్ నాట్య బృందం ఆధ్వర్యంలో సాగే నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలువనుంది. జులై 26వ తేదీన ఈ కార్యక్రమం ఉంటుందని, ఇది భారతీయ శాస్త్రీయ నృత్య శైలిని ఆధునిక పద్ధతులతో మిళితం చేసిన వినూత్న కళా ప్రదర్శనగా ఆకట్టుకుంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

3 నుంచి ప్యారడైజ్ కబాబ్ ఫెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఉండే జాతీయ రహదారి పొడవునా ఉన్న పది ప్రధాన పట్టణాల్లో ది కబాబ్స్ ఆఫ్ ఇండియా ఫెస్టివల్‌ను ప్రారంభించనున్నట్లు ప్యారడైజ్ హోటల్స్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రబిందర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జులై 11 కబాబ్స్ డే సందర్భంగా ఈ నెలంతా భిన్నమైన కబాబ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. జమ్మూ కశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో వెజ్, నాన్ వెజ్ వంటకాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు గుర్తించండి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాటి నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి వీలైనంత తొందరగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై సోమవారం ఆయన సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. జీహెచ్‌ఎంసీతోపాటు వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ కార్పొరేషన్లలో కూడా వేగంగా స్థలాలను గుర్తించాలన్నారు.

అంగన్వాడీలకు అదనపు నిధులు మంజూరు చేయండి

కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క వినతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్వాడీలకు కేంద్రం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో ఆమె భేటీ అయ్యారు. మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి వెళ్తున్న క్రమంలో ఆమె కొద్దిసేపు శంషాబాద్‌లో ఉన్నారు. ఈ సమయంలో ఆమెతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 10,950, రూ.6,450 చెల్లిస్తుండగా కేంద్రం తన వాటాగా నామమాత్రంగా కేవలం రూ. 2,700, రూ.1,350 మాత్రమే చెల్లిస్తోందన్నారు. ఈ వినతులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్‌లో ఒక జాతీయ సదస్సు నిర్వహిస్తామని, నిధుల కేటాయింపులపైనా చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

14,084 మంది హెచ్‌ఐవీ బాధితులకు చేయూత

పింఛన్ మంజూరు ఫైలుపై మంత్రి సీతక్క సంతకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 14,084 మంది హెచ్‌ఐవీ బాధితులకు చేయూత అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి సామాజిక పింఛన్ అందించేందుకు ప్రతిపాదించిన ఫైలుపై మంత్రి సీతక్క సోమవారం సంతకం చేశారు. దీంతో హెచ్‌ఐవీ బాధితులకు జూలై నెల నుంచి పింఛన్లు అందనున్నాయి. ఇప్పటికే హెచ్‌ఐవీ బాధితులు 34,421 మందికి నెలకు రూ.2,016 చొప్పున పెన్షన్ అందుతోంది. తాజాగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా నమోదు అయిన 14,084 మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

పోలీస్ శాఖలో ఆయన ట్రబుల్ షూటర్

ఐజీపీ సత్యనారాయణ వీడ్కోలు సభలో డీజీపీ ప్రశంసలు



ఐజీ సత్యనారాయణను సన్మానిస్తున్న డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణ పొందిన మల్టీ జోన్–2 ఐజీపీ వి.సత్యనారాయణ పోలీస్ శాఖలో ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందారని డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రశంసించారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సత్యనారాయణ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సత్యనారాయణ ఎస్సై నుంచి మొదలుకొని డీఎస్పీగా ఎంపికై ఐజీపీగా ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిపారు. శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఒక్క ఉద్యోగికి ఏదో ఒకరోజు వస్తుందని విధి నిర్వహణలో ఉన్నన్ని రోజులు సత్యనారాయణ సమర్థంగా పనిచేశారని అభినందించారు.

బుద్ధవనం ప్రత్యేకాధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్య



నాగార్జునసాగర్: బుద్ధవనం ప్రత్యేకాధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్యను తిరిగి నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు (టీజీటీడీసీ) తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు సోమవారం ఉత్తర్వులు పంపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. మల్లేపల్లి లక్ష్మయ్య గతంలో 2016 నుంచి 2024 వరకు బుద్ధవనం ప్రత్యేకాధికారిగా ఉండి బుద్ధవనం ప్రాజెక్టును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

ఓటుకు పౌరసత్వంతో లింకు!

- ఓటర్లు తమతోపాటు తల్లిదండ్రుల పుట్టిన తేదీ, పుట్టిన ప్రాంతం రుజువు చేయాల్సిందే
- 1987 జూలై 1కి ముందు పుట్టినవారు తమ పుట్టిన తేదీ/ప్రాంతాన్ని రుజువు చేస్తే సరిపోతుంది
- 1987 జూలై 1 తర్వాత పుట్టిన వారు తమతోపాటు తల్లిదండ్రుల పుట్టిన తేదీ/ప్రాంతాన్ని రుజువు చేయాలి
- ఇందుకోసం ఈసీ నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి
- బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను చేపట్టిన ఈసీ
- 2003 ఓటర్ల జాబితాలో పేరుంటే మాత్రం పత్రాల సమర్పణ నుంచి మినహాయింపు
- త్వరలో దీనిని దేశ వ్యాప్తంగా అమలు చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఓటరు జాబితాలో పేరు ఉండాలంటే భారత దేశ పౌరులేనని రుజువు చేసుకోవాలి. ఇందుకోసం ఓటర్ల జాబితాలో పేరు కలిగిన ఓటర్లందరూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక ధ్రువీకరణ పత్రాన్ని రుజువుగా సమర్పించాలి. త్వరలో శాసనసభ సాధారణ ఎన్నికలకు వెళ్లనున్న బిహార్‌లో సరిగ్గా ఇలాంటి నిబంధనలతోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ఈ నెల 24న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఈసీఐ ప్రకటించింది. వాస్తవానికి ఏటా నిర్వహించే వార్షిక ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్)–2025 కార్యక్రమంలో భాగంగా గత జనవరి 7న బిహార్ రాష్ట్ర తుది ఓటర్ల జాబితాను ఈసీ ప్రకటించింది. తాజాగా ప్రకటించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఇప్పటికే ప్రకటించిన తుది ఓటర్ల జాబితా – 2025లో పేరున్న ఓటర్లందరినీ వారి పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు నిర్దేశిత ధ్రువీకరణ పత్రాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ప్రయోగాత్మకంగా బిహార్‌లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఈసీ భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలున్నాయి. వార్షిక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్)–2026లో భాగంగా 2026 జనవరి 1 అర్హత తేదీగా త్వరలో మన రాష్ట్రంలో సైతం కొత్త ఓటర్ల జాబితా తయారీ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించనుంది. బిహార్ తరహాలోనే ఇక్కడ సైతం ఈ నిబంధనలను అమలు చేసే అవకావముంది.

రాజ్యాంగబద్ధంగానే ఇంటెన్సివ్ రివిజన్

బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఎన్నికల సంఘం స్పందించింది. భారత రాజ్యాంగంలోని 326వ ఆర్టికల్ ప్రకారం భారత పౌరుడై ఉండి కనీసం 18 ఏళ్ల వయస్సు కలిగిన వారినే ఓటరుగా నమోదు చేయాల్సి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 21(2)(ఏ) ప్రకారం ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుందని తమ నిర్ణయాన్ని సమర్థించుకుంది.

2003 ఓటర్ల జాబితా ఆధారంగా...

బిహార్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా–2003లో పేరు కలిగిన 4.96 కోట్ల మంది ఓటర్లతోపాటు పిల్లలు మాత్రం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి అవసరం లేదని సోమవారం ఈసీ ప్రకటించింది. బిహార్‌కి సంబంధించిన ఓటర్ల జాబితా–2003 అందుబాటులో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. బిహార్‌లో ప్రస్తుతం 7.8 కోట్ల ఓటర్లుండగా, 2003 జాబితాలో పేరున్న ఓటర్లతోపాటు వారి పిల్లలకు పౌరసత్వ ధ్రువీకరణ నుంచి మినహాయింపు కల్పించింది. ఎస్ఐఆర్‌లో భాగంగా సమర్పించే దరఖాస్తులో, 2003 జాబితాలో తమ పేరు లేదా తమ తల్లిదండ్రుల పేరున్నట్టు ఆధారాలతో సహా నమోదు చేసి సమర్పించాలని ఓటర్లను కోరింది. 2003 జాబితాలో తమ పేరు కానీ తమ తల్లిదండ్రుల పేర్లు లేని ఓటర్లు మాత్రం ఈసీ నిర్దేశించిన 11 పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పించాలి.

పుట్టిన తేదీ/ప్రాంతం రుజువు కావాలి

- పుట్టిన తేదీ ఆధారంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో పౌరసత్వ రుజువు కోసం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. దీనికోసం ఓటర్లను మూడు కేటగిరీలుగా విభజించి దరఖాస్తులను ఈసీ స్వీకరిస్తోంది.
- 1987 జూలై 1కి ముందు భారతదేశంలో పుట్టిన ఓటర్లు తమ పుట్టిన తేదీతోపాటు పుట్టిన ప్రాంతాన్ని రుజువు చేసేందుకు పత్రం ఇస్తే సరిపోనుంది.
- 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య పుట్టిన ఓటర్లు తమతోపాటు తమ తల్లి లేదా తండ్రికి సంబంధించిన పుట్టిన తేదీ, పుట్టిన ప్రాంతాన్ని రుజువు చేసేందుకు ఇదే తరహాలో వారికి సంబంధించిన పత్రాలను సమర్పించాలి.
- 2004 డిసెంబర్ 2 తర్వాత పుట్టిన ఓటర్లు తమతోపాటు తమ తల్లిండ్రులిద్దరికి సంబంధించిన పుట్టిన తేదీ, పుట్టిన ప్రాంతాన్ని ధ్రువీకరించే పత్రాలను సమర్పించాలి. ఈసీ నిర్దేశించిన 11 రకాల పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పిస్తేనే పుట్టిన తేదీ/పుట్టిన ప్రాంతం రుజువుగా పరిగణిస్తారు. విదేశాల్లో పుట్టిన పౌరులైతే సంబంధిత దేశంలోని భారత దౌత్య కార్యాలయం జారీ చేసిన బర్త్ రిజిస్ట్రేషన్‌ను సమర్పించాలి. ఒకవేళ భారత పౌరసత్వం స్వీకరించి ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు దాఖలు చేయాలి. ఇక ఇతర ఏ దేశ పౌరసత్వం స్వీకరించలేదని స్వీయ ధ్రువీకరణ సైతం ఇవ్వాల్సి ఉంటుంది.

ఈసీ నిర్దేశించిన 11 రకాల పత్రాలు ఇవే

- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్ లేదా గుర్తింపు కార్డు
- 1987 జూలై 1కి ముందు ప్రభుత్వం/స్థానిక సంస్థ/బ్యాంకు/పోస్టు ఆఫీసు/ఎల్ఐసీ/ప్రభుత్వ రంగ సంస్థ జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డు/ధ్రువీకరణ పత్రం/డాక్యుమెంట్
- జనన ధ్రువీకరణ పత్రం
- పాస్‌పోర్టు
- గుర్తింపు పొందిన బోర్డులు/వర్సిటీలు జారీ చేసిన పదోతరగతి/విద్యార్హత పత్రాలు
- రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్మనెంట్ రెసిడెన్సీ సర్టిఫికెట్
- ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ లేదా కుల ధ్రువీకరణ పత్రం
- నేషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ సెన్సెక్స్
- రాష్ట్ర ప్రభుత్వం/స్థానిక సంస్థలు రూపొందించిన ఫ్యామిలీ రిజిస్టర్
- ప్రభుత్వం భూమి/ఇళ్ల కేటాయిస్తూ జారీ చేసిన పత్రం

తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనాల్లో కోత

- 10–15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం ఆదేశం
- రవాణా, దేవాదాయ, ఐటీ సహా వివిధ శాఖల్లో ట్రాన్స్‌జెండర్ల సేవలు
- దివ్యాంగులకు మరింత అండగా ప్రభుత్వం
- సంక్షేమ శాఖల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొన్నం, సీతక్క, లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలు చేస్తున్న పలువురు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, అటువంటి వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరముందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రులకు ఖాతాలకు 10–15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. అస్సాంలో ఇప్పటికే అటువంటి పథకం అమలవుతోందని.. ఇతర రాష్ట్రాల్లో ఇంకా అటువంటివి ఏవైనా ఉంటే పరిశీలించి ఒక నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై తన నివాసంలో సీఎం సోమవారం సమీక్షించారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని, వారి సేవలను రవాణా, దేవాదాయ శాఖ, వైద్యారోగ్య శాఖలతో పాటు ఐటీ, ఇతర కంపెనీలు వినియోగించుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు.

దేశానికి రోల్ మోడల్‌గా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలి

తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఐదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సీఎం సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలని, ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నారని, పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టి సారించాలని సీఎం తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలన్నారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

తెలంగాణ రైజింగ్‌లో....

తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధివిధానాలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. దివ్యాంగుల మధ్య వివాహాలు, వివిధ పథకాల్లో దివ్యాంగులకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై అధ్యయనం చేసి వచ్చే కేబినెట్ సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు సీతక్క, లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




బోనం ఎత్తుకున్న గవర్నర్, ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.

ఢిల్లీలో ఘనంగా బోనాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి 11వ బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ వేడుకలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో జిష్ణుదేవ్ వర్మకు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ బంగారు బోనం తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను దేశ రాజధానిలో చాటుతూ.. సమాజానికి శక్తినిచ్చేలా బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని గవర్నర్ చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు మహంకాళి అమ్మవారి గద్దెల ఊరేగింపు, ఘట స్థాపన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, గవర్నర్‌ను ఆహ్వానించేందుకు వచ్చిన తమను భద్రత పేరుతో తోసేయడం పద్ధతేనా అంటూ ఆలయ కమిటీ చైర్మన్ మారుతీ యాదవ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీతో జిష్ణుదేవ్ వర్మ భేటీ

ఢిల్లీ పర్యటనలో ఉన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసంలో ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు అరగంటపాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించి పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించినట్లు గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండాలి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- ఉపసంఘంతో కలసి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు

సాక్షి , హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నేపథ్యంలో సామాన్యులకు సిమెంటు, స్టీల్, ఇటుకలు, ఇసుక అందుబాటులో ఉండేందుకు మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు సమావేశమై ధరలను నిర్ణయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ సమావేశం జరిగింది. ఇందులో కేబినెట్ సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిపై శాఖల వారీగా మొదట మంత్రుల బృందం సమీక్షించింది. సామాన్యులకు రాష్ట్రవ్యాప్తంగా ఇసుకను అందుబాటులో ఉంచాలన్న గత సమావేశం నిర్ణయం మేరకు రాష్ట్రంలో 20 కేంద్రాల్లో ఇసుక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. కాగా మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో కూడా త్వరితగతిన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులకు సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలు నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. కాగా, హైదరాబాద్‌లోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు తరలించే అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం అధికారులతో సమీక్షించింది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్యపన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థిని ఆత్మహత్య

- బాలిక మృతికి ప్రిన్సిపాల్, టీచర్లే కారణమంటూ తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన



శ్రీవాణి(ఫైల్)

పరకాల: ఓ పదో తరగతి విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా పరకాల మండలం మల్లక్కపేట శివారులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం జరిగింది. పరకాలకు చెందిన ఏకు ఈశ్వర్–నీల కుమార్తె శ్రీవాణి ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం బాత్రూమ్‌కు వెళ్లింది. చాలాసేపటి వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితురాళ్లు ప్రిన్సిపాల్ కృష్ణకుమారికి తెలిపారు. ఆమె వచ్చి బాత్రూం డోర్‌ను బలవంతంగా తీయడంతో శ్రీవాణి చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. శ్రీవాణి బాత్రూంలో జారిపడిందని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఆస్పత్రికి వచ్చారు. అప్పటికే బాలిక చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు భోరుమని విలపించారు. తమ కుమార్తె చావుకు కారణం తెలపాలంటూ రెసిడెన్షియల్ ముందు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపల్ కృష్ణకుమారి, హౌజ్‌మాస్టర్ మీరాబాయి వేధింపుల కారణంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యకు ఫొటోనే కారణమా..

వారం క్రితమే రెసిడెన్షియల్‌లో చేరిన శ్రీవాణి వద్ద ఓ ఫొటోను చూసిన హౌస్ టీచర్ బలవంతంగా లాక్కున్నట్లు తెలిసింది. తర్వాత విద్యార్థిని సదరు టీచర్ తాళం చెవి కనుక్కొని లాకర్ ఓపెన్ చేసి ఫొటో తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా.. విద్యార్థినుల సమక్షంలోనే శ్రీవాణిని నోటికి వచ్చినట్లు తిట్టి.. చావచ్చు కదా అన్నట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ప్రిన్సిపాల్ ఆటోలో విద్యార్థిని మృతదేహాన్ని తరలించడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పరకాల పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

ఆస్తి పన్నుపై ఇదెక్కడి వడ్డీ?

- రూ.71 లక్షల పన్నులో అసలు రూ.28 లక్షలేనా?
- జీహెచ్‌ఎంసీని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రూ.71 లక్షల పన్నులో అసలు రూ.28 లక్షలేనా.. ఏ లెక్కన ఆస్తి పన్నుపై వడ్డీ లెక్కిస్తారని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సెల్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ వడ్డీ లెక్కలు కట్టడంపై అధికారులను, ఆస్తి పన్ను చెల్లించకపోవడంపై పిటిషనర్‌ను అంతర్జాతీయ ఎకనామిక్స్ యూనివర్సిటీలకు పంపి తరగతులు చెప్పించాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఆస్తి ఉన్న తర్వాత పన్ను చెల్లించాల్సిందేనని పిటిషనర్‌కు చెబుతూ.. ముందుగా మూడు రోజుల్లో రూ.5 లక్షలు కట్టాలని ఆదేశించింది. తదుపరి విచారణ జూలై 16కు వాయిదా వేసింది. తమ ఫ్లాట్ 1,122 చదరపు అడుగులు ఉండగా, అధికారులు 2,122 చదరపు అడుగులకు పన్ను విధిస్తున్నారంటూ బంజారాహిల్స్‌కు చెందిన మేరాజ్ అహ్మద్ సిద్దిఖీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సెల్ వాదనలు వినిపిస్తూ.. సోమాజీగూడలోని వాణిజ్య భవనంలో ఈ ఫ్లాట్ ఉందని.. పదకొండేళ్లుగా ఆస్తి పన్ను కట్టడం లేదన్నారు. మొత్తం రూ.71 లక్షలు బకాయి ఉందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి అధికారులు, పిటిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్తులున్నా ఆస్తి పన్ను కట్టొద్దు.. ఆదాయం ఉన్నా పన్ను చెల్లించవద్దు.. బ్యాంక్ లోన్ తీసుకుని ఎగ్గొట్టాలి.. ఇలాంటి అంశాలపై హైదరాబాద్‌లోని ఎగవేతదారులతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, కేంబ్రిడ్జ్ లాంటి అంతర్జాతీయ వర్సిటీల్లో తరగతులు చెప్పించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే, ఆస్తి పన్ను అధికారులను కూడా పంపాలని.. వడ్డీ లెక్కలు ఎలా చేయాలనే అంశంపై వారితో మాట్లాడించాలన్నారు.

బరాజ్‌లకు కేబినెట్ ఆమోదం లేదు!

- తొలుత నిర్మించాలని నిర్ణయం.. ఏడాది తర్వాతే కేబినెట్‌లో ర్యాటిఫికేషన్
- కమిషన్ కోరిన పత్రాలన్నింటినీ ఇప్పటికే ఇచ్చాం
- 1,000 పేజీలతో నివేదికను సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు అందించనున్న సర్కారు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం లేదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. బరాజ్‌లు నిర్మించాలని నిర్ణయం తీసుకొని పనులు ప్రారంభించిన ఏడాది తర్వాత మంత్రివర్గంలో ఈ నిర్ణయాన్ని ర్యాటిఫై చేశారని గుర్తించింది. అప్పటికే ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కి సైతం సమర్పించారని తేల్చింది. ఈ వివరాలతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సీల్డ్ కవర్‌లో 1,000 పేజీలతో కూడిన నివేదికను సమర్పించనుంది. గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జరిగిన నిర్ణయాలను క్రమానుగుణంగా నివేదికలో పొందుపరిచింది. బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట గతనెల 11న మాజీ సీఎం కేసీఆర్ హాజరై మంత్రివర్గ నిర్ణయాల మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు వాంగ్మూలం ఇచ్చారు. మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు సైతం కమిషన్‌కు ఇదే వాంగ్మూలం ఇచ్చారు. నాటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్‌తో కూడిన మంత్రివర్గ ఉపసంఘం బరాజ్‌ల నిర్మాణాలపై సిఫారసు చేసిందని ఈటల, హరీశ్‌రావు కమిషన్‌కు తెలపగా, పూర్తిగా అవాస్తవమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలేకరుల సమావేశం పెట్టి ఖండించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి బదులుగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణానికి రూ.2,591 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేయాలని నాటి ఈఎన్సీ సి.మురళీధర్ 2016 ఫిబ్రవరి 18 ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో 2016 మార్చి 1న పరిపాలన అనుమతులతో జీవో 231ను నాటి ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో జారీకి హరీశ్‌రావు అధ్యక్షతన ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ 2016 మార్చి 15న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ జీవో నంబర్ 655 జారీ చేశారు. ఈ వివరాలను కమిషన్‌కు సమర్పించనున్న నివేదికలో సర్కారు పొందుపరిచింది. కమిషన్‌కు కేసీఆర్‌తోపాటు హరీశ్, ఈటల రాజేందర్‌లు కల్పిత విషయాలు చెప్పారని నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలను నివేదికతోపాటు ప్రభుత్వం జత చేసింది. వాస్తవానికి కేసీఆర్‌ను విచారించిన తర్వాత గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన వివరాలను అందజేయాలని కమిషన్ గత నెల 13న సర్కారుకు లేఖ రాసింది. గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ తీర్మానాలకు సంబంధించినవి గతేడాది అక్టోబర్‌లోనే అందించామని, గత జూన్ 13న అదనపు సమాచారాన్ని అందజేశామని ప్రభుత్వానికి కమిషన్ వివరించింది.

ఈనెల 26లోపు నివేదిక

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈనెల 26 లోపు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ నెల 15 లేదా 16న సమర్పించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



జూరాల ప్రాజెక్టు 14 క్రస్టు గేట్ల ఎత్తివేత

1.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 9 గంటల సమయానికి 1.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు 14 క్రస్టు గేట్లను ఎత్తి 92,680 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్‌లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 26,056 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 150 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1,20,185 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1,34,912 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

జీవితం ఒక సినిమా అయితే...
దేవుడు రాసిన స్క్రిప్ట్‌ను కూడా
మార్చి రాయగల రైటర్లు డాక్టర్లు.

జీవితం ఒక మూవీ అయితే...
పేషెంట్‌కు లైఫ్‌కో కొత్త డైరెక్షనిచ్చి
హిట్ చేయగల టాప్ డైరెక్టర్లు డాక్టర్లు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే...

జీవితం... సినిమా కంటే విచిత్రమైనది.
దాంట్లో లవ్, మదర్ సెంటిమెంట్, స్టడీస్‌లో సక్సెస్‌తో కెమెరా టిల్ట్ చేసి
తలెత్తి పైకి చూడాల్సినంత అడ్మిరేషన్, ఎదురుగా మృత్యువు నిలబడ్డా
చిరునవ్వుతో ఎదుర్కొనేంత హీరోయిక్ కరేజ్,
హెల్మెట్లు లేకపోవడంతో జరిగే అనర్థాల స్టంట్స్...
ఇలా ఎన్నో... ఎన్నెన్నో!!

ఇన్ని ఎమోషన్స్‌ను
మనతో పంచుకున్నారు
నిష్ణాతులూ, లబ్ధప్రతిష్ఠులైన
కొందరు డాక్టర్లు...

నేడు డాక్టర్స్ డే
సందర్భంగా
కొన్ని భావోద్వేగాలు
వాళ్ల మాటల్లోనే...

డాక్టర్స్ హార్ట్‌బీట్

- యాసీన్

అడ్మిరేషన్

బరువైన బతుకులో చిరునవ్వు అతడు!

కొన్ని కేసులు ఎలా ఉంటాయంటే... ఇలా నిజ జీవితంలో కూడా సాధ్యమవుతుందా అన్నట్టుగా ఉంటాయి. అవి 1990 ల నాటి తొలి రోజులు. ఓ చిన్నారి బాబును వాళ్ల అమ్మగారు నా దగ్గరికి తీసుకొచ్చారు. మహా అయితే ఆ బాబుకు అప్పటికి ఓ ఏడెనిమిదేళ్లు ఉంటాయేమో... అంతే!

ఆ బాబుకు వాళ్ల నాన్నకు ఉండే మూత్రపిండాల (కిడ్నీ) జబ్బే వచ్చింది. అదేమిటంటే... కిడ్నీలో చాలా గడ్డలు రావడం. మూత్రపిండాల్లో మల్టిపుల్ ట్యూమర్స్ వస్తూ జన్యుపరమైన కారణాలతో వంశపారంపర్యంగా వచ్చే జబ్బు అది. తండ్రికీ ఉండటంతో కొడుకుకూ వచ్చింది. ఆ బాబు తల్లిదండ్రులిద్దరూ చాలా సంస్కారవంతులూ, ఉన్నత విద్యావంతులూ, కాస్త ధనవంతులు కూడా.



డాక్టర్ సి. మల్లికార్జున,
చీఫ్ యూరాలజిస్ట్,
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ & యూరాలజీ (AINU), హైదరాబాద్

తండ్రికి ఆ జబ్బు ఉండటంతో అతడి తల్లి తన భర్తకు కిడ్నీ ఇచ్చి కాపాడేందుకు ప్రయత్నించింది. ఆ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్స జరుగుతున్నప్పుడు నేనూ అక్కడ ఉన్నా. ఆ తర్వాత ఐదేళ్లలో ఆయన చనిపోయారు. ఆ తర్వాత రెండుమూడేళ్లకు అనుకుంటా... అతడి అమ్మగారు హార్ట్ అటాక్‌తో లోకం విడిచి వెళ్లారు. ఈ ప్రపంచంలో ఇప్పుడా బాబు పూర్తిగా అనాథ.

అయితే అతడు చాలా చిన్నవయసు నుంచే సమర్థంగా బిజినెస్ చేస్తుండేవాడు. బిజినెస్‌లో ఎక్స్‌పర్ట్ కావడంతో తానో పెద్ద కంపెనీ పెట్టి విజయాన్ని చవిచూసిన ఓ సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మేన్ అతడు. తన వ్యాపారంలో అతడెంత ఉన్నతిని సాధించాడంటే... తన కంపెనీ ద్వారా వందల సంఖ్యలో వ్యక్తులకు ఉపాధిని కల్పించాడు.

కొన్నేళ్ల తర్వాత దాదాపు 2000 సంవత్సరం ప్రాంతాల్లో అతడు మళ్లీ కిడ్నీ సమస్యతో మరోసారి నా దగ్గరికి వచ్చాడు. గుర్రపునాడా ఆకృతిలో (హార్స్ షూ షేప్‌లో) ఉన్న అతడి కిడ్నీలోంచి ఈసారి సగభాగాన్ని తొలగించాల్సి వచ్చింది. ఆ సర్జరీ నేనే చేశా.

కాలక్రమంలో ఈసారి పూర్తిస్థాయి కిడ్నీ ఫెయిల్యూర్‌తో అతడు మళ్లీ నా దగ్గరికి వచ్చాడు. ట్రాన్స్‌ప్లాంట్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. కిడ్నీ ఇవ్వడానికి అతడికి ఈలోకంలో రక్తసంబంధీకులెవ్వరూ లేరు.

వాస్తవానికి వాళ్ల నాన్నగారు చాలా చిన్నప్పుడే ఓ చిన్నారి బాబును ఇంట్లో పెట్టుకున్నారు. ఒకరి ఆత్మబంధువుగా మరొకరు గత రెండు దశాబ్దాలుగా వాళ్లిద్దరూ ఆ ఇంట్లో నివసిస్తున్నారు. ఆ ఇంట్లో అతడి వ్యక్తిగత సహాయకుడూ, సెక్రటరీ అన్నీ అతడే. అతడు కిడ్నీ ఇస్తానన్నాడుగానీ... నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులో... లేదా రక్త సంబంధం లేనివాళ్లైతే భార్యభర్తల్లో ఎవరో ఒకరు ఇవ్వాలి. తనకు ఈ లోకంలో అతడు తప్ప మరెవ్వరూ లేరనే కారణంతో వాళ్లు కోర్టుకు వెళ్లారు. అతడి ఇంట్లో గత 20 ఏళ్లుగా ఉంటున్న వ్యక్తి కిడ్నీ ఇవ్వవచ్చంటూ అతడి కేసులో మాత్రం కోర్టు ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో అతడి ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స కూడా నేనే చేశా. ఈ ట్రాన్స్‌ప్లాంట్ చేసి ఇప్పటికి దాదాపు ఎనిమిదేళ్లు అయ్యింది. అంటే... దాదాపు గత 30కి పైగా ఏళ్ల నుంచి అతడు నా పేషెంట్. వాళ్ల అమ్మగారు చనిపోయాక ప్రతి చికిత్సకూ అతడొక్కడే వచ్చేవాడు. ఇన్‌పేషెంట్‌గా చేరేప్పుడూ... డిశ్చార్జ్ అయి వెళ్లేటప్పుడూ ఇలా ప్రతి ప్రతికూల పరిస్థితిలోనూ అతడొక్కడే. ఏ పరిస్థితుల్లోనూ అతడు తన చిరునవ్వును వీడలేదు. ఇక్కడ ఓ డాక్టర్‌గా నా గొప్పదనం ఏమీ లేదు. గొప్ప చికిత్స జరిగినప్పుడు పేషెంట్ అదృష్టాలూ, డాక్టర్ ప్రయత్నాలూ, పరిస్థితులు కలిసి రావడాలూ... ఇలా ఇవన్నీ అనుకూలించడంతో డాక్టర్ గొప్పగా, సమర్థంగా చికిత్స చేశాడనే పేరొస్తుంది. కానీ ఈ కేసులో పరిస్థితి వేరు. ఆ పేషెంట్ తాలూకు సంకల్పబలం, గొప్పదనంతో డాక్టర్‌కూ గొప్పదనాన్ని ఆపాదించినట్లయ్యింది.

ఇప్పుడతడి వయసు దాదాపు 40 ఉండవచ్చు. ఈ వయసుకే అతడో సక్సెస్‌ఫుల్ వాణిజ్యవేత్త. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లోనూ అదరక, బెదరక ఎంతోమందికి అన్నం పెడుతున్న బెస్ట్ బిజినెస్‌మేన్. సాధారణంగా డాక్టర్లంటే పేషెంట్లకు అడ్మిరేషన్ ఉండటం సహజం. కానీ... చిన్నప్పట్నుంచీ... ఓ చిన్నారిగా ఉన్నప్పట్నుంచీ అతడిని చూస్తూ ఉన్నప్పటికీ, గత 30 ఏళ్ల నుంచి అతడికి చికిత్స అందిస్తున్నప్పటికీ... అతడంటే నాకెంతో అడ్మిరేషన్.

'హెల్త్'మేట్స్

ముప్పు డప్పు కొట్టినా తప్పులు ఆగవా!

అదో అందమైన చలికాలపు ఉదయపు వేళ. కానీ ఆ ఆహ్లాదకరమైన ప్రాతఃకాలం... శేఖర్ పాలిట రాబోయే రాత్రికి కాబోయే కాళరాత్రికి నాందీ సమయం. కారణం... ఆరోజు శేఖర్ చేసిన రెండు తప్పులు.

మొదటి తప్పు హెల్మెట్ ధరించకపోవడమైతే... రెండోది స్పీడ్ బ్రేకర్ దగ్గర కూడా ఏమాత్రం స్లో చేయకపోవడం. దాంతో బండి మీది నుంచి పడి తలకు గాయంతో ఐసీయూలో బెడ్‌పై అచేతనంగా పడి ఉన్నాడు.

శేఖర్ గురించి అతడి అన్న శ్రీధర్ చాలా బాధపడుతూ ఉండేవాడు. బహుశా శ్రీధర్‌కు 35 ఏళ్లూ, అతడి తమ్ముడు శేఖర్‌కు 30 ఏళ్లు ఉంటాయేమో. ప్రతి రోజూ కళ్ల నిండా నీళ్లతో, జోడించిన చేతులతో నా దగ్గరికి వచ్చి తమ్ముడి పరిస్థితి వాకబు చేస్తూ ఉండేవాడు. ''ఎంత ఖర్చైనా పర్లేదు డాక్టర్. నా తమ్ముడు బాగైతే చాలు'' అనేవాడు. అంతటి దయ, గుండెనిండా ఆర్ద్రత ఉన్న ఆ అన్నను చూస్తే ఓ పక్క ఆనందం... మరో పక్క అతడి పరిస్థితికి బాధా ఉండేవి. ''మీవాడుగానీ ఆ రోజు హెల్మెట్ పెట్టుకుని ఉంటే... ఇవ్వాళ ఈ పరిస్థితి వచ్చేదే కాదు'' అంటూ ఉండేవాణ్ణి.



డాక్టర్ అనిరుథ్ కె. పురోహిత్
సీనియర్ కన్సల్టెంట్
న్యూరో & స్పైన్ సర్జన్,
ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్

ఒకరోజు పొద్దున్నే నేను నా కార్ డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నా. పక్క సందులోంచి ఒక వ్యక్తి తన బైక్‌ను చాలా రాష్‌గా డ్రైవ్ చేస్తూ ప్రధాన రోడ్డు మీదికి వస్తున్నాడు. ఎక్కడా స్లో చేయడమన్న మాటే లేదు. మెయిన్ రోడ్డులో వస్తున్న నేను వెంటనే నా కార్‌ను స్లో చేస్తూ... అతడు నన్ను గుద్దుకోకుండా నా కార్‌ను చాలా పక్కకు తీశా. ఒకవేళ నేనలా చేయకపోతే నన్నతడు తప్పక ఢీకొని ఉండేవాడు. తీరా చూస్తే అతడి బైక్ హ్యాండిల్ మీద హెల్మెట్ కూడా ఉంది. పరిశీలనగా చూస్తే అతడు మరెవరో కాదు... మా హాస్పిటల్ బెడ్ మీద యాక్సిడెంట్ అయి పడుకుని ఉన్న పేషెంట్ వాళ్ల అన్నే. కాస్తయితే ''అదే బెడ్ పక్కన ఇతడూ తమ్ముడికి కంపెనీ ఇస్తూ పడుకునేవాడు కదా'' అనిపించింది. మరో మాట అనిపించింది. తన సొంత తమ్ముడు చేసిన రెండు తప్పుల నుంచి ఏమీ గ్రహించకుండా శేఖర్ వాళ్ల అన్న శ్రీధర్ చేసింది మూడో తప్పు.

అలాంటి యాక్సిడెంట్‌లో చనిపోయిన ఓ వ్యక్తి తాలూకు అంతిమ సంస్కారాల్లో పాల్గొన్న మర్నాడే ఈ ఘటన జరగడంతో నాకీ విషయం స్ఫురణకు వచ్చింది. నన్ను మనసులో తొలిచేస్తున్న విషయమేమిటో తెలుసా... ''ఇన్ని సంఘటనలు జరిగాక... జరుగుతున్న సంఘటనలను చూశాక... తమ ఇంట్లో కూడా ఇలాంటి విషాదాలు చోటు చేసుకున్న తర్వాత కూడా వీళ్లు మారరా'' అంటూ బాధేసింది. నా అనుభవంలో చూసిన ఘటనలూ, ఆ టైమ్‌లో వచ్చే ఆలోచనలే నన్ను ఈ నాలుగు మాటలు రాసేలా పురిగొల్పాయి.

మదర్ హుడ్

అమ్మతనం ఇచ్చిన 'బ్రహ్మా'నందం

అమ్మతనపు కమ్మదనం కోసం అర్రులు సాచే అమ్మాయిలెందరో! అలాంటి అమ్మాయిల్లో ఆమె కూడా ఒకరు.

అప్పటికే ఆ అమ్మాయికి నాలుగు అబార్షన్లు అయ్యాయి. ఆ గర్భస్రావాల్లో ఒకట్రెండు దాదాపు పూర్తికాలం గర్భం మోసిన దాఖలాలూ ఉన్నాయి. కానీ ఏ ప్రసవంలోనూ బిడ్డ జీవించి పుట్టలేదు. ఈసారి ఐదో ప్రసవం సమయంలో ఆ దంపతులు నా దగ్గరికి వచ్చారు. వాళ్లకు ఇది ఐదోసారి గర్భధారణ. అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లో ఏదో తేడా ఉంది. వాళ్లలో ఉండే వేదన ఎంతో ఎవ్వరైనా అంచనా వేయవచ్చు.

మా దగ్గర రెండు రకాలుగా పరీక్షలు నిర్వహిస్తాం. మొదటిది క్రోమోజోముల్లో ఏదైనా తేడా ఉందేమో తెలుసుకునే క్యారియోటైపింగ్ టెస్ట్. రెండోది ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టడానికి గల అవకాశాలను తెలిపే ప్రొబబిలిటీ పరీక్ష. వాళ్ల రెండోది కోరుకున్నప్పటికీ... అప్పటికే ఉన్న ప్రతికూలతల కారణంగా అది సాధ్యం కాలేదు. ఇలాంటి సందర్భాల్లో ఏమవుతుందంటే... ఒకవేళ పుట్టబోయే బిడ్డకు శారీరక అవయవాల్లో లోపాలో లేదా మానసిక ఎదుగుదల బాగుండదనో తెలిస్తే జెనెటిక్ కౌన్సెలింగ్ ఇచ్చి... 'ఇదీ పరిస్థితి. ఇక మీరు నిర్ణయం తీసుకోండి' అని చెబుతాం.



డాక్టర్ యానీ క్యూ హసన్,
సీనియర్ జెనెటిక్ & మాలెక్యులార్ స్పెషలిస్ట్,
కామినేని హాస్పిటల్స్,
హైదరాబాద్

ఇక ఆ తర్వాత నిర్వహించిన క్యారియోటైపింగ్ పరీక్షల్లో బిడ్డలో 'క్రోమోజోమల్ ట్రాన్స్‌లోకేషన్' జరిగినట్లు తేలింది. అంటే... క్రోమోజోముల్లో ఒకచోట ఉండాల్సినవి అక్కడినుంచి మారి మరోచోట చేరాయి. కానీ చూడ్డానికి అంతా మామూలుగానే ఉంది. ఇలాంటప్పుడు బిడ్డ ఆరోగ్యకరంగానే పుడుతుందా అంటే చెప్పలేం. ఇలాంటి సందర్భాల్లో ప్రకృతి ఓ పని చేస్తుంది. అనారోగ్యకరమైన బిడ్డను ఈ లోకంలోకి రాకుండా చేసేందుకు మూడు నెలలలోపు స్వాభావికంగా దానంతట అదే బిడ్డ పడిపోయేలా చేస్తుంది. అంటే నేచురల్ అబార్షన్ జరిగిపోతుందన్నమాట. అదే ఒకవేళ మూడు నెలలు గడిచిపోయాయంటే ఇక బిడ్డ పూర్తిగా ఎదగడానికి అవకాశం ఉందన్నమాట. మొదటి సస్పెన్సు కాలమైన ఆ మూడు నెలలూ గడిచిపోయాయి.

ఇప్పుడు రెండో సస్పెన్సు మొదలైంది. ఇప్పటికే నిండు చందమామలాంటి బిడ్డలు నలుగురు ఆ అమ్మ ఒడినుంచి జారిపోయారు. కడుపున మరో బంగారం పెరుగుతోందిగానీ... ఆ కొంగుబంగారమూ కొంగుజారిపోతే? అమ్మో!! అందుకే మేమంతా కాబోయే ఆ అమ్మను జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉన్నాం. క్రోమోజోమల్ ట్రాన్స్‌లోకేషన్ జరిగిందంటే ఏదో జరిగిందనే అర్థం. కాకపోతే అదెక్కడో, ఎలాగో, దాని పర్యవసానాలేమిటో తెలియదు. జాగ్రత్తగా వేచిచూస్తున్నాం. ఎట్టకేలకు అల్లరి పిడుగు పుట్టనే పుట్టింది. ఆ బంగారుతల్లి ఒడిలోకి బంగారుకొండ చేరింది. అంతా సుఖాంతం. బిడ్డకు పూర్తి ఆరోగ్యం. మా అందరిలోనూ కొండంత ఆనందం.

నేను చెప్పేదేమిటంటే... ప్రతి ఒక్కరికీ జెనెటిక్ పరీక్షలు అవసరం కాకపోవచ్చు. కానీ ఎలాంటి బిడ్డ పుడుతుందో... పుట్టి జీవితాంతం తల్లిదండ్రులను క్షోభ పెడుతుందో తెలియని పరిస్థితుల్లో జన్యుపరీక్షలు అవసరం. ఓ సీనియర్ జన్యు పరిశోధకురాలిగా, జెనెటిక్స్ వైద్యురాలిగా ఇదీ నా సూచన.

స్టడీస్

మృత్యువు పెట్టిన 'పరీక్ష' పాసయ్యాడు!

ఎలాగైనా యూపీఎస్సీ పరీక్ష రాసి ఐఏఎస్ సాధించాలనే తపనతో చదువుతున్నాడు మిస్టర్ రంజిత్ (పేరు మార్చాం). అతడు నరాలు తెగే ఏకాగ్రతతో చదువుతుంటే గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జీబీఎస్) అనే సమస్య అతడి నరాలను దెబ్బతీసింది.

జీబీఎస్ అనేది నరాలకు సంబంధించిన వ్యాధి. ఏదైనా ఇన్ఫెక్షన్‌కు గురైన తర్వాత వస్తుందిది. ఇందులో నుంచి దేహంలోని ప్రతి భాగానికీ ఆదేశాలందించే నరాలపైన ఉండే 'మైలీన్' అనే పొర దెబ్బతింటుంది. సొంత వ్యాధి నిరోధక వ్యవస్థలోని యాంటీబాడీస్ వెలువడి... అవి తమ సొంత మైలీన్ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ అందక సొంత అవయవాలు అచేతనమవుతాయి.

అందునా ఈసారి రంజిత్‌కు వచ్చిన వ్యాధి మామూలు జీబీఎస్ కాదు. జీబీఎస్ వచ్చేవాళ్లలోనూ ప్రతి 1000 మందిలో ఒకరికి మాత్రమే వచ్చే అరుదైన, అత్యంత తీవ్రమైన గులియన్ బ్యారీ సిండ్రోమ్ రకమిది. నరాల కూడలి (నోడల్) ప్రదేశాల్లో వస్తుంది కాబట్టి దీన్ని 'నోడోపతి' అంటారు. అది ఎంతటి తీవ్రమైనదంటే... సాధారణంగా కాళ్ల నుంచి పైకి చచ్చుబడిపోయేలా చేసే ఆ వ్యాధి... ఇతడిలో మాత్రం దేహమంతా అచేతనమయ్యేలా చేసింది.



డాక్టర్ హర్ష్ ఖండేలియా
సీనియర్ కన్సల్టెంట్
క్రిటికల్ కేర్ ఫిజీషియన్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్

ఊపిరి తీసుకునేందుకు సహాయపడే కండరాలు అచేతనమైపోతే కొద్ది క్షణాల్లోనే ప్రాణం పోతుంది కదా. అలాంటిది అతడి కంటికి సంబంధించిన కండరాల్లో కొంత మినహాయించి మిగతా దేహమంతా కదలిక లేకుండా పోయింది.

సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ అతడిని దెబ్బతీసిందేమో కానీ పరిస్థితులు అతడి సంకల్ప బలాన్ని ఏమాత్రమూ దెబ్బ తీయలేకపోయాయి. సొంత కుటుంబ సభ్యులు అండగా నిలబడ్డ తీరు అసామాన్యం, అనితర సాధ్యం, నిరుపమానం, నిరంతర స్ఫూర్తి. సొంత సోదరి కూడా ఐఏఎస్‌కు ప్రిపేర్ అవుతుండటంతో ఆమె అతడిలో మోటివేషన్ నింపుతూ ఉంది.

అతడి పరిస్థితికి అతడిలోని వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఐవీఐజీ అనే తరహా ఇమ్యునోథెరపీ ఇవ్వాల్సి ఉంది. ఇది బాగా ఖరీదైన చికిత్స. అతడిది కేవలం ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం. దాంతో అతడి మనోబలాన్ని పెంచేందుకూ, అతడిలో స్ఫూర్తి రగిలించేందుకూ మేం డాక్టర్లం కూడా అతడికి ఆర్థికంగా కొంత సహాయం (క్రౌడ్ ఫండింగ్) చేశాం. ఆసుపత్రి కూడా తనవంతు అండదండలందించింది.

అన్నివైపుల నుంచి అందుతున్న సహకారాలతో అతడు రెండునెలల పాటు ఐసీయూలో వ్యాధితో పోరాడాడు. ఈలోపు మరో రెండుసార్లు ఇన్ఫెక్షన్ వచ్చి అతడిని మృత్యువు అంచులవరకూ తీసుకెళ్లింది. దాంతో అతడి పరిసరాలు అత్యంత శుభ్రంగా ఉండేలా చేశాం. అతడికి అందే ఆహారాలు బలవర్థకంగా ఉండేలా చూశాం. రిటుక్సిమాబ్ అనే ఇమ్యూన్ సపోర్ట్ మందులిచ్చాం. ఇలా అనేక ప్రయత్నాలు చేసి అతడిని కాపాడాం. రెండు నెలల పాటు అతడి నరాలకు ఏ ఆహారమూ అందకపోవడంతో, అవి రెండునెలల పాటూ ఏ పనీ చేయకపోవడంతో... ఆ తర్వాత ఎంతో బలహీనపడి శక్తిపుంజుకునేందుకు ఎంతో కష్టమైంది. అయినప్పటికీ ఫిజియోథెరపీ సహాయంతో అతడెంతో కష్టపడి బయటకొచ్చాడు. ఇప్పుడు హాయిగా హ్యాపీగా ఉన్నాడు.

ఈ ఏడాది కాకుండా ఆ వచ్చే ఏడాది పరీక్ష రాద్దువుగానీ అంటే... ''లేదు సర్... మీరిచ్చిన ప్రోత్సాహంతో ఈ ఏడాది కూడా పరీక్ష రాయాల్సిందే. అది కుదరకపోతే నేను చెబుతుంటే ఎవరైనా స్క్రైబ్‌ను పెట్టుకునైనా సరే'' అన్నాడా అబ్బాయి.

మేం ఒక టీమ్‌గా పనిచేసే డాక్టర్లమంతా కలిసి, మా శక్తియుక్తులన్నీ వెచ్చించి, సంయుక్తంగా అతడిని మృత్యుదేవత ఒడిలోంచి బలవంతంగా వెనక్కు తీసుకొచ్చామంటే అది అతిశయోక్తి కాదు.

క్రిటికల్ కేర్‌లో పనిచేసే మేము రోజులోని 24 గంటలూ క్రిటికల్ కేసుల్నే చూస్తాం. ఇటీవలే మేం ఒక డబుల్ ట్విన్స్ కడుపులో ఉన్న మహిళను రక్షించాం. అత్యంత సంక్లిష్టమైన టీబీ ఇన్ఫెక్షన్లూ, చాలా అరుదుగా కనిపించే మెనింజైటిస్ విత్ టీటీపీ అనే కేసులూ చూశాం. కానీ ఇలా చదువుకోసం తాపత్రయపడే ఓ చురుకైన కుర్రాణ్ణి మేమంతా ఓ టీమ్‌గా రక్షించిన ఉదంతం మాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) జూన్ 30న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,210
బంగారం (22 క్యారెట్లు)	90,720
వెండి	1,08,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,570
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,08,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,260
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,17,700
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,570
బంగారం (22 క్యారెట్లు)	91,820
వెండి	1,08,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,500
బంగారం (22 క్యారెట్లు)	88,780
వెండి	1,07,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,250
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,19,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లవ్

వాళ్ల ప్రేమకు పునర్జన్మ!

సురేశ్, సమీర (పేర్లు మార్చాం) ప్రేమించుకున్నారు. అయితే అన్ని ప్రేమకథల్లోలాగే అమ్మాయి వాళ్ల పెద్దలు ఈ ప్రేమను ఒప్పుకోలేదు. కలిసే బతుకుదామని నిర్ణయించుకున్నారు. పారిపోయి పెళ్లి చేసుకుందామనుకున్నారు.

అమ్మాయి నిర్ణీత స్థలానికి రాగానే అప్పటికే అక్కడ టూ వీలర్ మీద వెయిట్ చేస్తున్న సురేశ్... సమీరను పికప్ చేసుకున్నాడు. అసలే యాంగ్జైటీ. తమను వెతికేవారికి దొరక్కూడదనే టెన్షన్. ఆ యాంగ్జైటీ, టెన్షన్లతో బండి వేగంగా నడిపాడు. ఫలితం... బండి బోల్తా కొట్టి యాక్సిడెంట్ అయ్యింది.

వెంబడిస్తున్న సమీర తరఫు బంధువులకు అమ్మాయి చిన్న చిన్న దెబ్బలతో సేఫ్‌గానే దక్కింది. కానీ... సురేశ్ తల బద్దలైంది. అచ్చం అతడి ప్రేమలా!

సురేశ్ మెదడు బయటకు వచ్చింది. ఛాతీ ఎముకలూ విరిగాయి. పొట్టలోకి నీరు వచ్చింది. ఇలా మెడికల్‌కు సంబంధించిన మల్టీ డిసిప్లినరీ సమస్యలెన్నో వచ్చాయి.

ఆ స్థితిలో తీసుకువచ్చిన సురేశ్‌కు చికిత్సలు చాలా జాగ్రత్తగా అందించాల్సి వచ్చింది. తల తాలూకు చిన్న చిన్న ముక్కలు కొన్ని (మరీ లోతుగా కాకపోయినా) మెదడులోనూ ఇరుక్కున్నాయి. మెదడులోకి లోతైన గాయాలు కాకుండా వాటిని చాలా జాగ్రత్తగా బయటకు తీయాల్సి వచ్చింది. వెంటిలేటర్‌పై పెట్టి చికిత్స ఇవ్వాల్సిన పరిస్థితి.



డాక్టర్ ఎస్. రమేశ్
సీనియర్ న్యూరో సర్జన్,
మినిమల్ యాక్సెస్ బ్రెయిన్ & స్పైన్ సర్జన్,
కామినేని హాస్పిటల్స్,
హైదరాబాద్

అత్యంత సునిశితమైన చికిత్సలూ, గాజు బొమ్మలా చూసుకున్న జాగ్రత్తల తర్వాత ఎట్టకేలకు సురేశ్ కోలుకున్నాడు.

ఈలోపు... వాళ్ల ప్రేమకథలో ఓ ట్విస్ట్. అతడి యాక్సిడెంట్ వృత్తాంతం వాళ్ల క్లోజ్ క్లోజ్ సర్కిల్స్‌లో వ్యాపించడంతో అతడికి సంబంధాలేమీ రాలేదు. అటువైపు ఆ అమ్మాయి పరిస్థితీ అంతే.

బద్దలైన తల తాలూకు చిన్న చిన్న ముక్కల్నీ పేర్చి అతికిస్తే అవే మెల్లగా అమరాయి కదా... అచ్చం అలాగే పెద్దలు బద్దలు చేయాలనుకున్న వాళ్ల ప్రేమ కూడా చక్కగా కుదిరింది. వెరసి పెళ్లీ జరిగింది.

తన కాళ్ల మీద నిలబడ్డ సురేశ్ ఇప్పుడు ఓ మంచి రెస్టారెంట్ నడుపుతున్నాడు. వాళ్లిద్దర్నీ చూసినప్పుడు ఇప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది.

ఇంటర్నేషనల్ జోక్ డే

నవ్వు నవ్వులాట కాదు

ఇవాళ మనిషి దగ్గర అన్నీ ఉంటున్నాయి... నవ్వు తప్ప. వేయి తుఫాన్లు చుట్టుముట్టినా హాయిగా నవ్వగలిగే, నవ్వించగలిగేవాళ్లు వాటిని దాటుతారు. స్నేహాలు, కుటుంబ అనుబంధాలు పలుచబడి ఒత్తిడి నిండిన ఈ రోజుల్లో నవ్వు సిరిధాన్యాల బలం ఇవ్వగలదు. జూలై 1 'ఇంటర్నేషనల్ జోక్ డే'. స్త్రీలకు నవ్వు ఇష్టం. ఇంట్లో, పని చోటా నవ్వుకోగలిగే వాతావరణం ఇష్టం. కాని వారిని టార్గెట్ చేస్తూ ఇంకా కొనసాగుతున్న కుళ్లు జోకులను మాత్రం 'ఇక ఆపండి' అంటున్నారు. ఆరోగ్యకరమైన హాస్యమే ఆనందోబ్రహ్మ.



జోకులు ఎవరు పుట్టిస్తారో ఎవరికీ తెలియదు.

ప్రసిద్ధ రచయిత కుష్వంత్ సింగ్ పుస్తకాలు రాయడమే కాదు బాగా చదువుతాడు. హాస్యప్రియుడు. ఆయనకు ఒక సందేహం వచ్చింది. ఇంగ్లిష్‌లో ప్రచారంలో ఉన్న చాలా జోకులు కొద్దిపాటి తేడాలతో చాలా దేశాల్లో జనం చెప్పుకోవడం ఆయన గమనించాడు. ఈ జోకులు అన్ని దేశాల్లో చెప్పుకుంటున్నారు... చిన్న మార్పులతో... ఒరిజినల్‌గా ఎవరు సృష్టించి ఉంటారు అని చిన్న పరిశోధన చేస్తే చివరకు ఏం తెలిసిందో తెలుసా? అవన్నీ యూదులు తయారు చేసిన జోకులు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో భయం, ఒత్తిడిలో, తమపై ఊచకోత సాగుతున్న సమయంలో వారు ఆ దుఃఖాన్ని మర్చిపోవడానికి జోకులు సృష్టించుకుని నవ్వుకునేవారట. అవే ఆ తర్వాత అన్ని దేశాలకు రూపు మార్చుకుని చేరాయి.

ఒక్క నవ్వు చాలు వేయి వరహాలు అంటారు మనవారు. నవ్వు రూపానికో అలంకారం మాత్రమే కాదు సంస్కారానికి ఆనవాలు కూడా. చిర్నవ్వు ధరించిన ప్రతి మనిషి సౌందర్యంతో ఉన్నట్టే. ఫ్రీ మేకప్. అంతా కలిపి చేయాల్సింది నవ్వుతూ పెదాలను సాగదీయడమే.

నవ్వులో విశేషం ఏమిటంటే బలవంతంగా నవ్వినా, ఏడ్చినట్టు నవ్వినా ఆ నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందట. ఇక నిజంగా నవ్వితేనో? అందుకే సినీ దర్శకుడు నవ్వడం భోగం... నవ్వించడం యోగం అన్నాడు. జోకులకు ఉండే శాపం ఏమిటంటే అవి విన్నప్పుడు నవ్వొస్తాయి... తర్వాత గుర్తుండవు. ఒక జోకు చెప్పు అని ఎవర్ని అడిగినా వెంటనే బుర్ర తడుముకుంటారు. జోకులు ఎందుకు గుర్తుండవనేది పెద్ద పజిల్.

ఇవాళ రేపు స్టాండప్ కమెడియన్లు చాలా సక్సెస్ అవుతున్నారు. రాజకీయ నాయకుల మీద జోకులు వేస్తున్నారు. అలా జోకులేసే కమెడియన్లపై రాజకీయ నాయకులు కూడా సెటైరికల్‌గా పగబడుతున్నారు. 'ఇతరులు మన మీద జోకేస్తే నవ్వేవాడు భోగి... తన మీద తనే జోకేసుకునేవాడు యోగి' అన్నాడో జోకుల రీసెర్చర్ వెనుకటికి. జోకు వింటే వచ్చే నవ్వుకు జెండర్ ఉండదు. స్త్రీలు, పురుషులు సమానంగా నవ్వుతారు. కాని జోకులో సబ్జెక్ట్‌కు జెండర్ ఉంటుంది. ఆడవాళ్ల మీద వేసే జోకు అన్నింటి కంటే అధమమైనది. అయినా సరే అప్పడాల కర్రల మీద, వారి అలంకరణల మీద, అలవాట్ల మీద జోకులు వేసి ఇకఇకలు పోతుంటారు చాలా మంది. భార్య తోడు లేకపోతే గంట కూడా బతకలేని భర్త నలుగురు ఫ్రెండ్స్ రాగానే భార్య మీద జోకులేస్తాడు. భార్యను నవ్వించొచ్చు. నవ్వులాటగా మార్చకూడదు. అయినా సరే స్త్రీల మీద చీప్ జోకులు వినపడుతూనే ఉన్నాయి.

ఒక మనిషిని కించపరిచేది జోక్ కాదు. మంచి జోక్ పేల్చడం ఉదాత్తమైన కళ.

ఇంటర్నేషనల్ జోక్ డే సందర్భంగా నవ్వుల శుభాకాంక్షలు. నవ్వుతూ బతుకుదాం.



'కెప్టెన్ కూల్' ట్రేడ్ మార్క్ కోరుతూ... ఎమ్మెస్ ధోని దరఖాస్తు

న్యూఢిల్లీ: మైదానంలో నాయకుడిగా మహేంద్ర సింగ్ ధోని సాధించిన ఘనతల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అతని సారథ్య శైలి, కీలక సమయాల్లోనూ ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా ఉంటూ విజయాలు అందించిన తీరు ధోనికి 'కెప్టెన్ కూల్'గా గుర్తింపు తెచ్చాయి. జనంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ 'కెప్టెన్ కూల్' పదం తనకు మాత్రమే సొంతమని, ఇతరులు ఎవరూ వ్యాపార ప్రయోజనాల కోసం వాడరాదని ధోని చెబుతున్నాడు. అందుకే దీనికి సంబంధించి ట్రేడ్ మార్క్ హక్కులను కోరుతూ అతను దరఖాస్తు చేశాడు. ధోని అప్లికేషన్‌ను 'ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రీ ఆఫ్ ఇండియా' స్వీకరించింది. 'క్రీడా శిక్షణ, క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు' అనే కేటగిరీ కింద ఈ దరఖాస్తు దాఖలైంది. నిజానికి 2023 జూన్‌లోనే ధోని 'కెప్టెన్ కూల్' ట్రేడ్‌మార్క్ కోసం దరఖాస్తు చేశాడు. అయితే అప్పటికే ప్రభ స్కిల్ స్పోర్ట్స్ అనే కంపెనీ దీని కోసం దరఖాస్తు చేసినట్లు తేలింది. దీనిపై ధోని అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఒక గుర్తింపు పొందిన వ్యక్తి పేరును దురుపయోగం చేసే ప్రయత్నం ఇది అంటూ 'రెక్టిఫికేషన్ పిటిషన్' దాఖలు చేశాడు. దీనిపై నాలుగు సార్లు వాదనలు జరిగిన తర్వాత ఇప్పుడు రెండేళ్లకు అతని దరఖాస్తు ఆమోదం పొందింది.

ఆయుశ్ అదరహో

- కెరీర్‌లో తొలి వరల్డ్ టూర్ టైటిల్ నెగ్గిన భారత యువ షట్లర్
- యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ సొంతం

అయోవా (అమెరికా): నిరీక్షణ ముగిసింది. ఈ ఏడాది భారత ప్లేయర్ ఖాతాలో తొలి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ టైటిల్ చేరింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ ఆయుశ్ శెట్టి విజేతగా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 34వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 21-18, 21-13తో ప్రపంచ 33వ ర్యాంకర్ బ్రియాన్ యాంగ్ (కెనడా)పై గెలుపొందాడు. ఈ ఏడాది యాంగ్‌పై ఆయుశ్‌కిది మూడో విజయం కావడం విశేషం. మలేసియా ఓపెన్, తైపీ ఓపెన్ టోర్నీల్లోనూ యాంగ్‌పై ఆయుశ్ నెగ్గాడు. చాంపియన్‌గా నిలిచిన ఆయుశ్‌కు 18 వేల డాలర్ల (రూ. 15 లక్షల 45 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

యాంగ్‌తో 47 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ఆయుశ్‌కు తొలి గేమ్‌లో గట్టిపోటీ ఎదురైంది. మూడుసార్లు ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. స్కోరు 19-18 వద్ద ఆయుశ్ వరుసగా రెండు పాయింట్లు నెగ్గి తొలి గేమ్ దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో మాత్రం ఆయుశ్ దూకుడు కనబరిచాడు. ఆరంభంలోనే 6-1తో ఆధిక్యంలోకి వెళ్లిన ఆయుశ్ ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని 11-6కు పెంచుకున్నాడు. యాంగ్ కోలుకునే ప్రయత్నం చేసినా జోరు మీదున్న ఆయుశ్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 2023లో లక్ష్య సేన్ కెనడా ఓపెన్‌లో టైటిల్ సాధించిన తర్వాత ఆయుశ్ శెట్టి రూపంలో మరో భారత ప్లేయర్ అంతర్జాతీయ టోర్నీలో పురుషుల సింగిల్స్ టైటిల్ గెల్చుకున్నాడు. 'సీనియర్ సర్క్యూట్‌లో నాకిదే తొలి టైటిల్. ఈ విజయం ఎంతో ప్రత్యేకం. చాలా సంతోషంగా ఉన్నా. గత వారం రోజులుగా అద్భుతంగా ఆడాను. ఇదే జోరును కెనడా ఓపెన్‌లోనూ కొనసాగిస్తాను' అని కర్ణాటకకు చెందిన 20 ఏళ్ల ఆయుశ్ వ్యాఖ్యానించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న ఆయుశ్ 2023లో ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించి వెలుగులోకి వచ్చాడు.



2 యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచిన రెండో భారతీయ ప్లేయర్‌గా ఆయుశ్ శెట్టి గుర్తింపు పొందాడు. 71 ఏళ్ల చరిత్రగల ఈ టోర్నీలో 2017లో భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్ టైటిల్ సాధించాడు.

రన్నరప్ తన్వీ శర్మ



యూఎస్ ఓపెన్ టోర్నీలో భారత్‌కు 'డబుల్ ధమాకా' సృష్టించే అవకాశం చేజారింది. మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ తన్వీ శర్మ రన్నరప్‌గా నిలిచింది. టాప్ సీడ్, ప్రపంచ 21వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)తో జరిగిన ఫైనల్లో 16 ఏళ్ల తన్వీ శర్మ 11-21, 21-16, 10-21తో పోరాడి ఓడిపోయింది. కెరీర్‌లో తొలి వరల్డ్ టూర్ ఫైనల్ ఆడిన పంజాబ్‌కు చెందిన తన్వీ ప్రత్యర్థికి గట్టిపోటీ నిచ్చినా చివరకు అనుభవజ్ఞురాలైన బీవెన్ జాంగ్‌దే పైచేయి అయింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 66వ స్థానంలో ఉన్న తన్వీ శర్మకు 9,120 డాలర్ల (రూ. 7 లక్షల 82 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 5950 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



'హ్యాట్రిక్' టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో బరిలోకి దిగిన స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్‌కు ఊహించని ప్రతిఘటన ఎదురైంది. తొలి రౌండ్ అడ్డంకిని అలవోకగా అధిగమిస్తాడని భావించినా... ఇటలీ సీనియర్ ప్లేయర్ ఫాగ్నిని పోరాటపటిమ కారణంగా ఏకంగా 4 గంటల 37 నిమిషాలు చెమటోడ్చి... చివరకు ఐదు సెట్‌ల పోరులో అల్‌కరాజ్ గట్టెక్కాడు.

గట్టెక్కిన అల్‌కరాజ్

తొలి రౌండ్‌లోనే ఓడిన మెద్వెదెవ్, రూనె

- సబలెంకా శుభారంభం
- మాజీ రన్నరప్ ఆన్స్ జబర్ నిష్క్రమణ

లండన్: టెన్నిస్ సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ వింబుల్డన్‌లో తొలి రోజు సంచలన ఫలితాలు నమోదయ్యాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో రష్యా స్టార్, తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా), ఎనిమిదో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టగా... డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) తొలి రౌండ్‌ను దాటేందుకు తీవ్రంగా శ్రమించాడు. ప్రపంచ 138వ ర్యాంకర్ ఫాబియో ఫాగ్నిని (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 7-5, 6-7 (5/7), 7-5, 2-6, 6-1తో గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 4 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 14 ఏస్‌లు సంధించి, 9 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 62 అనవసర తప్పిదాలు చేసి, 52 విన్నర్స్ కొట్టాడు. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన అల్‌కరాజ్... ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో బెంజిమిన్ బోంజి (ఫ్రాన్స్) 3 గంటల 7 నిమిషాల్లో 7-6 (7/2), 3-6, 7-6 (7/3), 6-2తో మెద్వెదెవ్‌పై... నికోలస్ జారీ (చెక్ రిపబ్లిక్) 3 గంటల 34 నిమిషాల్లో 4-6, 4-6, 7-5, 6-3, 6-4తో హోల్గర్ రూనెపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. వాలెంటిన్ రాయర్ (ఫ్రాన్స్)తో జరిగిన మ్యాచ్‌లో 24వ సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) తొలి రెండు సెట్‌లను 3-6, 2-6తో కోల్పోయాక వెన్నునొప్పితో ఆటను కొనసాగించలేక వైదొలిగాడు.



సబలెంకా

నిశేష్‌కు నిరాశ

కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఆడుతున్న తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ నిశేష్ బసవరెడ్డికి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో 20 ఏళ్ల నిశేష్ 6-7 (5/7), 3-6, 2-6తో అమెరికాకే చెందిన లెర్నర్ టియెన్ చేతిలో ఓడిపోయాడు. నిశేష్‌కు 66,000 పౌండ్లు (రూ. 77 లక్షల 56 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

కష్టపడ్డ కీస్

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సబలెంకా 6-1, 7-5తో కార్సన్ బ్రాన్‌స్టిన్ (కెనడా)పై గెలిచింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఆరో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) గెలిచేందుకు కష్టపడింది. 2 గంటల 41 నిమిషాల పోరులో కీస్ 6-7 (4/7), 7-5, 7-5తో ఎలీనా రూసె (రొమేనియా)పై నెగ్గింది. 20వ సీడ్, 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఒస్టాపెంకో (లాత్వియా)... 2022, 2023 రన్నరప్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. తొమోవా (బల్గేరియా)తో జరిగిన మ్యాచ్‌లో జబర్ తొలి సెట్‌ను 6-7 (5/7)తో కోల్పోయి, రెండో సెట్‌లో 0-2తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగింది. బ్రిటన్ ప్లేయర్ సోనె కార్టల్ 7-5, 2-6, 6-2తో ఒస్టాపెంకోను ఓడించి రెండో రౌండ్‌కు చేరింది. టోర్నీ మొదటిరోజు రికార్డు స్థాయిలో 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో ఆటగాళ్లకు పట్టపగలే చుక్కలు కనబడ్డాయి. చాలా మంది ప్లేయర్లు మ్యాచ్ మధ్యలో బ్రేక్‌లు తీసుకుంటూ... ఐస్ ప్యాక్‌లతో శరీరాన్ని చల్లబర్చుకుంటూ... ఆటను కొనసాగించారు.

ఫైనల్లో నిఖత్



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ స్టార్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ టోర్నీలో నిఖత్ 51 కేజీల విభాగంలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో నిఖత్ 5-0తో లక్షయ (తమిళనాడు)పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో రైల్వేస్ బాక్సర్ జ్యోతితో నిఖత్ తలపడుతుంది. మరోవైపు అంతర్జాతీయ బాక్సర్లు నీతూ ఘంఘాస్ (48 కేజీలు), స్వీటీ బూరా, అల్ఫియా పఠాన్ (80 కేజీలు), టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), అంకుశిత బోరో (65 కేజీలు) కూడా ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో నీతూ 5-0తో మంజు రాణి (రైల్వేస్)పై, స్వీటీ 5-0తో బబితా బిష్త్ (ఆలిండియా పోలీస్)పై, అంకుశిత 5-0తో అనిత కుందు (ఆలిండియా పోలీస్)పై గెలిచారు. లవ్లీనా, అల్ఫియా.. రిఫరీ స్టాప్స్ ద కంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) పద్ధతిలో విజయం సాధించారు. లవ్లీనా పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి స్నేహ (ఉత్తరప్రదేశ్) తట్టుకోలేకపోవడంతో రిఫరీ తొలి రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపి వేయగా... అల్ఫియా పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి గరీమా (రాజస్తాన్) చేతులెత్తేయడంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను నిలిపివేశారు. తెలంగాణకు చెందిన యశీ శర్మ (65 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. సెమీఫైనల్లో యశీ శర్మ 0-5తో శశి (రైల్వేస్) చేతిలో ఓడిపోయింది. 54 కేజీల విభాగంలో ప్రీతి (టాప్స్), తనూ (సర్వీసెస్)... 57 కేజీల విభాగంలో బాబిరోజీసనా చాను (రైల్వేస్), కమల్జీత్ కౌర్ గిల్ (ఆలిండియా పోలీస్)... ప్లస్ 80 కేజీల విభాగంలో రితిక (సాయ్), శివాని తోమర్ (ఆలిండియా పోలీస్) ఫైనల్లోకి అడుగు పెట్టారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


పాన్ ఇండియా చిత్రం ఆరంభం



● పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, నారాయణ రావు

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం శనివారం ఆరంభమైంది. ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటించనున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్‌పై పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. ''ఈ సినిమాకి సంబంధించిన అన్ని విషయాల్లో పూరి చాలా కేర్ తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులని అలరించే స్క్రిప్ట్‌ని సిద్ధం చేయడంతో పాటు నటీనటులను కూడా ఎంపిక చేశారు. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ఈ వారంలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా చిత్రం విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. టబు, విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి సీఈఓ: విషు రెడ్డి.

వైవిధ్యమైన ఆల్కహాల్



● 'అల్లరి' నరేశ్

'అల్లరి' నరేశ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రానికి 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఆల్కహాల్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఫిక్స్ చేసి, నరేశ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు చిత్ర యూనిట్. ''హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న నరేశ్ నటిస్తున్న మరో వైవిధ్యమైన చిత్రం 'ఆల్కహాల్'. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నాం'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, సహ నిర్మాత: వెంకట్ ఉప్పుటూరి, కెమెరా: జిజు సన్నీ.



● విష్ణు మంచు, మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంచు మోహన్‌బాబు

కన్నప్ప ఊహకు మించి ఉంది

- మల్లు భట్టి విక్రమార్క

'కన్నప్ప' చిత్రం ఊహకు మించి ఉంది. అర్జునుడిగా, తిన్నడిగా, కన్నప్పగా విష్ణు అద్భుతంగా నటించారు. ఇంత గొప్ప చిత్రం నిర్మించిన మోహన్ బాబుగారికి అభినందనలు. ఇదొక మైల్‌స్టోన్ చిత్రం అవుతుంది'' అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కన్నప్ప'. మంచు మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల అయింది. కాగా 'కన్నప్ప' సినిమాని మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి వారు ప్రత్యేకంగా వీక్షించారు. అనంతరం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ-''చాలా రోజుల తర్వాత 'కన్నప్ప' వంటి మంచి చిత్రాన్ని చూశాను. శివ భక్తులంతా పరవశించిపోయేలా ఈ సినిమా తీశారు. మన కథలను అందరికీ తెలిసేలా చేయాలి. ఇలాంటి చిత్రాల్ని అప్పుడప్పుడు అయినా తీయాలని అందర్నీ కోరుతున్నాను'' అన్నారు.

కొత్తపల్లిలో ఒకప్పుడు!



● రానా

'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' వంటి సినిమాలను నిర్మించిన నటి-నిర్మాత ప్రవీణ పరుచూరి 'కొత్తపల్లిలో ఒకప్పుడు..' అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 'కేరాఫ్ కంచరపాలెం' సినిమాను నిర్మించిన రానా, ప్రవీణ కలిసి మళ్లీ 'కొత్తపల్లిలో ఒకప్పుడు..' చిత్రం నిర్మిస్తున్నారు. ''ఓ ఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఓ గ్రామీణ యువకుడి జీవితం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుంది. తెలుగు సినిమాకు ఒక లవ్‌లెటర్‌లాంటిది ఈ చిత్రం. నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం''అని యూనిట్ పేర్కొంది.

దీపావళికి కె-ర్యాంప్



● కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కె-ర్యాంప్' ఈ దీపావళికి థియేటర్స్‌లో సందడి చేయనుంది. ఈ చిత్రంలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్నారు. జైన్స్ నాని దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ పతాకాలపై రాజేష్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కాగా సోమవారం 'కె-ర్యాంప్' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, ఈ చిత్రాన్ని ఈ దీపావళికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ''కిరణ్ అబ్బవరం కెరీర్‌లో 'కె-ర్యాంప్' చిత్రం మరో ఫ్రెష్ అటెంప్ట్ అవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ-నిర్మాత:జి. బాలాజీ.

థ్యాంక్యూ డియర్ విజయం సాధించాలి

- వీవీ వినాయక్



● రేఖా నిరోషా, వీవీ వినాయక్, ధనుష్ రఘుముద్రి

ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'థ్యాంక్యూ డియర్'. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వంలో మహాలక్ష్మి ప్రొడక్షన్స్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ వీవీ వినాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''శ్రీహరిగారి కుటుంబం నుండి వచ్చిన ధనుష్ రఘుముద్రి హీరోగా రూపొందిన 'థ్యాంక్యూ డియర్' చిత్రం గొప్ప విజయం సాధించాలి'' అన్నారు. ''వినాయక్‌గారు మా టీజర్‌ను లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది'' అని ధనుష్ రఘుముద్రి, రేఖ నిరోషా తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: పీఎల్‌కే రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: బలిజ పునీత్ రాయల్, సహ నిర్మాత: పీబీవీవీ సత్య నారాయణ.

ధర్మం కోసం యుద్ధం

"తమ్ముడు' సినిమాకు బడ్జెట్, క్రియేటివ్ పరంగా బాధ్యతను 'దిల్' రాజుగారు నాకే అప్పగించారు. ఎనిమిది నెలల్లో చిత్రీకరణను పూర్తి చేయాలనుకున్నాం. కానీ రెండేళ్లు పట్టింది. అయితే ముందుగా అనుకున్న బడ్జెట్‌లోనే పూర్తి చేశాం'' అని దర్శకుడు వేణు శ్రీరామ్ అన్నారు. నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'తమ్ముడు'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వేణు శ్రీరామ్ మాట్లాడుతూ-''ధర్మం కోసం ఓ తమ్ముడు చేసే యుద్ధమే ఈ సినిమా. 'తమ్ముడు' టైటిల్ పెట్టాలన్నది నా నిర్ణయమే. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటుగా, డిఫరెంట్ లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమా కోసం ఆర్చరీలో శిక్షణ తీసుకున్నాడు నితిన్. లయగారి పాత్ర కోసం ముందుగా ఓ స్టార్ హీరోయిన్‌ను సంప్రదిస్తే.. కుటుంబ సమస్యల కారణంగా ఆ సమయంలో చేయలేనని చెప్పారు. నా కుమార్తె బేబీ దిత్యను కూడా ఆడిషన్స్ చేసి తీసుకున్నాం. నేను పారితోషికం ఇంకా తీసుకోలేదు.. కానీ, నా కుమార్తెకు ఇప్పించాను. నితిన్ ప్రస్తుత సక్సెస్ ట్రాక్‌ని బట్టి చూస్తే ఓటీటీ, శాటిలైట్ బిజినెస్ పరంగా మేము చాలా హ్యాపీగా ఉన్నాం. నా ప్రయాణం 'దిల్'రాజుగారితోనే సాగుతుంది. ఆయనలాంటి సౌకర్యం ఇచ్చే నిర్మాతలు కుదిరితే వారితోనూ సినిమాలు చేస్తాను. అల్లు అర్జున్‌తో నేను చేయాల్సిన 'ఐకాన్' సినిమా ఆగిపోయినందుకు నాకేం బాధ లేదు.. ఎందుకంటే నా జీవితంలో ఆల్రెడీ ఫెయిల్యూర్స్ చూశాను. నా తొలి సినిమాకు, రెండో సినిమాకు మధ్య ఏడేళ్ల విరామం ఉంది'' అని తెలిపారు.



● వేణు శ్రీరామ్



● లావణ్య, రమేష్, సర్వాణి

రైతుల కష్టాల నేపథ్యంతో..

రమేష్ ఉప్పు హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వీడే మన వారసుడు'. లావణ్యా రెడ్డి, సర్వాణి మోహన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ-''ఒకప్పుడు సందేశాత్మక చిత్రాలు వచ్చేవి. ఆ తరహాలో ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''రైతుల కష్టాలను చక్కగా ఆవిష్కరించిన కుటుంబకథా చిత్రం ఇది'' అని పేర్కొన్నారు రమేష్ ఉప్పు. ఈ కార్యక్రమంలో దర్శకులు సముద్ర, వీఎన్ ఆదిత్య, నటుడు-దర్శక-నిర్మాత సాయి వెంకట్, పోలీసాఫీసర్ రమావత్ తేజ, హీరో కృష్ణ సాయి, కాంగ్రెస్ నాయకుడు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మంగళవారం
1-7-2025

బిజినెస్



స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
452	121
83,606	25,517

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,314	△	40
డోజోన్స్	43,981	△	180
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,761	▽	38
డాక్స్	23,910	▽	124
షాంఘై	3,444	△	20
నికాయ్	40,487	△	337

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.90	118.89
€	యూరో	ఎస్‌బీఐ	98.92	101.66
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.59	60.12
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.01	57.23
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.94	69.64
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	23.48
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.46	24.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.92

పొదుపు పథకాలపై వడ్డీ రేటు యథాతథం



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై 1తో (నేటితో) ప్రారంభమయ్యే త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయరాదని కేంద్రం నిర్ణయించింది. దీనితో ప్రధానంగా పోస్టాఫీసులు, బ్యాంకులు నిర్వహించే చిన్న మొత్తాల స్కీములపై వడ్డీ రేట్లు వరుసగా ఆరో క్వార్టర్‌లోనూ యథాతథంగా కొనసాగనున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సుకన్య సమృద్ధి పథకం కింద రేటు 8.2 శాతంగా, మూడేళ్ల టర్మ్ డిపాజిట్లపై 7.1 శాతంగా కొనసాగుతుంది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీములు, కిసాన్ వికాస్ పత్రాలపై పైనా వరుసగా 7.1 శాతం, 4 శాతం, 7.5 శాతంగా వడ్డీ రేటు ఉంటుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ రేటు 7.7 శాతంగా కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూణ్నెల్లకోసారి స్మాల్ సేవింగ్స్ స్కీములపై వడ్డీ రేట్లను నోటిఫై చేస్తుంది. చివరిసారిగా 2023-24 నాలుగో త్రైమాసికంలో కొన్ని స్కీముల్లో మార్పులు చేసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ కీలకం: ఆర్‌బీఐ	వాణిజ్య వాహనాలకు ఇన్‌ఫ్రా దన్ను

పెట్‌కేర్ @ 60,000 కోట్లు

ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల ఫోకస్

- మార్కెట్లో వాటా కోసం పోటాపోటీ
- ట్రెండ్స్, డిమాండ్‌పై మరింతగా దృష్టి
- అంకుర సంస్థల్లో పెట్టుబడులు

పెంపుడు జంతువులు ఇప్పుడు జీవితంలో, లైఫ్‌స్టయిల్‌లో భాగంగా మారుతున్నాయి. వాటిని కుటుంబ సభ్యులుగా పరిగణిస్తూ, వాటి సంరక్షణ కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు జంతుప్రేమికులు సిద్ధంగా ఉంటున్నారు. దీంతో ఖరీదైన ప్యాకేజ్డ్ పౌష్టికాహారం నుంచి సప్లిమెంట్లు, డయాగ్నోస్టిక్స్ సహా పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన పెట్ మార్కెట్ భారీ స్థాయిలో విస్తరిస్తోంది. ప్రస్తుతం దేశీయంగా ఈ మార్కెట్ ఏకంగా 7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 60,000 కోట్లు) స్థాయిలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఎంసీజీ సంస్థలు కూడా దీనిపై మరింతగా ఫోకస్ పెడుతున్నాయి. మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఇటీవలే విప్రో కన్జూమర్ కేర్ వెంచర్స్ సంస్థ గూఫీ టెయిల్స్ అనే సంస్థలో ఇన్వెస్ట్ చేసింది. ఇక డ్రూల్స్‌లో మరో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే వాటాలు కొనుగోలు చేసింది. అలాగే ప్యూరినా అనే సంస్థను కొనుగోలు చేసింది. మరోవైపు, 2022లో క్యానిస్ లూపస్‌లో ఇమామి 30 శాతం వాటాలు కొనుగోలు చేసింది. అప్పటినుంచి క్రమక్రమంగా పెట్టుబడిని పెంచుకుంటూ వస్తోంది. ఇలా, మార్కెట్‌పై ఆసక్తిగానే ఉన్నప్పటికీ ప్రస్తుతానికి ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలు ఆచితూచి అడుగేస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉన్న సంస్థల్లో మైనారిటీ వాటాలను తీసుకుంటూ మార్కెట్‌ను అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నాయని వివరించాయి. అయితే, డీ2సీ (డైరెక్ట్ టు కన్జూమర్) బ్రాండ్ల విశ్వసనీయతను పెంచుకుంటూ, వృద్ధి చెందే కొద్దీ వాటిని పెద్ద కంపెనీలు కొనుగోలు చేయొచ్చని పేర్కొన్నాయి. విస్తరణ, లాభదాయకత పెరిగే కొద్దీ తదుపరి దశలో స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టయ్యే అవకాశాలూ వివరించాయి.

పట్టణీకరణ దన్ను..

వినియోగదారుల ధోరణులే కాకుండా వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ కూడా ఈ విభాగానికి దన్నుగా ఉంటోంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, ఆదాయాలు ఆర్జిస్తుండటం, కుటుంబ స్వరూపం మారుతుండటం వంటి అంశాలు కూడా కొంత దీనికి దోహదపడుతున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తప్పనిసరి కాని అంశాలపై భారీగా ఖర్చు చేయగలిగేంతగా ఆదాయం ఉండే సంపన్న కుటుంబాలు, పెంపుడు జంతువులపై మరింతగా వెచ్చిస్తుండటాన్ని ఇది ప్రతిబింబిస్తోందని పేర్కొన్నాయి. 2019-2024 మధ్య కాలంలో దేశీయంగా జంతు సంరక్షణ ఉత్పత్తులు, సేవలు అందించే అంకుర సంస్థలు దాదాపు 121.3 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. 2021లో 13 డీల్స్ ద్వారా ఏకంగా 56.7 మిలియన్ డాలర్లు సేకరించాయి. 2024లో ఇది 17.4 మిలియన్ డాలర్లుగా ఉంది. బ్లింకిట్, జెప్టోలాంటి క్విక్-కామర్స్ ప్లాట్‌ఫాంలు విస్తరించే కొద్దీ పెట్ ఫుడ్, గ్రూమింగ్ ఉత్పత్తులు నిమిషాల్లో డెలివరీ అవుతున్నాయి. దీని వల్ల మార్కెట్ విస్తరిస్తున్నప్పటికీ, పోటీ కూడా తీవ్రతరమవుతోంది. పెట్ కేర్ ఉత్పత్తులకు క్విక్ కామర్స్ కీలకమైన మాధ్యమంగా మారే అవకాశం ఉండగా, అదే సమయంలో డీ2సీ సంస్థలు తమ బ్రాండ్లను నిలబెట్టుకోవడానికి, వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనేందుకు మరింతగా కసరత్తు చేయాల్సి రానుంది.

ఏటా 15% వృద్ధి..


ఈ విభాగం ఏటా 15 శాతం వృద్ధి చెందుతోందని కన్సల్టెన్సీ సంస్థ ఈవై-పార్థినాన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత డిమాండ్‌లో పావు వంతు భాగాన్ని భర్తీ చేసేందుకు దిగుమతులపై ఆధారపడాల్సి ఉంటోందని పేర్కొన్నాయి. ఈ అంతరాలను తగ్గించేందుకు పెద్ద బ్రాండ్లు రంగంలోకి దిగుతున్నాయని, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా, స్థానికంగా ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతున్నాయని వివరించాయి. భారతీయ పెట్ పేరెంట్స్ కోసం భారతీయ బ్రాండ్లను తీర్చిదిద్దే అవకాశం ఉండటంతో విప్రో కన్జూమర్ కేర్‌లాంటి సంస్థలు ఈ విభాగంలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొన్నాయి. పెట్స్‌ను కుటుంబంలో భాగంగా చూసే ధోరణి పెరుగుతున్న కారణంగా వాటి సంరక్షణపై మరింతగా వెచ్చించడంపై వినియోగదారులు దృష్టి పెడుతున్నారు. దీంతో ఈ మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆహారం, గ్రూమింగ్, డయాగ్నోస్టిక్స్‌లాంటి అన్ని విభాగాల్లోను పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని గూఫీ టెయిల్స్ వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో క్యాట్ ఫుడ్, ఫ్రీజ్-డ్రైడ్ మీల్స్, సప్లిమెంట్లకు మరింత డిమాండ్ నెలకొంటుందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్



పరిశ్రమలు.. నేల చూపు!

- 9 నెలల కనిష్టానికి పారిశ్రామికోత్పత్తి
- మే నెలలో 1.2 శాతం వృద్ధి
- మైనింగ్, విద్యుత్‌లో మైనస్ పనితీరు



న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి మే నెలలో 1.2 శాతానికి పరిమితమైంది. 2024 ఆగస్ట్ తర్వాత ఇదే అత్యంత కనిష్ట స్థాయి. ముందస్తు వర్షాల రాకతో తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల్లో పనితీరు నిదానించడం ఇందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకటించింది. 2024 మే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6.3 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించి ఐఐపీ వృద్ధి రేటు 2.7 శాతంగా కాగా, దీన్ని 2.6 శాతానికి ఎన్ఎస్ఓ సవరించింది.

- తయారీ రంగంలో వృద్ధి మే నెల 2.6%కి పరిమితమైంది. గతేడాది ఇదే నెలలో వృద్ధి 5.1%.
- మైనింగ్ రంగంలో ఉత్పత్తి మైనస్ 0.1 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఈ రంగంలో వృద్ధి 6.6 శాతంగా ఉంది.
- విద్యుత్ రంగంలో ఉత్పత్తి మైనస్ 5.8 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే నెలలో 13.7 శాతం వృద్ధి నమోదైంది.
- క్యాపిటల్ గూడ్స్ రంగంలో భిన్నమైన పరిస్థితి కనిపించింది. 14.1 శాతం వృద్ధి కనిపించింది. క్రితం ఏడాది మే నెలలో వృద్ధి కేవలం 2.6 శాతంగానే ఉంది.
- కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగంలో పనితీరు మైనస్ 0.7 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో 12.6 శాతం వృద్ధిని చూసింది.
- కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్ రంగంలోనూ ఉత్పత్తి మైనస్ 2.4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 7.6 శాతం వృద్ధి కనిపించింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్, మే) పారిశ్రామికోత్పత్తి వృద్ధి 1.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 5.7 శాతంగా ఉంది.

బ్యాంకు షేర్లలో లాభాల స్వీకరణ

నాలుగు రోజుల లాభాలకు బ్రేక్

- 84 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 121 పాయింట్ల నష్టం



ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల నాలుగు రోజుల లాభాలకు సోమవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 452 పాయింట్లు నష్టపోయి 83,606 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు బలహీనపడి 25,517 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ బలహీన సంకేతాల ప్రభావంతో రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 577 పాయింట్లు క్షీణించి 83,482 వద్ద, నిఫ్టీ 164 పాయింట్లు పతనమై 25,473 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, ఇండస్ట్రీయల్స్, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా కంపెనీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియాలో తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్ దేశాల స్టాక్ సూచీలు 1.50 శాతం నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పతనమయ్యాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 26 పైసలు పతనమై 85.76 వద్ద స్థిరపడింది.
- టొరెంట్ ఫార్మా మెజారిటీ వాటా కొనుగోలు ప్రకటనతో జేబీ కెమికల్స్ ఫార్మాస్యూటికల్స్ షేరు 7% నష్టపోయి ఇంట్రాడే కనిష్టం రూ.1,678 వద్ద స్థిరపడింది. అయితే వాటా చేజిక్కించుకున్న టొరెంటో ఫార్మా షేరు 2% పెరిగి రూ.3,409 వద్ద ముగిసింది.
- ఎండీ, సీఈవో శ్రీకృష్ణన్ హరిహర శర్మ రాజీనామాతో కర్ణాటక బ్యాంకు షేరు 6% పతనమై రూ.196 వద్ద స్థిరపడింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (02/2026) ఉద్యోగాలు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలచేసింది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథ్‌మేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్(సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు)/ఇంటర్ ఒకేషనల్ లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** 02.07.2005 నుంచి 02.01.2009 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఫేజ్–1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్–2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్–1, అడాప్టబిలిటీ టెస్ట్–2), ఫేజ్–3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది:**11.07.2025
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది:** 31.07.2025.
- **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 25.09.2025.
- **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ ఉద్యోగాలు

చింద్వారా రీజియన్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- **పోస్టుల వివరాలు:** ఫ్యాకల్టీ–01, ఆఫీస్ అసిస్టెంట్–04, అసిస్టెంట్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. టైపింగ్ స్కిల్స్, స్థానిక భాషలో చదవడం, రాయడం వచ్చి ఉండాలి.
- **వయసు:** 21 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు ఫ్యాకల్టీ పోస్టులకు రూ.20,000, ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.12,000, అసిస్టెంట్‌కు రూ.8000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ హెడ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, చింద్వారా పంజాబ్ భవన్ వద్ద, చిట్నవిస్ గంజ్, నర్సింగ్‌పూర్ రోడ్, చింద్వారా–480002 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.07.2025.
- **వెబ్‌సైట్:** https://centralbankofindia.co.in

డీఎంహెచ్‌వో పార్వతీపురం మన్యం జిల్లాలో 34 ఆశా వర్కర్ పోస్టులు

డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్(డీఎంహెచ్‌వో), పార్వతీపురం మన్యం జిల్లాలో ఆశా వర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 34.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 25 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.10,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా .
- **దరఖాస్తులకు చివరితేది:** 05.07.2025.
- **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

ఎన్‌హెచ్‌ఏఐ, న్యూఢిల్లీలో అసిస్టెంట్ హైవే ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డీపీఆర్‌లో పనిచేయడానికి ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ హైవే ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(సివిల్ ఇంజనీర్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.45,000.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** hr.nhipmpl@nhai.org.
- **దరఖాస్తులకు చివరితేది:** 02.07.2025.
- **వెబ్‌సైట్:** https://nhai.gov.in

క్రేజీ కొలువు పీవో

బ్యాంకింగ్ రంగంలో అత్యంత క్రేజీ కొలువు.. ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో). దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 541 పీవో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులో ఆఫీసర్ కొలువు కోరుకునే వారికి ఇది చక్కటి అవకాశం. ఏదైనా డిగ్రీతో ఈ పీవో పోస్టులకు పోటీపడొచ్చు. మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ పీవో నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్, వేతనాలు, కెరీర్ తదితర వివరాలు..

» 541 పీవో పోస్టులకు ఎస్‌బీఐ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు పోటీపడొచ్చు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

యువతలో బ్యాంకు ఉద్యోగాల పట్ల క్రేజ్ పెరుగుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఆఫీసర్ కొలువు కోరుకోని వారుండరు. సంప్రదాయ డిగ్రీ ఉత్తీర్ణులు మొదలు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సైతం బ్యాంక్ పరీక్షలకు ఎంతోకాలంగా ప్రిపరేషన్ సాగిస్తుంటారు. ఇలాంటి అభ్యర్థులు ఎస్‌బీఐ పీవోకు పోటీ పడి విజయం సొంతం చేసుకోవచ్చు.

- **పోస్టు:** ప్రొబేషనరీ ఆఫీసర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 541(ఇందులో అన్ రిజర్వ్‌డ్ 203 పోస్టులు, ఎస్సీ 80 పోస్టులు, ఎస్టీ 73 పోస్టులు, ఓబీసీ 135 పోస్టులు, ఈడబ్ల్యూఎస్ 50 పోస్టులు).

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అర్హత పరీక్ష ఫైనల్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు 30.09.2025 నాటికి డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులైనట్లు సర్టిఫికెట్ చూపాల్సి ఉంటుంది.

వయసు

01.04.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

- ఎస్‌బీఐ పీవో పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఇందులో ఫేజ్1లో ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, ఫేజ్ 2లో ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామినేషన్, చివరగా ఫేజ్ 3లో సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి.

వంద మార్కులకు ప్రిలిమ్స్

- తొలిదశ ఫేజ్ 1లో 100 మార్కులకు ప్రిలిమనరీ పరీక్ష నిర్వహిస్తారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై 40 ప్రశ్నలు–40 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ నుంచి 30 ప్రశ్నలు–30 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు–30 మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం 60 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/4 మార్కులను తగ్గిస్తారు. ఈ పరీక్షలో ఎలాంటి సెక్షనల్ కటాఫ్ విధానం లేదు.
- ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగా కేటగిరీల వారిగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఇలా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. ఫేజ్1లో సాధించిన మార్కులను తుది ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోరు.

మెయిన్ పరీక్ష ఇలా

- మెయిన్ ఎగ్జామ్ కూడా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో ఆబ్జెక్టివ్ పరీక్ష 200 మార్కులకు, డిస్క్రిప్టివ్ పరీక్ష 50 మార్కులకు ఉంటాయి. ఆబ్జెక్టివ్ పరీక్ష పూర్తికాగానే డిస్క్రిప్టివ్ పరీక్ష సైతం నిర్వహిస్తారు. ఈ పరీక్షను కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది.
- మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగా 200 మార్కులకు జరిగే ఆబ్జెక్టివ్ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు– 60 మార్కులకు, డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 30 ప్రశ్నలు–60 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ / ఎకానమీ/బ్యాంకింగ్‌నాలెడ్జ్ 60 ప్రశ్నలు–60 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–20 మార్కులకు ఉంటాయి. ఇలా మొత్తం 170 ప్రశ్నలు–200 మార్కులకు మెయిన్ ఆబ్జెక్టివ్ పరీక్ష జరుగుతుంది. ప్రతి విభాగానికి ప్రత్యేక పరీక్ష వ్యవధి ఉంటుంది. ఈ పరీక్షకు మొత్తంగా మూడు గంటల సమయం కేటాయించారు.
- మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగా నిర్వహించే డిస్క్రిప్టివ్ పరీక్షలో కమ్యూనికేషన్ స్కిల్స్(ఈమెయిల్స్, రిపోర్ట్స్, సిట్యువేషన్ అనాలసిస్, ప్రిసైజ్ రైటింగ్)పై మూడు ప్రశ్నలు 50 మార్కులకు అడుగుతారు. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు.
- మెయిన్ పరీక్షలో ప్రతి విభాగంలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. పోస్టుల సంఖ్యను బట్టి సెక్షనల్ కటాఫ్‌ను బ్యాంక్ నిర్ణయిస్తుంది. మెయిన్ పరీక్షలో సాధించిన సగటు మార్కుల ఆధారంగా కేటగిరీల వారీగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఈ జాబితా నుంచి ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పును ఫేజ్ 3కి ఎంపిక చేస్తారు.

50 మార్కులకు ఫేజ్ 3

ఎంపిక ప్రక్రియలో మూడో దశ ఫేజ్ 3లో..సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. ఇందులో గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు కేటాయించారు. ఫేజ్ 3లో కనీస అర్హత మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది.

తుది ఎంపిక ఇలా

- అభ్యర్థులు ఫేజ్ 2, ఫేజ్ 3లో వేర్వేరుగా అర్హత సాధించాల్సి ఉంటుంది. ఫేజ్ 2 మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో పొందిన మార్కులను.. ఫేజ్ 3 మార్కులతో కలిపి తుది జాబితా రూపొందిస్తారు. మెయిన్ పరీక్షకు కేటాయించిన 250 మార్కులను 75 మార్కులకు, ఫేజ్ 3కి కేటాయించిన 50 మార్కులను 25 మార్కులకు నార్మలైజేషన్ చేస్తారు. ఇలా వంద మార్కులకు సాధించిన స్కోర్ ఆధారంగా కేటగిరీల వారీగా తుది విజేతలను ప్రకటిస్తారు.

వేతనం

ప్రారంభ మూల వేతనం రూ.48,480 లభిస్తుంది. నాలుగు ముందస్తు ఇంక్రిమెంట్లు దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు, సౌకర్యాలు అందుతాయి. ముంబై వంటి చోట్ల పనిచేసే అభ్యర్థులకు అన్నీ కలుపుకొని వార్షిక వేతనం రూ.20.43 లక్షలు ఉంటుంది.

కెరీర్ స్కోప్

- ఎంపికైన అభ్యర్థులకు బ్యాంకులో చేరడానికి ముందే బ్యాంక్ ప్రాథమిక కార్యకలాపాలపై అవగాహన కల్పించేలా ఆన్‌లైన్ కోర్సు అందిస్తారు. దీన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.అదేవిధంగా బ్యాంకులో కనీసం మూడేళ్లు పనిచేస్తామని హామీ ఇస్తూ రూ.2లక్షల పూచీకత్తు బాండ్ ఇవ్వాలి.
- బ్యాంకులో చేరిన అభ్యర్థులు రెండేళ్లపాటు ప్రొబేషనరీ ఆఫీసర్ హోదాలో ప్రొబేషన్‌లో కొనసాగుతారు. ఈ సమయంలో వీరి పనితీరును నిరంతరం మదింపు చేస్తారు. ప్రొబేషన్‌ను సైతం విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–1 హోదా ఇస్తారు.

ఆన్‌లైన్ పరీక్షలో రాణించేలా

- ప్రిలిమ్స్ జూలై/ఆగస్టులో,మెయిన్స్ సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి లేదు. కాబట్టి ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికి ఉమ్మడి ప్రిపరేషన్ సాగించేలా అభ్యర్థులు ప్రణాళిక రూపొందించుకోవాలి.
- తొలుత సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. అనంతరం పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి.
- రెండు పరీక్షల్లో కామన్‌గా ఉన్న విభాగాలను గుర్తించాలి. ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ రెండు పరీక్షల్లోనూ ఉన్నాయి. కాబట్టి తొలుత వీటి ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత కంప్యూటర్ అప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ /బ్యాంకింగ్ నాలెడ్జ్‌పై దృష్టిసారించాలి.
- ఇంగ్లిష్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వొక్యాబులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. అదేవిధంగా మెయిన్ పరీక్షలోని డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించి ఈమెయిల్స్, రిపోర్ట్, ప్రెసీ రైటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో మంచి మార్కుల కోసం అరిథమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్ –డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డేటా సఫిషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగం కోసం బ్యాంకింగ్ రంగ తాజా పరిణామాలు,ఎకానమీ, బ్యాంకింగ్ టెర్మినాలజీ, జాతీయ,అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి. దీనికోసం ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరిస్తే సరిపోతుంది.



ముఖ్య సమాచారం


- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 14.07.2025
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** జూలై/ఆగస్టు 2025
- **ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష:** సెప్టెంబర్ 2025
- **వెబ్‌సైట్:** https://bank.sbi/web/careers /currentopenings

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–ఇండియన్ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

బడికెళ్లే పిల్లలకు ఉదయం టిఫిన్ ఫార్ములా...

50-25-25



చిప్స్, స్వీట్ డ్రింక్స్, చాక్లెట్లు వద్దు

పిండిపదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు తగు పాళ్లలో

చిరుధాన్యాలను నెమ్మదిగా అలవాటు చేయొచ్చు

'సాక్షి'తో ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. భారతీ కులకర్ణి

స్కూళ్ల సీజన్ ప్రారంభమైపోయింది. తల్లిదండ్రులందరికీ.. తమ పిల్లలను చక్కగా తయారుచేయడం ఒక యజ్ఞమైతే.. వారికి బాక్సుల్లో చిరుతిళ్లు, మధ్యాహ్నం భోజనానికి ఏమేం పెట్టాలో నిర్ణయించి, తయారుచేయడం లేదా కొనిపెట్టడం మరో యజ్ఞం. పిల్లలకు మంచి పోషకాహారం పెట్టాలని చాలామందికి ఉంటుంది గానీ తెలియక కొందరు, సమయం లేక మరి కొందరు పెట్టలేరు. అలాంటి వాళ్లందరి కోసం.. 'అసలు రోజువారీ భోజనంలో అన్ని పోషకాలూ అందాలంటే ఏయే పదార్థాలు పెట్టాలి.. మాంసకృత్తులు ఎంత ఇస్తే మంచిది.. చిరు ధాన్యాలను పిల్లలకు పెట్టవచ్చా..' ఇలాంటి ఎన్నో విలువైన విషయాలు 'సాక్షి'తో పంచుకున్నారు జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డా. భారతి కులకర్ణి.

సాక్షి, సాగుబడి

ప్ర: స్కూళ్ల సీజన్ మళ్లీ ప్రారంభమైంది. ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ పిల్లల, ముఖ్యంగా బడుల్లో చదువుకుంటున్న పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్న విషయం మనకు తెలిసిందే. ఈ సమస్యపై ఎన్ఐఎన్ ఇటీవల చేసిన అధ్యయనాలేమైనా ఉన్నాయా?

జ: ఉన్నాయి. అధికంగా కొవ్వు, ఉప్పు, చక్కెర కలిగిన ఇలాంటి ఆహార పదార్థాల వల్ల మన పిల్లల ఆరోగ్యానికి జరుగుతున్న నష్టం గురించి భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కి అనుబంధంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) అనేక అధ్యయనాలు నిర్వహించింది. వీటి ఫలితాలను ఫాట్ స్టడీ రిపోర్ట్స్, ఎఫ్.ఓ.పి.ఎస్.ఎల్. స్టడీ 2023, డైటరీ గైడ్ లైన్స్ 2024 వంటి అనేక నివేదికల్లో పొందుపరచి జాతీయ విధాన చర్చల కోసం అందించింది.

ప్ర: ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకునే పిల్లలు వారం రోజుల్లో తినదగిన ఆరోగ్య దాయకమైన చిరుతిండ్లను సూచించగలరా?

జ: స్కూల్ టిఫిన్/స్నాక్స్ బాక్సుల్లో పెట్టడానికి 'సింపుల్ వీక్లీ ప్లాన్' ఈ కింది విధంగా ఉంటే బాగుంటుంది.

రోజు	ఆహారం
సోమవారం	ఇడ్లీలు (చట్నీతో) + ఆయా కాలాల్లో పండే పండ్లు
మంగళవారం	కూరగాయ ముక్కలు, అటుకులతో చేసిన పోహా లేదా ఉప్మా + మజ్జిగ
బుధవారం	మొలకల సలాడ్ (నిమ్మ రసంతో) + ఉడికించిన గుడ్డు (కావాలనుకుంటే)
గురువారం	పన్నీరు/కూరగాయలతో కూడిన రోటీ రోల్ + కీరదోస ముక్కలు
శుక్రవారం	చిరుధాన్యాల దోసె + వేరుశనగల చట్నీ
శనివారం	ఉడికించిన మొక్కజొన్న గింజలు, కూరగాయ ముక్కలు + పెరుగు

ప్ర: ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే స్కూలు పిల్లలకు ఉదయపు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్), మధ్యాహ్న భోజనం, రాత్రి ఆహారంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులను ఎంతెంత పాళ్లలో అందించాలి?

జ: పిల్లలు ప్రతి రోజూ నీరసం లేకుండా శక్తిమంతంగా గడపడానికి, ఆరోగ్యంగా ఎదగడానికి పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులతో కూడిన సమతులాహారం అందించాలి. ఈ కింద పేర్కొన్న విధంగా పెడితే బాగుంటుంది:

1. ఉదయపు అల్పాహారం:
50% పిండి పదార్థాలు – శక్తి కోసం
ఉదా: ఇడ్లీ, పోహా, చపాతి, హోల్ గ్రెయిన్ బ్రెడ్ వంటివి
25% ప్రొటీన్ – శరీరం ఎదుగుదల కోసం
ఉదా: పాలు, గుడ్లు, మొలకలు, పప్పు వగైరా
25% ఆరోగ్యకరమైన కొవ్వులు–మెదడు పెరుగుదల కోసం
ఉదా: వేరుశనగలు, బాదం పప్పులు వంటి నట్స్, కొద్ది పరిమాణంలో నెయ్యి

2. మధ్యాహ్న భోజనం:
వరి అన్నం లేదా రొట్టెతో పాటు పప్పు లేదా పెరుగు, ఆ సీజన్‌లో పండే కనీసం ఒక రకం కూరగాయ, ఒక పండు.

3. రాత్రి భోజనం:
మధ్యాహ్న భోజనం మాదిరిగానే ఉండొచ్చు. కాకపోతే కాస్త లైట్‌గా ఉంటే మంచిది. అంటే, తక్కువ నూనె, ఎక్కువ కూరగాయలు పెట్టాలి. మరీ రాత్రి ఆలస్యంగా కాకుండా, ముందే భోజనం చేసేయాలి. ఇలా ఆహారం తీసుకునే పిల్లలు స్కూల్లో పాఠాలపై దృష్టిని కేంద్రీకరించగలుగుతారు. చురుగ్గా ఉంటారు. ఆరోగ్యంగా తగినంత బరువుతో ఎదుగుతారు.

ప్ర: ప్రతి కిలోగ్రామ్ శరీర బరువుకు 1 గ్రాము మాంసకృత్తులు తినాలని చెబుతూ ఉంటారు కదా! ఊబకాయం ఉన్నా, లేకున్నా స్కూలు పిల్లలకు, పెద్దలకు కూడా ఈ సూత్రం వర్తిస్తుందా?

జ: అవును. ఈ సూత్రం స్కూలుకెళ్లే పిల్లలతో పాటు జనాభాలో చాలామందికి వర్తిస్తుంది. వారు మామూలుగా ఉన్నా, ఊబకాయంతో ఉన్నా సరే.. ఇందులో మార్పేమీ లేదు. అయితే, ఊబకాయంతో ఉన్న పిల్లలు ఎంత మాంసకృత్తులు తినాలనేది లెక్క వేసేటప్పుడు ఇప్పుడు వారున్న బరువును లెక్కలోకి తీసుకోకూడదు. వారి వయసు/ఎత్తును బట్టి వారు ఎంత బరువుంటే బాగుంటుందో దాన్ని లెక్కలోకి తీసుకోవాలి. మాంసకృత్తులు శరీరం, మెదడు ఎదుగుదలకు ఉపకరిస్తాయి. ఎదిగే పిల్లలకు పాలు, గుడ్లు, పప్పులు, చేపల నుంచి లభించే నాణ్యమైన మాంసకృత్తులు ఇవ్వటం ముఖ్యం.

ప్ర: కొర్రలు, సామలు, అరికెలు, అండుకొర్రలు, ఊదలు వంటి మిల్లెట్లతో వండిన వంటకాలను రోజువారీ ప్రధానాహారంగా తీసుకుంటే పిల్లలకైనా, పెద్దలకైనా పోషకాల లభ్యత సమస్య వచ్చే అవకాశం ఉంటుందా?

జ: స్మాల్ మిల్లెట్లలో పీచు, ఇనుము, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, వీటిలోని ఫైటేట్స్ అనే యాంటీ–న్యూట్రియంట్స్ కారణంగా వాటిలోని పోషకాలను పూర్తిగా వంట పట్టించుకోవటం సాధ్యపడదు. వీటిని సరైన పద్ధతిలో.. అంటే.. నానబెట్టి, పులియబెట్టి, మొలకలు వచ్చేలా చేసి తింటే వాటిలోని పోషకాలను వంట పట్టించుకోవచ్చు. వరి అన్నానికి బదులుగా చిరుధాన్యాల అన్నాన్ని ఒకేసారి 100% తినటం కాకుండా.. కొంత శాతంతో ప్రారంభించటం మంచిది. చిరుధాన్యాలు పిల్లలకైనా పెద్దలకైనా ఉపయోగకరమైనవే. ఇవి జీర్ణశక్తిని పెంపొందించడానికి, రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచడానికి, ఊబకాయాన్ని నివారించడానికి ఉపయోగపడతాయి.

చిన్నపిల్లల వైద్యురాలు.. శాస్త్రవేత్త



డాక్టర్ భారతి కులకర్ణి ఎంబీబీఎస్ చదివి.. శాస్త్రవేత్తగా మారారు. పుణే యూనివర్సిటీలో చిన్నపిల్లల వైద్యశాస్త్రంలో పీజీ చేశారు. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ చదివారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి డాక్టోరల్ డిగ్రీ పొందారు.చిన్న పిల్లల ఆహారానికి సంబంధించిన జాతీయ ప్రమాణాల రూపకల్పనపై ప్రత్యేక కృషి చేశారు.

ఏ రోజైనా సరే.. నీరు, పండ్లు, పీచు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలనే పిల్లలకు పెట్టాలి. నూనెలో వేపిన వంటకాలు రోజూ పెట్టొద్దు. ప్యాకెట్లలో దొరికే స్నాక్స్, చిప్స్, చాక్లెట్లు, తీపి పానీయాలు ఇవ్వొద్దు.

అన్ని కోర్సులకూ పాత ఫీజులే

ఉత్తర్వులు విడుదల చేసిన సర్కారు.. ఈ ఏడాది ఫీజుల సవరణ లేనట్లే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రొఫెషనల్ కాలేజీల్లోని అన్ని కోర్సుల ట్యూషన్ ఫీజులపై సర్కారు స్పష్టత ఇచ్చింది. 2025–26 విద్యా సంవత్సరంలో పాత ఫీజులే ఉంటాయని వెల్లడించింది. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 2022–25 బ్లాక్ పీరియడ్ ఫీజులే ఈ ఏడాది అమలవుతాయని ఉత్తర్వులు జారీ చేసింది. 2025–28 (మూడేళ్లు) బ్లాక్ పీరియడ్‌లో ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కాలేజీల వారీగా ప్రతిపాదనలు స్వీకరించి, ప్రత్యక్ష విచారణలు జరిపింది. అనంతరం ఫీజులను కూడా ఖరారు చేసింది. అయితే ఫీజులను అధికారికంగా ధ్రువీకరిస్తూ జీవో జారీ చేయాల్సిన తరుణంలో ప్రభుత్వం ఫీజుల సవరణకు బ్రేకులు వేసింది. కొన్ని కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరగడంపై సర్కారు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. వ్యత్యాసం భారీగా ఉండటం, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, నిబంధనలు, ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్టు గుర్తించింది. దీంతో ఫీజుల సవరణను నిలిపివేసింది. ఇక ఫీజులపై త్వరలోనే ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ కమిటీ ఫీజుల ఖరారును పరిశీలిస్తుందని, సవరణను సూచిస్తుందని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజులను ఈ కమిటీ పరిశీలిస్తుందని సర్కారు వెల్లడించింది. వీటితోపాటు హైకోర్టు, సుప్రీంకోర్టుల ఆదేశాల మేరకు ఫీజుల సవరణపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు సర్కారు తెలిపింది.

'మీ సేవ'లో మరిన్ని కొత్త సేవలు

మార్కెట్ విలువ, వివాహ నమోదుకు స్లాట్ బుకింగ్.. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ పోర్టల్ 'మీ సేవ'ద్వారా మరికొన్ని పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మీ సేవ ద్వారా అందుతున్న సేవలతో పాటు కొత్తగా భూముల మార్కెట్ విలువ, వివాహ నమోదు (స్లాట్ బుకింగ్) సేవలను జోడించారు. మీ సేవ కార్యకలాపాలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నూతన సేవలపై ఆయన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా చేర్చిన 'మార్కెట్ విలువ'సేవ ద్వారా భూమి లేదా అపార్ట్‌మెంట్ విలువలను సులభంగా పొందవచ్చు. పౌరులు మీ సేవా కేంద్రాన్ని సందర్శించి లేదా ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉపయోగించి, భూమి లేదా అపార్ట్‌మెంట్ విలువ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా, మండలం, గ్రామం వంటి వివరాలను సమర్పించిన తర్వాత, ఆ దరఖాస్తు సంబంధిత సబ్–రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుతుంది. దీనిని 24 గంటల్లో ఆమోదించిన తర్వాత, ధ్రువీకరణ పత్రం వెంటనే ముద్రణకు అందుబాటులో ఉంటుంది. దీంతో పాటు 'వివాహ నమోదు'సేవ ద్వారా స్లాట్ బుకింగ్ వ్యవస్థతో వివాహ నమోదును చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే జంటలు నిర్దేశిత రుసుముతో పాటు అవసరమైన పత్రాలను సమర్పించాలి. వివాహ ఆహ్వాన పత్రం, ఆ జంట కనిపించేలా వివాహ వేడుక ఫొటో, నివాస రుజువు, ఎస్సెస్సీ సర్టిఫికెట్ లేదా పాస్‌పోర్ట్ కాపీల రూపంలో వయసుకు సంబంధించిన రుజువులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అలాగే ముగ్గురు సాక్షులు ఆన్‌లైన్ ఫారమ్‌తో పాటు రిజిస్ట్రార్ కార్యాలయంలోని భౌతిక రిజిస్టర్‌పై సంతకం చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, తుది ధ్రువీకరణ పత్రాన్ని నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా జారీ చేస్తారు.

విత్తనాలు నాటేందుకు 'సోలార్ పవర్ సీడ్ సోయింగ్ మెషీన్'

జేఎన్టీయూహెచ్ విద్యార్థి నూతన ఆవిష్కరణ



బాలానగర్: తండ్రి చేసే వ్యవసాయ పనులను దృష్టిలో పెట్టుకుని ఓ విద్యార్థి 'సోలార్ పవర్ సీడ్ సోయింగ్ మెషీన్' తయారు చేశాడు. ఇది విత్తనాలు నాటే మిషన్. రణధీర్ జేఎన్టీయూహెచ్‌లో ఎంటెక్ మెకానికల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. జగిత్యాల జిల్లాలోని తులసీనగర్‌లో రణధీర్ తండ్రి గంగాధర్ మక్కలు (మొక్కజొన్న) సాగు చేస్తూ ఉంటాడు. ఆ ప్రాంతంలో మక్కల సాగు ఎక్కువ. అయితే విత్తనాలు వేయడానికి అక్కడ కూలీల కొరత ఉంది. కూలీలు దొరక్కపోతే సమయానికి విత్తనాలు వేసే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో రణధీర్ సీడ్స్ వేయడానికి ప్రత్యేక మెషీన్‌ను తయారు చేశాడు. విత్తనాలు ఎంతెంత దూరంలో నాటుకోవాలో దానికి ఇన్‌పుట్స్ ఇస్తారు. ప్రస్తుతం మెషీన్ ట్రయల్స్‌లో ఉంది. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా రణధీర్ ఆర్ అండ్ డీ విభాగం డైరెక్టర్ చెన్నకేశవరెడ్డి మార్గదర్శకంలో ఈ మెషీన్‌ను రూపొందించాడు.


రణధీర్

క్లుప్తంగా...

'మోడల్'లో రాష్ట్రపతి ఉత్తర్వు అమలుపై స్టే

సాక్షి, హైదరాబాద్: మోడల్ స్కూల్స్‌లో పని చేసే పోస్టు గ్రాడ్యుయేషన్ ఉద్యోగులకు రాష్ట్రపతి ఉత్తర్వులు–2018 అమలు ప్రక్రియపై హైకోర్టు స్టే విధించింది. తెలంగాణ మోడల్ స్కూల్స్ సెకండరీ ఎడ్యుకేషన్ సొసైటీలోని పోస్టులను కొత్త జోనల్ కేడర్లుగా విభజించి, రాష్ట్రపతి ఉత్తర్వుల నిబంధనల ప్రకారం ఉద్యోగులను కేటాయించాలని రాష్ట్ర విద్యా శాఖ, పాఠశాల విద్య డైరెక్టర్ విడివిడిగా జారీ చేసిన రెండు మెమోలను కోర్టు నిలిపివేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణ ఈనెల 15కు వాయిదా వేసింది. ఈ మెమోలను సవాల్ చేస్తూ నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పాడు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు సైదులుతోపాటు మరో 10 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సామ్ కోషి, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది రాములు, ఫణిభూషణ్ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368లోని నిబంధన (2) ప్రకారం పార్లమెంటులోని ఏ సభలోనైనా బిల్లును ప్రవేశపెట్టడం, ఆ సభల్లోని మొత్తం సభ్యుల్లో మెజారిటీ బిల్లును ఆమోదించినప్పుడు మాత్రమే రాజ్యాంగ సవరణ సాధ్యమవుతుందన్నారు. ఆ విధానాన్ని పాటించకుండా రాష్ట్రపతి ఉత్తర్వులు అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

డిస్కంలో ఏఐ సేవలు

సాక్షి, హైదరాబాద్: వినియోగదారులకు నాణ్యమైన, మరింత మెరుగైన విద్యుత్ సేవలను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించనున్నట్లు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. సోమవారం మింట్ కాంపౌండ్‌లోని ఆ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యుత్ డిమాండ్, సరఫరాలో హెచ్చుతగ్గుల గుర్తింపు, అంతరాయాల నియంత్రణకు త్వరలోనే ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రతి బుధవారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

తరాలు మారినా మీరు మారరా?

మున్సిపల్ అధికారులపై హైకోర్టు అసహనం

సాక్షి, హైదరాబాద్: తరాలు మారుతున్నా మున్సిపల్ అధికారులు పని తీరు మాత్రం మారడం లేదని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేయడమేగానీ, సమస్యను వెంటనే పరిష్కరిద్దాం అనే ఆలోచన చేయరని తప్పుబట్టింది. ఇంకా ఎన్నాళ్లు ఇలా వ్యవహరిస్తారో అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై ఏ నిర్ణయం తీసుకున్నారో చెప్పాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ తాలూకా ఖానామెట్‌లోని తమ భూమిలో రాయపాటి ప్రతిభ, రాయపాటి శ్రీహర్ష, జీబీ ప్రసాద్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ సయ్యద్ రహీమున్నిసా సహా మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'నోటీసులిస్తారు కూల్చివేతలు ఉండవు. వచ్చే సోమవారం నుంచి ప్రతీ వారం చేపట్టిన కూల్చివేతల వివరాలు కోర్టు ముందు ఉంచేలా స్టాండింగ్ కౌన్సెళ్లకు ఆదేశాలిస్తా. అనధికారిక నిర్మాణాలకు, నగర విధ్వంసానికి ఈ స్టాండింగ్ కౌన్సెళ్లు, అధికారులే బాధ్యులు. ఎవరికి వారు మా పని మేం చేశామంటూ చేతులు దులుపుకుంటున్నారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశామని స్టాండింగ్ కౌన్సెళ్లు.. ఉత్తర్వులిచ్చాం, టాస్‌ఫోర్స్‌కు బదిలీ చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్.. ఈ లేఖను పోలీసులకు అందజేశామని టాస్‌ఫోర్స్.. శాంతిభద్రతల్లో తలమునకలై మేం ఆ పనిని వాయిదా వేశామని పోలీసులు.. ఇలా ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి అధికారులు, స్టాండింగ్ కౌన్సెళ్ల పేర్లు రాత్రి పూట కూడా స్పష్టంగా కనిపించేలా నెక్లెస్ రోడ్‌పై విద్యుత్ దీపాలతో పోస్టర్లు వేయించాలి'అని అసహనం వ్యక్తంచేశారు.

గ్రూప్–1పై వాదనలు సత్వరం ముగించండి

న్యాయవాదులను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి ఉద్యోగం వస్తుందని కొందరు, మెయిన్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని.. పరీక్ష రద్దవుతుందని ఇంకొందరు.. ఇలా వేలాది మంది ఎదురు చూస్తున్నారని, అందువల్ల వీలైనంత త్వరగా వాదనలు ముగించాలని న్యాయవాదులకు హైకోర్టు సూచించింది. సోమ, మంగళవారాల్లో వాదనలు పూర్తి చేయాలని చెప్పింది. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట్ శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. సొంత నిబంధనలనే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మార్చేయడం, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య వేర్వేరు సందర్భాల్లో వేర్వేరుగా వెల్లడించడంపై సందేహాలున్నాయన్నారు. ఒకటికి రెండుసార్లు మూల్యాంకనం చేస్తే నష్టమేమిటన్న హైకోర్టు ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. నిబంధనలను మార్చడం చెల్లదని ఏపీ హైకోర్టు తీర్పు చెప్పిందన్నారు. మూల్యాంకనానికి దేశవ్యాప్తంగా ఉన్నవారిని నియమిస్తున్నామని పేర్కొన్నారని, వేరే రాష్ట్రాల వాళ్లు మూల్యాంకనం చేస్తే వారికి తెలుగు ఎలా తెలుస్తుందనే ప్రశ్నకు కమిషన్ నుంచి సమాధానం లేదన్నారు. అనంతరం మరో సీనియర్ న్యాయవాది సురేందర్ వాదనలు వినిపించారు.

భూశాస్త్ర వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా

యోగితా రాణా



సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూ శాస్త్ర విశ్వవిద్యాలయంకు తొలి ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా నియమితులయ్యారు. ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమెకు ప్రభుత్వం ఈ మేరకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్టం, 1991లోని సెక్షన్ 12 (3) ప్రకారం ఈ నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నియామక ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

'ఉమ్మడి' జీఎంగా మాథూర్

- దక్షిణ మధ్య రైల్వే–దక్షిణకోస్తా రైల్వే జోన్ల బాధ్యతలు


మాథూర్


అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రధాన ప్రాంతంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే, ఆంధ్రప్రదేశ్‌తో కూడి కొత్తగా ఆవిర్భవించిన దక్షిణ కోస్తా రైల్వేకు ఉమ్మడి జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథూర్‌ను రైల్వే శాఖ నియమించింది. రైల్వే బోర్డులో సిగ్నలింగ్ ఆధునికీకరణ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఆయనను కొద్దిరోజుల క్రితమే దక్షిణ కోస్తా జీఎంగా నియమించింది. తాజాగా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్ సోమవారం ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన బాధ్యతలను మాథుర్‌కు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దక్షిణ కోస్తా కోసం రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసినా.. ఆ జోన్ ప్రధాన కార్యాలయ విభాగాలేవీ ఏర్పడలేదు. దీంతో సందీప్ మాథూర్ విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలోకి మారనున్నారు. సికింద్రాబాద్ నుంచే ఆయన రెండు జోన్లను పర్యవేక్షించనున్నారు. మూడు నెలల కోసం ఆయనకు దక్షిణ మధ్య రైల్వే బాధ్యతలు అప్పగించినా, ఆయన మరికొంత కాలం కొనసాగనున్నట్టు సమాచారం.

అరుణ్‌కుమార్‌కు వీడ్కోలు

దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు సుదీర్ఘకాలం జీఎంగా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్న అరుణ్‌కుమార్ జైన్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు రైల్ నిలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు రైల్వే రక్షక దళం మౌలాలీలోని శిక్షణ మైదానంలో జీఎంకు వీడ్కోలు పరేడ్ నిర్వహించింది.

అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశాలు ప్రారంభం



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) కోర్సులు, పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ) కోర్సులు, బి.లైఫ్‌సైన్స్, ఎం.లైఫ్‌సైన్స్, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైనట్లు విశ్వవిద్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం మొదటి సారి సెమిస్టర్ విధానంలో ఆర్ట్స్ సబ్జెక్టుల్లో ఆర్థిక శాస్త్రం, చరిత్ర, ప్రజా పరిపాలన, రాజకీయ శాస్త్రం, సామాజిక శాస్త్రం, ఇంగ్లిష్ మీడియంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను ప్రవేశపెట్టిందని విద్యార్థి సేవా విభాగాధిపతి వెల్లడించారు. అభ్యర్థులు రాష్ట్రంలో ఉన్న అధ్యయన కేంద్రాల్లో మాత్రమే ఎంచుకోవాలన్నారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని, హెల్ప్‌డెస్క్ నెంబర్ 7382929570లో గానీ, 040–23680290/291/294/295 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వైద్య కళాశాలల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,000 కోట్ల రుణం!

- వరల్డ్ బ్యాంక్‌కు రుణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యారోగ్య శాఖకు ప్రభుత్వం ఆదేశం
- ఇప్పటికే వైద్య సేవలకు సంబంధించి రూ.4,100 కోట్ల రుణానికి వరల్డ్ బ్యాంక్ గ్రీన్‌సిగ్నల్



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రపంచ బ్యాంకు నుంచి రూ.1,000 కోట్లు రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయడం, కళాశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులు వెచ్చించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యారోగ్య శాఖను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, కొత్తగా గత సంవత్సరం నుంచి ప్రారంభమైన 8 కళాశాలలతోపాటు గత ప్రభుత్వంలో ఏర్పాటైన సుమారు 21 కళాశాలల్లో కూడా సదుపాయాలు లేవు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటైన నర్సింగ్ కళాశాలల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో కొత్త కళాశాలల నిర్మాణం ప్రారంభమైనా నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్నాయి. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై జాతీయ వైద్య కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం తీసుకోవడం ద్వారా వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వైద్య విద్యను అందిస్తున్న 34 కళాశాలలు, వాటికి అనుబంధంగా ఏర్పాటవుతున్న నర్సింగ్ కళాశాలలు, బోధనా ఆస్పత్రుల సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధుల గురించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. రూ.1,000 కోట్ల రుణాలకు సంబంధించిన ప్రతిపాదనలను వచ్చే మంత్రివర్గ సమావేశంలోనే ఆమోదింపజేసి, కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించాలని భావిస్తున్నారు. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ప్రపంచబ్యాంక్ నుంచి మరో రూ.వెయ్యి కోట్లు రాష్ట్రంలో వైద్య సేవల కోసం వచ్చినట్టే. రాష్ట్రంలో జిల్లాల వారీగా కేన్సర్ రీజనల్ సెంటర్లు, డయాలసిస్ వాస్కులర్ కేంద్రాలు, ట్రామా కేంద్రాల ఏర్పాటు వంటి వైద్య సదుపాయాల కోసం ఇప్పటికే ప్రపంచబ్యాంక్ నుంచి రూ. 4,100 కోట్ల రుణానికి సంబంధించి గ్రీన్‌సిగ్నల్ లభించింది. అయితే ప్రతిపాదిత రూ.1,000 కోట్లు మాత్రం పూర్తిగా వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలల కోసమే వెచ్చించాలని నిర్ణయించారు.

26 వైద్య కళాశాలల అనుమతుల పునరుద్ధరణ

వచ్చే విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు ఎన్ఎంసీ అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరంలో ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రవేశానికి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) 26 కళాశాలలకు అనుమతి పునరుద్ధరించింది. రాష్ట్రంలోని 34 కళాశాలల్లో తనిఖీలు నిర్వహించిన జాతీయ వైద్య కమిషన్ 26 కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాల్లేవని, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులు సరైన విధంగా చదువుకోలేని పరిస్థితులున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూన్ రెండో వారంలో నోటీసులు జారీ చేసింది. పరిస్థితి మారకపోతే ఈ కళాశాలలకు అనుమతి పునరుద్ధరించలేమని స్పష్టంచేసింది. ఈ అంశంపై విచారణ కోసం ప్రభుత్వ ఆరోగ్య శాఖ కార్యదర్శిని, డీఎంఈని ఢిల్లీకి పిలిచింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి, వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో వైద్యాధికారులు ఎన్ఎంసీకి నివేదిక సమర్పించారు. ఈ మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అనుమతిని రెన్యువల్ చేసినట్లు తెలిపింది. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలో ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రవేశానికి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.




మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిన్నారుల్లో కంటి సమస్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షలతో గుర్తింపు

మహబూబ్‌నగర్‌లో ఎక్కువ.. మంచిర్యాలలో తక్కువ

మంచిర్యాల టౌన్: పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాలస్వాస్థ్య) కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు చేసి, కళ్లజోడు ఉచితంగా అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ నుంచి వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కేల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మానసిక, కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలో ఉన్న 35,700 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు 19,69,448 మంది చిన్నారులకు పరీక్షలు చేయాలని నిర్ణయించారు. సోమవారం వరకు 11,27,602 మందికి (57.25 శాతం) కంటి పరీక్షలను నిర్వహించారు. ఇంకా 8,41,846 మందికి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కంటి పరీక్షలు నిర్వహించిన చిన్నారుల్లో రాష్ట్రవ్యాప్తంగా 246 మందికి కంటి సమస్య ఉన్నట్లుగా గుర్తించగా.. 2,014 మంది చిన్నారుల్లో కంటికి సంబంధించిన లోపాలు, సమస్యలను గుర్తించారు. మొత్తంగా 2,260 మంది చిన్నారుల్లో కంటి సమస్యలను గుర్తించి, జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

మహబూబ్‌నగర్‌లో ఎక్కువ..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కేలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కంటి పరీక్షలు చేయగా మహబూబ్‌నగర్ జిల్లాలో చిన్నారుల్లో కంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మహబూబ్‌నగర్‌లో 320 మంది చిన్నారులు, నిజామాబాద్‌లో 253 మంది, మహబూబాబాద్ జిల్లాలో 167 మంది, కామారెడ్డిలో 115, సిద్దిపేటలో 109, హైదరాబాద్‌లో 101, యాదాద్రి భువనగిరి జిల్లాలో 98 మంది, రంగారెడ్డిలో 92 మంది, నల్లగొండలో 71, జనగాంలో 68, ఆదిలాబాద్‌లో 67, వనపర్తిలో 65, ఖమ్మంలో 58 మంది, పెద్దపల్లిలో 58, సిరిసిల్లలో 55 మంది, నాగర్‌కర్నూల్‌లో 53, జోగులాంబ గద్వాల్‌లో 53, భద్రాద్రి కొత్తగూడెంలో 47, మెదక్‌లో 42, సంగారెడ్డిలో 39, వికారాబాద్‌లో 37, వరంగల్‌లో 37, నారాయణపేట్‌లో 37, హనుమకొండలో 37, జగిత్యాలలో 36, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 30, కరీంనగర్‌లో 24, నిర్మల్‌లో 21, మల్కాజగిరిలో 18, సూర్యాపేటలో 17, ములుగులో 13, జయశంకర్ భూపాలపల్లిలో 12, మంచిర్యాలలో 10 మందిలో కంటి లోపాలున్నట్లు గుర్తించారు.

సమస్యలకు కారణాలు..

చిన్నారుల్లో కంటి సమస్యలకు కారణాలను వైద్యులు వెల్లడిస్తున్నారు. పోషకాహార లోపం, జన్యుపరమైన కారణాలు, పిల్లలకు తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు ఇస్తుండటంతో, ఆరేళ్లలోపు చిన్నారుల్లో వచ్చే దృష్టిలోపం, ఇతర కంటి సమస్యలు వస్తున్నట్లుగా గుర్తించారు. కనురెప్ప కిందికి పడిపోవడం, కళ్ల నుంచి నీరు రావడం, కళ్లు నియంత్రించలేని స్థితిలో కదలడం, ఒకే దిశలో చూడకపోవడం, కళ్లలో తేమ లేకపోవడం, కంటిపై ఒకవైపు మాంసం పెరగడం, కళ్లు పొడిబారడం, కంటిలో వక్రీభవన లోపాలు, మెల్ల వంటి దృష్టిలోపాలను గుర్తించిన చిన్నారులను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. చిన్నారులకు ఉన్న సమస్యలను మరోసారి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తారు. అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తారు. సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి రెఫర్ చేస్తారు.



మీడియా హౌస్‌ల ముసుగులో వధ శాలలు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోవడాన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై కక్ష కట్టారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మీడియా హౌస్‌ల ముసుగులో స్లాటర్ హౌస్ (వధశాల)లు నడుపుతూ తమ పార్టీ నేతలు కేసీఆర్, కేటీఆర్‌పై కుట్ర పూరిత కథనాలు ప్రసారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీనిక్స్ పక్షిలా కేసీఆర్ తిరిగి వస్తున్న తీరుతో పాటు కేటీఆర్ చేస్తున్న ప్రజా పోరాటాలు తెలంగాణ వ్యతిరేకులకు నచ్చడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు చేతిలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక టూల్‌లా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం గత ప్రభుత్వానికి లేదు. మీరు చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్‌ను బద్‌నాం చేసే కుట్రకు పాల్పడుతున్నారు' అని విమర్శించారు. 'మహా న్యూస్ చానల్‌పై దాడి జరిగిందని బయటి ప్రపంచానికి తెలియకముందే చంద్రబాబు నాయుడు స్పందించారు. దీనిని బట్టే చంద్రబాబు ముందస్తు ప్రణాళిక బయట పడింది. ఆధారాలు లేకుండా మా వ్యక్తిత్వాన్ని హననం చేస్తే సహించేది లేదు' అని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు.

బీజేపీ-బీఆర్‌ఎస్‌ల మైత్రి మరోసారి బయటపడింది: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ సూచనల మేరకు ఆయన ఎంపిక చేసిన వ్యక్తికే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు నియామకంతో ఆ రెండు పార్టీల మధ్య మైత్రి మరోసారి బయటపడిందని ఆరోపించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఐలయ్య విలేకరులతో మాట్లాడుతూ బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ సాఫీగా జరగడం కోసమే బలహీన అధ్యక్షుడిని మోదీ, అమిత్‌షాలు నియమించారన్నారు. బీఆర్‌ఎస్‌ను గట్టిగా వ్యతిరేకించే వారికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తే తన పన్నాగం ఫలించదని కేసీఆర్ ఎత్తులు వేశారని, అందుకే తెలంగాణలో బీజేపీ కార్యకర్తలు ఒకటి కోరుకుంటే అధిష్టానం మరో నిర్ణయం తీసుకుందని తెలిపారు. నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో త్వరలోనే బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసుకుంటారని ఐలయ్య జోస్యం చెప్పారు. బీజేపీ నాయకత్వానికి బీసీలపై ప్రేమలేదని మరోసారి రుజువైందని వ్యాఖ్యానించారు.

అసలు రాష్ట్రంలో బీజేపీఅధికారంలోకి ఎలా వస్తుంది?

అమిత్‌షాకు సత్యం శ్రీరంగం ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రాబోయేది తమ ప్రభుత్వమేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెబుతున్నారని, అసలు వారి ప్రభుత్వం ఎలా అధికారంలోకి వస్తుందో ఆయన చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ప్రశ్నించారు. మన్‌కీబాత్ పేరుతో మాట్లాడటం మాత్రమే బీజేపీ నేతలకు తెలుసునని, వారు ప్రజల బాధలు వినేవారు కాదని, అలాంటప్పుడు అసలు తెలంగాణలో వారి ప్రభుత్వం ఎలా వస్తుందో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటే వికసిత్ భారత్ అవుతుందా? రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేస్తే వికసిత్ భారత్ ఏర్పడుతుందా? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదని, రాహుల్‌గాంధీ వారి గుండెల్లో నిద్రపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేయడం ద్వారా కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాలనేది కిషన్‌రెడ్డి ప్రయత్నమని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సత్యం, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయే నేత పీజేఆర్ అని అన్నారు.

ఎనిమిది మంది ఎంపీలు రాష్ట్రానికి ఏం సాధించారు?

బీజేపీ ఎంపీలపై కాంగ్రెస్ ఎంపీ చామల ఫైర్



సాక్షి, న్యూఢిల్లీ: 'రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు, వీళ్లు రాష్ట్రాభివృద్ధికి ఒక్కరోజు కూడా సహకరించిన దాఖలాలు లేవు. గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు వారు రాష్ట్రానికి ఏం సాధించారు' అంటూ బీజేపీ ఎంపీలపై కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫైర్ అయ్యారు. మెట్రో, రింగ్‌రోడ్డు తదితర అంశాలపై పలుమార్లు మా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వచ్చి, ప్రధాని, ఇతర కేంద్ర మంత్రులను కలుస్తుంటే మాపైనే నిందలు వేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకు అనుమతులు ఇచ్చే ఉద్దేశం లేకనే డీపీఆర్ పేరుతో సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల కోసం బీజేపీ ఎంపీలు మెట్రో అనుమతులు తీసుకురాలేరా అంటూ నిలదీశారు. సోమవారం ఢిల్లీలో చామల మీడియాతో మాట్లాడారు. పసుపు బోర్డుకు ఎన్నిసార్లు శంకుస్థాపనలు, ఎన్నిసార్లు ప్రారంభోత్సవాలు చేస్తారని నిలదీశారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ఈడీ, సీబీఐ విచారణలు జరగాలని డిమాండ్ చేసే కేటీఆర్.. గత పదేళ్లలో జరిగిన పనులపై ముందుగా విచారణ కోరాలన్నారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్ అవినీతిని బయటకు తీసేందుకు సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని సవాల్ చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫ్యూచర్ గోల్స్ కాబట్టి.. బీఆర్‌ఎస్‌పై బీజేపీ ఏవిధమైన చర్యలకూ ఉపక్రమించదని చామల ఆరోపించారు. బీజేపీ నూతన అధ్యక్షుని విషయం ఆ రెండు పార్టీలూ కలిసే తీసుకున్న నిర్ణయమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

థర్మల్ కేంద్రాలకు తగ్గుతున్న బొగ్గు వినియోగం

విద్యుత్ ప్లాంట్లలో నెలకుపైగా సరిపడా నిల్వలు

భారీస్థాయిలో రవాణా తగ్గిస్తున్న సింగరేణి • పెరిగిన సోలార్, విండ్, హైడ్రో పవర్ ఎఫెక్ట్

గోదావరిఖని: సంప్రదాయ విద్యుత్ వినియోగం పెరగడంతో థర్మల్ కేంద్రాల్లో బొగ్గు వినియోగం తగ్గుతోంది. సోలార్, విండ్, హైడ్రో పవర్ ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో థర్మల్ కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలు తగ్గిస్తున్నారు. దీంతో పలు ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిస్తున్నట్టు చెబుతున్నారు. సింగరేణి యాజమాన్యం నిత్యం 2 లక్షల టన్నుల బొగ్గును పలు విద్యుత్ సంస్థలకు రైల్వే ద్వారా రవాణా చేస్తోంది. బొగ్గు డిమాండ్ తగ్గడంతో రోజు 1.20 లక్షలు మాత్రమే రవాణా చేస్తోంది. థర్మల్ విద్యుత్ డిమాండ్ తగ్గడంతో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించుకొని బొగ్గు కొనుగోలు కూడా తగ్గించినట్టు సింగరేణి యాజమాన్యం చెబుతోంది. పలు థర్మల్ కేంద్రాల నుంచి బొగ్గుకు డిమాండ్‌కు గణనీయంగా తగ్గడంతో పలు సీహెచ్‌పీల నుంచి కూడా బొగ్గు రవాణాను తగ్గించారు. నాలుగు రేక్‌లు వెళ్లే ప్రాంతానికి రెండు రైల్వే రేక్‌ల బొగ్గు మాత్రమే రవాణా చేస్తున్నారు.

85 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకే..

సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 85 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వెళుతోంది. రామగుండం ఎన్టీపీసీ, సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టుతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి సంస్థ బొగ్గు అందిస్తోంది. అయితే వర్షాకాలం మొదలు కావడంతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి తీసే అవకాశం ఉండదు. కాబట్టి ముందే థర్మల్ విద్యుత్ కేంద్రాలు భారీగా బొగ్గును యార్డుల్లో నిల్వ చేసుకుంటాయి. ఈసారి థర్మల్ విద్యుత్ వినియోగం తగ్గడంతో సింగరేణి వెలికి తీసిన బొగ్గును పూర్తిగా తీసుకోవడం లేదు. రవాణా అవుతున్న బొగ్గును సగానికి తగ్గించాల్సి వస్తోంది. సంస్థవ్యాప్తంగా నిత్యం 35 రేక్‌ల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు విక్రయిస్తుండగా, ప్రస్తుతం 25 రేక్‌ల వరకు మాత్రమే రవాణా అవుతున్నట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

పెరిగిన సోలార్, విండ్ పవర్

రాష్ట్రంలో సోలార్, విండ్ పవర్ పెరగడంతో థర్మల్ విద్యుత్‌కు డిమాండ్ తగ్గినట్టు తెలుస్తోంది. 50 వేల నుంచి 75 వేల మెగావాట్ల సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి అవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రభావం థర్మల్ విద్యుత్‌పై చూపుతోంది.

పెరిగిన బొగ్గు నిల్వలు

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో నెలరోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నట్టు చెబుతున్నారు. నిత్యం కొనుగోలు చేయాల్సిన బొగ్గును కూడా సగానికి తగ్గించాయి.

సోలార్ పవర్ నేరుగా కొనుగోలు చేయడంతో..

ఇళ్లలోని సోలార్ రూఫ్, సోలార్ విద్యుత్ కేంద్రాల నుంచి ట్రాన్స్‌కో నేరుగా విద్యుత్ పొందుతోంది. ఇంటి పైకప్పుపై ఉన్న సోలార్ ఫలకల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేసి ట్రాన్స్‌కో నుంచి ఇంటికి విద్యుత్ అందిస్తోంది. అయితే ఇంటి విద్యుత్ వినియోగం కన్నా సోలార్ రూఫ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ఎక్కువ అయితే వారికి రిటర్న్ చెల్లిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే పద్ధతిలో తీసుకుంటుండటంతో మొదటగా సోలార్, విండ్ పవర్‌ను వినియోగిస్తున్నారు. ఆ తర్వాతే థర్మల్ కేంద్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. సోలార్, విండ్, హైడ్రో పవర్ ఉత్పత్తి పెరుగుతుండటంతో థర్మల్ విద్యుత్ కొనుగోలును ట్రాన్స్‌కో తగ్గిస్తోంది.

నాణ్యమైన బొగ్గుపై సింగరేణి దృష్టి

థర్మల్ కేంద్రాలకు బొగ్గు వినియోగం తగ్గిన క్రమంలో నాణ్యమైన బొగ్గును మాత్రమే ఉత్పత్తి చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఇప్పటికే జీ-15, 16 గ్రేడ్‌ల బొగ్గు ఉత్పత్తి నిలిపివేయగా, ప్రస్తుతం నాణ్యమైన బొగ్గును ఎక్కువగా ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఓసీపీలు, భూగర్భగనుల్లో నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. జీ-5 నుంచి జీ-13 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది.



రైల్వే ద్వారా రవాణా అవుతోన్న బొగ్గు



ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న షావెల్

పాశమైలారం ఘటనపై టీపీసీసీ చీఫ్ దిగ్భ్రాంతి



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు సోమవారం ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ధర్మశాలకు అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్

సీపీఏ ఇండియా రీజియన్ సమావేశానికి హాజరు



గడ్డం ప్రసాద్‌కుమార్



గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిల బృందం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలకు వెళ్లింది. అక్కడ జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ జోన్-2 సమావేశానికి హాజరైంది. సమావేశంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్‌లు, మండలి చైర్మన్లు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి వెళ్లిన బృందంలో అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు, మండలి చైర్మన్ పీఎస్ ఏనుగు నర్సింహారెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఆఫీసును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి: సంపత్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌ను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ భవనాన్ని స్వాధీనం చేసుకునే పనిని యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధితో పాటు ఇక్కడి సంప్రదాయాలను పెంపొందిస్తారనే ఆలోచనతో నాటి ప్రభుత్వం ఆ పార్టీకి స్థలం కేటాయించిందని, కానీ తెలంగాణ భవన్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నేరస్తులకు, రౌడీ మూకలకు అడ్డాగా బీఆర్‌ఎస్ మారిందని, రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు బీఆర్‌ఎస్ ఆఫీసు నుంచే జరుగుతున్నందున ఆ కార్యాలయాన్ని వెంటనే జప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఆ కార్యాలయంలో ఓ టీవీ చానెల్‌ను నడిపిస్తూ మహిళల హత్యలకు కారణమవుతున్నారని, జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి సంతోశ్‌రావు సన్నిహితుడైన పూర్ణచందర్ కారణమని వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. గత 20 ఏళ్లలో ఆ పార్టీ కార్యాలయంలో ఏం జరిగిందనే దానిపై ఆధారాలను సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వం కూడా వారికిచ్చిన రాయితీలను వెనక్కు తీసుకుని ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని సంపత్ కోరారు.

పసుపు బోర్డుకు నిధులేవి?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: పసుపు బోర్డు కార్యాలయాన్ని నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా ప్రారంభించడం మినహా.. ఎలాంటి నిధులు కేటాయించలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా వస్తున్న సందర్భంగా ఎలాంటి నిరసనలు, ఆందోళనలకు పిలుపు లేకున్నా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు సహా నాయకులు, కార్యకర్తలు, ఇతర వామపక్ష పార్టీల వారిని ముందురోజే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లల్లో నిర్బంధించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నట్టు సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఒత్తాసు పలికే పద్ధతుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాంటి చర్యలకు పూనుకోవడాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో మేము అధికారంలోకి రాబోతున్నామని అమిత్ షా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న సీట్లే గల్లంతవుతాయని జోస్యం చెప్పారు. మతోన్మాద రాజకీయాలను కొనసాగిస్తున్న బీజేపీని ఓడించడానికి సీపీఎంతో సహా, ఇతర వామపక్ష పార్టీలు కలిసి పనిచేస్తాయన్నారు.

ఒక శాతం జనాభా ఉన్న వర్గానికి అధ్యక్ష పదవా?: జాజుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు కాదని, ఒక శాతం ఉన్న వర్గానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టడం ఏంటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట ఆయన బీసీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి బీసీలకు ఇస్తామని ఊరడించి, ఊరించి బీసీలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల జపం చేస్తుంటే.. బీజేపీ మాత్రం అగ్రకులాల జపం చేస్తోందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని సీఎం చేస్తానన్న బీజేపీ.. చివరికి ఫ్లోర్ లీడర్ కూడా అగ్రకులాలకు కట్టబెట్టిందని జాజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్ష పదవి బీసీకి ఇవ్వని పార్టీ, రేపు బీసీని సీఎం చేస్తానంటే బీజేపీని బీసీలు ఎప్పటికీ నమ్మరన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపకుండా, బీసీలకు రాష్ట్ర పగ్గాలు ఇవ్వకుండా బీజేపీ బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బీజేపీలో అగ్రకుల హిందువులకు ఒక న్యాయం.. బీసీ హిందువులకు ఇంకొక న్యాయమా? అని ప్రశ్నించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు ఏమాత్రం ఆత్మగౌరవం ఉన్నా వెంటనే బీజేపీకి రాజీనామా చేయాలని జాజుల డిమాండ్ చేశారు.

బనకచర్లకు పర్యావరణ అనుమతి నిరాకరణ హర్షణీయం: ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 200 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా, పెన్నా బేసిన్‌లకు తరలించేందుకు చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు నిరాకరించడం హర్షణీయమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ 33వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ జాగృతి, బీఆర్‌ఎస్ పార్టీ సాధించిన విజయమన్నారు. చంద్రబాబుతో చేతులు కలిపి తెలంగాణ జలదోపిడీకి ద్వారాలు తెరిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పని చేయాలని 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలి. గోదావరిలో తెలంగాణ రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 968 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసే వరకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పట్టాలెక్కకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి' అని కవిత డిమాండ్ చేశారు.

సుమశరుడే అచ్చెరువొందేలా!



కిత్తనచెరువు ప్రాంతంలో విరబూసిన ఎర్రని తురాయి పూలు



సరిపల్లిలో రోడ్డు పక్కన ఆహ్లాదంగా పచ్చ తురాయి అందాలు

పూవు ఏదైనా మనసుకు.. కనులకు ఎంతో ప్రశాంతతనిస్తాయి. కొన్ని సుగంధాలను వెదజల్లితే.. కొన్ని ఆ లక్షణం లేకపోయినా కనుదోయికి ఎంతో తృప్తినిస్తాయి. ఈ చిత్రాల్లోని పూలను చూడండి.. అరుణ, పసుపు వర్ణాల్లోని తురాయి పూలు ఎంత ఆహ్లాదంగా ఉన్నాయో. ఎటువంటి సుగంధాలను వెదజల్లకపోయినా ఆ అందాలను స్వయంగా చూసినవారే వర్ణించగలరు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని కిత్తన చెరువు ప్రాంతంలో ఎర్రని తురాయి పూలు.. సరిపల్లిలో రహదారి పక్కన పసుపు పచ్చని పూలు ఆ మార్గాల్లో వెళ్తున్న ప్రయాణికులకు బడలిక తీరుస్తూ సేద తీరుస్తున్నాయి.

– ఉప్పలగుప్తం

విరబూసిన దాలియా



మన్యంలో దాలియా పూల సీజన్ ప్రారంభమైంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలించాయి. ఆగస్టులో రావాల్సిన దిగుబడి నెలరోజుల ముందుగానే ప్రారంభమైందని గిరిజన రైతులు తెలిపారు. పాడేరు డివిజన్‌లో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, డుంబ్రిగుడ మండలాల్లో గిరిజన రైతులు బంతితోపాటు దాలియాను సాగు చేస్తున్నారు. వివిధ రంగుల్లో పండించే ఈ రకం పూలకు మైదాన ప్రాంతంలో మంచి ఆదరణ ఉంది. బుట్ట పూలకు రూ.100 వరకు ధర పలుకుతోంది. తక్కువ విస్తీర్ణంలో వేయడం వల్ల సీజన్‌లో రైతులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

– సాక్షి, పాడేరు

క్లుప్తంగా...

మినీ అంగన్‌వాడీల ఉన్నతీకరణపై త్వరలో జీవో

మంత్రి సంధ్యారాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 5వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణపై త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడనున్నాయని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మినీ అంగన్‌వాడీలకు ప్రధాన అంగన్‌వాడీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిందని మంత్రి వివరించారు. ప్రధాన అంగన్‌వాడీలుగా రూపుదాల్చితే వాటిలో కార్యకర్త, సహాయకులను నియమించనున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో మంత్రి తెలిపారు. అలాగే గిరిజన గురుకుల విద్యా సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని మరో ప్రకటనలో తెలిపారు.

పీఎస్పీల సామర్థ్యం పెంపు

పలు సంస్థలకు ప్రాజెక్టులు కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలు పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు (పీఎస్పీ)ల సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంచింది. అలాగే, పలు ప్రాజెక్టులను వివిధ సంస్థలకు కేటాయించింది. ఒక సంస్థకు కేటాయించిన పీఎస్పీ అనుమతులను రద్దుచేసింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ప్రాజెక్టుల వివరాలు..

- వైఎస్సార్ కడప జిల్లా కొంపాల్లులో 360 మెగావాట్ల పీఎస్పీ ఏర్పాటుకు చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి.
- అరో ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 800 మెగావాట్ల ఓక్ పీఎస్పీ ప్రాజెక్టు రద్దు.
- అదానీ హైడ్రో ఎనర్జీ–4 లిమిటెడ్ సంస్థకు ముందుగా అనుమతించిన 1,000 మెగావాట్ల రైవాడ పీఎస్పీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1,800 మెగావాట్లకు పెంచుతూ అనుమతి.
- సత్యసాయి జిల్లాలో 83 మెగావాట్ల సోలార్ హైబ్రీడ్ పవర్ ప్రాజెక్టు స్థాపనకు బెల్లీ అల్లాయిస్ లిమిటెడ్‌కు అనుమతి.
- అదానీ రెన్యూవబుల్ ఎనర్జీ–51 లిమిటెడ్ సంస్థకు ముందుగా అనుమతించిన 1,000 మెగావాట్ల గండికోట పీఎస్పీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1,800 మెగావాట్లకు పెంచుతూ అనుమతి.

ఈహెచ్‌ఎస్ సేవలు అధ్వానం

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) సేవలు అధ్వానంగా మారాయని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈహెచ్‌ఎస్ ప్యాకేజీలు రివైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈహెచ్‌ఎస్ సేవల అమలుపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈహెచ్‌ఎస్ కోసం ఉద్యోగుల వాటాతో పాటు, ప్రభుత్వ వాటా నిధులను ప్రతి నెలా వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం జమ చేయాలని కోరారు. పెద్ద ఎత్తున బకాయిలు ఉండటంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించడం లేదని వెల్లడించారు.

'బీఈఎస్ఎస్'కు కొత్త నిబంధనలు!

సాక్షి, అమరావతి: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్టు ప్రణాళిక, విద్యుత్ సేకరణ, వినియోగం వంటి అంశాలపై కొత్త నిబంధనలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్సీ) రూపొందించింది. దానికి సంబంధించిన ముసాయిదా(డ్రాఫ్ట్)ను సోమవారం ప్రకటించింది. ఆ వివరాలను ×ఏపీఈఆర్సీ₹ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్టు వెల్లడించింది. వీటిపై అభ్యంతరాలను ఈ నెల 21లోగా కమిషన్‌కు ఈ మెయిల్ ద్వారా పంపాల్సిందిగా కోరింది. 21 రోజుల అనంతరం డ్రాఫ్ట్ అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే.. ప్రజలకు అందుబాటులో ఉంచామని చెబుతున్న ముసాయిదా వెబ్‌సైట్‌లో కనిపించలేదు. దీంతో డ్రాఫ్ట్ కనిపించకుండా అభ్యంతరాలు ఎలా చెప్పాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

విలాసాల నౌక వచ్చేస్తోంది!



చెన్నైలో బయలుదేరి 2వ తేదీన విశాఖ చేరుకోనున్న నౌక

మళ్లీ సముద్రంలో సందడే సందడి

- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన కార్డేలియా క్రూయిజ్ యాత్ర
- విశాఖ నుంచి జూలై 2, 9, 16 తేదీల్లో ప్రారంభం
- చెన్నై–విశాఖపట్నం–పుదుచ్చేరి–చెన్నై మధ్య సర్వీసు
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రారంభమైన టికెట్ల విక్రయాలు

విశాఖ సిటీ : సాగర విహార ప్రపంచానికి విశాఖ మరోసారి స్వాగతం పలుకుతోంది. సముద్ర జలాల్లో తేలియాడే అద్భుత సౌధం మళ్లీ నగరానికి వచ్చేస్తోంది. అలలపై ఆహ్లాదకర ప్రయాణాన్ని అందించనుంది. విలాసవంతమైన సముద్ర విహార నౌకను చెన్నై–విశాఖపట్నం–పుదుచ్చేరి–చెన్నైల మధ్య నడపడానికి కార్డేలియా క్రూయిజ్ సంస్థ మళ్లీ ముందుకొచ్చింది. విశాఖ నుంచి జూలై 2, 9, 16 తేదీల్లో మూడు ట్రిప్పులు నడపనున్నట్లు ప్రకటించింది. 2022 జూన్‌లో ఇదే సంస్థ విశాఖ నుంచి క్రూయిజ్ నౌకను నడిపింది. ఈ నౌకలో విహరించేందుకు విశాఖ ప్రజలే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాల పర్యాటకులు పోటీ పడ్డారు. దీంతో 85 శాతం మేర ఆక్యుపెన్సీతో ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నడిచింది. ఈసారి విశాఖ పోర్టులో కొత్తగా నిర్మించిన ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ నుంచి ఈ విహార నౌక రాకపోకలు సాగించనుంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలను సైతం ప్రారంభించింది.

విహార యాత్ర ఆరంభం ఇలా..

సెవెన్ స్టార్ హోటల్‌కు మించి విలాసవంతమైన నౌకలో విహారం.. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా 24 గంటలు వినోదం.. విభిన్న వంటకాలతో రుచికరమైన ఆహారం.. ఆరోగ్యానికి జిమ్, ఫిట్‌నెస్ సెంటర్ల సౌకర్యం.. స్విమ్మింగ్ పూల్స్‌లో జలకాలాటలు.. రాక్ క్లైంబింగ్ విన్యాసాలు.. ఆహ్లాదపరిచే డ్యాన్స్ షోలు.. అబ్బురపరిచే మ్యాజిక్ ప్రదర్శనలు.. సినిమా థియేటర్లు.. ఇలా ఎటువంటి ఒత్తిడి లేకుండా.. సమయం తెలియకుండా 24/7 ఎంజాయ్ చేసే లగ్జరీ విహార యాత్ర విశాఖ నుంచి ప్రారంభమవుతోంది. జూన్ 30న చెన్నైలో బయల్దేరిన ఈ క్రూయిజ్ నౌక జూలై 2వ తేదీ ఉదయం విశాఖకు వస్తుంది. అదే రోజు సాయంత్రం ఇక్కడ నుంచి బయలుదేరి 4వ తేదీన పుదుచ్చేరికి చేరుకుంటుంది. మళ్లీ అదే రోజు అక్కడి నుంచి బయలుదేరి 5వ తేదీన చెన్నై వెళుతుంది. దీంతో ఒక ట్రిప్పు పూర్తవుతుంది. ఆ తరువాత జూలై 7న చెన్నైలో మరో ట్రిప్పు ప్రారంభమై..



9వ తేదీన విశాఖకు చేరుకుని.. మళ్లీ ఇక్కడి నుంచి బయలుదేరి 12వ తేదీన చెన్నైలో ముగుస్తుంది. మూడో ట్రిప్పు జూలై 14న చెన్నైలో మొదలై 16వ తేదీకి విశాఖకు చేరుకుంది. తిరిగి అదే రోజు ఇక్కడి నుంచి ప్రారంభమై 19వ తేదీన చెన్నైలో ముగుస్తుంది.

గత ప్రభుత్వ చొరవతో విశాఖకు క్రూయిజ్

విశాఖలో క్రూయిజ్ రాక దీర్ఘకాల కలగా ఉండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. విలాసవంతమైన క్రూయిజ్ నౌక ప్రయాణం విశాఖలో అందుబాటులో ఉంటే.. ఇక్కడకు పర్యాటకుల తాకిడి మరింత పెరుగుతుందని భావించింది. ఇందుకోసం కార్డేలియా సంస్థతో సంప్రదింపులు జరిపింది. వాస్తవానికి కార్డేలియా క్రూయిజ్ సర్వీసు విశాఖకు లేదు. ముంబయి, చెన్నై, గోవా, అండమాన్, లక్షద్వీప్ వంటి ప్రాంతాల్లో ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విశాఖ నుంచి సర్వీసు నడిపేందుకు అంగీకరించింది. అది కూడా ముందుగా మూడు సర్వీసులు నడిపి డిమాండ్‌ను బట్టి నిర్ణయం తీసుకోవాలని భావించింది. కానీ విశాఖవాసులే కాకుండా పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు విశాఖ నుంచి క్రూయిజ్ విహార యాత్రకు పోటీ పడ్డారు. దీంతో ఆ సర్వీసును సెప్టెంబర్ వరకు పొడిగించింది.

క్రూయిజ్‌లో సదుపాయాలు

- కార్డేలియా ఎంప్రెస్ క్రూయిజ్ నౌక ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంది.
- మొత్తం 11 అంతస్తులతో ఉండే ఈ క్రూయిజ్ మొదటి ఫ్లోర్‌లో ఇంజిన్, రెండో ఫ్లోర్‌లో కార్గో ఉంటుంది.
- మూడో ఫ్లోర్ నుంచి పాసింజర్ లాంజ్ మొదలవుతుంది.
- అక్కడి నుంచి ఎలివేటర్ ద్వారా పదో అంతస్తు వరకు చేరుకోవచ్చు.
- పదో ఫ్లోర్‌లో డెక్ లాంటి పెద్ద టెరస్ ఉంటుంది.
- 11వ అంతస్తులో ఉండే ప్రత్యేక సెటప్ ద్వారా సూర్యోదయం, సూర్యాస్తమయాలను వీక్షించడం మధురానుభూతిని కలిగిస్తుంది.
- లగ్జరీ సూట్(8వ ఫ్లోర్) మినహా మిగిలిన అన్ని రకాల రూమ్స్ దాదాపుగా అన్ని ఫ్లోర్లలో ఉంటాయి.
- ఫుడ్‌కోర్టులు, మూడు స్పెషాలిటీ రెస్టారెంట్లు, 5 బార్లు, స్పా, సెలూన్ అందుబాటులో ఉన్నాయి.
- చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఫన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా ఈ నౌకలో కార్డేలియా కిడ్స్ అకాడమీ పేరుతో విశాల ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.





- జిమ్, ఫిట్‌నెస్ సెంటర్, స్విమ్మింగ్ పూల్, కేసినో, డ్యాన్సులు, కామెడీ, మ్యాజిక్ షోల కోసం ఆడిటోరియం, కొత్త సినిమాలను వీక్షించడానికి థియేటర్, నైట్ క్లబ్, 24 గంటల సూపర్ మార్కెట్, లైబ్రరీ ఇలా క్షణం కూడా బోర్ కొట్టకుండా అనేక సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.
- డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్‌ను ఎంజాయ్ చేయవచ్చు.
- అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్‌మాల్స్, లైవ్ షోలు కూడా అలరిస్తాయి.
- టికెట్ తీసుకున్న ప్రతీ ఒక్కరికీ క్యాసినోలో ఎంట్రీ ఉచితం.
- లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

క్యాసినో ఆడాలంటే..

రాష్ట్రంలో క్యాసినో ఆడేందుకు ప్రభుత్వం అనుమతి లేదు. ఇందుకు కొంత సమయం వేచి ఉండాల్సిందే. నౌక ప్రయాణం ప్రారంభమై 20 మైళ్లు వెళ్లిన తరువాత క్యాసినో ఆడేందుకు అవకాశం ఉంటుంది.

కల్తీల కలవరం









కల్తీ మాఫియా గుప్పిట్లోనే..

- కుళ్లిపోయిన వెన్నను కాచి నెయ్యిని తయారు చేస్తున్నారు. మంచి సువాసన కోసం కొన్నిరకాల రసాయనాలు కలుపుతున్నారు.
- కారంపొడిలో రకరకాల రసాయనాలతో పాటు కొన్ని రకాల పొట్టు కలిపి కారంపొడి తయారు చేస్తున్నారు.
- చిన్న పిల్లలకు ఇచ్చే గ్లూకోన్‌డీని కూడా కల్తీమయం చేశారు. కొన్ని రసాయనాల మిశ్రమం, శాక్రిన్‌లు కలిపి ఇస్తున్నారు. దీనివల్ల చిన్నారుల ఆహారం గుల్లవుతోంది.
- పప్పు దినుసుల్లోనూ కల్తీ జరుగుతోంది. శనగపిండిలో బియ్యపు పిండి కలిపి అమ్ముతున్నారు.
- చిరు ధాన్యాల్లో అంటే ధనియాలు, మినప్పప్పు వంటివి బాగా ఆకర్షించేలా ఉండటం కోసం ఓరకమైన నూనెలను కలుపుతున్నారు. ఇవి చాలా ఆకర్షించేలా ఉంటాయి.
- తాజాగా సర్ఫ్ పౌడర్, సబ్బులు, గుడ్‌నైట్ లిక్విడ్ వంటి నకిలీ సరుకులు విజిలెన్స్ తనిఖీల్లో పట్టుకున్నారు.

నకిలీని కనిపెట్టేదెలా..?

- సబ్బులు, బట్టలకు వాడే సర్ఫ్ వంటివి కనిపెట్టడం సామాన్య వినియోగదారులకు కొంచెం కష్టమే. కానీ కొద్దిగా పరిశీలిస్తే...
- ఒరిజనల్ కంపెనీ వస్తువుకు, నకిలీ వస్తువుకు లేబుల్ మీద ఉన్న రాత (ఫాంట్)లో తేడా ఉంటుంది.
- లోగోలో కూడా ఒక అక్షరం తేడాతో ఇమిటేట్ చేస్తుంటారు.
- అన్నింటికీ మించి బార్‌కోడ్ అతి ముఖ్యమైనది. చిన్న చిన్న కిరాణా షాపుల్లో బార్‌కోడ్ స్కాన్ చేయరు.
- ఒకసారి బార్‌కోడ్ స్కాన్‌తో కొనుకున్న వస్తువును, కిరాణా షాపులో ఉన్న వస్తువును పోల్చి చూస్తే తేడా ఖచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

నీళ్ల నుంచి పాల వరకు అన్నీ కల్తీ

- తాజాగా గుడ్‌నైట్, ఏరియల్ వస్తువులు నకిలీ
- గతంలో బ్రూ ప్యాకెట్లు, టైడ్ పౌడర్లు ఫేక్‌గా తేలాయి
- ఒరిజనల్ ఏదో నకిలీ ఏదో కనిపెట్టలేక మోసపోతున్న జనం
- విజిలెన్స్ తనిఖీల్లో గుట్టు రట్టుతో వినియోగదారుల్లో ఆందోళన

- అనంతపురంలోని పాతూరుకు చెందిన మహబూబ్ బాషా దోమలబారినుంచి తప్పించుకునేందుకు ఆలౌట్ లిక్విడ్ బాటిల్ కొన్నారు. దోమలు చావకపోగా ఎన్నాలున్నా లిక్విడ్ అయిపోలేదు. అప్పుడు తెలిసింది ఇది నకిలీ ఆలౌట్ అని.
- గుత్తిలో సుజాత అనే ఓ మహిళ అర డజను బట్టల సబ్బులు కొనింది. కానీ ఈ సబ్బుతో ఎంత ఉతికినా మురికి పోలేదు. చివరకు ఆరా తీస్తే అవి నకిలీవని తేలింది.

డిక్లరేషన్ నిబంధనలే చూస్తాం

మా పరిధిలో కంపెనీ డిక్లరేషన్‌లో ఇచ్చిన నిబంధనలు మాత్రమే చూస్తాం. అవి కరెక్టుగా ఉన్నాయా లేదా అనేదే పరిశీలిస్తాం. వస్తువు నాణ్యత చూడటం మా పరిధిలో లేదు. డిక్లరేషన్ నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం.

– సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్, తూనికలు కొలతల శాఖ

యాజమాన్యాలే జాగ్రత్తగా ఉండాలి

నకిలీ ఏదో ఒరిజనల్ ఏదో సామాన్యులు కనిపెట్టలేరు. ఎన్నో ఏళ్లనుంచి వ్యాపారం చేస్తున్న కిరాణా షాపుల యజమానులకు డూప్లికేట్ ఏదో, మంచిదేదో తెలుసు. ఏజెన్సీలనుంచి తీసుకునేటప్పుడు జాగ్రత్త వహించి తీసుకోవాలి. లేదంటే నకిలీ ప్రొడక్టులు దొరికితే నష్టపోయేది కిరాణాషాపుల యాజమాన్యాలే.

– జమాల్ బాషా, సీఐ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మార్కెట్ నిండా నకిలీ, కల్తీ వస్తువులే. సామాన్యులు, నిరక్షరాస్యులే కాదు బాగా చదువుకున్న ఐటీ ఉద్యోగులు కూడా నకిలీ వస్తువుల విషయంలో బోల్తా పడుతున్నారు. ఏది నకిలీనో, ఏది నిజమైనదో తెల్సుకోలేక వినియోగదారులు ఘోరంగా మోసపోతున్నారు. రోజువారీ వినియోగంలో ఉండే వస్తువుల వ్యాపారం రూ.కోట్లలో ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నకిలీ, కల్తీ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తాజాగా విజిలెన్స్ తనిఖీల్లో నకిలీ వస్తువులు బయట పడటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. తరచూ తనిఖీలు లేకపోవడం వల్ల ఇలా నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నట్టు ఆరోపణలున్నాయి.

టీపొడిలో కొత్త కోణాలు

ఇటీవలి కాలంలో కల్తీ టీపొడి వినియోగం తీవ్రమైంది. పదే పదే వాడిన టీని ఎండపెట్టి చింతపిక్కల పొడి వంటివి కలిపి మళ్లీ అమ్ముతున్నారు. ఇందులో కొన్ని ఆకర్షించే రంగులు, రుచికోసం రసాయనాలు కలుపుతున్నారు. ఒరిజనల్ టీపొడి అయితే ఒక గ్లాసు మంచినీళ్లలో వేస్తే... టీపొడి బాగా నానిన తర్వాత గానీ రంగుమారదు. అదే నకిలీ టీపొడి అయితే నీళ్లలో వేసిన రెప్పపాటులోనే నీళ్లన్నీ టీరంగులోకి మారిపోతాయి. లేబుళ్లు లేకుండా సంచుల కొద్దీ వస్తున్న ఈ టీపొడిలో మసాలాలు కలిపి వినియోగదారులకు అందిస్తున్న తీరు భయాందోళనకు గురిచేస్తోంది.

పాలను విషపూరితం చేస్తున్నారు

కల్తీపాలు ఇప్పటికీ యథేచ్ఛగా మార్కెట్లోకి వస్తున్నాయి. కొన్ని రకాల నూనెలను బాగా మరగకాచి, వాటిలో కొన్ని క్రీములు కలిపి నకిలీ పాలను తయారు చేస్తారు. వీటిని డెయిరీ సంస్థలకు అమ్ముతున్నారు. డెయిరీ సంస్థలు ఫ్యాట్ కంటెంట్ (కొవ్వు శాతం) చూస్తాయి గానీ, ఇవి నకిలీవా, కాదా అనే పరిస్థితి లేదు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు


తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 88,497 మంది స్వామివారిని దర్శించుకోగా 29,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.34 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. సోమవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు వరకు ఊంజల్ సేవ చేపట్టారు. రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం హనుమంత, బుధవారం గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూలై 3న పార్వేట ఉత్సవం జరగనుంది.

పుష్పయాగం రేపు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో ఈనెల 2న బుధవారం పుష్పయాగం జరుగనుంది. ఇందుకోసం 1వ తేదీన మంగళవారం సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటలకు వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహిస్తారు. 2వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు శ్రీభూ సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒక గంట నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.



కొందరు ఎప్పుడూ ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, తుళ్లుతూ ఉంటారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అలాగే కనిపిస్తుంటారు. పైగా ఆ పరిస్థితిని ఎదుర్కొనేంత ధైర్యాన్ని కనబరుస్తుంటారు. తమ మానసిక బలంతో సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటారు. తాము విజయం సాధిస్తే మరీ మంచిది. ఒకవేళ సాధించలేకపోయినా తమ ప్రయత్నం మాత్రం మానరు. ఇక మరికొందరు చిన్న చిన్న సమస్యకే డీలాపడిపోతుంటారు. కిందా మీదా పడుతూ ఎంతో ప్రయాస పడుతున్నట్టుగా కనిపిస్తారు. వాళ్ల మాటల్లో ఆందోళన, నిరుత్సాహం, చిరాకు, చికాకూ అన్నీ కనిపిస్తుంటాయి. అందరూ మనుషులే.. అయితే వాళ్ల మధ్య ఈ వ్యత్యాసాలెలా కనిపిస్తున్నాయి? ఈ తేడాలెందుకున్నాయి? ఎందుకంటే ఒక్కొక్కరికి ఐక్యూలలో తేడాలున్నట్టే... వాళ్ల ఎమోషన్ కోషియెంట్ (ఈక్యూ)లలో ఉన్న తేడాల వల్ల. ఎమోషనల్ కోషియెంట్ అంటే ఏమిటి, అది ఎందుకు అవసరం, దాన్ని ఎలా అభివృద్ధి పరచుకోవాలి... వంటి అనేక అంశాలను తెలిపేదే ఈ కథనం.

EQ మన మనో బలం ఎంత?

ఐన్‌స్టైన్ చాలా మేధావి అనీ, అతడి ఐక్యూ సాధారణ జనాల ఐక్యూ కంటే చాలా ఎక్కువనే మాట వినే ఉంటారు. ఐక్యూ వల్ల తెలివితేటలు బాగానే ఉండవచ్చు. కానీ జీవితంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైనది ఎమోషనల్ కోషియెంట్. అలాంటి 'ఈక్యూ' గురించి తెలుసుకుందాం.

ఎమోషనల్ ఎపిడమిక్...

ఏదైనా వైరస్ లేదా బ్యాక్టీరియా వంటి వాటి వల్ల అనేక చోట్ల ఒక్కసారిగా వ్యాధులు పెచ్చరిల్లి వ్యాప్తిచెందుతూ ఉంటే దాన్ని ఎపిడమిక్ అంటారు కదా. మరి ఇప్పుడున్న వాతావరణంలో ఎమోషన్ ఎపిడమిక్ అనే పరిస్థితి నెలకొని ఉందని అనుకోవచ్చు. అసలు ఎమోషనల్ ఎపిడమిక్ అంటే ఏమిటో చూద్దాం.

ఈ మధ్యకాలంలో మన సమాజంలో అనేక రకాల మానవ సంబంధాలకు (రిలేషన్‌షిప్ ప్రాబ్లమ్స్‌కు) సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయి. సంక్లిష్టమైన ఈ మానవ సంబంధాలతో వచ్చే మానసిక వేదనలూ, దౌర్బల్యాలూ, కుంగుబాట్ల వల్ల అనేక అనర్థాలూ చోటు చేసుకుంటున్నాయి. ఈ తరహా కుటుంబ కలహాలు... భార్యాభర్తలు, తల్లిదండ్రులు–పిల్లలూ, అన్నాచెల్లెళ్లూ, అక్కా తమ్ముళ్లూ... స్నేహితులూ, ఇతరుల మధ్య... దాదాపుగా ఇలాంటి సమస్యలు లేనివారంటూ ఉండరనే చెప్పవచ్చు. కాకపోతే వాటి తీవ్రతలోనే తేడా ఉంటే ఉండవచ్చుగానీ... సమస్యలంటూ లేనివారు ఉండరు. ఇలా అన్ని చోట్లా ఇలాంటి మానసిక సమస్యలు పెచ్చరిల్లి మానవ సంబంధాలు ప్రభావితం కావడాన్ని 'ఎమోషనల్ ఎపిడెమిక్'గా చెప్పవచ్చు.

ఈ ఎమోషనల్ ఎపిడమిక్‌కు కారణం... మనం, చదువుకూ, డబ్బుకూ ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఉద్వేగాలకు అతీతంగా స్థిరంగా ఉండటానికి... అంటే 'ఎమోషనల్ డెవలప్‌మెంట్'కు ఇవ్వకపోవడమే. దాంతో క్షణికోద్రేకాలు... వాటి కారణంగా ఘర్షణలూ, కొన్నిసార్లు ఆత్మహత్యలు, హత్యల వంటివీ చోటు చేసుకుంటున్నాయి. దీనికి కారణం మనుషుల్లో ఐక్యూలాగా... ఈక్యూను అంటే ఎమోషనల్ కోషియెంట్‌ను కూడా పెంపొందించుకోవాలన్న దృష్టి కొరవడటం.

అందుకే ఇప్పుడు స్కూలు పిల్లల చదువులలో ఐక్యూతో పాటు ఈక్యూనూ పెంచడంతోపాటు చిన్నప్పట్నుంచే పిల్లలకు ఈక్యూ కూడా పెంపొందేలా చూడటం అవసరం.

ఈక్యూ ఎందుకంటే...

మేధాశక్తి (ఇంటెలిజెన్స్)ని రెండు రకాలుగా చెప్పవచ్చు. ఒకటి విషయ సంబంధమైన పరిజ్ఞానం, తెలివితేటలు మొదలైన వాటికి సంబంధించినది. విషయసంబంధమైన మేధాశక్తిని ఇంటెలిజెన్స్ కోషియెన్స్ (ఐక్యూ) ద్వారా చెబుతారు.

రెండోది భావోద్వేగ మేధాశక్తి. దీనినే 'ఎమోషనల్ ఇంటెలిజెన్స్' అంటారు. భావోద్వేగ మేధాశక్తి ద్వారా ఈక్యూను అంచనా వేస్తారు.

ఒక వ్యక్తి సంతోషంగా జీవించడానికి, ఇతరులతో చక్కటి సంబంధాలను ఏర్పరచుకోడానికి భావోద్వేగ మేధాశక్తి ఎంతో కీలకం. మరెంతో అవసరం. తెలివితేటలు, చదువు, విషయపరిజ్ఞానం వంటి ఎన్నో అంశాలు ఉండి కూడా కొందరు సమస్యలను ఎదుర్కొనేలా అంతగా మానసిక దృఢత్వం లేకపోవడానికీ, ఢక్కాముక్కీలు తిన్నవారిలా కాకుండా సమస్యకు తేలిగ్గా లొంగిపోయి, బెదిరిపోవడానికి కారణం ఈక్యూ తక్కువగా ఉండటమే.

భావోద్వేగ మేధాశక్తి అంటే ఏమిటి?

ఏదైనా ఓ మానసిక స్థితి తాత్కాలికంగా కొనసాగడాన్ని ఉద్వేగం లేదా ఎమోషన్ అంటారు. అదే మానసిక స్థితి చాలా ఎక్కువసేపు కొనసాగితే దాన్ని 'మూడ్' అని వ్యవహరిస్తారు. ఉదాహరణకు బాధ పడటం ఒక మానసిక స్థితి. దాన్ని ఒక డిప్రెసివ్ ఎమోషన్‌గా చెప్పవచ్చు. అయితే అదే బాధ అలా దీర్ఘకాలం పాటు కొనసాగుతూ ఉంటే దాన్ని 'డిప్రెస్డ్ మూడ్' అంటారు. రోజుల తరబడి అదే బాధ నిత్యం ఉంటే అది మూడ్ డిజార్డర్ అవుతుంది.

బాధ, సంతోషం, దిగులు, ఆందోళన, భయం, కోపం, ప్రేమ, ఉత్సాహం... ఇవన్నీ మనందరిలోనూ రకరకాల సమయాల్లో కలిగే మానసిక స్థితులు. వాటినే భావోద్వేగ స్థితులుగా చెప్పవచ్చు.

సరైన సమయంలో సరైన భావోద్వేగాలను సరైన రీతిలో ప్రదర్శించడాన్ని 'భావోద్వేగ మేధాశక్తి'గా చెప్పవచ్చు. ఉదాహరణకు చాలా పెద్ద పొరబాటు జరిగినప్పుడు ఆ సమయంలో (అంటే తగిన సమయంలో) తగిన రీతిలో కోపం ప్రదర్శించినప్పుడు అది తనకూ, ఇతరులకు కూడా సక్రమంగా ఉపయోగపడుతుంది. అయితే అదే కోపాన్ని ఎప్పుడూ ప్రదర్శిస్తూ ఉంటే అది వారికి తీరని నష్టం కలగజేయవచ్చు. అతడితో పనిచేయడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చు. అంటే... తన భావోద్వేగ మేధాశక్తిని సమర్థంగా తగిన రీతిలో సరైన రీతిలో ఉపయోగపడేలా చేసుకోవడమే ఇక్కడ ప్రయోజనాన్ని ఇస్తుందని గుర్తించాలి. ఇలా ఎప్పుడు ఏ రకమైన ఉద్వేగాన్ని, ఎంత మేరకు, ఏ పరిమితుల్లో ఉపయోగించాలన్నదే 'ఈక్యూ'గా చెప్పవచ్చు.

భావోద్వేగ మేధాశక్తి (ఈక్యూ) ఉన్నవారి లక్షణాలివి...

- ఎప్పుడూ సంతోషంగా కనిపించడం...
- తమ భావోద్వేగాలను ఎప్పుడూ తమ అదుపులో ఉంచుకోవడం,
- ఇతరుల భావోద్వేగాలనూ గుర్తించగలగడం. వాటిని గుర్తెరిగి వాటికి అనుగుణంగా ప్రవర్తించడం.
- అవసరమైనప్పుడు ఇతరుల భావోద్వేగాలను సైతం తాను నియంత్రిస్తూ, వారిని సంతోషపరచడం లేదా పరిస్థితులు వారికి అనుగుణంగా ఉండేలా మార్చగలగడం.
- అవసరాన్ని బట్టి తన లక్ష్యం కోసం కొన్ని తన సుఖాలను తాత్కాలికంగా వాయిదా వేయడం. అలా తన తక్షణ సుఖాలను వాయిదా వేయడం వల్ల కూడా తాను సంతోషం పొందగలగడం.
- సమర్థమైన నాయకత్వ లక్షణాలూ అలాగే మంచి సంభాషణాచాతుర్యం.
- ఓటమికి భయపడకపోవడం, కుంగిపోకుండా వాటిని ఎలా ఎదుర్కోవాలన్నది తక్షణం ఆలోచించగలగడం.



ఈక్యూ తాలూకు లక్షణాల వల్ల కలిగే ఫలితాలు...

- ఇలాంటివారు గతంలో తమకు ఎదురైన అనుభవాలను ఒక పాఠంగా తీసుకుని ప్రస్తుతంలో జీవిస్తారు. జీవితాన్ని ప్రణాళికాబద్ధంగా నడుపుతారు. దాంతో గెలుపూ, సంతోషం ఎప్పుడూ వాళ్లతోనే ఉంటాయి.
- అతడితో సమయం గడపడానికి అందరూ ఇష్టపడుతుంటారు. తనతో ఉన్నవారినీ సంతోషపెడుతూ ఈ ఈక్యూ ఎక్కువగా ఉన్నవారు ఇతరులకు మార్గదర్శకుడుగా ఉంటాడు.
- సమర్థమైన నాయకుడిగా ఎదుగుతాడు. తొలుత కుటుంబానికీ, ఆ తర్వాత సమాజానికీ నేతృత్వం వహిస్తుంటాడు.

ఈక్యూను (భావోద్వేగ మేధాశక్తిని) పెంచుకోవడం ఎలా...?

ఈక్యూ (భావోద్వేగ మేధాశక్తి)ని అభివృద్ధి చేసుకోడానికి ముందర... ముఖ్యంగా అదెలా ఏర్పడుతుందో తెలుసుకోవాలి.

- భావోద్వేగ మేధాశక్తికి మొదటి పునాదులు అర్లీ చైల్డ్‌హుడ్ టైమ్‌లో పడి అప్పట్నుంచి 18 ఏళ్ల వయసు వరకు వేగంగా అభివృద్ధి చెందుతుంటుంది. ఆ తర్వాత కూడా ఈక్యూ పెరుగుతుంటుంది కానీ... అర్లీ చైల్డ్‌హుడ్ నుంచి 18 ఏళ్ల వరకు జరిగినంత వేగంగా ఆ అభివృద్ధి జరగదు. చిన్నప్పుడు తమ తల్లిదండ్రుల, సమాజంలోని ఇతరుల ప్రవర్తన, తాము ఎదిగిన పరిస్థితులు... ఇవన్నీ పిల్లల భావోద్వేగ మేధాశక్తిపై ప్రభావం చూపుతాయి.
- మెదడులో చిన్నప్పుడు ప్లాస్టిసిటీ అనే స్వభావం ఎక్కువగా ఉంటుంది. అంటే... దాన్ని ఏరకంగా మలిస్తే మెదడులో స్వభావాలను ఏర్పరచుకునే తత్వం / పరిస్థితి ఆ రకంగా మారుతుందని చెప్పవచ్చు. ఈ స్వభావం లేదా గుణం మనం ఎదిగే కొద్దీ తగ్గుతూ పోతుంది. అందుకే 'మొక్కై వంగనిది, మానై వంగునా' అనే సామెత భావోద్వేగ మేధాశక్తి విషయంలో అక్షర సత్యమని చెప్పవచ్చు.



ఎమోషనల్ ఇంటెలిజెన్స్... తల్లిదండ్రుల పాత్ర...

తల్లిదండ్రులు కేవలం పిల్లల చదువుల మీద శ్రద్ధ పెట్టినంత మాత్రాన సరిపోదని గుర్తించాలి. నిజానికి వారు ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశమేమిటంటే... తమ పిల్లలు ఎదుటివారిలో మెలిగేప్పుడు ఎలా ప్రవర్తిస్తున్నారు, వాళ్ల ప్రవర్తనలో తేడాలుంటే ఎలా చక్కదిద్దాలి... అలాగే విపత్కర పరిస్థితుల్లో వాటిని ఎదుర్కొనేందుకు వాళ్లు అనుసరిస్తున్న పద్ధతులు లేదా వ్యూహమేమిటి, వాటిని పరిష్కరించడానికి వాళ్లు ఎదుర్కొంటున్న మార్గాలేమిటి అని చూడాలి. అవి చాలా చిన్న చిన్న అంశాలే కావచ్చు. ఉదాహరణకు ఏదైనా ఓ కారణంతో ఓ చిన్నారి తన హోమ్‌వర్క్ పూర్తిగా కంప్లీట్ చేయలేదు. ఆ వయసుకు అతడికి అదే విపత్కరమైన పరిస్థితి. దాన్ని అతడు ఎలా ఎదుర్కొంటున్నాడు అన్నది తల్లిదండ్రులు గమనించాలి. కడుపు నొప్పి లేదా ఇతరత్రా వంక పెట్టి ఆ రోజుకు స్కూల్ మానేయాలని చూస్తున్నాడా లేదా తగిన (కన్విన్సింగ్) జవాబును సిద్ధం చేసుకుని పరిస్థితిని ఎదుర్కొనేందుకు సంసిద్ధమవుతున్నాడా అన్నది తల్లిదండ్రులు చూడాల్సిన అంశం. ఒకవేళ అతడు స్కూల్ మానాలని అనుకుంటే... అది సరికాదనీ... టీచర్ అడిగినప్పుడు ఈ సమాధానం చెప్పమనీ, ''ముందు నువ్వు ఈ విషయం ఇలా చెప్పు. ఒకవేళ ఆయన వినకపోతే మేమూ స్కూల్‌కు వచ్చి కన్విన్స్ చేస్తా''మంటూ పిల్లలను పరిస్థితి ఎదుర్కొనేందుకు సంసిద్ధం చేయాలి.

ఇది చిన్నపిల్లల విషయంలో జరగాల్సిన పనికి ఓ ఉదాహరణ. పరిస్థితులను బట్టి ఇలాంటివే పిల్లలు ఎదుర్కొనేలా తలిదండ్రులు ధైర్య, స్థైర్యాలను తమ పిల్లల్లో పాదుకునేలా చూడాలి. నిజానికి చదువు కంటే... భవిష్యత్తులో ఎదురయ్యే అనేక రకాల సమస్యలను ఎదుర్కోడానికి ఇలాంటి పాఠాలే చాలా అవసరమని గుర్తించాలి. లోకంలోని అనేక పరిస్థితులను ఎదుర్కోడానికి ఐక్యూ కంటే కూడా ఈక్యూనే ప్రధానం.

ఇక అవసరమైన చోట ఓపిగ్గా ఉండటాన్ని అభ్యాసం చేయించాలి. ఓరిమితో ఉండటం క్షమాగుణాన్ని పెంపొందిస్తుంది. క్షమాగుణం వల్ల గొడవలు తగ్గి చాలా ప్రశాంతంగా హాయిగా జీవించడం సాధ్యమవుతుంది.

ఎదుటివారిలో మంచి కనిపించినప్పుడు దాన్ని గుర్తించి అభినందించే మనస్తత్వాన్ని అభ్యాసం చేయిస్తే... ఈర్ష్య తగ్గి చాలా ప్రశాంతతతో జీవించే గుణం అలవడుతుంది.

ప్రతికూల ప్రవర్తనలతో ఈక్యూ తగ్గిన సందర్భాల్లో...

తల్లిదండ్రులు తమ పిల్లలను తరచూ తిడుతూ, ఇతరులతో పోల్చి వారిని నిందిస్తూ ఉంటే పిల్లలు కూడా తమ తప్పులకు ఇతరులను బాధ్యులు అనుకోవడం, అందుకు వారిని దూషించడం, నిందించడం నేర్చుకుంటారు. ఇది అదేపనిగా కొనసాగడం వల్ల ద్వేషించడాన్ని కొనసాగిస్తుంటారు. ఇక మరికొందరు పెద్దవాళ్ల చేత అదేపనిగా ఎగతాళికి గురవుతుంటే ఆ పిల్లలు బిడియస్తులుగా, పిరికివారుగా తయారవుతారు. మరికొందరు అవమానం కారణంగా నేర స్వభావాన్ని పెంచుకుంటారు. అందుకే పిల్లలకు ఈక్యూ నేర్పడంలో తల్లిదండ్రుల ప్రవర్తన చాలా కీలకం.

భావోద్వేగ మేధాశక్తితో కలిగే ప్రయోజనాల్లో కొన్ని...

- భావోద్వేగ మేధాశక్తి ఉన్నవారికి మానసిక సమస్యలు చాలా తక్కువ.
- వారిలో శారీరక సమస్యలు వచ్చే అవకాశాలు కూడా తక్కువ అని అధ్యయనాలు తెలుపుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న వ్యక్తికి ఎమోషనల్ సపోర్ట్ లేకపోతే గుండెపోటు వచ్చే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువ. అదే ఒకసారి గుండెపోటు వచ్చిన వ్యక్తికి డిప్రెషన్ ఉంటే గుండెపోటు వచ్చే అవకాశాలు 3.5 రెట్లు అధికం.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని మనం మనలోని ఉద్వేగ మేధాశక్తిని (ఈక్యూను) నిరంతర సాధనతో పెంచుకుంటూ ఉండటంతో పాటు... ఆ ప్రభావం ఎదుటివారికీ ప్రయోజనం కలిగేలా వ్యవహరించడం (దీన్నే మానసిక విశ్లేషకులు 'విన్ – విన్ సిచ్యువేషన్' అంటుంటారు) వల్ల మానవ సంబంధాలు మెరుగుపడటంతో పాటు మరింత మంచి సమాజం ఏర్పడుతుందన్నది చాలామంది మానసిక వైద్యులూ, శాస్త్రవేత్తల మాట.





డా. శ్రీనివాస్ ఎస్‌ఆర్‌ఆర్‌వై,
సీనియర్ సైకియాట్రిస్ట్

ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ కీలకం

స్థూల ఆర్థిక మూలాలు పటిష్టం
- దశాబ్దాల కనిష్ఠ స్థాయికి ఎన్‌పీఏలు
- క్రెడిట్ కార్డుల్లో పెరిగిపోయిన బకాయిలు
- రుణ వృద్ధి 4.9 శాతానికి పరిమితం
- వెల్లడించిన ఆర్‌బీఐ నివేదిక



ముంబై: ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ కీలక చోదకంగా నిలుస్తున్నట్టు ఆర్‌బీఐ తాజా నివేదిక పేర్కొంది. స్థూల ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉండడంతోపాటు, వివేకవంతమైన విధానాలు ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది. ఆర్థిక స్థిరత్వంపై ద్వైవార్షిక నివేదికను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఆర్థిక, వాణిజ్య విధానపరమైన అనిశ్చితులు పెరిగిపోవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలాన్ని పరీక్షిస్తున్నట్టు తెలిపింది. ''భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ఫలితంగా ఆర్థిక మార్కెట్లు, ముఖ్యంగా ప్రభుత్వ బాండ్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. వీటికితోడు ప్రభుత్వ రుణాలు, ఆస్తుల విలువలు కూడా పెరగడం తాజా షాక్‌లకు దారితీయొచ్చు''అని ఈ నివేదిక పేర్కొంది. బ్యాంకులు, నాన్ బ్యాంకుల ఆరోగ్యకరమైన బ్యాలన్స్ షీట్ల మద్దతుతో దేశీ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నట్టు తెలిపింది. సర్దుబాటు పరపతి విధానం, ఫైనాన్షియల్ మార్కెట్లలో తక్కువ అస్థిరతల మద్దతుతో ఆర్థిక పరిస్థితులు సులభతరంగా మారినట్టు వివరించింది. బ్యాంకుల వద్ద నగదు నిల్వలు సమృద్ధిగా ఉన్నట్టు తెలిపింది.

నిదానించిన రుణ వృద్ధి..

మే 30తోముగిసిన పక్షం రోజుల్లో బ్యాంకుల రుణ వితరణలో వృద్ధి 4.9 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాంలో వృద్ధి 8.9 శాతంగా ఉన్నట్టు ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. ఆహారేతర విభాగాలకు బ్యాంక్‌ల నుంచి రుణ వితరణ 9.8 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 16.2 శాతం వృద్ధి చెందడం గమనార్హం. పరిశ్రమలకు రుణ వితరణ 4.9 శాతం వృద్ధికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 8.9 శాతంగా ఉంది. వార్షికంగా చూస్తే ఇంజనీరింగ్, నిర్మాణం, రబ్బర్, ప్లాస్టిక్స్ రంగాలకు రుణ వితరణ పెరిగింది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణ వితరణ మే 30తో ముగిసిన పక్షం రోజుల్లో 7.5 శాతం వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 21.6 శాతంగా ఉంది. సేవల రంగానికి రుణ వితరణ 9.4 శాతం వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 20.7 శాతంగా ఉంది.

స్థూల ఎన్‌పీఏలు 2.3 శాతం

బ్యాంకింగ్ రంగంలో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు/వసూలు కాని రుణాలు) 2025 మార్చి చివరికి మొత్తం రుణాల్లో 2.3 శాతానికి తగ్గాయి. ఇది దశాబ్దాల కనిష్ఠ స్థాయిగా ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. 2024 సెప్టెంబర్ చివరికి ఇవి 2.6 శాతంగా ఉండడం గమనించొచ్చు. 46 షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులకు సంబంధించి స్థూల ఎన్‌పీఏలు 2027 మార్చి నాటికి తిరిగి 2.6 శాతానికి పెరగొచ్చని ఆర్‌బీఐ నివేదిక అంచనా వేసింది. గత దశాబ్దం చివర్లో బ్యాంకింగ్ రంగానికి ఎన్‌పీఏలు సవాలుగా పరిణమించినట్టు గుర్తు చేసింది. కానీ, నాటి నుంచి బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరు ఎంతో మెరుగుపడినట్టు తెలిపింది. 2024–25 సంవత్సరంలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల్లో స్థూల ఎన్‌పీఏల్లో మాఫీ చేసిన రుణాలు 31.8 శాతానికి పెరిగాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇలా రద్దు చేసిన ఎన్‌పీఏలు 29.5 శాతంగానే ఉన్నాయి. కొత్త ఎన్‌పీఏల రేషియో 0.7 శాతానికి పరిమితమైంది. 6.1 శాతం జీఎన్‌పీఏలు వ్యవసాయ రంగం నుంచి ఉన్నాయి. వ్యక్తిగత రుణాల్లో ఎన్‌పీఏలు 1.2 శాతంగానే ఉన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులకు సంబంధించి క్రెడిట్ కార్డు రుణాల్లో స్థూల ఎన్‌పీఏలు 14.3 శాతానికి పెరగ్గా.. ప్రైవేటు బ్యాంకు క్రెడిట్ కార్డు రుణాల్లో ఇవి 2.1 శాతంగానే ఉన్నాయి. మొత్తం స్థూల ఎన్‌పీఏల్లో పెద్ద రుణ గ్రహీతలు ఎగ్గొట్టినవే 37.5 శాతంగా ఉండడం గమనార్హం.

వృద్ధికి ఆర్థిక స్థిరత్వం కీలకం

వృద్ధికి ఆర్థిక స్థిరత్వం, ధరల స్థిరత్వం ఎంతో కీలకమని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అదే సమయంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న ఎన్నో నిర్మాణాత్మక మార్పులు విధానపరమైన సవాళ్లను విసురుతున్నట్టు చెప్పారు. ''ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు కస్టమర్ల రక్షణకు, పోటీని ప్రోత్సహించేందుకు, ఆవిష్కరణలను వేగవంతం చేసేందుకు కట్టుబడి ఉన్నాయి. సామర్థ్యం మెరుగుదల, వృద్ధికి మధ్య ఇవి సరైన సమతూకాన్ని ఇవ్వగలవు''అని ఆర్‌బీఐ నివేదికలో గవర్నర్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వాణిజ్యం విచ్ఛిన్నం అవుతుండడం, టెక్నాలజీల్లో వేగవంతమైన మార్పులు, వాతావరణ మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులకు దారితీస్తున్నట్టు వివరించారు. ఇలాంటి తరుణంలో ఆర్థిక అంచనాలు వేయడం, విధానపరమైన జోక్యాలు సవాలుతో కూడుకున్నవిగా అభిప్రాయపడ్డారు. కనుక ఇలాంటి సమయాల్లో తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకునేందుకు కేంద్ర బ్యాంకులు, ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు అప్రమత్తంగా, వివేకంతో, చురుగ్గా ఉండాలన్నారు. దేశీయంగా ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నట్టు గుర్తు చేశారు. స్థూల ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నాయన్నారు. అదే సమయంలో అంతర్జాతీయ అంశాలు, వాతావరణ మార్పులు వృద్ధి తగ్గడానికి దారితీసే రిస్కులుగా పేర్కొన్నారు.



ఐపీవో స్ట్రీట్

4 కంపెనీల దరఖాస్తు

జాబితాలో సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ • జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్

టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా • గాజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్

దేశీయంగా ప్రైమరీ మార్కెట్ల జోరు కొనసాగుతోంది. తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి 4 కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. తద్వారా నిధుల సమీకరణకు సన్నాహాలు ప్రారంభించాయి. ఇటీవల జోష్‌లో ఉన్న ప్రైమరీ మార్కెట్ల కారణంగా ఈ వారం 13 ఎస్ఎంఈల తోపాటు.. హెచ్‌డీబీ, కల్పతరు తదితర 6 మెయిన్‌బోర్డ్ కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికానున్నాయి. తాజాగా ఐపీవో బాట పట్టిన కంపెనీల వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: ఆటోమోటివ్ విడిభాగాల తయారీ కంపెనీ టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు అనుమతించమంటూ సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్ సంస్థ టెన్నెకో మారిషస్ హోల్డింగ్స్ రూ. 3,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా ప్రమోటర్ సంస్థ రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. యూఎస్ సంస్థ టెన్నెకో గ్రూప్ కంపెనీ ఇది. కంపెనీ ప్రధానంగా క్రిటికల్, అత్యున్నత ఇంజినీర్డ్, టెక్నాలజీ ఆవశ్యత గల క్లీన్ ఎయిర్, పవర్‌ట్రెయిన్, సస్పెన్షన్ సొల్యూషన్స్ అందిస్తోంది. దేశీ ఓఈఎం దిగ్గజాలతోపాటు ఎగుమతి మార్కెట్లకు అనుగుణమైన ప్రొడక్టులను రూపొందిస్తోంది. ప్రమోటర్ సంస్థలలో టెన్నెకో మారిషస్‌సహా ఫెడరల్ మొగల్ ఇన్వెస్ట్‌మెంట్స్ బీవీ, టెన్నెకో ఎల్ఎల్‌సీ తదితరాలున్నాయి.


టీఎంటీ బార్స్ కంపెనీ



ఇనుము, స్టీల్ తయారీలో సమీకృత కార్యకలాపాలు కలిగిన గుజరాత్‌కంపెనీ జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. ప్రధానంగా టీఎంటీ బార్స్ తయారీపై దృష్టిపెట్టి సాగుతోంది. ఐపీవోలో భాగంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు కంపెనీ ప్రమోటర్లు మరో 20 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 325 కోట్లు గుజరాత్‌లోని తయారీ ప్లాంటు విస్తరణకు వినియోగించనుంది. అంతేకాకుండా హైబ్రిడ్ విండ్ అండ్ సోలార్ పవర్ ప్లాంటును సైతం ఏర్పాటు చేయనుంది. మరో రూ. 55 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2025 మార్చి31కల్లా రూ. 347.3 కోట్ల రుణ భారాన్ని కలిగి ఉంది. 2024 డిసెంబర్‌తో ముగిసిన తొలి 9 నెలల కాలానికి కంపెనీ ఆదాయం రూ. 980 కోట్లకు చేరింది. రూ. 32 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

గాజా క్యాపిటల్ బ్రాండ్‌తో

గోప్యతా విధానంలో సెబీకి గాజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ పబ్లిక్ ఇష్యూ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. గాజా క్యాపిటల్ బ్రాండుతో కంపెనీ ప్రయివేట్ ఈక్విటీ(పీఈ), ప్రత్యామ్నాయ ఆస్తుల కంపెనీగా సర్వీసులందిస్తోంది. రహస్య పద్ధతిలో ఫైలింగ్ చేయడంతో కంపెనీ కచ్చితంగా ఐపీవో చేపట్టవలసిన అవసరం ఉండబోదు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఇష్యూ నిధులను ఫండ్ మేనేజర్లకు పెట్టుబడులుగా వినియోగించనుంది. తద్వారా కొత్త ఫండ్స్ ఏర్పాటు చేయనుంది. వీటితోపాటు దేశ, విదేశాలలో పంపిణీ విస్తరణకు నిధులు వెచ్చించనుంది. ఈ బాటలో కొత్త ఫండ్ నిర్వహణా వ్యూహాలకు తెరతీయనుంది. వృద్ధి ప్రణాళికలకుతోడు లిస్టింగ్ ద్వారా మార్కెట్లో గాజా క్యాపిటల్ బ్రాండుకు ప్రాచుర్యం లభించనుంది. 2004లో ఏర్పాటైన గాజా క్యాపిటల్ దేశీయంగా పీఈ, ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజ సంస్థలలో ఒకటిగా నిలుస్తోంది. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు గ్రోత్ క్యాపిటల్‌ను సమకూర్చడంపై దృష్టి పెట్టింది. కీలక రంగాలైన ఎడ్యుకేషన్, కన్జూమర్, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో ఇన్వెస్ట్ చేసింది. ఈ నెల మొదట్లో ఐపీవోకు ముందుగా రూ. 125 కోట్లు సమీకరించడం ద్వారా రూ. 1,625 కోట్ల విలువను అందుకుంది. కంపెనీ లిస్టయితే ఆల్టర్నేటివ్ అసెట్ నిర్వహణ చేపట్టే స్టాండలోన్ దేశీ పీఈ సంస్థగా అవతరించనుంది.



స్పెషాలిటీ పేపర్ తయారీ

పర్యావరణ అనుకూల స్పెషాలిటీ పేపర్ తయారీ కంపెనీ సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్ గ్రూప్ సంస్థలు మరో 3.22 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు 100 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 129 కోట్లు ప్రస్తుత తయారీ ప్లాంటుకు అవసరమయ్యే ముడిసరుకుల వనరులకోసం పెట్టుబడి వ్యయాలుగా వెచ్చించనుంది. దీనిలో భాగంగా వృధా నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల 14 మెగావాట్ల సొంత ప్లాంటుతోపాటు కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్‌ను సైతం ఏర్పాటు చేయనుంది. అంతేకాకుండా రూ. 72 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. మరో రూ. 25 కోట్లకుపైగా రివైండర్, షీటర్ సామర్థ్య విస్తరణకు, ప్లాంటువద్దే సొంత వేర్‌హౌస్‌ల నిర్మాణానికి వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా రైటింగ్, ప్రింటింగ్, క్రాఫ్ట్, కప్‌స్టాక్ తదితర ప్రత్యేక తరహా గ్రేడ్ పేపర్లను రూపొందిస్తోంది. ఈకామర్స్, ఫుడ్ పరిశ్రమల్లో వీటిని అత్యధికంగా వినియోగిస్తున్నారు. 2024 డిసెంబర్‌కల్లా రూ. 194 కోట్ల రుణ భారాన్ని కలిగి ఉంది. 2024 డిసెంబర్‌తో ముగిసిన తొలి 9 నెలల కాలానికి కంపెనీ ఆదాయం రూ. 752 కోట్లను అధిగమించింది. రూ. 82 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.



ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎల్ఐసీ పాలసీలు

ముంబై: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్‌బీ) తెలిపింది. దీని ప్రకారం ఎల్ఐసీ టర్మ్ పాలసీలు, ఎండోమెంట్ ప్లాన్లు, హోల్ లైఫ్ పాలసీలు మొదలైన వాటిని తమ శాఖల్లో విక్రయించనున్నట్లు పేర్కొంది. 21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో తమకు 2,456 పైగా బ్యాంకింగ్ టచ్‌పాయింట్లు ఉన్నట్లు బ్యాంక్ ఈడీ ఉత్తమ్ టిబ్రెవాల్ తెలిపారు. ఈ ఒప్పందంతో ఓవైపు బ్యాంకింగ్, బీమా, దీర్ఘకాలిక ఆర్థిక ప్లానింగ్ సొల్యూషన్స్ అన్నింటినీ ఒకే దగ్గర అందించే సంస్థగా తమ బ్యాంక్ స్థానం పటిష్టమవుతుందని మరోవైపు గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో ఎల్ఐసీ పాలసీల విస్తృతి మరింతగా పెరుగుతుందని వివరించారు.

ఇక అమెజాన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల టూర్

క్యూ4 నుంచి అందుబాటులోకి



టోక్యో: ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన ఏ ఉత్పత్తయినా, విక్రేత దగ్గర్నుంచి మన ఇంటి వరకు చేరడం వెనుక బోలెడంత తతంగం ఉంటుంది. ఆ ప్రక్రియ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చాలా మందికి ఉంటుంది. అలాంటి వారి కోసం ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లోని తమ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను (ఎఫ్‌సీ) సందర్శించే అవకాశాన్ని కల్పించనుంది. ఈ ఏడాది నాలుగో త్రైమాసికం (క్యూ4) నుంచి ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరులోని తమ ఎఫ్‌సీల్లో ఉచిత టూర్లను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. నిత్యం లక్షల సంఖ్యలో ఉత్పత్తులను నిల్వ చేయడం, కస్టమర్ల ఆర్డర్ల ప్రాసెసింగ్, రవాణా మొదలైన ప్రక్రియలను ఈ సందర్భంగా ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. ఈ గైడెడ్ టూర్లు వారానికి మూడు సార్లు చొప్పున, ఒక్కోటి 45–60 నిమిషాల పాటు ఉంటాయి. ఒక్కో టూర్‌లో 20 మంది పాల్గొనవచ్చు. టోక్యోలో జరిగిన 'డెలివరింగ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో అమెజాన్ ఈ విషయాలు తెలిపింది. ఈ టూర్లపై ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు త్వరలో వీలు కల్పించనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఇండియా–ఆస్ట్రేలియా ఆపరేషన్స్) అభినవ్ సింగ్ చెప్పారు. దేశీయంగా అమెజాన్‌కు బెంగళూరులో 20 లక్షల ఘనపుటడుగుల స్టోరేజ్ స్పేస్‌తో అతి పెద్ద ఎఫ్‌సీ ఉంది. ఇక ఉత్తరాదిలోనే అతి పెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఉంది. ఇది 4,50,000 చ.అ.ల్లో, సుమారు ఎనిమిది ఫుట్‌బాల్ మైదానాలంత పెద్దగా ఉంటుంది. 2014 నుంచి అంతర్జాతీయంగా అమెరికా, కెనడా, తదితర దేశాల్లోని 35 లొకేషన్లలో ఇరవై లక్షల మంది పైగా సందర్శకులు అమెజాన్ ఎఫ్‌సీలను సందర్శించారు.

అపోలో ఆమ్నీచానల్ ఫార్మసీ వ్యాపారం విడదీత

21 నెలల్లో లిస్టింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యూహాత్మక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఆమ్నీచానల్ ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాలను విడదీసి, లిస్ట్ చేసే ప్రతిపాదనకు అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ (ఏహెచ్ఈఎల్) బోర్డు ఆమోదముద్ర వేసింది. దీనికి సంబంధించిన స్కీము ప్రకారం లిస్టింగ్‌కు 18–21 నెలల వ్యవధి పట్టనుంది. ఇందులో భాగంగా తొలి దశలో ఆమ్నీచానల్ ఫార్మా, డిజిటల్ హెల్త్ వ్యాపారాన్ని కొత్త సంస్థగా విడగొడతారు. తర్వాత హెల్త్‌కేర్ విభాగం అపోలో హెల్త్‌కో (ఏహెచ్ఎల్), హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్ కీమెడ్‌ను కొత్త సంస్థలో విలీనం చేస్తారు. ఈ ప్రక్రియతో దేశీయంగా దిగ్గజ ఆమ్నీచానల్ ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫాం ఏర్పడుతుందని అపోలో హాస్పిటల్స్ తెలిపింది. ఇది 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 25,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలదని పేర్కొంది. స్కీము ప్రకారం కొత్త సంస్థ, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్‌కు దరఖాస్తు చేసుకుంటుంది. ఏహెచ్ఈఎల్ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న ప్రతి 100 షేర్లకు గాను కొత్త కంపెనీకి చెందిన 195.2 షేర్లు లభిస్తాయి. అత్యంత నాణ్యమైన హెల్త్‌కేర్ సేవలను కోట్ల మందికి అందుబాటులోకి తెచ్చేందుకు ఈ మోడల్ ఉపయోగపడుతుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు.

అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ షేరు 0.87 శాతం క్షీణించి రూ. 7,242.75 వద్ద క్లోజయ్యింది.

కాకినాడ 'అరబిందో' ప్లాంటులో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అనుబంధ సంస్థ లిఫియస్ ఫార్మాకు చెందిన కాకినాడ ప్లాంటులో పెన్సిలిన్–జీ ఉత్పత్తిని పునఃప్రారంభించినట్లు అరబిందో ఫార్మా తెలిపింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు (ఏపీపీసీబీ) నుంచి అనుమతులు లభించడంతో తయారీ మొదలుపెట్టినట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-7-2025	
విశాఖ	585–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570–00
విజయవాడ	590–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	570–00
వరంగల్	572–00
రిటైల్ ధర	6.30

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,202.50	3.04
BEL	422.8	2
SBIN	819.85	1.79
INDUSINDBK	873	1.78
JIOFIN	327.4	1.22

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	12,406.00	-1.87
TATACONSUM	1,098.00	-2.34
KOTAKBANK	2,160.00	-2.17
AXISBANK	1,199.00	-2.13
HEROMOTOCO	4,235.60	-1.96

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,666
ఎన్ఎస్ఈ	1,08,192
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,41,483
ఎఫ్ఐఐ	- 831
డీఐఐ	+ 3,497

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.10 (రాత్రి 11.30కు)	$ 65.52 (సోమవారం ముగింపు)
బ్రెంట్	66.68 (రాత్రి 11.30కు)	$ 66.08 (సోమవారం ముగింపు)

కోస్టల్ మెకానిక్స్‌తో రిలయన్స్ డిఫెన్స్ డీల్

- సాయుధ బలగాలకు సర్వీసులు
- రూ. 20 వేల కోట్ల డిఫెన్స్ ఎంఆర్‌వో మార్కెట్‌పై కన్ను



న్యూఢిల్లీ: సుమారు రూ. 20,000 కోట్ల భారతీయ డిఫెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) మార్కెట్‌లో విస్తరణపై రిలయన్స్ డిఫెన్స్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన కోస్టల్ మెకానిక్స్‌తో చేతులు కలిపింది. భారతీయ సాయుధ బలగాలకు అవసరమైన ఎంఆర్‌వో, అప్‌గ్రేడ్, లైఫ్‌సైకిల్ సపోర్ట్ సొల్యూషన్స్‌ను అందించడంపై ఫోకస్ చేయనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ మాతృ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒక ప్రకటనలో తెలిపింది. 100కు పైగా జాగ్వార్ ఫైటర్ విమానాలు, 100 పైచిలుకు మిగ్–29 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్టులు, అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, ఎల్–70 ఎయిర్ డిఫెన్స్ గన్‌లు మొదలైన వాటి ఆధునీకరణకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించింది. డీల్ ప్రకారం భారత్‌తో పాటు ఎగుమతి మార్కెట్లలోని క్లయింట్లకు సేవలు అందించేందుకు రిలయన్స్ డిఫెన్స్, కోస్టల్ మెకానిక్స్ కలిసి మహారాష్ట్రలో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తాయి. దీనితో సాయుధ బలగాలు ఉపయోగించే గగనతల, భూతల డిఫెన్స్ ప్లాట్‌ఫాంల నిర్వహణ, అప్‌గ్రేడ్ సర్వీసులను అందించనున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. 1975లో ఏర్పాటైన కోస్టల్ మెకానిక్స్‌కు అమెరికా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీకి కీలక పరికరాలను సరఫరా చేస్తోంది.

జీడీపీలో ద్రవ్యలోటు 0.8 శాతం

- ఏప్రిల్, మే నెలకు నమోదు
- ఆదుకున్న ఆర్‌బీఐ భారీ డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 0.8 శాతంగా (రూ.13,163 కోట్లు) ఉన్నట్టు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ప్రకటించింది. ఆర్‌బీఐ నుంచి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్ రావడం ఇందుకు అనుకూలించింది. డివిడెండ్, ప్రాఫిట్స్ కింద ప్రభుత్వం రూ.2.78 లక్షల కోట్లను అందుకున్నట్టు సీజీఏ తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతం (రూ.15.69 లక్షల కోట్లు)గా ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొనడం గమనార్హం. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 3.1 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వరకే చూస్తే ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 11.9 శాతం (రూ.1.86 లక్షల కోట్లు)గా ఉండడం గమనించొచ్చు. ఏప్రిల్, మే నెలలకు కలిపి రూ.3.5 లక్షల కోట్ల పన్నుల రూపంలో, రూ.3.56 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం రూపంలో సమకూరింది. నాన్ డెట్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో రూ.25,224 కోట్లు వచ్చింది. వ్యయాలు రూ.7.46 లక్షల కోట్లుగా ఉన్నాయి.

వాణిజ్య వాహనాలకు ఇన్‌ఫ్రా దన్ను

- ఈసారి 3–5 శాతంగా పరిశ్రమ వృద్ధి
- రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా నివేదిక



న్యూఢిల్లీ: నిర్మాణ, ఇన్‌ఫ్రా కార్యకలాపాలు పుంజుకోవడం, ఆర్థికంగా మెరుగైన పరిస్థితులు మొదలైన అంశాలు దేశీయంగా వాణిజ్య వాహనాల (సీవీ) రంగానికి సానుకూలంగా ఉండనున్నాయి. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 3–5 శాతం వృద్ధి నమోదు చేసే అవకాశం ఉంది. వాణిజ్య వాహన రంగం గత ఆర్థిక సంవత్సరంలో స్వల్పంగా 1.2 శాతం క్షీణించింది. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్, మే) సీవీల టోకు విక్రయాలు, వార్షికంగా చూస్తే 0.7 శాతం క్షీణించాయి. రిటైల్ అమ్మకాలు మే నెలలో వార్షికంగా 3.7 శాతం, సీక్వెన్షియల్‌గా (ఏప్రిల్‌తో పోలిస్తే) 11.3 శాతం తగ్గాయి. మధ్య, భారీ స్థాయి వాణిజ్య వాహనాల (ఎం, హెచ్‌సీవీ) విక్రయాలు మే నెలలో వార్షికంగా 4.4 శాతం, సీక్వెన్షియల్‌గా ఏకంగా 18.9 శాతం తగ్గాయి. డీలర్‌షిప్‌ల దగ్గర నిల్వలు భారీగా పేరుకుపోయిన ధోరణులు కనిపిస్తున్నాయని నివేదిక వివరించింది. అయితే, మే గణాంకాలను విడిగా చూస్తే వార్షికంగా 0.1 శాతం, సీక్వెన్షియల్‌గా 1.6 శాతం పెరిగాయి.

రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ప్రాంతీయంగా సవాళ్లు, భౌగోళిక–రాజకీయ అనిశ్చితి మొదలైనవి మే నెలలో వాణిజ్య వాహనాలకు డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి.
- 2026 ఆర్థిక సంవత్సరంలో ఎం,హెచ్‌సీవీల అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 3 శాతం వరకు పెరిగే ఆకాశం ఉంది.
- తేలికపాటి వాణిజ్య వాహనాల (ఎల్‌సీవీ) రిటైల్ విక్రయాలు వార్షికంగా 3–5% పెరగవచ్చని అంచనా. కొత్త వాహనాల కన్నా ప్రీ–ఓన్డ్ వాహనాలకు ప్రాధాన్యత పెరుగుతుండటంతో ఈ మధ్య వీటికి డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడింది. మే నెలలో అమ్మకాలు వార్షికంగా 3.2 శాతం క్షీణించగా, సీక్వెన్షియల్‌గా 4.9% తగ్గాయి.
- ఎంహెచ్‌సీవీ, ఎల్‌సీవీల అమ్మకాల పరిమాణం వరుసగా 0–3 శాతం, 3–5 శాతం పెరగనుండగా, వాటితో పోలిస్తే బస్సుల సెగ్మెంట్ మాత్రం అత్యధికంగా 8–10 శాతం వృద్ధి చెందనుంది. ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటంతో పాటు నిర్మాణ, మైనింగ్ కార్యకలాపాలు పుంజుకోవడనేది ఎల్‌సీవీ ట్రక్కులు, ఎంహెచ్‌సీవీ ట్రక్కుల సెగ్మెంట్‌కి దన్నుగా నిలవనున్నాయి. పాత బస్సులను రీప్లేస్ చేయాల్సిన అవసరం నెలకొన్నందున బస్సుల సెగ్మెంట్ విక్రయాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.



నయన శ్రీకి మూడు స్వర్ణాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ షార్ట్ ట్రాక్ ఐస్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి తాళ్లూరి నయన శ్రీ మెరిసింది. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ టోర్నీలో నయన శ్రీ మూడు స్వర్ణ పతకాలు సాధించింది. అండర్‌-19 విభాగంలో పోటీపడ్డ నయన శ్రీ 500 మీటర్లు, 1000 మీటర్లు, 1500 మీటర్ల విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాలను సొంతం చేసుకుంది.

తిరోగమనంలో మన ‘స్టిక్‌’

- ప్రొ లీగ్‌లో విఫలమైన పురుషుల, మహిళల జట్లు
- భవిష్యత్తులో ప్రదర్శనపై మరింత దృష్టి

భారత హాకీ జట్లకు వరుస పరాజయాలు



సాక్షి క్రీడా విభాగం

భారత పురుషుల హాకీ జట్టు నెల రోజుల క్రితం వరకు కూడా ప్రపంచంలో బలమైన జట్లలో ఒకటిగా కనిపించింది. వరుస విజయాలు, ఫామ్‌లో చూస్తే సరైన దిశలో నడుస్తున్నట్లుగా, మున్ముందు మరింత మెరుగైన ప్రదర్శనతో దూసుకుపోయే సత్తా ఉన్న టీమ్‌లా అనిపించింది. ఇదే ఉత్సాహంతో యూరోపియన్‌ టూర్‌కు జట్టు సిద్ధమైంది. అయితే నెల రోజులు తిరిగేసరికి పరిస్థితి అంతా మారిపోయింది. ఇంతకాలం ఆశలు రేపిన జట్టు ఇదేనా అన్న తరహాలో ప్రొ లీగ్‌లో పేలవమైన ఆటను చూపించింది. ఆటగాళ్లతో పాటు కోచ్‌లు కూడా అంచనాలకు పూర్తి భిన్నంగా విఫల ప్రదర్శనతో వెనుదిరిగారు. పురుషుల జట్టుతో పోలిస్తే భారత మహిళల బృందం మరింత నాసిరకం ఆటను ప్రదర్శించింది. ఎంతో అనుభవం ఉన్నా... లీగ్‌లో కనీస స్థాయిలో ప్రమాణాలు కూడా చూపించకుండా చతికిల పడింది. మున్ముందు ప్రతిష్టాత్మక ఈవెంట్లు జరగనున్న నేపథ్యంలో ఈ రెండు టీమ్‌లు ఏమాత్రం పట్టు సాధిస్తాయనేది చూడాలి.

మూడు నుంచి ఎనిమిదో స్థానానికి...

భువనేశ్వర్‌లో జరిగిన తొలి అంచె ప్రొ లీగ్‌ పోటీల్లో 8 మ్యాచ్‌ల ద్వారా 15 పాయింట్లు సాధించిన భారత పురుషుల జట్టు మూడో స్థానంతో మెరుగైన రీతిలో ముగించింది. కానీ యూరోప్‌లో జరిగిన రెండో అంచె పోటీల్లో 8 మ్యాచ్‌లలో కేవలం 3 పాయింట్లు మాత్రమే రాబట్టగలిగింది. ఫలితంగా తొమ్మిది జట్ల టోర్నీలో ఎనిమిదో స్థానానికే పరిమితమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారత హాకీ చరిత్రలో తొలిసారి వరుసగా ఏడు మ్యాచ్‌లు ఓడిన చెత్త రికార్డు కూడా నమోదైంది. ఒకదశలో టైటిల్‌ రేసులో నిలిచిన జట్టు పరిస్థితి చివరకు ఇలా తయారైంది. ఐర్లాండ్‌లాంటి బలహీన జట్టుతో గెలిచిన అదృష్టం వల్ల ఆఖరి స్థానం రాకుండా తప్పించుకోగలిగింది! అయితే ఇన్ని మ్యాచ్‌లు ఓడినా ఇవన్నీ హోరాహోరీగా సాగి చివరి వరకు పోరాడినవి కావడం కొంత సానుకూలాంశం. ఈ ఏడు పరాజయాల్లో ఆరింటిలో భారత్‌ ఒకే ఒక గోల్‌ తేడాతో మాత్రమే ఓడింది. వాటిలో ఐదూ చివరి క్వార్టర్‌లోనే వచ్చాయి. చివర్లో డిఫెన్స్‌ వైఫల్యంతో ఇది జరిగింది. దీనిపై దృష్టి పెట్టి సరిదిద్దుకునే అవకాశం జట్టు ముందుంది. యూరోప్‌ టూర్‌ ఆరంభంలో వీసా సమస్యల వల్ల పలువురు ఆటగాళ్లు ఆలస్యంగా జట్టుతో చేరగా, గుర్జంత్‌ సింగ్, కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ గాయాలతో ఇబ్బంది పడ్డారు. పూర్తిగా అటాకింగ్‌పైనే దృష్టి పెట్టాలంటూ కోచ్‌ క్రెయిగ్‌ ఫుల్టన్‌ కొత్త వ్యూహాన్ని తీసుకురావడంతో ఆటగాళ్లు ఒక్కసారిగా దానికి అనుగుణంగా మారలేకపోయారు. దీంతో మరో వైపు డిఫెన్స్‌ బలహీనంగా మారిపోయింది. ట్యాకిల్‌ సరిగా లేక, పొజిషనింగ్‌ సరిగా లేక జట్టు ఈ ఎనిమిది మ్యాచ్‌లలో 26 గోల్స్‌ సమర్పించుకుంది!

మార్పులు ఉంటాయా...

సీనియర్లు అమిత్‌ రోహిదాస్, జుగ్‌రాజ్‌ సింగ్, జర్మన్‌ప్రీత్‌ సింగ్, సంజయ్‌ పూర్తిగా విఫలం కాగా... అభిషేక్‌ ఒక్కడే నాలుగు గోల్స్‌తో ఫర్వాలేదనిపించాడు. అయితే సర్కిల్‌ లోపల ఎక్కువ సేపు బంతిని ఉంచుకునే అతని బలహీనత కారణంగా ప్రత్యర్థులు సరైన డిఫెన్స్‌తో భారత్‌ మరిన్ని గోల్స్‌ చేయకుండా అడ్డుకోగలిగారు. ఇద్దరు గోల్‌ కీపర్లు కృషన్‌ పాఠక్, సూరజ్‌ కర్కేరా ఘోర వైఫల్యం శ్రీజేశ్‌ ఉన్నప్పుడు జట్టు గోల్‌కీపింగ్‌ స్థాయి ఎంత గొప్పగా ఉండేదో గుర్తు చేసింది. మన్‌దీప్‌ సింగ్, లలిత్, సుఖ్‌జీత్, దిల్‌ప్రీత్‌ కూడా ప్రభావం చూపలేకపోయారు. 400కు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మన్‌ప్రీత్‌ సింగ్‌తో పాటు హార్దిక్‌ సింగ్‌ మాత్రమే తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇచ్చినా అది జట్టు గెలిచేందుకు సరిపోలేదు. హర్మన్‌ప్రీత్‌ ఆడని మ్యాచ్‌లలో మన డ్రాగ్‌ ఫ్లికింగ్‌ మరీ పేలవంగా కనిపించింది. రోహిదాస్‌ అంచనాలను అందుకోలేకపోగా, జుగ్‌రాజ్‌ అయితే ఏకంగా పెనాల్టీ స్ట్రోక్‌ను కూడా గోల్‌గా మలచలేకపోయాడు. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీలో ఎంతో కీలకమైన డ్రాగ్‌ఫ్లికింగ్‌లో పరిస్థితి మెరుగు కాకపోయే ఎలాంటి విజయాలను ఆశించలేం. మరో రెండు నెలల్లో భారత్‌లోనే ఆసియా కప్‌ ఉంది. దీని ద్వారా మన టీమ్‌ వరల్డ్‌ కప్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. అప్పటిలోగా జట్టులో ఏమైనా మార్పులు చేస్తారా, సీనియర్లను పక్కన పెట్టిన కొత్తవారికి అవకాశాలు ఇస్తారా అనే విషయంపై కోచ్‌ స్పష్టతనివ్వలేదు. స్వదేశంలో జరిగే జూనియర్‌ వరల్డ్‌ కప్‌లో కుర్రాళ్ల ప్రదర్శన తర్వాత దీనిపై అతను నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అరైజిత్‌ సింగ్, మొహమ్మద్‌ రాహిల్, సెల్వమ్‌ కార్తీలాంటి యువ ఆటగాళ్లు ప్రస్తుతానికి తమ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. 2023-24 ప్రొ లీగ్‌లో కూడా ఏడో స్థానంలో నిలిచిన టీమ్‌ ఆ తర్వాత కోలుకొని పారిస్‌ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచే వరకు వెళ్లింది. ఇప్పుడు టీమ్‌కు అదే స్ఫూర్తి కావాలి.



దిగజారిన ఆట...

రెండు సీజన్ల క్రితం ప్రొ లీగ్‌ దిగువస్థాయి టోర్నీ నేషన్స్‌ కప్‌లో సత్తా చాటి భారత మహిళల జట్టు ప్రొ లీగ్‌ టోర్నీకి అర్హత సాధించింది. ఇప్పుడు పూర్తి స్థాయి వైఫల్యంతో ఆఖరి స్థానంలో నిలిచిన జట్టు దిగజారిన ప్రదర్శనతో మళ్లీ అక్కడికే చేరింది. వచ్చే సీజన్‌లో భారత్‌ నేషన్స్‌ కప్‌ ఆడాల్సి ఉండగా... ఈసారి ఆ టోర్నీ విజేత అయిన న్యూజిలాండ్‌ ప్రమోషన్‌ పొందింది. ఆడిన 16 మ్యాచ్‌లలో మన మహిళల బృందం 2 విజయాలు మాత్రమే సాధించింది. దిగువ గ్రూప్‌కు చేజారడం అవమానకరమే కాదు... మన మహిళల బృందం తాజా పరిస్థితి చూపిస్తూ భవిష్యత్తుపై ఆందోళన రేకెత్తిస్తోంది. దిగువ స్థాయికి పడిపోవడంతో ప్రొ లీగ్‌ ద్వారా అత్యుత్తమ జట్లతో తలపడే 16 మ్యాచ్‌ల అవకాశం కూడా పోయింది. నిజానికి పారిస్‌ ఒలింపిక్స్‌కు అర్హత సాధించకపోవడంతోనే ప్రమాద ఘంటిక మోగింది. అయితే ఆ వైఫల్యాన్ని దృష్టిలో ఉంచుకొని టీమ్‌లో సమూల మార్పులతో కొత్తగా సిద్ధం కావచ్చనే మాటలు వినిపించాయి. కానీ అవి ఏమాత్రం వాస్తవ రూపం దాల్చలేదు. గత ఏడాది ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీ నెగ్గడం సానుకూలంగా కనిపించినా నిజాయితీగా చూస్తే దానినీ పెద్ద విజయంగా భావించలేం. చైనా, జపాన్, కొరియా తమ ద్వితీయ శ్రేణి జట్లను పంపాలని విషయాన్ని మరచిపోవద్దు. ప్రొ లీగ్‌ భారత అంచెలో మెరుగ్గా ఆడటంతో కాస్త ఆశలు రేగినా... యూరోప్‌ పర్యటన అసలు స్థాయిని బయట పెట్టింది. ఆస్ట్రేలియా టూర్‌లో కూడా ఐదింటిలో భారత్‌ ఒకటే మ్యాచ్‌ గెలవగలిగింది.

నాలుగేళ్లుగా వరుస వైఫల్యాలు...

కోచ్‌ హరేంద్ర సింగ్‌ ఫిట్‌నెస్‌పై ఎంతో దృష్టి పెట్టేందుకు ప్రయత్నించినా...మన స్థాయి యూరోప్‌ జట్లతో సరితూగడం లేదు. ప్రత్యర్థి పెనాల్టీ కార్నర్లను నిలువరించలేని వైఫల్యం డిఫెన్స్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చైనాకు ఇలాగే రెండు పెనాల్టీ కార్నర్‌ గోల్స్‌ అప్పగించారు. చివరి మ్యాచ్‌లో మనం నెగ్గినా అప్పటికే ఆలస్యమైపోయింది. ఒక్క మ్యాచ్‌లో కూడా జట్టు ఆధిపత్యం కనబర్చలేకపోయింది. సమష్టిగా అటాక్‌ చేసింది లేదు. డిఫెన్స్‌ బలహీనంగా ఉండగా మిడ్‌ఫీల్డ్‌లో ఎలాంటి అవకాశాలు సృష్టించలేకపోయారు. ఇక వ్యూహాల గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. సీనియర్లు నేహా, లాల్‌రెమ్‌సియామి, నవనీత్‌ కౌర్, సలీమా టెటె సమష్టిగా విఫలం కాగా... యువ ప్లేయర్లు సాక్షి, రుతుజా, జ్యోతి తేలిపోయారు. డిఫెన్స్‌ చెల్లాచెదురు కావడంతో గోల్‌ కీపర్‌ సవిత పూనియా కూడా ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. పెనాల్టీలను దీపిక, మనీశా గోల్స్‌గా మలచలేకపోయారు. ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు ప్రస్తుతం అంత బలమైనదేమీ కాదు. ఇక్కడ విఫలమైతే వరల్డ్‌ కప్‌ కోసం క్వాలిఫయర్స్‌ ఆడాల్సి ఉంటుంది. టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానం సాధించిన తర్వాత జట్టు వరుస పరాజయాలతో తిరోగమిస్తోంది. ఈ నేపథ్యంలో మున్ముందు టీమ్‌లో ఎలాంటి అసాధారణ మార్పులు వస్తాయో, ఆట ఎలా మారుతుందనేది ఆసక్తికరం.

జింబాబ్వే లక్ష్యం 537

- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 369
- వియాన్‌ ముల్డర్‌ సెంచరీ




ముల్డర్‌ సెంచరీ అభివాదం

బులవాయో: జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా విజయం దాదాపు ఖాయమైనట్లే. మ్యాచ్‌ మూడో రోజు సోమవారం దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 82.5 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటైంది. వియాన్‌ ముల్డర్‌ (206 బంతుల్లో 147; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్‌ కేశవ్‌ మహరాజ్‌ (70 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్‌) హాఫ్‌ సెంచరీ సాధించాడు. మసకద్జాకు 4 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగుల ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా మొత్తం కలిపి జింబాబ్వే ముందు 537 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది. దీనిని ఛేదించే క్రమంలో ఆట ముగిసే సమయానికి జింబాబ్వే ఒక వికెట్‌ కోల్పోయి 32 పరుగులు చేసింది. ఆ జట్టు మిగిలిన రెండు రోజుల్లో మరో 505 పరుగులు చేయాల్సి ఉంది. టెస్టు క్రికెట్‌లో గతంలో ఏ జట్టుకూ సాధ్యం కాని ఈ లక్ష్యాన్ని జింబాబ్వే అందుకోవడం అసాధ్యమే!

బుమ్రాపై మ్యాచ్‌కు ముందే నిర్ణయం

నెట్స్‌లో శ్రమించిన స్పీడ్‌స్టర్‌

- ఫీల్డింగ్‌ లోపాలపై దృష్టి
- సహాయ కోచ్‌ దస్కటే వ్యాఖ్య



బర్మింగ్‌హామ్‌: ఇంగ్లండ్‌ పర్యటనలో మొదటి నుంచి భారత స్టార్‌ పేసర్‌ బుమ్రా ఆడే మూడు టెస్టుల గురించే చర్చ జరుగుతూ వచ్చింది. ఇప్పుడూ అదే కొనసాగుతోంది. ఇప్పటికే బుమ్రా తొలి టెస్టు ఆడాడు. జట్టు ఇంకా ఆడాల్సిన నాలుగు టెస్టుల్లో బుమ్రా ఆడేవి రెండే మ్యాచ్‌లు. ఆ రెండు ఏవనే దానిపై చర్చంతా సాగుతోంది. తాజాగా దీనిపై భారత అసిస్టెంట్‌ కోచ్‌ టెన్‌ డస్కటే స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. కానీ మ్యాచ్‌కు ముందే అతని అందుబాటుపై నిర్ణయం ఉంటుందని చెప్పాడు. ఎప్పటిలాగే అతను ట్రెయినింగ్‌ సెషన్‌లో పాల్గొంటున్నాడని, విశ్రాంతి తీసుకోవడం లేదన్నాడు. సోమవారం కూడా సహచరులతో కలిసి ప్రాక్టీస్‌లో చెమటోడ్చినట్లు చెప్పాడు. ‘తదుపరి మ్యాచ్‌కూ బుమ్రా అందుబాటులో ఉండే అవకాశముంది. అతను ఆడేది మూడు టెస్టులే అయినప్పటికీ గడిచిన తొలి టెస్టుకు, జరగబోయే రెండో టెస్టుకు మధ్య 8 రోజుల విశ్రాంతి లభించింది. అయితే సుదీర్ఘ ఫార్మాట్‌లో పనిభారాన్ని పరిశీలించాకే అతనిపై నిర్ణయం తీసుకుంటాం’ అని అసిస్టెంట్‌ కోచ్‌ అన్నాడు. తొలి టెస్టులో ఆతిథ్య జట్టుకు దీటుగానే బదులిచ్చామని, రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా వికెట్లు తీయడంలో వెనుకబడినప్పటికీ గెలిచేదశలో కనిపించామని చెప్పాడు. ఇద్దరు స్పిన్నర్ల కూర్పుపై కూడా జట్టు మేనేజ్‌మెంట్‌ విశ్లేషిస్తోంది. బ్యాటింగ్‌ను బలోపేతం చేయాలనుకుంటే సీనియర్‌ స్పిన్నర్‌ జడేజాకు జతగా వాషింగ్టన్‌ సుందర్‌ను బరిలోకి దించే అంశాన్ని గట్టిగానే పరిశీలిస్తోంది. అయితే పిచ్‌ పరిస్థితులని బట్టే తుది నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నట్లు డస్కటే చెప్పాడు. తొలి మ్యాచ్‌లో బౌలింగ్‌ ఆల్‌రౌండర్‌ అయిన శార్దుల్‌ పెద్దగా రాణించలేకపోయాడు. అయితే ఒకే టెస్టుతో అతని సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయబోమని, అయితే బ్యాటింగ్‌ ఆల్‌రౌండర్‌ అవసరమనుకుంటేనే అతన్ని మార్చే అంశాల్ని పరిశీలిస్తామన్నాడు. ఇదే జరిగితే నితీశ్‌ కుమార్‌ రెడ్డి తుది జట్టుకు ఖాయమవుతాడు. లీడ్స్‌లో సులువైన క్యాచ్‌ల్ని నేలపాలు చేయడంతో ఫీల్డింగ్‌పై ప్రధానంగా దృష్టిసారించిన జట్టు స్లిప్స్, గల్లీ వద్ద కట్టుదిట్టం చేయనుంది. జైస్వాల్‌ను గల్లీ నుంచి తప్పించడం ఖాయమైంది. నాలుగో స్లిప్, గల్లీ ప్లేస్‌మెంట్‌లను కరుణ్‌ నాయర్, రాహుల్, కెప్టెన్‌ శుబ్‌మన్‌ గిల్‌లతో భర్తీ చేయనున్నట్లు డస్కటే తెలిపాడు. ఈ మేరకు ఆ ముగ్గురితో పాటు సాయి సుదర్శన్, నితీశ్‌ కుమార్‌ రెడ్డిలతో ఫీల్డింగ్‌ ప్రాక్టీస్‌ను ముమ్మరం చేశారు.

అమ్మాయిల జోరు కొనసాగేనా!

- నేడు భారత్, ఇంగ్లండ్‌ మహిళల మధ్య రెండో టి20
- ఆధిక్యంపై కన్నేసిన హర్మన్‌ బృందం
- రాత్రి 11 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌ నెట్‌వర్క్‌లో ప్రసారం



బ్రిస్టల్‌: ఇంగ్లండ్‌ పర్యటనలో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు ఇదే జోరు కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. మంగళవారం జరిగే రెండో టి20లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకోవాలని భావిస్తోంది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుస విజయాలతో పట్టుబిగించాలని ఆశిస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఎదురైన ఘోరపరాజయం నుంచి తేరుకొని తదుపరి మ్యాచ్‌లపై దృష్టి పెట్టాలని ఆతిథ్య ఇంగ్లండ్‌ యోచిస్తోంది మళ్లీ ఓడితే తీవ్రమైన ఒత్తిడిలోకి కూరుకుపోయే ప్రమాదం తప్పదని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య హోరాహోరీగా మ్యాచ్‌ జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

స్మృతి తెచ్చిన ఆత్మవిశ్వాసంతో

రెగ్యులర్‌ కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ కౌర్‌ ఫిట్‌నెస్‌ సమస్యలతో అందుబాటులో లేకపోవడంతో జట్టును నడిపించిన స్టార్‌ ఓపెనర్‌ స్మృతి మంధాన సెంచరీతో చెలరేగింది. అంతర్జాతీయ టి20లో తొలి శతకాన్ని బాదిన ఆమె అదే ఫామ్‌ను కొనసాగించాలనుకుంటోంది. షఫాలీ వర్మ తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... హర్లీన్‌ డియోల్‌ మెరుపులు భారత స్కోరును 200 పైచిలుకు దాటించాయి. మొత్తానికి టాపార్డర్‌ బ్యాటర్లు మరోమారు బ్యాట్‌ ఝుళిపిస్తే భారీస్కోరు సాధ్యమవుతుంది. తొలి మ్యాచ్‌లో విఫలమైన రిచా ఘోష్, జెమీమాలు కూడా జతకలిస్తే స్కోరు వేగానికి అడ్డు అదుపూ ఉండదు. కెప్టెన్‌ హర్మన్‌ తుదిజట్టుకు ఆడితే స్పిన్నర్‌ రాధా యాదవ్‌ బెంచ్‌కు పరిమితం అవుతుంది. స్పీడ్‌స్టర్‌ రేణుక లేకపోయినా... అమన్‌జోత్, దీప్తి శర్మ, శ్రీచరణి, స్నేహ్‌ రాణాలతో కూడిన బౌలింగ్‌ దళం గత మ్యాచ్‌లో సమష్టిగా ప్రభావం చూపించింది. వీళ్ల ప్రదర్శన కొనసాగితే భారత ఆల్‌రౌండ్‌ జోరుకు ఎదురుండకపోవచ్చు.

బ్యాటింగ్‌పై దృష్టి


ఆతిథ్య జట్టు బ్యాటర్లు గత మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యారు. మొత్తం 11 మంది బ్యాటింగ్‌కు దిగితే వన్‌డౌన్‌ బ్యాటర్, కెప్టెన్‌ సీవర్‌ బ్రంట్‌ మాత్రమే అర్ధసెంచరీతో అదరగొట్టింది. మిగతా బ్యాటర్లంతా మూకుమ్మడిగా చేతులెత్తేశారు. మొదట బౌలర్లు, లక్ష్యఛేదనలో బ్యాటర్లు కలిసికట్టుగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. ఈ నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్‌ ప్రధానంగా బ్యాటింగ్‌ విభాగంపై దృష్టిసారించింది. ఎందుకంటే కెప్టెన్‌ బ్రంట్‌ మినహా ఇక ఏ ఒక్కరు కూడా కనీసం 15 పరుగులైనా చేయలేకపోవడం జట్టును మరింత ఆందోళన పరిచింది. బ్యాటర్లు బాధ్యతగా కనబరిస్తేనే జట్టు గాడినపడుతుందని మేనేజ్‌మెంట్‌ ఆశిస్తుంది. లేదంటే సొంతగడ్డపై మరో భంగపాటు ఖాయమవుతుంది. ఇదేజరిగితే సిరీస్‌లో ఇంగ్లండ్‌ 0-2తో వెనుకబడిపోతుంది.

రెండో టెస్టుకు మార్పుల్లేని ఇంగ్లండ్‌ జట్టు... ఆర్చర్‌కు దక్కని చోటు



బర్మింగ్‌హామ్‌: భారత్‌తో టెస్టు సిరీస్‌లో శుభారంభం చేసిన ఇంగ్లండ్‌ జట్టు తదుపరి టెస్టులోనూ అదే దళంతో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. రేపటి నుంచి ఎడ్జ్‌బాస్టన్‌ వేదికపై జరిగే రెండో టెస్టులో ఇంగ్లండ్‌ తుదిజట్టులో ఏ మార్పు ఉండదని ఇంగ్లండ్‌ క్రికెట్‌ బోర్డు (ఈసీబీ) వెల్లడించింది. పేస్‌ ఆల్‌రౌండర్‌ జోఫ్రా ఆర్చర్‌ను రెండో టెస్టుకు ఎంపిక చేశారు. దీంతో పేస్‌ పదును కూడా పెరిగింది. అయితే ఉన్నపళంగా తొలి టెస్టులో విజయవంతమైన తుదిజట్టును మార్చకూడదని జట్టు మేనేజ్‌మెంట్‌ నిర్ణయించింది. మరోవైపు జట్టుకు ఎంపికైన ఆర్చర్‌ కుటుంబ కారణాల రీత్యా ట్రెయినింగ్‌ సెషన్‌కు అందుబాటులో లేడు. మంగళవారం నుంచే అతను జట్టుతో కలుస్తాడని జట్టు వర్గాలు వెల్లడించాయి. ఆర్చర్‌ పరిస్థితి గత నాలుగేళ్లుగా ఇలాగే ఉంది. ఇప్పుడు కుటుంబ కారణాలతో జట్టుకు దూరమై ఉండొచ్చు కానీ... వరుస గాయాలు, దీర్ఘకాలిక ఫిట్‌నెస్‌ సమస్యలతో అంతర్జాతీయ క్రికెట్‌కు ఏళ్లతరబడి దూరంగా ఉన్నాడు. చివరగా నాలుగేళ్ల క్రితం అహ్మదాబాద్‌లోనే భారత్‌తో టెస్టు ఆడాక మళ్లీ సంప్రదాయ ఫార్మాట్‌ ఆడనేలేదు. ఇంగ్లండ్‌ జట్టు: స్టోక్స్‌ (కెప్టెన్‌), జాక్‌ క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్, క్రిస్‌ వోక్స్, బ్రైడన్‌ కార్స్, జోష్‌ టంగ్, షోయబ్‌ బషీర్‌.

భారత రెజ్లర్లకు 11 పతకాలు



రజత, స్వర్ణ పతకాలతో రాహుల్, అమన్‌

ఇస్తాంబుల్‌: యాసర్‌ డోగు స్మారక అంతర్జాతీయ రెజ్లింగ్‌ టోర్నమెంట్‌లో భారత రెజ్లర్లు అదరగొట్టారు. టర్కీలో జరిగిన ఈ టోర్నీలో భారత రెజ్లర్లు ఐదు స్వర్ణాలు, రెండు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలు సాధించి అగ్ర స్థానంలో నిలిచారు. పురుషుల ఫ్రీస్టయిల్‌ విభాగంలో పారిస్‌ ఒలింపిక్స్‌ కాంస్య పతక విజేత అమన్‌ సెహ్రావత్‌ (57 కేజీలు) బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. ఫైనల్లో భారత్‌కే చెందిన రాహుల్‌ అవారెపై అమన్‌ గెలుపొందాడు. ఉదిత్‌ కుమార్‌ (61 కేజీలు) రజతం నెగ్గగా... రోహిత్‌ సింగ్‌ (65 కేజీలు), విశాల్‌ కాళీరామన్‌ (70 కేజీలు), దీపక్‌ పూనియా (92 కేజీలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల ఫ్రీస్టయిల్‌ విభాగంలో పుష్ప (55 కేజీలు), నేహా శర్మ (57 కేజీలు), మనీషా భన్వాలా (62 కేజీలు), హర్షిత (72 కేజీలు) పసిడి పతకాలు సొంతం చేసుకోగా... నీలం (50 కేజీలు) కాంస్య పతకాన్ని సాధించింది.


'బిగ్, బ్యూటిఫుల్ బిల్లు'తో తమకు ఇబ్బందులు తప్పవంటూ యూఎస్ క్యాపిటల్ భవనం వద్ద ఆదివారం కొందరు నిరసన తెలిపినప్పటి దృశ్యమిది.


రష్యా రాజధాని మాస్కోలోని ఓ అపార్టుమెంట్ కిటికీల అద్దాలపై సూర్యకిరణాలు పడి పరావర్తనం చెందడాన్ని ఫొటో గ్రాఫర్ కెమెరాలో బంధించారు.


ఉత్తరాఖండ్‌లోని పౌడి గఢ్వాల్ జిల్లాలో అలకానంద నది సోమవారం పొంగి ప్రవహించడంతో ధారి దేవి ఆలయం ఇలా వరదలో మునిగిపోయి కన్పించింది.

మొదటి రోజు నుంచే వేధింపులు

- పథకం ప్రకారమే కాలేజీలో అత్యాచారం
- ప్రధాన నిందితుడు మోనోజిత్‌కు నేర చరిత్ర
- కోల్‌కతా గ్యాంగ్ రేప్ ఘటనలో దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడి

కోల్‌కతా: కోల్‌కతా లా కాలేజీలో విద్యార్థినిపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా, సహ నిందితులు గురించి దిగ్భ్రాంతికర విషయాలు సిట్ దర్యాప్తులో వెలుగు చూస్తున్నాయి. పెళ్లి ప్రతిపాదనను నిరాకరించిందనే అక్కసుతో బాధితురాలిని కాలేజీలో జాయినయిన మొదటి రోజు నుంచే వేధించాలని పథకం వేసినట్లు తేలింది. కాగా, ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి బదలాయించాలంటూ సోమవారం కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

ఏడు పెండింగ్ కేసులు

మోనోజిత్ హిస్టరీ షీటర్, ఇతడిపై పలు లైంగిక వేధింపుల కేసులతోపాటు ఇతర నేరాలో పణలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు సోమవారం తెలిపారు. ఇప్పటికే కనీసం ఏడు ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు ఇతడిపై కోల్‌కతాలోని పలు పోలీస్‌స్టేషన్లో నమోదై ఉన్నట్లు చెప్పారు. లా కాలేజీలో జాయిన 2013లోనే ఇతడు కాళీఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడిని కత్తితో పొడిచినట్లు కేసు నమోదైంది. దీంతో, కాలేజీ ఇతడిని బహిష్కరించింది. అప్పటికే టీఎంసీ విద్యార్థి విభాగంలో నేతగా ఇతడు పలుకుబడి సంపాదించినట్లు కాలేజీ మాజీ విద్యార్థి ఒకరు తెలిపారు. 2016లో లా కాలేజీపై దాడి కేసులో ఇతడూ నిందితుడే. ఆ తర్వాత ఈ కేసును కొట్టివేశారని మరో మాజీ విద్యార్థి నేత చెప్పారు. 2017లో తిరిగి ఇదే కాలేజీలో ప్రవేశం పొందిన మోనోజిత్ 2022లో ఉత్తీర్ణుడయ్యే వరకు కొనసాగాడు. ఆ సమయంలో అతడు పలు విద్యార్థినులను కాలేజీ యూనియన్ ఆఫీస్‌లోనే వివిధ కారణాలతో వేధించేవాడని తెలిసింది. 2018లో ఇద్దరు విద్యార్థినులు ఇతడిపై వేధింపుల కేసు పెట్టారు. విచిత్రంగా, ఈ కేసులో పోలీసులు ఎవర్నీ అరెస్ట్ చేయలేదని స్థానిక మీడియా వ్యాఖ్యానించింది. రాజకీయ పలుకుబడితో మేనేజ్ ఇలాంటి వాటిని మోనోజిత్ చేసుకునేవాడని వ్యాఖ్యానించింది.

సహనిందితులదీ అదేబాట

ఈ నేరంలో మిశ్రాకు సహకరించిన, సహ నిందితులు ప్రతిమ్ ముఖర్జీ, జయిద్ అహ్మద్‌కు గతంలో మహిళలను వేధించిన రికార్డు కూడా ఉందని వెల్లడైంది. 'ముందుగా వేసిన పథకం ప్రకారమే జూన్ 25వ తేదీన లా కాలేజీలో బాధితురాలిపై మోనోజిత్ దాడికి, అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆమెను చిత్ర హింసలకు గురి చేయాలని కూడా వీరు కుట్ర పన్నారు'అని ఓ అధికారి వివరించారు. గతంలో పలువురు విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన ఈ త్రయం వాటిని సెల్‌ఫోన్లలో చిత్రీకరించి, బాధితులకు వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేసేవారని ఆ అధికారి తెలిపారు. జూన్ 25వ తేదీన గ్యాంగ్ రేప్ ఘటన వీడియోను సైతం వీరు ఇతరులకు షేర్ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. అయితే, ఎవరికి షేర్ చేశారనే విషయాన్ని ఆరా తీస్తున్నామన్నారు. నిందితుల ఇళ్లలోనూ ఆదివారం సోదాలు జరిపామన్నారు. బాధిత 24 ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షలో వెల్లడైందని పోలీసు అధికారి వివరించారు. ఘటన జరిగిన సమయంలో కాలేజీలో ఉన్న 25 మంది విద్యార్థులను గుర్తించామని, వారి నుంచీ వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.



పోటాపోటీ నిరసనలు.. సౌత్ కలకత్తా లా కాలేజీ వద్ద బీజేపీ, అనుబంధ విద్యార్థి విభాగం బీజేవైఎం కార్యకర్తలను వామ పక్ష పార్టీలు, అనుబంధ విద్యార్థి సంఘాల కార్యకర్తలు చేపట్టిన పోటా పోటీ నిరసన కార్యక్రమాలు తీవ్ర ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బీఏ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలకు సంబంధించిన అన్ని తరగతులను నిరవధికంగా రద్దు చేస్తున్నట్లు ఘటన చోటుచేసుకున్న సౌత్ కలకత్తా లా కాలేజీ ప్రకటించింది. విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్ ఘటనపై దర్యాప్తులో భాగంగా కాలేజీ ఒక గేటును, ఒక వాష్ రూంను, యూనియన్ రూం, గార్డు రూంను పోలీసులు సీజ్ చేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తరగతులను తిరిగి ప్రారంభించే తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది.

సార్క్ స్థానంలో కొత్త కూటమి!

- ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న చైనా, పాక్, బంగ్లాదేశ్‌లు
- తోసిపుచ్చిన బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు

భారత్ సభ్యదేశంగా ఉన్న సార్క్ స్థానంలో కొత్త ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేయడానికి చైనా, పాకిస్తాన్‌లు ఎత్తులు వేస్తున్నాయి. వీరికి ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్ కూడా తోడయ్యింది. దీనిపై ఇరుదేశాల మధ్య అత్యున్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని పాకిస్తాన్‌కు చెందిన ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ నివేదించింది. ఈ కూటమిలో చేరేందుకు ఇతర దక్షిణాసియా దేశాలను ఆహ్వానించడమే లక్ష్యంగా జూన్ 19న కున్మింగ్‌లో సమావేశం జరిగింది. అలాగే తాలిబన్ పాలిత ప్రాంతంలో చైనా–పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌ను విస్తరించడం, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంపైనా ససమావేశం దృష్టి సారించింది.

డిసెంబర్ 8, 1985న బంగ్లాదేశ్‌లోని ఢాకాలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) ఏర్పడింది. సభ్య దేశాల మధ్య ప్రాంతీయ సామరస్యం, ఆర్థిక సమైక్యత లక్ష్యంగా ఏర్పాటైంది. ఈ కూటమిలో ఏడుగురు వ్యవస్థాపక సభ్య దేశాలు ఉండగా, ఆఫ్ఘనిస్తాన్ 2007లో చేరింది. 2014లో ఖట్మండూలో శిఖరాగ్ర సమావేశం తర్వాత సార్క్ నాయకులు సమావేశం కాలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 2020లో మొట్టమొదటి సార్క్ వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. కోవిడ్ అత్యవసర నిధిని ప్రతిపాదించారు. భారతద్ తరఫున 10 మిలియన్ డాలర్లను విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. సార్క్‌ను ప్రాంతీయ సహకారం, దేశాల అనుసంధానం కోసం భారత్ ఉపయోగించింది. సభ్య దేశాల మధ్య విద్య, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించడానికి సార్క్ డెవలప్‌మెంట్ ఫండ్, న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ ద్వారా సార్క్‌కు భారత్ దోహదపడింది. పాకిస్తాన్ మాత్రం తన స్వప్రయోజనాల కోసమే సార్క్‌లో పనిచేసింది. 2016 ఉరి దాడి తర్వాత ఉద్రిక్తతలు పెరిగాయి. పాకిస్తాన్ ప్రేరేపిత ఈ ఉగ్రవాద దాడిలో 17 మంది భారత సైనికులు మరణించడంతో భారత్ సార్క్‌ను బహిష్కరించింది. ఉగ్రవాదం, ప్రాంతీయ జోక్యం గురించి ఆందోళనలను వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్ కూడా వైదొలిగాయి. శిఖరాగ్ర సమావేశం రద్దయ్యింది. ఆ తరువాత మళ్లీ సమావేశం జరగలేదు.

ఈ నేపథ్యంలో ప్రాంతీయ సమైక్యత, దేశాల అనుసంధానం కోసం కొత్త సంస్థ అవసరమని చైనా, పాకిస్తాన్‌లు నమ్ముతున్నాయి. ఈ సంస్థలో శ్రీలంక, మాల్దీవులు, ఆఫ్ఘనిస్తాన్ వంటి సార్క్ సభ్యులు కూడా భాగమవుతారని భావిస్తున్నారు. అయితే.. ఈ కూటమి ఆలోచనలో తమ భాగస్వామ్యాన్ని బంగ్లాదేశ్ తోసిపుచ్చింది. కున్మింగ్‌లో మూడు దేశాల మధ్య జరిగిన సమావేశం రాజకీయం కాదని పేర్కొంది. తాము ఎలాంటి కూటమిలో ఏర్పాటు చేయడం లేదని ఆ దేశ విదేశాంగ సలహాదారు ఎం.తౌహిద్ హుస్సేన్ తెలిపారు. ఇది అధికారిక స్థాయిలో జరిగిన సమావేశమని, రాజకీయం కాదని పేర్కొన్నారు. అయితే.. కొత్త కూటమిలో చేరడానికి భారత్‌ను ఆహ్వానిస్తామని, కానీ ఆ దేశానికి ఉన్న విభిన్న ప్రయోజనాల దృష్ట్యా, అది సానుకూలంగా స్పందించే అవకాశం లేదని దౌత్య వర్గాలు చెప్పినట్లు నివేదిక పేర్కొంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

'అంతరిక్ష నిఘా' వ్యవస్థపై భారత్ దృష్టి

- సైనిక ఉపగ్రహాల ప్రయోగాలు వేగవంతం
- 52 సైనిక ఉపగ్రహాల ప్రయోగం లక్ష్యం
- ప్రయివేటు సంస్థల భాగస్వామ్యం తీసుకుంటున్న దేశం

అంతరిక్ష ఆధారిత నిఘా సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై భారత్ దృష్టి పెట్టింది. సైనిక ఉపగ్రహాల ప్రయోగాలను వేగవంతం చేస్తోంది. ముఖ్యంగా, చైనా, పాకిస్తాన్‌లతో పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో, నిఘా కార్యకలాపాలకు ఉపగ్రహాలను ఉపయోగించడంపై కేంద్రీకరించింది. మొత్తం, 52 సైనిక ఉపగ్రహాలను ప్రయోగించాలని యోచిస్తోంది. రియల్ టైమ్ పర్యవేక్షణ, సరిహద్దు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్రం రూ.26,968 కోట్లను ఖర్చు చేయనుంది. స్పేస్ బేస్ సర్వైలెన్స్ ఎస్‌బీఎస్ మూడో విడతలో భాగంగా ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేయనున్నాయి. మొదటి ఉపగ్రహం ఏప్రిల్ 2026లో ప్రయోగించనున్నారు. 2029 చివరి నాటికి పూర్తిగా విస్తరించనున్నారు. ఈ ఉపగ్రహాలు నిఘా, కమ్యూనికేషన్, నావిగేషన్, ఇతర వ్యూహాత్మక అవసరాలకు ఉపయోగపడతాయి.

ఈ ప్రాజెక్టులో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలో మొదటి సారిగా ప్రైవేటు సంస్థల సహాయాన్ని తీసుకుంటోంది. వేగంగా ప్రయోగాలను ప్రారంభించేందుకు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) టెక్నాలజీని బదిలీ చేయాలని ఇస్రో యోచిస్తోంది. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే శాటిలైట్లు ప్రయోగించేందుకు వీలవుతుంది. ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. భూమికి దగ్గరగా.. స్థిర కక్ష్యల్లో తిరగనున్న శాటిలైట్స్.. చైనా అభివృద్ధి చేస్తున్న ఆయుధాలు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలకు చెక్ పెడతాయి. భారత్ ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ స్వదేశీ, వాణిజ్య ఉపగ్రహ ఆధారిత ట్రాకింగ్ విలువేమిటో తెలియజెప్పింది.

ఆపరేషన్ సిందూర్‌లోనూ..

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పెద్దఎత్తున ఉపగ్రహ నిఘాను మోహరించింది. ఇందులో ఇస్రో రూపొందించిన ఉపగ్రహాల తోపాటు, అంతర్జాతీయగానూ మద్దతు లభించింది. ప్రస్తుతం భారత్ వద్ద సుమారు 9 నుండి 11 మిలిటరీ శాటిలైట్లు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చిన సమాచారాన్ని ఇస్రో తక్షణమే సైనిక దళాలకు అందించింది. ఒక కమర్షియల్ గ్లోబల్ శాటిలైట్ ఆపరేటర్ నుంచి ఫొటోలను కూడా సేకరించింది. వీటితో పాటు ఇస్రో సొంతంగా అభివృద్ధి చేసిన కార్టోశాట్ శ్రేణిలోని ఉపగ్రహాలను కూడా మిషన్ కోసం వినియోగించింది. వీటి ఆధారంగానే సైనిక దళాలు ఖచ్చితమైన వ్యూహంతో పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడులు జరిపాయి. అంతేకాకుండా, అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ వంటి సంస్థలూ భారత్‌కు సేవలందించాయి. ఇవి రోజుకు ఓసారి మాత్రమే చిత్రాలను అందించగా.. మనదేశపున శాటిలైట్లు మాత్రం ప్రతి 14 రోజులకు ఒకసారి పీరియాడిక్ డేటాను అందించగలవు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, భారత్‌కు యుద్ధరంగాల్లో రియల్‌టైమ్ డేటా అందుతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మిలటరీ బేస్‌లో సెటిలర్ల విధ్వంసం

సైనికులపై దాడి, వాహనాలు ధ్వంసం

ఏమాత్రం సహించబోమన్న ఇజ్రాయెల్ ప్రభుత్వం

టెల్ అవీవ్: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లా సమీపంలో ఉన్న మిలటరీ బేస్‌పై ఇజ్రాయెలీ సెటిలర్లు దాడికి దిగారు. సైనికులపై దాడి చేసి, ఆర్మీ వాహనాలను ధ్వంసం చేశారు. రంగు స్ప్రేతో స్థావరాన్ని, పరిసరాలను నినాదాలతో నింపేశారు. వీరిని చెదరగొట్టేందుకు సైనికులు స్టన్ గ్రెనేడ్లను ప్రయోగించారు. 'హిల్‌టాప్ యూత్'అనే అతివాద యూదు యువకులే ఘటనకు కారణమణి చెబుతున్నారు. సైనిక ఆస్తులను ధ్వంసం చేయడంపై మంత్రి ఇటామర్ బెన్ గ్విర్‌తోపాటు ప్రతిపక్ష నేత యయిర్ లాపిడ్ తీవ్రంగా ఖండించారు. 'యూదు ఉగ్రవాదులు, నేరగాళ్ల ముఠాలు, ప్రభుత్వం అండతో చెలరేగిపోతున్నారు'అని లాపిడ్ వ్యాఖ్యానించారు. బుధవారం సాయంత్రం కూడా సుమారు 100 మంది యూదు సెటిలర్లు కెఫాల్ మాలిక్ పట్టణంలోని పాలస్తీనియన్లపై దాడికి దిగారు. గాల్లోకి కాల్పులు జరుపుతూ భయభ్రాంతులకు గురి చేశారు. ఇజ్రాయెల్ ఆర్మీ అడ్డుకోవడం సహించలేనివారంతా ఆదివారం రాత్రి మిలటరీ బేస్‌ను చుట్టుముట్టి, దాడికి దిగారు. ఇటువంటి అరాచక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగనివ్వమని ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. ఇప్పటికే విరామం లేకుండా విధుల్లో కొనసాగుతున్న సైనికుల్లో సహనం నశించిందనే విషయం అతివాద సెటిలర్లు గుర్తుంచుకుని మెలగాలని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరికలు చేశారు. 1967లో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ వెస్ట్ బ్యాంక్, గాజా, జెరూసలేంలను స్వాధీనం చేసుకుంది. ఈ మూడు ప్రాంతాలను ఏకం చేసి స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలని పాలస్తీనా వాసులు డిమాండ్ చేస్తున్నారు. వెస్ట్‌బ్యాంక్‌లోని 30 లక్షల మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ సైనిక పాలనలో నలిగిపోతున్నారు. ఇక్కడ 5 లక్షల మంది వరకు యూదు సెటిలర్లు తిష్టవేశారు.

ఒక రోడ్డు... కొన్ని చెట్లు



- బిహార్‌లో యంత్రాంగం నిర్వాకం
- నరికేందుకు అనుమతించని అటవీ శాఖ
- దాంతో అలాగే వదిలేసి రోడ్డేసిన అధికారులు

పట్నా: నల్లగా నిగనిగా మెరిసిపోతున్న సువిశాలమైన, నున్నని తారు రోడ్డు. చూద్దామన్నా ఎక్కడా ఒక్క గుంత కూడా లేదు. రెండువైపులా ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్న చెట్లు. అలాంటి రోడ్డుపై యమా స్పీడుతో దూసుకుపోవాలని ఎవరికి మాత్రం ఉండదు! అలా వెళ్లే క్రమంలో ఆ చెట్లే ఉన్నట్టుండి రోడ్డు మధ్యలో ప్రత్యక్షమైతే? బిహార్‌లో సరిగ్గా అలాంటి ఘటనే జరిగింది. పట్నాకు కేవలం 50 కి.మీ. దూరంలోని జెహానాబాద్‌లో రూ.100 కోట్ల వ్యయంతో ఓ రోడ్డును సువిశాలంగా విస్తరించారు. కానీ ఏడున్నర కి.మీ. పొడవైన ఆ రోడ్డు మధ్య ఒకచోట ఏపుగా పెరిగిన చెట్లను ఇదుగో, ఇలా వదిలేశారు. ఇదేం అనాలోచితమైన పనంటారా? దీని వెనక ఓ ఆసక్తికరమైన కథ దాగుంది. ఈ చెట్లను తొలగిస్తామంటూ రోడ్డు నిర్మాణ సమయంలో జిల్లా యంత్రాంగం అటవీ శాఖను సంప్రదించింది. అందుకు శాఖ తొలుత అనుమతి నిరాకరించింది. పదేపదే కోరిన మీదట, ఏకంగా 14 హెక్టార్ల మేరకు అటవీ భూమికి సమానమైన పరిహారం కోరింది. అంత మొత్తం సమర్పించుకోవడం తమవల్ల కాదంటూ జిల్లా యంత్రాంగం చేతులెత్తేసింది. అలాగని ప్రాజెక్టును పక్కన పెట్టడానికి కూడా మనసు రాలేదు. దాంతో అటవీ నిబంధనలను ఉల్లంఘించకుండా చెట్లను ఇలా రోడ్ల మధ్యే వదిలేస్తూ పని పూర్తి చేసి చేతులు దులుపుకుంది. ఇప్పుడు ఆ రోడ్డుపై ప్రయాణం జనానికి అక్షరాలా ప్రాణాంతకంగా మారింది. ఎందుకంటే ఆ చెట్లు రోడ్డుపై కనీసం ఒక వరుసలో కూడా కాకుండా ఇక్కడొకటి, అక్కడొకటి అన్నట్టుగా చెల్లాచెదురుగా ఉండిపోయాయి. వాటిగుండా పోవాలంటే వాహనాలను నానా వంపులూ తిప్పుతూ విచిత్రమైన ఫీట్లు చేయాల్సిందే. ఆ క్రమంలో ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు కూడా. దాంతో చూస్తుండగానే ఇది మృత్యుమార్గంగా మారిపోయింది. నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా జిల్లా యంత్రాంగం ఇప్పటికీ ఈ చెట్ల బెడదను తప్పించే ప్రయత్నం కూడా చేయడం లేదు. మన దేశంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లేమికి ఇది మరో తిరుగులేని ఉదాహరణ అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

రాజ్యాంగం జోలికొస్తే సహించేది లేదు: ఖర్గే

బెంగళూరు: రాజ్యాంగంలోని ఒక్క పదం మార్చేందుకు ప్రయత్నించినా ఏమాత్రం ఊరుకునేది లేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే హెచ్చరించారు. రాజ్యాంగ ప్రవేశికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలపై సమీక్ష జరపాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబళె చేసిన వ్యాఖ్యలపై ఖర్గే ఈ మేరకు స్పందించారు. హొసబళెను ఆయన మనువాది అని అభివర్ణించారు. సోమవారం ఖర్గే బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. నిరుపేదలు ఉన్నతస్థాయికి ఎదగడం హొసబళెకు ఇష్టముండదు. వేల ఏళ్ల నాటి ఆచారాలను యథా ప్రకారం కొనసాగాలని కోరుకుంటున్నారు. అందుకే, హొసబళెకు సోషలిజం, సెక్యులరిజం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం అనేవి నచ్చవు'అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయాలు హొసబళెకి మాత్రమే కాదు, ఆర్ఎస్ఎస్‌వి కూడా అని పేర్కొన్నారు. హిందూమతానికి తామే దిక్కని చెప్పుకునే ఆర్ఎస్ఎస్ అంటరానితనాన్ని నిర్మూలించి, దేశాన్ని ఐక్యంగా ఉంచాలని సవాల్ విసిరారు. కేవలం మాటలతో ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నిస్తే మాత్రం తాము అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యానికి మంచివి కావు

- ప్రస్తుత రాజకీయ పోకడలపై ధన్‌ఖడ్

జైపూర్: దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితిపై ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆందోళన వెలిబుచ్చారు. ఇది ప్రజాస్వామ్యానికి గానీ, సమాజ ఆరోగ్యానికి గానీ మంచిది కాదంటూ ఆక్షేపించారు. సోమవారం జైపూర్‌లో ప్రగతిశీల్ మంచ్ ఆధ్వర్యంలో జరిగిన 'స్నేహమిలన్'కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలు, నేతల నడుమ సాగుతున్న వాగ్యుద్ధం, ఆ క్రమంలో వాడుతున్న భాష దారుణంగా ఉంటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. అవి అనాదిగా వస్తున్న మన నాగరిక విలువలకు ఏమాత్రం తగినట్టుగా లేవన్నారు. 'రాజకీయ ప్రత్యర్థులంటే శత్రువులు కాదన్న వాస్తవాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన ఎంతగానో మెరుగుపడాల్సిన అవసరముంది. లేదంటే ప్రజాస్వామిక వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం సడలిపోయే ప్రమాదముంది. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆరోగ్యకరమైన ప్రతిపక్షం ఉండటం చాలా అవసరం'అని అభిప్రాయపడ్డారు.

మా ప్రభుత్వం ఐదేళ్లూ కొనసాగుతుంది

- శివకుమార్‌తో సత్సంబంధాలున్నాయి
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు

మైసూరు: కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తికాలం ఐదేళ్లు కొనసాగడం ఖాయమని సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం శివకుమార్‌తో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. కొద్ది నెలల్లోనే రాష్ట్రంలో నాయకత్వ మార్పిడి జరగొచ్చంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ మేరకు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన శివకుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా శివకుమార్ చేత్తో చేయి కలిపి పైకెత్తి ఐక్యంగా ఉన్నామని తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను ప్రారంభించేది సీఎం సిద్ధరామయ్య కాదంటూ బీజేపీ నేత శ్రీరాములు చేసిన వ్యాఖ్యలపై ఆయన.. 'వాళ్లు అసత్యాలు చెప్పడంలో నిపుణులు'అని పేర్కొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ పలుమార్లు శ్రీరాములు ఓటమి పాలయ్యారని గుర్తు చేసిన సిద్ధరామయ్య.. తమ గురించి తెలియని వారు ఇతరుల భవిష్యత్తును ఎలా మాట్లాడుతారంటూ నిలదీశారు.

మంటలు రాజేసి..స్నైపర్ దాడి

- ఇద్దరు ఫైర్ సిబ్బంది మృతి..మరొకరి పరిస్థితి విషమం

ఇడహో: అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. పథకం ప్రకారం ఓ వ్యక్తి కొండ ప్రాంతంలోని అడవిలో మంటలు రాజేసి, పోలీసులకు ఫోన్ చేశాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా ఎత్తయిన కొండపై ముందుగా ఏర్పాటు చేసుకున్న స్థావరంలో పొంచి ఉండి శక్తివంతమైన తుపాకీతో వారిపైకి యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఘటనలో ఇద్దరు ఫైర్ సిబ్బంది చనిపోగా మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఇడహోలో కోయర్ డీ అలీన్‌కు ఉత్తరాన ఉన్న కాన్‌ఫీల్డ్ కొండప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకుని 300 మంది భద్రతా సిబ్బంది, హెలికాప్టర్లతో అక్కడికి చేరుకున్న భద్రతా బలగాలపైకి సైతం కాల్పులు జరిపాడని కూటెనై కౌంటీ షరీఫ్ బాబ్ నోరిస్ తెలిపారు. దుండగుడు దాగున్న చోటును కనిపెట్టి అక్కడికి చేరుకునే సరికే అతడు చేతిలో తుపాకీతో విగతజీవుడై పడి ఉన్నాడన్నారు. ఈ దారుణానికి అతడొక్కడే కారణమని భావిస్తున్నామని తెలిపారు. ఘటనకు కారణాలు, దుండగుడి వివరాలను షరీఫ్ వెల్లడించలేదు. దుండగుడు రాజేసిన నిప్పు 20 ఎకరాల్లో అడవిని దహించిందని, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్నారు.

ఆహార కేంద్రం వద్ద కాల్పులు..

22 మంది మృత్యువాత

కైరో: గాజావ్యాప్తంగా, ఆహార కేంద్రాల వద్ద అన్నార్తులపై ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పులు కొనసాగుతున్నాయి. తాజాగా సోమవారం జరిగిన కాల్పుల్లో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆహార కేంద్రాల వద్ద కనీసం 22 మంది చనిపోగా 20 మంది గాయాలపాలయ్యారని స్థానిక ఆరోగ్య విభాగం తెలిపింది. దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్ ఆహార కేంద్రం నుంచి వెనుదిరిగి వస్తున్న వారిపై జరిగిన కాల్పుల్లో 11 మంది చనిపోయారని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉత్తర గాజాలోని ఐరాస గిడ్డంగి వద్ద జరిగిన కాల్పుల్లో మరో 10 మంది చనిపోయారని ఆరోగ్య విభాగం వెల్లడించింది. రఫా వద్ద జరిగిన ఘటనలో మరో వ్యక్తి చనిపోయాడు. ఇలా ఉండగా, గాజా నగరంపై ఇజ్రాయెల్ నేవీ చేపట్టిన దాడిలో కనీసం 13 మంది పాలస్తీనియన్లు చనిపోగా 30 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య విభాగం పేర్కొంది. గాజా నగరంతోపాటు పొరుగునే ఉన్న జబాలియా శరణార్థి శిబిరంపై ఆది, సోమవారాల్లో ఇజ్రాయెల్ ఆర్మీ బాంబుదాడులను తీవ్రతరం చేసిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రతి ఒక్క నివాస భవనాన్ని, కనిపించిన ప్రతి మౌలిక వసతినీ ధ్వంసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్సులను కూడా ఇజ్రాయెల్ ఆర్మీ వెళ్లనివ్వడం లేదన్నారు.

యుద్ధం మృతులు 935 మంది: ఇరాన్

దుబాయ్: జూన్ 13వ తేదీన ఇజ్రాయెల్ దాడులతో మొదలైన యుద్ధంలో 935 మంది చనిపోయినట్లు సోమవారం ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 12 రోజులపాటు కొనసాగిన యుద్ధంలో మృతి చెందిన వారిలో 38 మంది చిన్నారులు, 132 మంది మహిళలు ఉన్నారని వివరించింది. మృతుల్లో సైనికులు, పౌరులెందరనే విషయాన్ని స్పష్టంగా పేర్కొనలేదు. ఈ యుద్ధంలో 627 మంది మాత్రమే చనిపోయారని మొన్నటి వరకు ఇరాన్ చెబుతూ వచ్చింది. కాగా, మెడికల్, స్థానిక వలంటీర్ల నుంచి తాము సేకరించిన వివరాల ప్రకారం ఇరాన్‌లో 1,190 మంది చనిపోయారని అమెరికా కేంద్రంగా పనిచేసే హ్యూమన్ రైట్స్ యాక్టివిట్స్ సంస్థ తెలిపింది. వీరిలో 436 మంది పౌరులు, 435 మంది సైనికులు, 319 మంది ఇంకా గుర్తించాల్సిన వారు ఉన్నారంది. ఇరాన్‌లోని అణు స్థావరాలు, రక్షణ వ్యవస్థలు, ఉన్నతస్థాయి మిలటరీ అధికారులు, అణు శాస్త్రవేత్తలే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర బాంబు దాడులకు తెరతీసిన విషయం తెల్సిందే. ప్రతిగా ఇరాన్ 550 బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. వీటిలో చాలా వరకు మధ్యలోనే ధ్వంసం చేశామని, పలుప్రాంతాల్లో జరిగిన విధ్వంసంలో 28 మంది చనిపోయారని ఇజ్రాయెల్ ప్రకటించింది.

టాంజానియా బస్సు ప్రమాదం

40 మంది మృతి; 30 మందికి గాయాలు

డొడోమా: టాంజానియాలో రెండు బస్సులు ఢీకొనడంతో 40 మంది మృతి చెందారు. 30 మందికి పైగా గాయపడ్డారు. కిలిమంజారో ప్రాంతంలోని మోషి–టాంగా రహదారి వెంబడి సబాసాబా ప్రాంతంలో శనివారం రాత్రి ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఢీకొన్న అనంతరం బస్సులకు నిప్పంటుకోవడంతో ప్రయాణికులు లోపల చిక్కుకుపోయారు. చుట్టుపక్కల ఉన్నవారు సంఘటనా స్థలానికి చేరుకుని, మండుతున్న బస్సుల నుంచి బాధితులను రక్షించారు. కాలిన గాయాల వల్ల బాధితులను గుర్తించడం కష్టమవుతోంది. బాధితుల్లో ఎక్కువ మంది టాంజానియా పౌరులు ఉన్నారని భావిస్తున్నారు. బస్సుల్లో ఒకటి వివాహానికి హాజరయ్యేందుకు పెళ్లివారిని తీసుకెళ్తోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియరాలేదు. ఒక బస్సు టైర్ పంక్చర్ కావడంతో నియంత్రణ కోల్పోయి, ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొని ఉండవచ్చని ప్రాథమిక నివేదిక తెలిపింది. ప్రమాద ఘటనపై టాంజానియా అధ్యక్షురాలు సమియా సులుహు హసన్ సంతాపం వ్యక్తం చేశారు. 'దుఃఖిస్తున్న కుటుంబాలు, బంధువులు, స్నేహితులకు నా ప్రగాఢ సానుభూతి. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని కోరుకుంటున్నా'అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు.

వాణిజ్య నౌకలో మంటలు..రంగంలోకి నేవీ

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని కాండ్లా నుంచి ఒమన్‌లోని షినాస్ నౌకాశ్రయం దిశగా వెళ్తున్న వాణిజ్య నౌకలో ఆదివారం మంటలు చెలరేగాయి. పలౌకు చెందిన ఎంటీ యింగ్ చెంక్ 6 అనే ఈ నౌకలో 14 మంది భారత సంతతికి చెందిన సిబ్బంది ఉన్నారు. ఇంజిన్ రూంలో మంటలు చెలరేగడంతో నౌక మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న భారత నేవీ గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మోహరించి ఉన్న ఐఎన్ఎస్ తబార్‌ను రంగంలోకి దించింది. తబార్ ఘటన ప్రాంతానికి చేరుకుని, ఐదుగురు సిబ్బందితోపాటు సామగ్రిని పడవ, హెలికాప్టర్ ద్వారా వాణిజ్య నౌకలోకి చేరవేసింది. అనంతరం, అంతా కలిసి మంటలను వ్యాపించకుండా విజయవంతంగా అడ్డుకున్నారని అధికారులు తెలిపారు.

10 కోట్ల మార్కు దాటిన సీపీసీ సభ్యత్వం

బీజింగ్: చైనా అధికార కమ్యూనిస్ట్ పార్టీ(సీపీసీ) సభ్యత్వం 10 కోట్ల మైలురాయిని దాటింది. 1921లో స్థాపించిన సీపీసీలో 2024 చివరికల్లా 10. 27 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారని సీపీసీలో సెంట్రల్ ఆర్గనైజేషన్ డిపార్టుమెంట్(సీవోడీ) సోమవారం వెల్లడించింది. 2023లో కంటే ఇది 10 లక్షలు ఎక్కువని పేర్కొంది. వీరిలో 3.1 కోట్ల మంది మహిళలని తెలిపింది. సీపీసీకి అరకోటికి పైగా ప్రాథమిక స్థాయి విభాగాలున్నాయంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సీపీసీకి సారథిగా ఉన్నారు. అధికారంలో ఉన్న అతికొద్ది కమ్యూనిస్ట్ పార్టీల్లో సీపీసీ ఒకటి. సభ్యత్వం సాధించాలంటే సీవోడీ వడపోతలో ఎన్నో కఠినమైన పరీక్షలను అధిగమించాల్సి ఉంటుందని సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. ప్రస్తుతం 2.14 కోట్ల సభ్యత్వ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంది. వియత్నాం, లావోస్, క్యూబా, ఉత్తరకొరియాల్లో మార్క్సిజం, సోషలిజంతో సైద్ధాంతిక అనుబంధముందని చెప్పుకునే కమ్యూనిస్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి.

సాక్షి ప్లస్
మంగళవారం। 1-7-2025

భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

రాజ్యాంగ అవలోకనం, ముఖ్య లక్షణాలు, ప్రవేశిక

మాదిరి ప్రశ్నలు

1. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
ఎ) బ్రిటిష్ రాణి / రాజు
బి) ఇంగ్లండ్ పార్లమెంట్
సి) సమాఖ్య శాసనసభ
డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. బ్రిటిషర్లు బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1776 బి) 1775 సి) 1777 డి) 1774
3. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఎలా వ్యవహరిస్తారు?
ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
సి) క్రౌన్ చట్టాలు డి) ఏవీకాదు
4. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
ఎ) 2 బి) 3 సి) 5 డి) 6
5. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
6. భారత ప్రభుత్వ చట్టం 1919లోని ప్రధాన అంశం / అంశాలు?
ఎ) రాష్ట్రాల కార్య నిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వచించడం
సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికారాన్ని సంక్రమింపజేయడం
డి) పైవన్నీ
7. మొదటిసారిగా ఏ బ్రిటిష్ చట్టం భారతీయులకు పాలనలో భాగస్వామ్యం కల్పించడానికి ఉద్దేశించింది?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
బి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1862
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909
డి) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజిన్ లేని యంత్రం' అని నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
ఎ) కేబినెట్ ప్లాన్
బి) మౌంట్‌బాటన్ ప్లాన్ సి) వేవెల్ ప్లాన్
డి) 1935 భారత ప్రభుత్వ చట్టం
9. మత ప్రాతిపదిక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ బెంటింక్
సి) వారెన్ హేస్టింగ్స్ డి) రాబర్ట్ క్లైవ్
10. భారతదేశంలో ఏ చట్టం ద్వారా తొలి అధికారిక శాసనసభను ఏర్పాటు చేశారు?
ఎ) చార్టర్ చట్టం, 1833
బి) చార్టర్ చట్టం, 1853
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
డి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1892
11. మౌంట్ బాటన్ ప్రణాళిక లక్ష్యం?
ఎ) సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం
బి) రాజ్యాంగ సభ ద్వారా భారత రాజ్యాంగ రూపకల్పనకు మార్గదర్శకాలు ఇవ్వడం
సి) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే పద్ధతి
డి) ఆ కాలంలో చెలరేగిన మతకల్లోలాలను నివారించడానికి ప్రణాళిక
12. ద్వంద్వ పరిపాలనను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం - 1892
బి) భారత ప్రభుత్వ చట్టం - 1909
సి) భారత ప్రభుత్వ చట్టం - 1919
డి) గాంధీ-ఇర్విన్ ఒప్పందం
13. రాజ్యాంగ వాదాన్ని మొదటిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త?
ఎ) అరిస్టాటిల్ బి) రూసో
సి) చార్లెస్ డార్విన్ డి) ప్లేటో
14. కింది వాటిలో ఏ చట్టాన్ని మొదటి లిఖిత రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?
ఎ) పిట్ ఇండియా చట్టం - 1784
బి) రెగ్యులేటింగ్ చట్టం - 1773
సి) చార్టర్ చట్టం - 1313
డి) చార్టర్ చట్టం - 1853
15. మొదటిసారిగా మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1909 బి) 1919
సి) 1935 డి) ఏవీకాదు
16. రాష్ట్రాల్లో ద్విసభా పద్ధతికి అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1935 బి) 1919
సి) 1909 డి) ఏదీకాదు
17. కింది వాటిలో భారత ప్రభుత్వ చట్టం - 1935లో సరికాని అంశం?
ఎ) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
బి) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
సి) ఆర్.బి.ఐ. ఏర్పాటు
డి) సార్వజనీన ఓటుహక్కు
18. కింది వాటిలో ఏ చట్టం ద్వారా 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్' పదవిని 'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు?
ఎ) 1833 బి) 1813 సి) 1861 డి) 1858
19. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
బి) రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించడం
సి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
డి) పైవన్నీ
20. కింది వాటిలో ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మాగ్నా కార్టాగా పేర్కొంటారు?
ఎ) వేవెల్ ప్రతిపాదన
బి) క్రిప్స్ ప్రతిపాదన
సి) కేబినెట్ రాయబార ప్రతిపాదన
డి) విక్టోరియా రాణి ప్రకటన
21. మహాత్మా గాంధీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?
ఎ) మొదటి రౌండ్ టేబుల్ సమావేశం
బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం
సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం
డి) ఏదీకాదు
22. భారత ప్రభుత్వ చట్టం - 1935ను బానిసత్వానికి నూతన పత్రంగా పేర్కొన్నవారు?
ఎ) కె.టి. షా బి) జవహర్ లాల్ నెహ్రూ
సి) మహాత్మాగాంధీ డి) సర్దార్ పటేల్
23. కింది వాటిలో ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటయ్యింది?
ఎ) కేబినెట్ ప్రతిపాదనలు
బి) మౌంట్ బాటన్ ప్రతిపాదనలు
సి) క్రిప్స్ ప్రతిపాదనలు డి) ఏవీకాదు
24. భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు?
ఎ) 1946 సెప్టెంబర్ 2
బి) 1946 అక్టోబర్ 2
సి) 1946 నవంబర్ 1
డి) 1947 నవంబర్ 1
25. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
ఎ) అమెరికా రాజ్యాంగం
బి) బ్రిటిష్ రాజ్యాంగం
సి) ఐరిష్ రాజ్యాంగం
డి) భారత ప్రభుత్వ చట్టం
26. జతపరచండి.
1. పోర్ట్ పోలియో పద్ధతి — ఎ. లార్డ్ మెకాలే
2. సివిల్ సర్వీస్ సులభతరం — బి. లార్డ్ కార్న్‌వాలిస్
3. మత నియోజక వర్గాలు — సి. లార్డ్ కానింగ్
4. భారత న్యాయ సంస్కరణలు — డి. లార్డ్ మింటో
ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
27. కింది వాటిని ప్రవేశపెట్టిన కాలానుగుణంగా క్రమంలో రాయండి.
1. ప్రత్యేక నియోజకవర్గాలు
2. శాసన అధికారాల బదలాయింపు
3. ద్విసభా విధానం
4. డొమినియన్ ప్రతిపత్తి
ఎ) 1, 2, 3, 4 బి) 2, 1, 3, 4
సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 2
28. రాజ్యాంగ వికాసానికి సంబంధించి సరైన క్రమాన్ని గుర్తించండి.
ఎ) మాగ్నాకార్టా, యు.ఎస్. రాజ్యాంగం, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం
బి) మాగ్నాకార్టా, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
సి) బిల్ ఆఫ్ రైట్స్, మాగ్నాకార్టా, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
డి) పైవేవీ కాదు
29. ప్రభుత్వానికి ఉండే అధికారం కింది వాటిలో దేనికి ఉదాహరణ?
ఎ) సంప్రదాయ అధికారం
బి) సమ్మోహన అధికారం
సి) చట్టబద్ధ - హేతుబద్ధ అధికారం
డి) పైవన్నీ
30. కింది వాటిలో భారత రాజ్యాంగానికి ఏ లక్షణాన్ని ఆపాదించలేం?
ఎ) శాసన శాఖ ఆధిక్యత
బి) న్యాయ శాఖ ఆధిక్యత
సి) కార్య నిర్వాహక శాఖ ఆధిక్యత
డి) పైవన్నీ
31. భారత సమాఖ్య స్వభావం?
ఎ) సిద్ధాంత సమాఖ్య బి) అర్ధ సమాఖ్య
సి) విశిష్ట సమాఖ్య
డి) బేరసారాల సమాఖ్య
32. పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?
ఎ) కేబినెట్ ప్రభుత్వం
బి) ప్రధానమంత్రి ప్రభుత్వం
సి) పై రెండూ డి) ఏవీ కాదు
33. 'భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది' కారణం?
ఎ) ఇతర రాజ్యాంగాల ప్రభావం
బి) భారతదేశ వైవిధ్యం
సి) రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకపోవడం
డి) పైవన్నీ
34. కింది వారిలో ఎవరి జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొనలేదు?
ఎ) పార్లమెంట్ సభ్యులు
బి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్
సి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
డి) గవర్నర్
35. భారత రాజ్యాంగానికి, అమెరికా రాజ్యాంగానికి పోలిక?
ఎ) సమాఖ్య వ్యవస్థ బి) న్యాయ సమీక్ష
సి) ప్రాథమిక హక్కులు డి) పైవన్నీ
36. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
సి) ప్రజలు డి) రాష్ట్రపతి
37. భారత రాజ్యాంగ పీఠికలో ఉండే పదాల క్రమం?
ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్రరాజ్యం
బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక
డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం
38. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?
ఎ) రాజ్యాంగ లక్షణాలు చాలా ముఖ్యమైనవి. వాటిని సవరించడానికి వీలులేదు
బి) ప్రాథమిక హక్కులను కుదించడం గానీ, తొలగించడం గానీ కుదరదు
సి) 368 ప్రకరణ ప్రకారం తప్ప రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదు
డి) కొన్ని అంశాలను సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం ఉండదు
39. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా వర్ణించినవారు?
ఎ) మహాత్మాగాంధీ బి) అంబేద్కర్
సి) వల్లభ్‌భాయ్ పటేల్
డి) ఠాకూర్‌దాస్ భార్గవ
40. రాజ్యాంగ ప్రవేశిక?
ఎ) సూచనాత్మకమైంది
బి) విషయసూచిక లాంటిది
సి) పై రెండూ డి) పైవేవీ కాదు
41. ప్రవేశిక నుంచి ఏయే అంశాలు తెలుసుకోవచ్చు?
ఎ) రాజ్యాంగ ఆమోద తేది
బి) రాజ్యాంగ ఆధారాలు
సి) రాజ్యాంగ ఆశయాలు
డి) పైవన్నీ
42. 'సమగ్రత' (ఇంటిగ్రిటీ) అనే పదాన్ని 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికకు చేర్చారు. దీని ఉద్దేశం?
ఎ) వేర్పాటువాద శక్తులను అరికట్టడం
బి) భౌగోళిక సామీప్యతను సాధించడం
సి) మతకలహాలను నియంత్రించడం
డి) పైవన్నీ
43. భారత 'సామ్యవాదం' (సోషలిస్ట్) అనే భావజాలం ఎవరి భావాలను ప్రతిబింబిస్తుంది?
ఎ) మార్క్స్, మహాత్మాగాంధీ
బి) గాంధీ, నెహ్రూ సి) మార్క్స్, మావో
డి) మార్క్స్, వినోభా బావే
44. కింది వాటిలో ప్రవేశికకు సంబంధించి సరైంది?
ఎ) రాజ్యాంగంలోని ప్రకరణలతో సంబంధం ఉంటుంది
బి) ప్రత్యేకంగా ప్రవేశికకు ఉనికి ఉండదు
సి) సవరణకు అతీతం కాదు
డి) పైవన్నీ సరైనవే
45. కింది వాటిలో ఏయే అంశాలను వ్యాఖ్యానించడానికి ప్రవేశికను ఆధారంగా తీసుకోవచ్చు?
ఎ) ప్రాథమిక హక్కులు
బి) ఆదేశిక సూత్రాలు
సి) ప్రభుత్వ అధికారాలు డి) పైవన్నీ
46. ప్రవేశికలో పేర్కొన్న 'సమానత్వం' కింది వాటిలో దేనికి హామీ ఇస్తుంది?
ఎ) హోదా బి) అవకాశాలు
సి) ఉపాధి డి) ఎ, బి
47. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం, పరిమితి కాదు
బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు. ఆఖరున ఆమోదించారు
డి) పైవన్నీ సరైనవే
48. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అత్యంత దృఢ రాజ్యాంగం - అమెరికా
బి) పరిమాణాత్మక రాజ్యాంగం - ఇంగ్లండ్
సి) చట్టీకృత రాజ్యాంగం - ఇండియా
డి) పైవన్నీ సరైనవే
49. రాజ్యాంగ వాదన అంటే?
ఎ) పరిమిత అధికారాలతో కూడిన పరిపాలన
బి) పరిమిత ప్రభుత్వ వ్యవస్థ
సి) రాజ్యాంగ వికాస దశ
డి) పైవేవీ కాదు
50. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చేర్చిన అంశాలు?
ఎ) ప్రాథమిక విధులు బి) ట్రిబ్యునల్
సి) సహకార సంస్థలు డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) బి; 5) బి;
6) డి; 7) ఎ; 8) డి; 9) ఎ; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) బి; 15) ఎ;
16) ఎ; 17) డి; 18) ఎ; 19) ఎ; 20) డి;
21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) డి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) సి; 30) డి;
31) సి; 32) సి; 33) డి; 34) ఎ; 35) డి;
36) సి; 37) డి; 38) డి; 39) డి; 40) ఎ;
41) డి; 42) ఎ; 43) ఎ; 44) డి; 45) డి;
46) డి; 47) డి; 48) డి; 49) ఎ; 50) డి.

'లైబర్' అనే మాటకు అర్థం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - మెథడ్స్ (ఎస్ఏ)

బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
1) బర్టన్ 2) కార్టర్ గుడ్
3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
1) 11% 2) 35%
3) 83% 4) 100%
3. చెప్పడం,చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
1) 60% 2) 75%
3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్
3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ
3) మాటలు లేదా గుర్తులతో
4) ఏవీకాదు
7. దృశ్య,శ్రవణ,దృశ్య-శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
1) అనుభవాలు 2) పరిమాణం
3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
1) దృశ్య 2) దృశ్య-శ్రవణ
3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
1) గోళాకారం 2) చతురస్రాకారం
3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
1) పీఠ భాగం 2) శిఖర భాగం
3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
1) పీఠ భాగం 2) శిఖర భాగం
3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన
3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
1) ప్రదర్శనా ఉపకరణాలు
2) త్రిపరిమాణ ఉపకరణం
3) రేఖీయ చిత్రం 4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రొజెక్టర్ల స్థానం?
1) ప్రదర్శన బల్లలపైన
2) చార్టు తర్వాత 3) చలనచిత్రాలపైన
4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ
3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు
3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం
3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
1) కృత్యాధార 2) ప్రదర్శన
3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
1) ఫిల్మ్ ప్రొజెక్టర్ 2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
22. మైక్రో ప్రొజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
4) సెల్లోఫేన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రొజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా ఆయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రొజెక్టర్ లక్షణం?
1) స్లైడ్ ప్రొజెక్టర్ 2) ఓవర్ హెడ్ ప్రొజెక్టర్
3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
1) 1959 2) 1961
3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
1) మొదలియార్ 2) తారాదేవి
3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
1) ప్రక్షేపిత 2) కృత్యాధార
3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) కోల్‌కతా 2) ముంబై
3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
1) బిర్లా ప్లానిటోరియం
2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
1) వివేరియం 2) ఛేదనం
3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
1) అందాన్నిచ్చే వస్తువు
2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
3) అన్ని రకాల జీవులుండే స్థలం
4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
1) వివేరియం 2) అక్వేరియం
3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
1) అక్వేరియం 2) వివేరియం
3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
1) వివేరియం 2) హెర్బేరియం
3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
1) కీటకాలు 2) చేపలు
3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
1) గులాబీ మొక్కలు 2) కాక్టస్
3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1; 5) 2;
6) 2; 7) 4; 8) 3; 9) 3; 10) 1;
11) 2; 12) 4; 13) 1; 14) 4; 15) 2;
16) 3; 17) 3; 18) 1; 19) 2; 20) 4;
21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3;
26) 2; 27) 1; 28) 3; 29) 4; 30) 2;
31) 1; 32) 2; 33) 4; 34) 2; 35) 3.

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య

1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్‌పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్‌లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
3) విద్య సాంకేతిక శాస్త్రం
4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
1) జ్ఞానాత్మక - భావావేశ
2) భావావేశ, మానసిక చలనాత్మక
3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని - అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
1) మొదలియార్ 2) కొఠారీ
3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
4) విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
1) వైజ్ఞానిక సంఘం
2) విహార యాత్ర సంఘం
3) సేవా సంఘం 4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
1) సాధారణ సంఘం
2) సాంస్కృతిక సంఘం
3) ప్రత్యేక అభిరుచి సంఘం
4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
1) ప్రధానోపాధ్యాయుడు
2) డీఈవో
3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
1) ప్రభుత్వ గుర్తింపు
2) కమిటీల ఏర్పాటు
3) నియమాలు
4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
1) మార్గదర్శి 2) నియంత
3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరిసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
1) అధ్యక్షుడు 2) కార్యదర్శి
3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
1) క్షేత్ర పర్యటన
2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
3) బడి తోట నిర్వహణ
4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
1) మండల విద్యాశాఖ
2) రాష్ట్ర విద్యాశాఖ
3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
1) NCERT- SCERT
2) విద్యా శాఖా మంత్రి
3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
1) కలెక్టర్ 2) డీఈవో
3) డైట్ ప్రిన్సిపాల్
4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్
16. లైబ్రరీ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
1) గ్రీకు 2) పర్షియా
3) ఇంగ్లిష్ 4) లాటిన్
17. 'లైబర్' అనే మాటకు అర్థం?
1) పుస్తకం 2) రాయడం
3) జ్ఞానం 4) సేకరించడం
18. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఎవరి ఆధీనంలో ఉంటుంది?
1) ప్రధానోపాధ్యాయుడు
2) జిల్లా విద్యాశాఖాధికారి
3) తరగతిలో, సైన్స్‌లో తెలివి కలిగిన విద్యార్థి
4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
19. వేటి నిర్వహణలో ఇండెక్స్ కార్డ్, క్యాటలాగ్‌లను తప్పనిసరిగా ఏర్పర్చాలి?
1) సైన్స్ క్లబ్ 2) సైన్స్ లైబ్రరీ
3) సైన్స్ ఫేర్ 4) ఫీల్డ్ ట్రిప్
20. ప్రతి పాఠశాలలో ప్రత్యేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఉండాలి అని ప్రతిపాదించిన వారు?
1) కొఠారీ కమిషన్
2) మొదలియార్ కమిషన్
3) ఆలిండియా సైన్స్ సెమినార్
4) రాధాకృష్ణన్ కమిషన్
21. హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?
1) బిర్లా 2) టాటా
3) గెలాక్సీ 4) గెలీలియో
22. విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రాన్ని 1966లో ఎక్కడ ప్రారంభించారు?
1) అహ్మదాబాద్ 2) ముంబై
3) లక్నో 4) అలహాబాద్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 1; 7) 3; 8) 4; 9) 1; 10) 3;
11) 4; 12) 2; 13) 3; 14) 1; 15) 2;
16) 1; 17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 1; 22) 1;

పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం లక్ష్యాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

- ★ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్ర; దేశీయ, విదేశీ పెట్టుబడులు; సాంకేతిక పరిజ్ఞానం మొదలైన వాటి విషయంలో ప్రభుత్వ వైఖరిని సంబంధిత దేశ పారిశ్రామిక విధానంలో వివరిస్తారు.
- ★ ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోవాలి. నిర్దేశిత లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీనికి సంబంధించి ఉత్పత్తి ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్రను పారిశ్రామిక విధానం వివరిస్తుంది.
- ★ స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశానికి సరైన, కచ్చితమైన పారిశ్రామిక విధానం లేదు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పారిశ్రామిక విధానం ఆవశ్యకతను గుర్తించి 1948, ఏప్రిల్ 6న మొదటి పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది.

మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం

- ★ ఈ తీర్మానంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పరిధిని స్పష్టంగా పేర్కొంటూ పరిశ్రమలను నాలుగు వర్గాలుగా విభజించారు. ఈ తీర్మానంతో మన దేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొంది.
- ★ **మొదటి వర్గం (ప్రభుత్వ ఏకస్వామ్యం):** ఈ వర్గంలోని పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మూడు రకాల కార్యకలాపాలను నిర్వహించే పరిశ్రమలను ఈ వర్గంలో చేర్చారు. అవి..

1. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు, ఆయుధ సామగ్రి, ఆయుధాల ఉత్పత్తి, నియంత్రణ.
2. అణుశక్తి ఉత్పత్తి, నియంత్రణ.
3. రైల్వేలు వాటి నిర్వహణ, యాజమాన్యం

రెండో వర్గం (మిశ్రమ రంగం): ఇందులో ఆరు కీలక, మౌలిక పరిశ్రమలను చేర్చారు. అవి..
1. బొగ్గు, 2. ఇనుము, ఉక్కు, 3. విమానాల ఉత్పత్తి, 4. నౌకా నిర్మాణం,
5. టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ పరికరాల ఉత్పత్తి, 6. ఖనిజ నూనెలు.

- ★ ఈ తీర్మానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ వర్గంలోని పరిశ్రమల్లో కొత్త వాటిని ప్రైవేటు రంగంలో స్థాపించడానికి వీల్లేదు. ఇకపై వీటిని ప్రభుత్వ రంగంలోనే స్థాపిస్తారు. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్న వాటిని కొనసాగించవచ్చు. అవసరమనుకుంటే పదేళ్ల తర్వాత నష్టపరిహారం చెల్లించి వాటిలో దేన్నయినా ప్రభుత్వం జాతీయం చేయొచ్చు.



మూడో వర్గం (ప్రభుత్వ నియంత్రణ): ఈ వర్గంలో జాతీయ ప్రాముఖ్యం ఉన్న 18 పరిశ్రమలను చేర్చారు. వీటిని ప్రభుత్వం నిర్వహించనప్పటికీ వీటి నియంత్రణ, అజమాయిషీ ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నియమ, నిబంధనలకు లోబడి వీటి ఉత్పత్తులు కొనసాగాలి. ఇందులో ఆటోమొబైల్స్, భారీ రసాయనాలు, భారీ యంత్రాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, పంచదార, కాగితం, సిమెంట్, వస్త్ర, ఊలు మొదలైన పరిశ్రమలను చేర్చారు.

నాలుగో వర్గం (ప్రైవేటు రంగం): పై మూడు వర్గాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. వీటిని ప్రైవేటు రంగానికి వదిలేశారు. అయితే వీటిపై ప్రభుత్వం సాధారణ అజమాయిషీ కలిగి ఉంటుంది.

1951-పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం

(పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం)

- ★ మన దేశంలో ప్రైవేటు రంగ పరిశ్రమల అభివృద్ధిని క్రమబద్ధం చేయడం, వాటిని నియంత్రించడం అనే రెండు ప్రధాన ఉద్దేశాలతో 1951, అక్టోబర్‌లో పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని (పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం) పార్లమెంటు చట్టం ద్వారా రూపొందించారు. ఈ చట్టం 1952, మే 8 నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం లక్ష్యాలు

1. ప్రణాళికా లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పారిశ్రామిక పెట్టుబడులు, ఉత్పత్తులు ఉండేలా చూడటం.
2. పెద్ద పరిశ్రమల పోటీ నుంచి చిన్న పరిశ్రమలను రక్షించడం.
3. ఏకస్వామ్యాలను నిరోధించడం.
4. సంతులిత ప్రాంతీయాభివృద్ధి.
5. వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం.
6. దేశీయ మార్కెట్లో సప్లై, డిమాండ్‌ల మధ్య సహ సంబంధాన్ని తీసుకురావడం.
7. సామాజిక మూలధనాన్ని అభిలషణీయంగా ఉపయోగించుకోవడం.

- ★ ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమలు ప్రారంభంలో 37 ఉండగా, తర్వాత కాలంలో 70కి పెంచారు. ఇందులోని పరిశ్రమలు రిజిస్టర్ చేసుకొని లైసెన్స్ పొందాలి.
- ★ 1953లో రూ.1 లక్ష కంటే ఎక్కువ పెట్టుబడి కలిగిన పరిశ్రమలను దీని పరిధిలోకి తెచ్చారు. అయితే లైసెన్సింగ్ అథారిటీపై పరిపాలన పరమైన భారం, ఒత్తిడి మూలంగా 1956లో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించారు.
- ★ 1956లో విద్యుత్‌ను ఉపయోగించి, 50 మంది శ్రామికులతో ఉత్పత్తిని చేపట్టే పరిశ్రమలు (లేదా) విద్యుత్‌ను వాడకుండా 100 మంది శ్రామికులతో ఉత్పత్తిని నిర్వహించే పరిశ్రమలను ఈ చట్టం పరిధిలోకి చేర్చారు.
- ★ ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమల పెట్టుబడి పరిమితిని 1960లో రూ.10 లక్షలకు పెంచారు. ఈ పరిమితిని 1963లో రూ.25 లక్షలకు పెంచారు. 1970లో రూ. కోటికి పెంచారు. 1978లో రూ.3 కోట్లకు పెంచారు. ఆ తర్వాత పెట్టుబడి పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు.
- ★ 1988-89లో ప్రభుత్వం లైసెన్సింగ్ విధానంలో విప్లవాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. దీని ప్రకారం అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రూ.15 కోట్లు, వెనుకబడిన ప్రాంతాల్లో రూ.50 కోట్లకు పైబడిన పెట్టుబడి గల పరిశ్రమలు మాత్రమే లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. లిబరలైజేషన్ పాలసీ (సరళీకృత విధానం)లో భాగంగా లైసెన్స్‌ల రద్దు వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది.

రెండో పారిశ్రామిక విధాన తీర్మానం-1956

- ★ 1956, ఏప్రిల్ 30న భారత ప్రభుత్వం రెండో పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది. 1956 నాటికి మన దేశంలో అనేక రాజకీయ, ఆర్థిక మార్పులు సంభవించాయి.
- ★ 1956 నాటికి మొదటి పంచవర్ష ప్రణాళికను పూర్తి చేసుకోవడం, రెండో ప్రణాళికలో భారీ, మౌలిక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమ సమాజ స్థాపనను లక్ష్యంగా నిర్ణయించుకోవడం మొదలైనవి 1956 పారిశ్రామిక విధాన తీర్మాన ప్రకటనకు కారణమయ్యాయి.

మూడు జాబితాలు:

- ★ 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో పరిశ్రమలను ఎ, బి, సి అనే మూడు జాబితాలుగా వర్గీకరించారు.
- ★ **జాబితా-ఎ:** ఇందులో 17 పరిశ్రమలను చేర్చారు. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు దీనిలో ఉన్నాయి. వీటిలో ఆయుధాలు, అణుశక్తి, విమాన రవాణా, రైల్వే రవాణా పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మిగతా 13 పరిశ్రమలను ఈ తీర్మానం తర్వాత నుంచి ప్రభుత్వమే స్థాపిస్తుంది. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్నవి కొనసాగవచ్చు. అవసరమైతే వీటిని ప్రైవేటు రంగంలో కూడా నెలకొల్పే అవకాశం కల్పించారు. ఈ తీర్మానంలో పరిశ్రమలను జాతీయం చేసే ప్రతిపాదన లేదు.
- ★ **జాబితా-బి:** అన్ని రకాల ఖనిజాలు, లోహాలు, యంత్ర పనిముట్లు, మిశ్రమ లోహాలు, ఎరువులు, రబ్బరు, బొగ్గు తదితర 12 పరిశ్రమలను ఇందులో చేర్చారు. ప్రభుత్వం నూతన సంస్థలను స్థాపించి తన భాగస్వామ్యాన్ని పెంచుకోవచ్చు. అయితే ప్రైవేటు రంగం కొత్త సంస్థలను స్థాపించడానికి, ఉన్న వాటిని విస్తృతం చేసుకోవడానికి ఏ ఆటంకం ఉండదు.
- ★ **జాబితా-సి:** ఎ, బి జాబితాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. ఈ జాబితాలోని పరిశ్రమల అభివృద్ధి ప్రైవేటు రంగం చొరవపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామికీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ జాబితాలోని పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించడమే కాకుండా నియంత్రిస్తుంది.
- ★ 1970, 1973, 1975ల్లో పారిశ్రామిక విధాన తీర్మానాలను ప్రకటించినా, వాటికి 1956 తీర్మానమే ప్రాతిపదికగా నిలిచింది. ఈ తీర్మానాల్లో మౌలిక మార్పులు లేకుండా కేవలం కుటీర, చిన్నతరహా పరిశ్రమల నిర్వచనాల్లో, లైసెన్సింగ్ విధానంలో, విదేశీ మూలధనం విషయంలో స్వల్ప మార్పులు చేశారు.

జనతా ప్రభుత్వ పారిశ్రామిక విధానం-1977

- ★ 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం, తన శైలిలో 1977 డిసెంబర్ 23న నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. గాంధేయ విధానానికి అనుగుణంగా దీన్ని రూపొందించారు.
- ★ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ఇందులో అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

నూతన పారిశ్రామిక విధానం-1991

- ★ 1980 నుంచి మొదలైన సరళీకృత విధానం, నిర్ణయాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు.
- ★ పి.వి.నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా 1991, జూలై 24న దీన్ని ప్రకటించారు.
- ★ ప్రపంచ మార్కెట్‌తో భారత ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేసి, విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర సామగ్రి దిగుమతులను పెంచి, వేగవంతమైన అభివృద్ధిని సాధించడం ఈ తీర్మానం ముఖ్య ఉద్దేశం.
- ★ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టారు.
- ★ ఈ పారిశ్రామిక విధాన తీర్మానంలో లైసెన్సింగ్ విధానంలోని నిబంధనలను గణనీయంగా సడలించారు.

1991 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రధాన లక్ష్యాలు

- ★ సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఉపయోగించడం.
- ★ ఆర్థిక ప్రగతికి ఆటంకం కలిగించే అంశాలను సరిచేయడం.
- ★ ఉత్పత్తి, ఉద్యోగితల్లో సుస్థిర వృద్ధిని నిలుపుకోవడం.
- ★ అంతర్జాతీయంగా ఎదురయ్యే పోటీని తట్టుకోవడం.

The antonym of Critical is..



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements:
Climate change may force the shifting of locations of the existing crops due to
a) Melting of glaciers
b) Water availability and temperature suitability at other locations
c) Poor productivity of crops
d) Wider adaptability of crop plants
Which of the statements given above are correct?
1) a, b, & c 2) b & c only
3) a & d only 4) a & c
5) a, b, c, & d

2. To promote agricultural research in India is important because:
1) To predict variations in monsoon patterns and to manage water resources.
2) To make long term investment decisions for economic growth.
3) To facilitate wider adaptability of crops.
4) To predict drought conditions and to recharge aquifers.
5) Changed weather patterns in future.

3. The spillover from the Himalayas is due to
1) large-scale shifts in agro-ecological conditions.
2) changed weather patterns in future
3) productivity of crops
4) melting of glaciers
5) adaptability of crop plants

4. The antonym of **Critical** is
1) waver 2) steady
3) unsure 4) insecure
5) fasten

5. The synonym of **promote** is
1) encompass 2) encourage
3) entangle 4) entrust
5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
1) vary 2) variety
3) similar 4) reported
5) yawning

7. She ____ to escape from her office job.
1) earned 2) yelled
3) yearned 4) yielded
5) learn

8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
1) easy; complete
2) different; wholesome
3) difficult; totality
4) hard; completeness
5) tough; compliment

9. The new policy was adopted in the ____ of fierce ____.
1) wake; opponent
2) show; postponement
3) teeth; criticism
4) course; outcome
5) reality; injustice

10. The computer is now an ____ tool for the family doctor.
1) value 2) valid
3) price 4) worth
5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
1) year twice 2) twice yearly
3) yearly two 4) two yearly
5) no correction required

12. She yelled at the child to getting down from the wall.
1) got down 2) get down
3) getting away 4) get upon
5) no correction required

13. All her yesterday's has vanished without a trace.
1) Have 2) had
3) has been 4) have being
5) no correction required

14. My son's 13 but he's younger for his age.
1) Youngest 2) youth
3) older 4) young
5) no correction required

15. When the needle enters the red zone the engine is indicator hot.
1) Too 2) much
3) becomes 4) left
5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)

17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)

18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)

19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)

20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)

21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)

22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)

23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)

24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)

25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.

27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)

28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)

29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)

30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
3) extraneous 4) bucollic
5) conundrum

37. 1) powwow 2) malignant
3) untenable 4) capricious
5) dissipete

38. 1) railery 2) splenetic
3) palaver 4) lachrymose
5) tenacity

39. 1) exiguity 2) pillary
3) concomitant 4) surfeit
5) adjudicate

40. 1) promulgate 2) cataclysm
3) deluge 4) simulacrom
5) mural

Answers

1) 1;	2) 4;	3) 4;	4) 2;
5) 2;	6) 5;	7) 3;	8) 3;
9) 3;	10) 5;	11) 2;	12) 2;
13) 2;	14) 4;	15) 1;	16) 3;
17) 5;	18) 3;	19) 4;	20) 2;
21) 1;	22) 4;	23) 1;	24) 3;
25) 3;	26) 3;	27) 1;	28) 3;
29) 2;	30) 2;	31) 1;	32) 4;
33) 2;	34) 1;	35) 3;	36) 4;
37) 5;	38) 1;	39) 2;	40) 4.